




# బోల్షెవిక్

సంచిక: 5 సి.పి.ఐ. (మావోయిస్టు) ఎ.ఒ.బి. సమాచార పత్రిక జనవరి – జూన్ 2015

## లోపలి పేజీల్లో...

1. ఆపరేషన్ ఆల్‌ఔట్ .......... 03
2. చైనా విప్లవ చరిత్ర .......... 07
3. ప్రధాన కార్యదర్శి కా॥ గణపతి ఇంటర్వ్యూ .......... 11
4. కరపత్రాలు / పత్రికా ప్రకటనలు .......... 22
5. సి.ఎల్.సి నిజనిర్ధారణ రిపోర్టులు .......... 28
6. అమరుల జీవిత చరిత్రలు .......... 35
7. పోరాట స్రవంతి .......... 38

# మీ త్యాగాల వెలుగులో ప్రజాయుద్ధ మార్గం ప్రకాశవంతమైంది. లక్ష్యం చేరేదాక మీరు చూపిన మార్గాన్ని వదలం.

భారత దేశంలో ప్రస్తుతం నెలకొని వున్న అర్థ భూస్వామ్య, అర్ధవలస సమాజాన్ని కూకటివేళ్ళతో పెళ్ళగించి నూతన ప్రజాస్వామిక వ్యవస్థనూ, ఈ క్రమంలో సోషలిజాన్ని, అంతిమంగా కమ్యూనిజాన్ని స్థాపించే లక్ష్యంతో సి.పి.ఐ మావోయిస్టు పార్టీ నేతృత్వంలో ప్రజలు వీరోచితంగా ఉద్యమిస్తున్నారు. ఈ ఉద్యమాన్ని అణచి వేసి తమ అధికారాన్ని సుస్థిరం చేసుకొనేందుకూ, దోపిడీ పీడనలను కొనసాగించేందుకు ఈ దేశ దోపిడీ పాలక వర్గాలైన దళారీ నిరంకుశ బూర్జువా, భూస్వామ్య వర్గాలు, వారి యజమానులైన సామ్రాజ్యవాదులు తమ రాజ్యాంగ యంత్రం ద్వారా పార్టీపైన, పి.ఎల్.జి.ఎ.పైన, ప్రజలపైన తీవ్రమైన సాయుధ అణిచివేతను కొనసాగిస్తున్నారు. ఈ అణచివేత 2009 సెప్టెంబర్ నుండి గ్రీన్‌హంట్ బహుముఖ, సైనిక దాడి రూపంలో మరింత తీవ్రతరం అయింది. ఈ దాడి అత్యంత పాశవికంగా, క్రూరంగా, మోసపూరితంగా కొనసాగుతున్నది. విరుద్ధ ప్రయోజనాలకోసం జరుగుతున్న ఈ యుద్ధంలో ప్రజల రాజ్యాధికారాన్ని నెలకొల్పే లక్ష్యంతో దోపిడి వర్గాల రాజ్యంతో వీరోచితంగా పోరాడుతూ అనేక మంది ప్రజల ఉత్తమ పుత్రులు, పుత్రికలు తమ అమూల్యమైన ప్రాణాలను తృణప్రాయంగా అర్పిస్తున్నారు. చరిత్ర పురోగమనానికి తమ వంతు కర్తవ్యంగా వీరోచితమైన త్యాగాలను చేస్తూ గొప్ప విప్లవ సాంప్రదాయాలను నెలకొల్పుతున్నారు. 2015 జనవరి నుండి జూన్ వరకు దేశవ్యాప్తంగా పదుల సంఖ్యలోనే పార్టీ, పి.ఎల్.జి.ఎ, ప్రజాసంఘాల సభ్యులు, నాయకత్వంతో పాటు సాధారణ ప్రజలు నేలకొరిగారు. ఎ.ఒ.బిలో కా॥ జోగాల్ (ఎ.సి.ఎమ్), కా॥ సూర్యం (పి.ఎమ్)లు నేలకొరిగారు. మన ఈ కామ్రేడ్స్ అమరత్వం పార్టీకి, ఉద్యమానికి ఎనలేని నష్టాన్ని కల్పించింది. వారి కుటుంబాలకు, శ్రేయోభిలాషులకు తీవ్రమైన దు:ఖాన్ని నింపింది. ఈ పరిస్థితులలో అమరుల కుటుంబాల, శ్రేయోభిలాషుల దు:ఖంలో పాల్పంచుకుంటూ, వారికి ఎస్.జడ్.సి ప్రగాఢ సంతాపాన్ని తెలియ జేస్తున్నది. అలాగే అమరుల ఆశయాలను సఫలీకృతం చేస్తామని ప్రతిజ్ఞ చేస్తూ, వారికి తలవంచి వినమ్రంగా శ్రద్ధాంజలి ఘటిస్తున్నది.

మన అమరుల త్యాగాలు మన వెంటనే వున్నాయి. వారి త్యాగాలతో మన మార్గం ప్రకాశవంతమైంది. మన పురోగమనంలో వారిస్తున్న ఉత్తేజం మనకు నూతన శక్తినీ, చైతన్యాన్ని అందిస్తున్నది. అందుకే వారు సదా చిరస్మరణీయులు.

వ్యాసం

# బోల్షివీకరణ క్యాంపెయిన్‌ను విజయవంతం చేద్దాం!

## ఆపరేషన్ గ్రీన్‌హంట్‌లో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన 'ఆపరేషన్ ఆల్‌ఔట్' ను ఓడిద్దాం!

2014లో కేంద్రంలోనూ, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశ రాష్ట్రాలలోనూ జరిగిన పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికలలో అధికారం చేజిక్కించుకున్న బి.జె.పి, తెలుగుదేశం, టి.ఆర్.ఎస్, బి.జె.డి పార్టీలు రెండవతరం సంస్కరణలను వేగవంతం చేస్తూ దేశాన్ని బహుళజాతి సంస్థలకు అమ్మేందుకు పోటీ పడుతున్నాయి. అభివృద్ధి పేరుతో చేపట్టిన ఈ 'సంస్కరణల నిర్వాకాన్ని' మునుపెన్నడు లేనంత వేగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొనసాగిస్తున్నాయి. పైగా ఈ ప్రభుత్వాలు చేపట్టిన ఈ దళారీ కార్యక్రమాలకు 'మేక్ ఇన్ ఇండియా' 'డిజిటల్ ఇండియా' డిజిటల్ ఆంధ్రప్రదేశ్' 'స్వర్ణాంధ్రప్రదేశ్' 'బంగారు తెలంగాణ' వంటి మోసపూరిత నినాదాల ముసుగును కప్పుతున్నాయి.

మోడి నాయకత్వంలోని ఎన్.డి.ఎ ప్రభుత్వం ఇప్పటికే భీమా, రక్షణ వంటి కీలక రంగాలలో విదేశీ పెట్టుబడులను 26% నుండి 49% నికి పెంచింది. పెట్టుబడుల ఉపసంహరణ పేరుతో లాభాల బాటలో నడుస్తున్న ప్రభుత్వ రంగ సంస్థలైన కోల్ ఇండియా, సెయిల్, నాల్కో సంస్థలలో వాటాలను పెట్టుబడిదారులకు కారుచౌకగా విక్రయించింది. బహుళజాతి సంస్థల పెట్టుబడులకు అనుకూల వాతావరణం కల్పించేందుకు పర్యావరణ అనుమతులను, భూసేకరణను సులభతరం చేస్తున్నది. అంటే దేశంలోని పర్యావరణాన్ని (అడవులను) ధ్వంసం చేస్తూ రైతాంగం నుండి, ఇతర సెక్షన్‌ల ప్రజల నుండి బలవంతంగా భూములను గుంజుకొనే ఆర్డినెన్స్‌లను తీసుకువచ్చింది. పన్నుల వ్యవస్థను సులభతరం చేయడం పేరుతో విదేశీ, దేశ కార్పోరేట్ సంస్థలపై నేడున్న పన్నులను సైతం ఎత్తివేస్తున్నది. మరోవైపు సాధారణ ప్రజలపై ప్రత్యక్ష, పరోక్ష పన్నులను ఇబ్బడి ముబ్బడిగా పెంచుతున్నది. కార్మిక హక్కులను కాలరాసేందుకు వారు పోరాడి సాధించుకున్న 8 గం॥ల పనిదినం వంటి చట్టాలను రద్దు చేస్తున్నది. ఇవి చాలవన్నట్లు విదేశీ పెట్టుబడిదారులు దేశంలో పెట్టే ప్రతి రూపాయి పెట్టుబడికి లాభాలు కల్పించే బాధ్యత మాదేనంటూ హామిని ఇస్తూ వారికి ఎర్ర తివాచీ (రెడ్ కార్పేట్) పరుస్తున్నది.

మోడి ప్రధానమంత్రి పదవి అధిష్టించిన మరుక్షణం నుండే తాను సామ్రాజ్యవాదులకు 'అత్యంత వినయ విధేయతలు కలిగిన సేవకుడినని' నిరూపించుకునేందుకు భారతదేశంలో కాలు నిలపకుండా విదేశీ పర్యటనలు చేస్తూ బహుళజాతి సంస్థలకు ఆహ్వానం పలుకుతున్నాడు. తనను గెలిపించి ప్రధానమంత్రి అధికారం కట్టబెట్టిన బహుళజాతి సంస్థలకు, దేశీయ కార్పోరేట్ సంస్థలకు అత్యంత నమ్మకం కల్గిన విశ్వాస పాత్రుడిగా మెలుగుతున్నాడు. మరోవైపు మోడి తాను అనుసరిస్తున్న సామ్రాజ్యవాద అనుకూల, దేశ ద్రోహపూరితమైన విధానాలను ప్రజలు అర్థం చేసుకోకుండా వారిని పక్కదారి పట్టించేందుకు సంస్కరణలను 'అభివృద్ధి కార్యక్రమం' గా ఏకరువు పెట్టడమే కాకుండా, దేశభక్తిని చాటుకోవడమంటే సంస్కరణల బాటలో నడవడమేనంటూ తన ఉపన్యాసాలతో ఊదరగొడ్తున్నాడు.

సామ్రాజ్యవాదులకు సేవ చేయడంలో దళారీ, నిరంకుశ బూర్జువా భూస్వామ్య వర్గాల రాజకీయ ప్రతినిధులుగా చంద్రబాబు, చంద్రశేఖర్‌లు మోడికి ఏ మాత్రం తీసిపోవడం లేదు. వీరు కూడా ముఖ్యమంత్రి పదవులను చేపట్టినప్పటి నుండి బహుళజాతి సంస్థలకు తలుపులు బార్లా తెరవడంలో పోటీ పడ్తున్నారు. చంద్రబాబు అయితే మోడిని అనుసరిస్తూ సామ్రాజ్యవాద దేశాలకు వెళ్ళి వాళ్ళను సకల మర్యాదలతో ఆహ్వానిస్తున్నాడు. ఇప్పటికే రాజధాని పేరుతో 33 వేల ఎకరాల సారవంతమైన వ్యవసాయ భూమిని రైతాంగం నుండి బలవంతంగా గుంజుకొని సింగాపూర్, జపాన్ పెట్టుబడిదారులకు అప్పగించేందుకు సన్నాహాలు పూర్తి చేసాడు. ఇంకా విశాఖ, చెన్నై కోస్టల్ కారిడార్ కోసమూ, 'పెట్రో కెమికల్ పెట్రో ఇండస్ట్రియల్ కారిడర్' కోసమూ లక్షల ఎకరాల పంట భూములను రైతాంగం నుండి స్వాధీనం చేసుకొంటున్నాడు. ఇలా 'అభివృద్ధి' పేరుతో, ఉపాధి కల్పన పేరుతో మోసపు మాటలు చెప్తూ తమ యజమానులైన సామ్రాజ్యవాదులతో పాటు ఈ దేశ దోపిడీ పాలకవర్గాలలోని తన పరివారం బొక్కసాలు నింపేందుకు నిద్రహారాలు లేకుండా కృషి చేస్తున్నాడు. వ్యవసాయాన్ని, వ్యవసాయంపై ఆధారడుతున్న రైతులను, కూలీలను సర్వనాశనం చేసేందుకు సంకల్పించాడు. 1947 తర్వాత నామమాత్రంగా మిగిలిన దేశ ప్రజాస్వామ్యం, సార్వభౌమత్వం, స్వావలంబన వంటి విషయాలను సంపూర్ణంగా సామ్రాజ్యవాదులకు ధారాదత్తం చేయడంలో మోడితో చేయి చేయి కలిపి దూకుడుగా ముందుకు పోతున్నాడు. ఇక తెలంగాణ ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు సైతం అక్కడి పోరాట సమాజం కొంత నియంత్రిస్తున్నప్పటికీ సంస్కరణల విషయంలో తను ఏ మాత్రం వెనక పడకూడదనే ఉద్దేశంతో సామ్రాజ్యవాదులకు, దేశ దోపిడీ పాలకవర్గాలకు అనుకూలంగా పారిశ్రామిక విధానాన్ని రూపొందించాడు.

ఈ దళారీలు ఒక వైపున దేశాన్ని బహుళజాతి సంస్థలకు అమ్మివేస్తూ మరోవైపు తమ విధానాలను వ్యతిరేకించే ఎవరినైనా సరే క్రూరంగా అణచివేసేందుకు ఫాసిస్టు అణచివేతకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. వీరు అధికారంలోకి వచ్చింది మొదలు పోలీసువ్యవస్థను పటిష్టీకరించే పనిని చేపట్టారు. ఈ విషయాన్ని అనేకసార్లు బహిరంగంగానే ప్రకటించారు. వాస్తవంగా తాము చేపట్టే విధానాలు ప్రజానుకూలమైనవైతే పోలీసువ్యవస్థ పటిష్టీకరణకు అంత ప్రాధాన్యత అవసరం లేదు. కానీ వాళ్ళ వర్గ స్వభావ రీత్యా, వారు సామ్రాజ్యవాద అనుకూల ప్రజావ్యతిరేక విధానాలను మాత్రమే చేపడ్తారు. కనుక ప్రజల నుండి, ప్రజాస్వామికవాదుల నుండి, పర్యావరణవాదుల నుండి, విప్లవ కారుల నుండి వ్యతిరేకతలు, నిరసనలు, ప్రతిఘటనలు తప్పని సరి కనుక వారు పోలీసు

పటిష్ఠీకరణపై ఎక్కువగా ఆధారపడ్డారు.

పై నేపథ్యంలోనే నేడు ఎ.ఒ.బిలో కేంద్ర సాయుధ బలగాలతో పాటు ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల ప్రత్యేక పోలీసు బలగాలు నిర్వహిస్తున్న ఆపరేషన్ ఆల్‌ఔట్‌ను పరిశీలించాలి. చంద్రబాబు ప్రమాణ స్వీకారం రోజునే నల్లమలలో కా॥ బాబురావు, కా॥ భారతి, కా॥ విమలలను బూటకపు ఎన్‌కౌంటర్‌లో కాల్చి చంపి, తన 'అభివృద్ధి నమూనా' ను వ్యతిరేకించేవారి విషయంలో తన ఫాసిస్టు వైఖరి ఏమిటో స్పష్టం చేసాడు.

నేడు ఆంధ్ర, ఒడిశా సరిహద్దు జోన్‌లోని విశాఖ, మల్కనగిరి కోరాపూట్ జిల్లాలలో పీడిత ప్రజలు మావోయిస్టు పార్టీ నేతృత్వంలో భూస్వాములకు, సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా సాయుధ వ్యవసాయ పోరాటాన్ని కొనసాగిస్తున్నారు. ఈ మూడు జిల్లాలలో ప్రజలు రైతుకూలీసంఘాల నాయకత్వంలో సమీకృతులై భూస్వాముల నుండి, అటవీశాఖ నుండి వేలాది ఎకరాల భూమిని ఆక్రమించుకొని సాగుచేసుకొంటున్నారు. ముఖ్యంగా కోరాపూట్ జిల్లా నారాయణపట్నా బ్లాక్‌లో భూస్వాములకు చెందిన 2,500 ఎకరాల భూమిని ప్రజలు పోరాడి స్వాధీనం చేసుకొన్నారు. విశాఖ జిల్లా మన్యం ప్రాంతంలోని 500 హెక్టార్ల ప్రభుత్వ కాఫీ ప్లాంటేషన్లను వేలాది మంది ప్రజలు కదిలి స్వాధీనం చేసుకున్నారు. ఈ ప్రముఖమైన పోరాటాలే కాకుండా కలిమెల, పొడియా, బైఫర్‌గూడ, మాచ్‌ఖండ్, కట్‌ఆఫ్ ఏరియా, పెదబయలు మొ॥గు ప్రాంతాలలోని దాదాపు మెజారిటీ గ్రామాలలో రైతాంగం భూమి సమస్యను చేపట్టి పోరాడుతున్నారు. మరోవైపు చంద్రబాబు, నవీన్‌పట్నాయక్‌లు బాక్సైట్ గనుల తవ్వకాలకు బహుళజాతి సంస్థలతో ఒప్పందం కుదుర్చుకొని వేలాది మంది ఆదివాసీ రైతాంగాన్ని విస్తాపితుల్ని చేసే దుష్ట పథకాలను తిప్పి కొడ్తూ ప్రజలు మావోయిస్టు పార్టీ నేతృత్వంలో మిలిటెంట్ పోరాటాలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే జర్రెల, అరకు (విశాఖ జిల్లా), మాలి దేవమాలి (కోరాపూట్ జిల్లా) పర్వాతాల నుండి బాక్సైట్ తవ్వి తీయడాన్ని వ్యతిరేకిస్తూ ప్రజలు మిలిటెంట్ పోరాటాలు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా సామ్రాజ్యవాదులు దేశ దళారీల సహయంతో నిర్వహిస్తున్న వనరుల దోపిడీని అడ్డుకుంటున్నారు. ఈ పోరాటాలలో చైతన్యవంతమవుతున్న ప్రజలు సామ్రాజ్యవాదులకు, వారి తాబేదారులైన దళారీ నిరంకుశ బూర్జువా భూస్వామ్య వర్గాలకు వారి రాజ్యానికి వ్యతిరేకంగా రాజకీయంగా సమీకృతులు అవడమే కాకుండా, ప్రత్యామ్నాయ అధికార అంగాలైన విప్లవ ప్రజాకమిటీలను (ఆర్.పి.సి) నిర్మించుకొంటున్నారు. ప్రత్యామ్నాయ ప్రజా అభివృద్ధి నమూనాను అమలు చేస్తున్నారు.

ప్రజలలో వస్తున్న ఈ విప్లవకరమైన మార్పు పాలకవర్గాలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నది. అసలే తీవ్రమైన ద్రవ్య, ఆర్థిక సంక్షోభంలో ఉన్న సామ్రాజ్యవాదులకు, దేశ పాలకవర్గాలకు ఈ పరిణామాలు మింగుడు పడటం లేదు. దీంతో వారు విప్లవ పార్టీని, పి.ఎల్.జి.ఎను, ప్రజలను ప్రధానంగా తమ సాయుధ బలగాలతో సత్వరమే అణచివేసి తమ 'సంస్కరణల' ప్రక్రియను వేగవంతం చేసేందుకు తెగ హైరానా పడ్తున్నారు. ఈ 'సత్వర అణచివేత' పథకంలో భాగంగానే జనవరి 2015 నుండి ఆపరేషన్ ఆల్ ఔట్ పథకాన్ని చేపట్టారు.

2014 నవంబర్‌లోనే విశాఖపట్నం ఎస్.పి కోయ ప్రవీణ్ 'మావోయిస్టులతో మరో యుద్ధానికి సిద్ధమవుతున్నామనీ, మావోయిస్టుల అణచివేతకు వినూత్న పథకం రూపొందించామనీ, దానికి రాష్ట్ర ప్రభుత్వం అనుమతి లభించిదనీ, కేంద్రం ఆమోదిస్తే ఎ.ఒ.బిలో మావోయిస్టుల జాడే ఉండదని' ప్రకటించాడు. అదే నెలలో కా॥ శరత్, కా॥ గణపతిలపై వీరవరం సంజీవరావు ముఠా దాడిచేసి హత్య చేయడాన్ని ఆసరా చేసుకొని పోలీసులు 'మావోయిస్టులను ఎదిరించిన వీరవరం వాసులను ఆదర్శంగా తీసుకొని గిరిజన ప్రాంత ప్రజలంతా మావోయిస్టులను తిప్పికొట్టాలని' పిలుపునిస్తూ దుష్ప్రచారానికి లంకించుకున్నారు. మరోవైపు మన్యంలో సభలు, ర్యాలీలు చివరికీ ఏ కొద్దిమంది కూడా జమ అయ్యేందుకు వీలులేని పద్ధతులలో పోలీస్ యాక్ట్-30ని అమలు జరుపుతూ ప్రజల ప్రాథమిక హక్కులను సైతం కాలరాచివేస్తున్నారు. రాష్ట్ర హెూం శాఖమంత్రి నిమ్మకాయల చిన్న రాజప్ప రాష్ట్రంలో మావోయిస్టు కార్యకలాపాలను పూర్తిగా నిర్మూలిస్తామని ప్రకటించిన తరువాత సాయుధ దాడిని మరింత తీవ్రతరం చేసారు. రాష్ట్రంలో కొత్తగా 7వేల మంది పోలీసులను నియమించడంతో పాటు, పోలీసులకు నూతన వాహనాలను అలాట్ చేసారు. విశాఖ జిల్లాలో నర్సీపట్నం, కృష్ణదేవిపేట, నాతవరం, కొయ్యూరు, అరకులోయ, ముంచంగిపుట్టులలో రెండేసి కోట్ల రూపాలయలతో అధునాతన పోలీస్టేషన్లను నిర్మిస్తున్నారు. బాక్సైట్ తవ్వకాలకు ఎటువంటి ఆటంకాలు లేకుండా చేసేందుకు 100 వరకు ఔట్ పోస్టులను ఏర్పరుస్తామని చంద్రబాబు ప్రభుత్వం ప్రకటించింది. కేంద్ర ప్రభుత్వ పథకంలో భాగంగా ఉద్యమ సమాచారాన్ని సేకరించేందుకు లోతట్టు ప్రాంతాలలో సైతం సెల్‌ఫోన్ టవర్లు నిర్మిస్తున్నారు. కూంబింగ్‌లలో పాల్గొనే సాయుధ బలగాలకు మందు పాతర్లను పసిగట్టి తెలియచేసేందుకు బెల్జియన్ షెపర్డ్ జాతిని చెందిన 'మాలినోయిస్' రకం కుక్కలను తెప్పించారు. ఒడిశాలో ఇప్పటికే ఉన్న 5 బి.ఎస్.ఎఫ్ బెటాలియన్‌లకు తోడు అదనంగా మరో 2 బి.ఎస్.ఎఫ్ బెటాలియన్‌లను మోహరించారు. ఈ మధ్య కాలంలో కొత్తగా కుంబారిపూట్, కియాంగ్, రాళ్ళగడ్డలలో బి.ఎస్.ఎఫ్ క్యాంపులను ఏర్పరిచారు.

ముఖ్యంగా జనవరి 2015 నుండి ఈ దాడి మరింత తీవ్రతరమైంది. ఆంధ్రప్రదేశ్‌లో మైదాన ప్రాంతాలలోని స్పెషల్ పార్టీ, గ్రేహౌండ్స్ బలగాలను ఏజన్సీకి రప్పించారు. ఏజెన్సీలోని అన్ని పోలీస్టేషన్లు స్పెషల్ పార్టీ పోలీసులతో పాటు సి.ఆర్.పి.ఎఫ్ బలగాలతో భర్తీ అయి ఉన్నాయి. కొన్ని బలగాలను పోలీస్టేషన్లతో సంబంధం లేకుండా నేరుగా గ్రామీణ ప్రాంతానికి తరలించే ఏర్పాటు చేసుకున్నారు. ఈ దాడులకు ముందు విశాఖ ఎస్.పి కోయ ప్రవీణ్, మల్కనగిరి ఎస్.పి మిత్రభాను మహాపాత్రోలు ఏరియల్ సర్వేలు నిర్వహించడంతో పాటు సమిష్టిగా దాడి వధకాన్ని రూపొందిస్తున్నారు. ఈ దాడుల్లో కేంద్ర సాయుధ బలగాలతో పాటు ఆంధ్ర, ఒడిశా రాష్ట్రాలకు చెందిన కమాండో బలగాలు గ్రేహౌండ్స్, ఎస్.ఒ.జి లు పాల్గొంటున్నాయి. ఒక్కొక్క దాడిలో 500లకు తగ్గకుండా ఈ బలగాలు సమన్వయంతో కూంబింగ్‌లు నిర్వహిస్తున్నాయి. ఈ సమన్వయానికి మానవ రహిత విమానాలను కూడా వాడుకొంటున్నారు. ఈ సంవత్సరంలో జనవరి నుండి ఏప్రిల్ చివరి వరకు ఈ బలగాలు 10 సార్లైనా ఏరియా డామినేషన్లు నిర్వహించి ఉంటాయి. ఇంకా ఈ కాలంలో పార్టీ జనరల్ సెక్రటరీ

మొదలు ముఖ్యమైన నాయకత్వ కామ్రేడ్స్ తలలకు వెలలు ప్రకటించి పోస్టర్లు వేయడం, పదుల సంఖ్యల్లో సంఘ మిలీషియా సభ్యులను, నాయకత్వాన్ని అరెస్టులు చేయడం, చిత్రహింసలకు గురి చేయడం, లొంగుబాట్లను చూపించడం, ఇన్ఫార్మర్ నెట్వర్క్ను బలోపేతం చేయడం, మరోవైపు సివిక్ యాక్షన్ ప్రోగ్రాం పేరుతో బూటకపు వితరణ కార్యక్రమాలు చేపట్టడం వగైరా రూపాలలో పోలీసులు తమ బహుముఖ దాడిని తీవ్రతరం చేసారు.

జనవరి ప్రారంభంలో పార్టీ నాయకత్వాన్ని నిర్మూలించేందుకు చేపట్టిన ఆపరేషన్ ఆల్ఔట్ సందర్భంగా బి.ఎస్.ఎఫ్ పోలీసులు మల్కనగిరి జిల్లా గుమ్మ బ్లాక్లో వర్రపాదర్ నుండి నారింగ్జాలకు నదిలో పడవ ప్రయాణం చేస్తున్న ముగ్గురు ఆదివాసీ రైతులపై విచక్షణా రహితంగా కాల్పులు జరిపారు. ఈ కాల్పులలో ముదిలి బుద్దా చనిపోగా లచ్చా పలాసీ, బుద్ర మొదలీ గాయపడ్డారు. ఈ సంఘటన తరువాత పోలీసు కాల్పులను నిరసించిన ఆ చుట్టుపక్క గ్రామాల ప్రజలు చిత్రకొండలోని ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్ళగా అక్కడ మల్కనగిరి ఎస్.పి నేతృత్వంలోని పోలీసులు లచ్చా, మొదిలీలను అదుపులోకి తీసుకొని ఇంతవరకు వారిని వదలలేదు. ఈసంఘటనను కప్పిపుచ్చేందుకు పోలీసులు తాము చేపట్టిన దాడిలో 5గురు మావోయిస్టులు చనిపోయారని పెద్దఎత్తున తప్పుడు ప్రచారం చేపట్టారు. చివరకు సాధారణ రైతు చనిపోయాడనే అసలు విషయం బయట పడటంతో వాళ్ళు కూడా మావోయిస్టు సానుభూతి పరులేనంటూ బుకాయించడం మొదలుపెట్టారు.

పోలీసులు ఒకవైపునా గతంలో ఎప్పుడు లేనంతా పెద్ద స్థాయిలో సాయుధ బలగాలను మోహరించి ఏరియా డామినేషన్లు నిర్వహిస్తున్నప్పటికీ, విప్లవ ప్రజానీకం మాత్రం పార్టీ, పి.ఎల్.జి.ఎ నేతృత్వంలో సంఘటిత పడుతూ తమ పోరాట శక్తిని మరింతగా పెంచుకుంటూ ఉద్యమిస్తున్నారు. మన్యంలో బాక్సైట్ తవ్వకాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించేది లేదనీ, ఇక్కడి వనరులను రక్షించుకోవడంలో తమ తుది రక్తపు బొట్టు వరకు పోరాడతామని శపథం చేస్తూ దృఢంగా నిలబడుతున్నారు. జనవరి నుండి పోలీసులు ఒకవైపున ఉద్యమాన్ని పూర్తిగా దెబ్బతీయాలనే పథకంతో దాడి చేస్తున్నప్పటికీ జనవరి 17న 500 మంది ప్రజలు కదిలి జి.మాడుగుల మండలంలోని గుదలంవీధిలోని సింహాచలం ఆశ్రమంపై దాడి చేసారు. ఆ ఆశ్రమాన్ని ధ్వంసం చేసి అక్కడున్న సంపదనంతా ప్రజలు పంచుకున్నారు. తమ ప్రియతమ నాయకులు కా॥ శరత్, కా॥ గణపతిల హత్యలకు నిరసనగానే ఈ దాడి అంటూ ప్రకటించారు. ఈ దాడి జరిగిన వారం రోజుల లోపునే ప్రజలు ఎస్.ఆర్ కంపెనీకి చెందిన పైప్లైన్ను ధ్వంసం చేసారు. ఎస్.ఆర్ కంపెనీ యజమాన్యం డి.కెలో విప్లవోద్యమాన్ని అణచివేసేందుకు ప్రభుత్వ సాయుధ బలగాలకయ్యే ఖర్చులకు కోట్ల రూపాయలు ఖర్చు పెడ్తున్నది. అందుకే దోపిడీ వర్గాలకు చెందిన కార్పోరేట్ సంస్థపై ప్రజలు దాడి చేసారు. జనవరి 26న 'రిపబ్లిక్ దినం' సందర్భంగా ఒబామా ఆహ్వానాన్ని వ్యతిరేకిస్తూ నిరసన చర్యలు చేపట్టడంతో పాటు బంద్ నిర్వహించారు. తిరిగి ఫిబ్రవరి 9న 200 మంది ప్రజలు, మిలీషియా కదిలి వీరవరం, తూరుమామిడి, దిగవలస గ్రామాలలోని ద్రోహి సంజీవరావు పరివారానికి చెందిన ఇళ్ళపై దాడి చేసి వాటిని ధ్వంసం చేసారు. ఫిబ్రవరి 20న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న సామ్రాజ్యవాద, బ్రహ్మాణవాద హిందుత్వ విధానాలకు వ్యతిరేకంగా పార్టీ బంద్కు పిలుపునిస్తే ప్రజలు అందులో చురుగ్గా పాల్గొన్నారు. ఫిబ్రవరి 23న బూసిపుట్ పరిసర గ్రామాల ప్రజలు సారాను నిషేధించాలనీ, బూసిపుట్లో పోలీసు క్యాంపు పెట్టకూడదని డిమాండ్ చేస్తూ సభ నిర్వహించారు. అదేరోజు పెద్ద ఊరేగింపుగా బూసిపుట్కు వెళ్లి పోలీసుక్యాంపు కోసం నిర్మాణంలో ఉన్న భవనాన్ని కూల్చివేసారు.

ఈ సంఘటనలన్నీ పార్టీకి పెరుగుతున్న ప్రజల మద్దతును వ్యక్తపరుస్తున్నాయి. పోలీసులను మరింత చికాకు పరుస్తున్నాయి. పోలీసుల మాట అటుంచితే ఫాసిజం మూర్తిభవించిన చంద్రబాబుకు మరింత అసహనం కల్గిస్తున్నాయి. ఈ అసహనం ఎంతగా పెరుగుతున్నదంటే ఈ మధ్య 20 మంది ఎర్రచందనం కూలీల బూటకపు ఎన్కౌంటర్ చూస్తే అర్థమవుతుంది. ఇటు చంద్రబాబు, అటు చంద్రశేఖర్రావు సామ్రాజ్యవాదుల బంట్లుగా ప్రథమ స్థానాన్ని పొందాలని పోటీ పడ్తున్నారు. సామ్రాజ్యవాదుల మార్కెట్ రథచక్రాలకు ఆయా రాష్ట్రాల ఆర్థిక విధానాలను రాట కట్టేందుకు చేస్తున్న ప్రయాత్నాలకు, వారి రోడ్ రోలర్ పాలనకు ఏ మాత్రం చికాకు కల్పించినా సహించే పరిస్థితిలో లేరు. అందుకే చంద్రశేఖర్రావు పట్టపగలు 'సెమి' సంస్థకు చెందిన వికారుద్దీన్ బృందాన్ని కోర్టుకు తీసుకెళ్తూ బూటకపు ఎన్కౌంటర్లో హత్య చేసాడు. ఈ సంఘటనలన్నీ వారి ఫాసిస్టుపాలనకు ప్రారంభ సూచికలు మాత్రమే.

కేంద్రంలో గానీ, రాష్ట్రాలలో గానీ, మోడి, చంద్రబాబు, చంద్రశేఖర్రావులు వారి యజమానులకిచ్చిన మాట ప్రకారం దేశాన్ని వేగంగా అమ్మివేయక తప్పదు. ఇప్పటికే సామ్రాజ్యవాదులకు అనుకూలంగా అనేక విధాన ప్రకటనలు చేసారు. వాటిని యుద్ధ ప్రాతిపదికన అమలు చేసేందుకు స్వతహాగా వారే బాధ్యతలు స్వీకరించారు. ఇంత చేస్తున్నప్పటికీ బహుళజాతి సంస్థలు సంతృప్తి పడటం లేదు. టాక్సుల (పన్నుల) విషయం ఇంకా తగ్గించాల్సినంత తగ్గించడం లేదనీ, ఇది టాక్స్టెర్రరిజం అని కేంద్ర, రాష్ట్ర పాలకులపై హూంకరిస్తున్నాయి. ఇప్పుడు చేస్తున్న మార్పులు ఇంకా వేగంగా జరగాలని అదేశిస్తున్నాయి. దీంతో ఈ దళారీ పాలకులు వారి యజమానులకు ఏ మాత్రం ఇబ్బంది కలగకుండా దేశ సంపదలను బంగారు పళ్ళెంలో పెట్టి వారికి అర్పిస్తున్నారు. మరోవైపు మన దేశం హిందూ దేశమనీ, ఇది హిందువులకు మాత్రమే పరిమితమంటూ తమ అసలు ఎజెండా అయినా బ్రాహ్మణవాద హిందుత్వాన్ని చాపకింద నీరులాగా ప్రవేశ పెడ్తున్నారు.

ఈ దళారీ పాలకులు దేశాన్ని ఒకవైపున సామ్రాజ్యవాదులకు ధారదత్తం చేస్తూ మరోవైపు 'సంస్కరణల' వల్ల దేశసంపద పెరుగుతుందనీ, పెరిగిన సంపదను అందరికీ అందేలా 'సమ్మిళిత అభివృద్ధిని' కొనసాగిస్తామనీ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని మాయమాటలు చెబుతున్నారు. వాస్తవంగా 1991 నుండి అమలవుతున్న సంస్కరణల ఫలితాలను చూస్తే వాటి అసలు నైజమేమిటో మనకు అర్థమవుతుంది. ఈ 25 ఏళ్ళలో సంపద పెరిగినప్పటికీ ధనికులు మరింత ధనికులుగా (ప్రపంచ బిలియనీర్లలో నాల్గవ స్థానం భారత బిలియనీర్లు సంపాధించారు) పేదలు మరింత పేదలుగా మారారు. పేదల విషయానికొస్తే దేశంలో రోజుకు 20రూ॥లు కూడా ఖర్చుపెట్టలేని వారు వందకు 77 మంది ఉన్నారని వివిధ నివేదికలు తెలియచేస్తున్నాయి. ఈ కాలంలో

ఎప్పుడు లేనంతగా కుంభకోణాలు బయటపడి అవినీతి కొన్ని రెట్లు పెరిగినట్లుగా ప్రభుత్వ గణాంకాలే తెలియచేసాయి. వ్యవసాయం ధ్వంసమై వేలల్లో రైతాంగం ఆత్మహత్యలకు పాల్పడ్డారు. వ్యవసాయ కూలీలు ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డారు. పారిశ్రామిక రంగానిది కూడా ఇదే పరిస్థితి. సంస్కరణలు ప్రారంభమైన తర్వాత సామ్రాజ్యవాదులు, నయాఉదారవాద విధానాల ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థను, రాజకీయాలను, సంస్కృతిని పూర్తి స్థాయిలో నియంత్రిస్తున్నారు. కీలకమైన విధానాలను వారే నిర్ణయిస్తున్నారు. సలహాదారులు, నిపుణుల పేరుతో ప్రభుత్వ శాఖలన్నింటిపై వారి పట్టు కొనసాగుతున్నది. సహాయం, ఋణం పేరుతో దేశ ఆర్థిక వ్యవస్థను వారి ద్రవ్య సాలేగూటిలో మరింతగా ఇరికించారు. ఒక్కమాటలో చెప్పాలంటే సామాజిక జీవితంలోని ప్రతి ఒక్క అంశంపై పట్టు సంపాదించారు. గడిచిన 25 ఏళ్ళ కాలంలో సంస్కరణల వల్ల దేశం పరాధీనమైన విషయం స్పష్టంగా కళ్ళకు కన్పిస్తూంటే ఈ దళారీలు మాత్రం సంస్కరణలను మరింతగా 'ఉరకలెత్తించి' దేశాన్ని ప్రపంచంలోనే 'అగ్రపథాన' నిలబెడ్తామని ఆర్భాటం చేస్తున్నారు. మరోవైపు వారి ప్రయత్నాలకు ఎవరైనా ఏ మాత్రం అసమ్మతి, నిరసన, ప్రతిఘటన వ్యక్తం చేస్తే వారిని క్రూరంగా అణిచివేసేందుకు రాజ్యాన్ని ఫాసిజీకరిస్తున్నారు. బ్రాహ్మణవాద హిందుత్వ శక్తులను సంఘటిత పరిచి ఫాసిజానికి సామాజికంగా బలమైన పునాదిని నిర్మిస్తున్నారు.

నేడు భారత దళారీ పాలకవర్గాలు వారికి రాజకీయంగా ప్రాతినిధ్యం వహిస్తున్న బూర్జువా, రివిజనిస్టు పార్టీలు, ముఖ్యంగా కేంద్రంలో, రాష్ట్రాలలో అధికారంలో ఉన్న పార్టీలు, నాయకులు అనుసరిస్తున్న సామ్రాజ్యవాద అనుకూల ఆర్థిక రాజకీయ విధానాల వలన దేశంలో మౌళిక వైరుధ్యాలు తీవ్రతరమవుతున్నాయి. ప్రజలు వివిధ సమస్యలపై ఈ దోపిడీ పాలకవర్గాలకు వ్యతిరేకంగా సమరశీల పోరాటాలు నిర్వహిస్తున్నారు. ఈ వస్తుగత స్థితిని దృష్టిలో ఉంచుకొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నేడు విప్లవోద్యమంపై ఎక్కుపెట్టిన ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ను, అందులో భాగంగా ఈ మధ్య కాలంలో నిర్వహిస్తున్న ఆపరేషన్ ఆల్ ఔట్‌ను ఓడించేందుకు ప్రజా పోరాటాలకు ముందుండి నాయకత్వం వహించాలి. ముఖ్యంగా భూమి, విస్తాపిత సమస్యను కేంద్ర బిందువుగా చేసుకొని పోరాటాలు నిర్వహించాలి. సాయుధ వ్యవసాయక విప్లవాన్ని తీవ్రతరం చేయడంతో పాటు విస్తరించాలి. సమస్యల ప్రాతిపదికన వీలైనంత విశాలంగా ఐక్యవేదికలు నిర్మించేందుకు చొరవ చేయాలి. ఐక్యవేదికల నాయకత్వంలో ప్రజలను కదిలించి సామ్రాజ్యవాదులకు, దళారీ నిరంకుశ బూర్జువా, భూస్వామ్య వర్గాలకు వ్యతిరేకంగా రాజకీయ సమీకరణలు చేపట్టాలి. ఈ క్రమంలోనే వారిని వివిధ రహస్య ప్రజా సంఘాలలోకి, మిలీషియాలోకి పార్టీలోకి సమీకరించి ప్రజాయుద్ధాన్ని తీవ్రతరం చేసే విధంగా సంఘటిత పరచాలి. ఈ క్రమాన్ని పట్టుదలగా, దృఢంగా, దీర్ఘకాలిక దృష్టితో నిర్వహించేందుకు పార్టీ, పి.ఎల్.జి.ఎలు మరింతగా తమ కార్మికవర్గ స్వభావాన్ని పెంపొందించే దిశగా బోల్షీవీరణ క్యాంపెయిన్‌ను విజయవంతం చేయాలి. ★

## "గాలిమీద స్వారీ చేయండి-కెరటాలను ఛేదించుకుంటూ పురోగమించండి"

లక్ష్యాలను చేరుకోవడానికి మనకు గొప్ప ఊపు ఉండాలి. "గాలిమీద స్వారీ చేయండి-కెరటాలను ఛేదించుకుంటూ పురోగమించండి" అనే పీపుల్స్ డైలి సంపాదకీయాన్ని గమనంలో ఉంచుకొంటే, ఏటికి ఎదురీదటానికి మనం శక్తినంతటిని కూడదీసుకోవాల్సి ఉంటుంది. గొప్పతనం, విజయాలకోసం ఆరాటపడుతూ, సత్వర ఫలితాల కోసం అసహనంగా ఉంటూ, గతాన్ని అసహ్యించుకుంటూ, భవిష్యత్ మీద గుడ్డిగా నమ్మకాన్ని పెట్టుకొనే కొందర్ని, కొందరు విమర్శిస్తున్నారు. గొప్పతనం, విజయాలకోసం ఏ రకమైన ఆరాటం ఉంది? అది గొప్పదనం, విజయాలకోసం విప్లవకారుడు పడే ఆరాటమా, లేక అభివృద్ధి నిరోధకులుపడే ఆరాటమా అది గొప్పతనం, విజయాలకై స్వీయాత్మకత, లాంఛనతత్వాలతో కూడుకొని ఉన్న ఆరాటమా లేక వాస్తవాత్మకమైనదా?

గతాన్ని అసహ్యించుకోవడం అనే విషయానికివస్తే, గతంలో మంచి మచ్చుకైనా లేనేలేదు అనటం లేదే. గతంలో నిజంగానే మంచి విషయాలున్నాయి. కాని ఎల్లప్పుడూ గతానికే అంత ప్రాముఖ్యతనివ్వడం అంత మంచిది కాదు. మానవ చరిత్ర పురోగమిస్తుంది. ఒక తరం మరో తరమంత శ్రేష్టమైనది కాదు. ముందు వెళ్ళినవారు అటు తర్వాత వచ్చే వారంతా శ్రేష్టులు కారు.

భవిష్యత్తు మీద గుడ్డి నమ్మకం అనే విషయానికి వస్తే, మన లక్ష్యాలు భవిష్యత్‌కు సంబంధించినవి. భవిష్యత్ మీద విశ్వాసాన్నుంచడం, పూర్తిగా సరైన విషయమేనని మనం నమ్ముతున్నాము. అయితే మనది అంధవిశ్వాసం కాకూడదు.

నాయకత్వాన్ని అందించటానికి రెండు మార్గాలున్నాయి. ఒకటి మంచిది, మరొకటి మంచిది కానిది. సోషలిజం నిర్మాణంలో రెండు నాయకత్వ పద్ధతులు, రెండు పనిశైలులు ఉన్నాయి. 'ఇనుము కాకమీద ఉన్నప్పుడే కొట్టి ఒకే ఊపులో పని పూర్తి చేయాలి' అదే సరైన పద్ధతి. ఉదాహరణకు తప్పలను సరిదిద్దుకునే ఉద్యమం అనేది చేయడానికి, పెద్ద ఎత్తున అభిప్రాయాల వ్యక్తీకరణ, వికాసం, ఉండటం అత్యంత శ్రేయస్కరం.

మన శక్తినంతటిని మేల్కొల్పాలి. దాన్ని క్షీణింపచేయకూడదు. మనకు లోటుపాట్లు ఉన్నా, లేదా మనం తప్పలు చేసినా, పెద్ద ఎత్తున అభిప్రాయాలను వ్యక్తం చేయడం, వికాసం అనే మాట ద్వారా వాటిని సరిదిద్దుకోవచ్చు. మనం నీరుగార్చకూడదనే కూడదు. గొప్పదనం, విజయాలను కోరుతున్నామని మనల్ని విమర్శిస్తున్నారు. అటువంటప్పుడు మనం అల్పత్వాన్ని, వైఫల్యాన్ని కోరుకుందామా? మనం గతానికి విలువనిచ్చి, భవిష్యత్తును అసహ్యించుకోవాలా? మనం తప్పకుండా గొప్పతనాన్ని, విజయాన్ని కోరుకోవాలి. అలా అనేవారు మంచివారు. మనం నిజంగానే మన పోరాట చైతన్యాన్ని నిలబెట్టుకోవాలి.

-కా॥ మావో

వ్యాసం

# బోల్షివీకరణను ఒక ఉద్యమంగా చేపడదాం-దేశ విదేశాల చరిత్ర నుండి నేర్చుకుందాం!

## చైనా అక్టోబర్ సోషలిస్టు విప్లవ చరిత్ర నుండి నేర్చుకుందాం!

చైనా విప్లవంలో మూడు దశల అంతర్యుద్ధం, జపాన్ సామ్రాజ్యవాద వ్యతిరేకయుద్ధం అనే రెండు వ్యూహాత్మక దశలున్నాయి. గెరిల్లాయుద్ధాన్ని వ్యూహాత్మక యుద్ధంగా, చలనయుద్ధంతో గొప్పగా మెళవించి దీర్ఘకాలిక యుద్ధ పంథాను విజయవంతం చేయడం ఉంది. వలస, అర్థవలస చైనా దేశంలో నూతన ప్రజాస్వామిక విప్లవం జరిగిన విధం ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికన్ దేశాల విప్లవాలకు మార్గదర్శకమయ్యింది. మొదటి అంతర్యుద్ధ కాలంలో మితవాదం, రెండవ అంతర్యుద్ధ కాలంలో అతివాదం ఓటమికి కారణాలయితే మొదటి తిరోగమనం చింకాంగ్ కొండల్లో విప్లవ స్థావర నిర్మాణ పురోగమనానికీ రెండవ తిరోగమనం లాంగ్‌మార్చ్ వ్యూహంగా పురోగమించాయి. జపాన్ వ్యతిరేక యుద్ధంలోనూ, మూడవ అంతర్యుద్ధంలోనూ కా॥ మావో మార్గదర్శకత్వంలో సరైన శాస్త్రీయ మర్క్సిస్టు-లెనినిస్టు విధానాలు అనుసరించడం వలన చైనా విప్లవం విజయవంతం అయ్యింది. పార్టీ, సైన్యం, ఐక్యసంఘటన అనే మూడు అద్భుత ఆయుధాలు ప్రజాపంథా, వర్గపంథాలో బోల్షివీకరించబడ్డాయి. ఆ క్రమాన్ని ఈ వ్యాసంలో నేర్చుకుందాం.

చైనాదేశం 2వేల సంవత్సరాల పాటు భూస్వామ్య సమాజంగా ఉంది. 100 సంవత్సరాలకు పైగా సామ్రాజ్యవాదుల పరోక్ష పాలనలో ఉంది. 1840లో నల్లమందుకు వ్యతిరేకంగా 2సంవత్సరాల పాటు జరిగిన, బ్రిటన్ సామ్రాజ్యవాద వ్యతిరేక యుద్ధంలో చైనా ఓటమికి గురయ్యింది. ఆనాడు మంచురియా ప్రభువులతో జరిగిన ఒప్పందాల కారణంగా చైనాలోకి విదేశీ పెట్టుబడిదారి విధానం చొచ్చుకురావడంతో ఆర్థికంగా అనేక మార్పులు సంభవించాయి. 1840-1894 మధ్య చైనా అనేకసార్లు దురాక్రమణలకు గురియ్యింది. 1894 చైనా-జపాన్ యుద్ధం, 1900లో 8 మిత్రదేశాల సైన్యం చైనాపై చేసిన యుద్ధం అన్ని కలిసి చైనాను సామ్రాజ్యవాద అనుకూల అర్థవలస-అర్థభూస్వామ్య దేశంగా మార్చివేశాయి. అసమాన ఒప్పందాల కారణంగా విదేశీ వాణిజ్యానికి ఓడరేవులు తెరవడం, చైనా తన భూభాగాలు వదులుకోవడం, మిషనరీ కార్యకలాపాలను అనుమతించడం జరిగింది. 19వ శతాబ్ది చివరికి పెట్టుబడిదారి విధానం సామ్రాజ్యవాద దశలోకి ప్రవేశించి స్వేచ్ఛాయుత పోటి స్థానాన్ని గుత్తపెట్టుబడి ఆక్రమించింది. పెట్టుబడి ఎగుమతి పెరిగింది. చైనాలోకి సామ్రాజ్యవాదులు పెద్దసంఖ్యలో వచ్చారు. స్థానిక భూస్వామ్య పాలకులను/యుద్ధ ప్రభువులను ఏజెంట్లుగా మలుచుకున్నారు. దేశవ్యాపిత మార్కెట్ కలిగిన పింగాణీ, పట్టు కార్ఖానాలు తమ గర్భంలో స్వదేశీ పెట్టుబడిదారీ విధానపు బీజాలను కలిగి ఉండేవి. ఇప్పుడు సామ్రాజ్యవాద దురాక్రమణ దాడులు అసమాన ఒప్పందాలు, మార్కెట్ విస్తరణ, భూస్వామ్యంతో షరీకవ్వడం కారణంగా అవన్నీ విచ్ఛిన్నం కావడంతో సహజసిద్ధంగా అభివృద్ధి అవుతున్న పెట్టుబడిదారీ శక్తుల స్థానంలో దళారీ పెట్టుబడిదారీ వర్గాన్ని కృత్రిమ/అసహజరీతిలో తయారుచేసి ఏజెంట్లుగా వినియోగించుకోవడం ప్రారంభించింది.

చైనా ఇక ఎంతమాత్రం స్వచ్ఛమైన, సామాన్యమైన భూస్వామ్య వ్యవస్థగా లేదు. అర్థభూస్వామ్య వ్యవస్థగా తయారయ్యింది. చైనా ఆర్థికవ్యవస్థ తన స్వతంత్రతను కోల్పోయి సామ్రాజ్యవాద ఆర్థికవ్యవస్థలో ఒక భాగంగా మారిపోయింది. నామమాత్రపు స్వాతంత్ర్యాన్ని, సార్వభౌమత్వాన్ని కలిగిన అర్థవలసగా దిగజారిపోయింది. భూస్వామ్యానికి, అశేష ప్రజానీకానికి మధ్య, సామ్రాజ్యవాదానికి చైనా జాతికి మధ్య వైరుధ్యాలే చైనాలోని మౌళిక వైరుధ్యాలు.

1851-1864 మధ్య 14సం॥ల పాటు సాగి రాష్ట్రాలకు విస్తరించిన తాయిపింగ్ విప్లవం నాన్‌కింగ్‌లో ఒక విప్లవ ప్రభుత్వాన్ని నెలకొల్పింది. భూస్వామ్య మౌళిక భావాలను సవాల్ చేసినప్పటికీ, వ్యవసాయక చట్టాన్ని అమలు చేసినప్పటికీ దానికి పురోగామి సిద్ధాంతం లేని కారణంగా ఓటమిపాలైంది. విప్లవ ప్రతిఘాతుక చింగ్ రాజ్య సైన్యం, అమెరికా, బ్రిటన్, ప్రాన్స్ దురాక్రమణదారులు సంయుక్తంగా దాడిచేసి మొదటి రైతురాజ్యాన్ని (తయిపింగ్ అంటే స్వర్గధామం) కూల్చివేసారు. అయితే ఇలా రైతాంగం స్వతంత్ర్య నాయకత్వంలో తిరుగుబాటు చేసి రాజ్యాన్ని గెలవడం, నడపడం ప్రపంచ చరిత్రలో చాలా ప్రాముఖ్యత గల అంశం.

చైనాలో కమ్యూనిస్టుపార్టీ ఏర్పడక ముందు సాయుధంగా జరిగిన పోరాటాలు చూస్తే నల్లమందు యుద్ధం తర్వాత అనేక సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాలు జరిగాయి. అందులో 1900లో ఉత్తర చైనాలో కర్షకులు, చేతి వృత్తులవారు చేసిన బాక్సర్‌యుద్ధం (ఇహెటువాన్ ఉద్యమం) ఒకటి. ఇది సామ్రాజ్యవాద వ్యతిరేక ప్రజా ఉద్యమంగా యాదృచ్ఛికంగా బద్ధలై సాయుధరూపం తీసుకుంది. బ్రిటన్, అమెరికా, జపాన్, జర్మనీ, జారిస్టు రష్యా, ప్రాన్స్, ఇటలీ, ఆస్ట్రియా. 8 సామ్రాజ్యవాద శక్తులు పెకింగ్, టిన్‌ట్సిన్‌అను ఆక్రమించుకొని ఆ ఉద్యమాన్ని అత్యంత క్రూరంగా అణచివేసాయి.

ఆ తర్వాత జరిగిన మొదటి ప్రపంచయుద్ధం (1914-18) లో అమెరికా, బ్రిటన్, ప్రాన్స్ దేశాల పక్షాన చైనా పోరాడింది. వర్సైల్‌లో 1919 జనవరి 18న జరిగిన శాంతి సమావేశంలో చైనా ప్రతిపాదనలను చర్చించలేదు. చైనా ప్రజలకు ద్రోహం చేయడానికి, దోచుకోవడానికి కుట్ర చేసారు. 1919 మే 4న పెకింగ్‌లో విద్యార్థులు, ఆ తర్వాత షాంగైలో కార్మికులు దేశంలోని అన్ని విప్లవ శక్తులు కదిలి గొప్ప సామ్రాజ్యవాద వ్యతిరేక దేశభక్త ఉద్యమం యుద్ధ ప్రభువుల ప్రభుత్వంపై గట్టి దెబ్బ కొట్టింది. చైనా బూర్జువాజీ విప్లవం కూడా ఈ దేశభక్తి వుద్యమ శ్రేణులల్లో చేరింది. ఆ 'మే4' ఉద్యమం గొపవిజయాన్ని సాధించింది.

మే4 ఉద్యమంలో వ్యక్తమయిన కార్మికశక్తి, రాజకీయ సమ్మెల ప్రభావం, పోరాట విజయాలు నాయకత్వం వహించే, సమన్వయించే రాజకీయపార్టీ అవసరాన్ని ముందుకు తెచ్చింది. చైనా కమ్యూనిస్టుపార్టీ స్థాపనకు పునాది ఏర్పండింది.

1905లో డా॥ సన్‌యట్‌సేన్ స్థాపించిన విప్లవ సమితిలో (టుంగ్‌మెంగ్‌హుయిలో) బూర్జువా, పెటీ బూర్జువా వర్గాలున్నాయి. 1905 నుండి 1911వరకు అనేక విప్లవ తిరుగుబాట్లు చేసారు. 1911లో చింగ్ రాచరిక నియంతృత్వాన్ని ఓడించి చైనా రిపబ్లిక్‌ను, నాన్‌కింగ్‌లో ఒక తాత్కలిక విప్లవ ప్రభుత్వాన్ని ఆ విప్లవ సమితి ఏర్పాటు చేసింది. 1911 విప్లవానికి గట్టి సమాజిక పునాది ఏర్పడలేదు. భూమి సమస్యను పరిష్కరించలేదు. ఆ బూర్జువా వర్గానికి ఉన్న బలహీనత కారణంగా అది ఓడిపోయింది. 1913లో ఉత్తరాది యుద్ధప్రభువు యువాన్‌షికాయ్ సామ్రాజ్యవాదుల మద్దతుతో తాత్కాలిక ప్రభుత్వాన్ని కూలదోసాడు.

సామ్రాజ్యవాద పాలనలో ముడిపదార్థాల లూటీ కారణంగా చైనా ఆర్థిక వ్యవస్థ నాశనమయ్యింది. చైనారైతు మార్కెట్‌పై ఆధారపడటం, చైనాలో సరుకుల మార్కెట్ ఏర్పడటం, రైతులు, చేతివృత్తులవారు లేబర్ మార్కెట్‌గా మారడం జరిగిపోయింది. 1915 నాటికి 1కోటి మంది కార్మికులుంటే అందులో కేవలం 6శాతం మాత్రమే పరిశ్రమల్లో పని చేస్తున్నారు. అంతర్జాతీయకార్మికవర్గ ఉద్యమ ప్రభావంతో కార్మికవర్గ రాజకీయ చైతన్యం త్వరిత గతిన పెరిగింది. 1917అక్టోబర్ సోషలిస్టు విప్లవం చైనా చరిత్రలోనూ, ప్రపంచ చరిత్రలోను మౌళిక మార్పును తెచ్చింది.

చైనాలో మర్క్సిజం-లెనినిజాన్ని లీటా-చావో 1918నుండి విస్తృతంగా ప్రచారం చేసాడు. మే4 తర్వాత ఉద్యమ సిద్ధాంతచర్చలు లోతుగా, విస్తృతంగా జరిగాయి. షాంగై, పెకింగ్‌లలో అధ్యయన బృందాలు, హూనాన్, హూపీ, షాటుంగ్‌లలో కమ్యూనిస్టు బృందాలు, అనేక పత్రికలు, పుస్తకాలు, మేడేలాంటి కార్యక్రమాలు, అధ్యయనాలు, నిర్మాణాలు సాగి చైనా కార్మికవర్గంలో ప్రచార, నిర్మాణకృషి నడిచింది. కార్మికసంస్థలు, రాత్రి పాఠశాలలు క్యాడర్‌కు శిక్షణనిచ్చాయి.

1919 మార్చిలో లెనిన్ నాయకత్వంలో 3వ ఇంటర్నేషనల్ ఏర్పడింది. జాతుల వలసల సమస్యలపై లెనిన్ థీసిస్ ముందుకు తెచ్చింది. 1921 జూలై 1న కమ్యూనిస్టుపార్టీ (సి.పి.సి) మొదటి కాంగ్రెస్ జరిగింది. మావోతో పాటు 12మంది ప్రతినిధులు పాల్గొన్నారు.

1923 జూన్‌లో సి.పి.సి 3వ జాతీయ కాంగ్రెస్ సన్‌యేట్-సేన్ నాయకత్వంలో కొమింగ్‌టాంగ్ పార్టీ సహకారంతో సామ్రాజ్యవాద వ్యతిరేక, భూస్వామ్య వ్యతిరేక ఐక్యసంఘటనను నిర్మించాలని నిర్ణయించింది. 1924-26లలో జరిగిన మొదటి, రెండవ కోమింగ్‌టాంగ్ జాతీయ కాంగ్రెస్‌లు ఐక్యసంఘటన కార్యక్రమాలను రూపొందించి అమలు చేసాయి. కా॥ మావో అందులో నిర్ధిష్టంగా నాయకత్వాన్ని అందించాడు. కార్మికవర్గం, రైతాంగం సాగించిన గొప్ప పోరాటాలతో చైనా విప్లవం వేగంగా పురోగమించింది. 1925 మే 30న సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమంలో అన్ని సెక్షన్‌లు పాల్గొన్నారు. యావత్తు చైనాదేశం విప్లవం-ప్రతీఘాతుక విప్లవాల మధ్య నిర్ణయాత్మక యుద్ధ పరిస్థితుల్లో ఉంది.

1924 మే 31న సోవియట్ రష్యా-చైనా స్నేహ ఒడంబడిక కుదిరింది. దాని ఫలితమే విప్లవ సైన్యాన్ని ఏర్పరచడం. సోవియట్ యూనియన్ డా॥ సన్‌యెట్-సేన్‌కు సహకరించి కాంటన్‌లో "వాంపోవా మిలటరీ అకాడమి" ఏర్పాటు చేసారు. ప్రధాన పోరాటశక్తి అయిన జాతీయ విప్లవ సైన్యం ఏర్పరిచి, ఆ తర్వాత యావత్తు కాంటుంగ్‌ను విప్లవ ప్రభుత్వం ఆధీనం కిందకు తెచ్చి ఉత్తరదేశ దండయాత్రను సాగించింది.

జనవరి 1925లో సి.పి.సి 4వ జాతీయ కాంగ్రెస్ ప్రజాఉద్యమం మంచి ఊపు ఉన్న సమయంలో జరిగింది. కార్మికవర్గ నాయకత్వంలో చైనా ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేయాలని, రైతాంగం మౌళికశక్తి అని, కార్మికవర్గానికి ప్రధాన మిత్రుడని కాంగ్రెస్ పేర్కొన్నది. అయితే వ్యవసాయక విప్లవ కార్యక్రమాన్ని రూపొందించడంలో విఫలమైంది.

1925 మార్చి 12న డా॥ సన్‌యెట్-సేన్ అమరుడయ్యాడు. దేశభక్తుడు, జాతీయ ఉద్యమకారుడు, సోవియట్ యూనియన్ మిత్రుడు ఇకలేడు. ఈ నష్టం తర్వాత కోమింగ్‌టాంగ్ పార్టీ స్వాభావం మారిపోయింది. దీనికి చాంగైషేక్ నాయకుడయ్యాడు. అతడు విప్లవ శిబిరంలో దాగిఉన్న దుందుడుకువాది, కెరియరిస్టు, ఒకప్పుడు షాంగై ఎక్స్చేంజ్‌లో దళారీగా (బ్రోకర్‌గా) పని చేసాడు. డా॥ డన్‌యెట్-సేన్ అతనిని నిజమైన విప్లవకారుడుగా పొరబడి వాంపోవా మిలటరీ అకాడమికి కమాండర్‌గా నియమించాడు. అతను ద్వందనీతిని అనుసరిస్తూ నాయకత్వాన్ని చేజిక్కించుకుని, దేశద్రోహానికి పాల్పడ్డాడు. విప్లవానికి ప్రతిఘాతుకంగా మారాడు. స్థానికయుద్ధ ప్రభువులతో కుమ్మకై బలాన్ని పెంచుకున్నాడు. సామ్రాజ్యవాదులతో మిలాఖత్తైపోయాడు.

1926 మార్చి 18న చాంగైషేక్ తన అనుచరులతో కుట్ర పన్ని "కమ్యూనిస్టులు తిరుగుబాటుకు కుట్ర పన్నారంటూ" ప్రచారం చేసి మార్షల్ లా ప్రకటించి, కమ్యూనికేషన్ కట్ చేసి, కమ్యూనిస్టు అనుకూల కార్యలయాలను దిగ్భంధించి, కమ్యూనిస్టు నాయకత్వాన్ని అరెస్టుచేసి, కమ్యూనిస్టులను ఆర్మీ నుండి తొలగించి పూర్తిగా కమాండ్ సంపాదించాడు. ఈ సంఘటననే "క్రూయిజర్ చుంగ్‌షాన్" (నౌక) సంఘటనగా చెబుతారు.

ఆ నాటికి పార్టీ కార్యదర్శిగా ఉన్న చెన్‌టూషీ మితవాద, అవకాశవాదం మూలంగానే వీడు ఆ కుట్రలు చేయగలిగాడు. పార్టీకి నష్టం చేసి, ఐక్యసంఘటనకు విద్రోహం చేసి, వెన్నుపోటు పొడిచినాసరే వీడిని విప్లవకారుడుగానే చెన్‌టూషీ గుర్తించాడు. వాడిని వ్యతిరేకించిన వారిని విప్లవ ప్రతీఘాతకులుగా పరిగణించాడు.

1925 జులైలో సి.పి.సి కేంద్రకమిటీ యుద్ధ ప్రభువుల, సామ్రాజ్యవాదుల పాలనను కూలదోయాలని పిలుపునిచ్చింది. కార్మిక, కర్షక, విద్యార్థి, సైనిక, వ్యాపార వర్గాలను ఐక్యం కావాలని పిలుపునిచ్చింది. ఇదే ఉత్తరాది దండయాత్రకు ప్రేరణ. అయితే చెన్‌టూషీలో ఉన్న మితవాద, అవకాశవాదం, మిలటరీ నాయకత్వాన్ని చాంగైషేక్ కైవసం చేసుకోవడానికి మార్గం సుగమం చేసింది.

ఇదే సమయంలో కోమింగ్‌టాంగ్ పార్టీలో చాంగైషేక్ అనుచరులు, వారి సిద్ధాంతకర్త టాయ్‌చిటావో 1.జాతీయవిప్లవం-కోమింగ్‌టాంగ్, 2. సన్‌యెట్‌సేన్ సిద్ధాంతం

యొక్క తాత్విక పునాది అని 2పుస్తకాలు రాసాడు. అందులో అతను వర్గపోరాటాన్ని తీవ్రంగా వ్యతిరేకించాడు. కార్మికవర్గ పోరాటాన్ని ఖండించాడు. కార్మికులు పెట్టుబడికి బానిసలుగా ఉండాలన్నాడు. వాడి లక్ష్యం ప్రస్తుత వర్గ సంబంధాలను, బూర్జువా నియంతృత్వాన్ని సుస్థిరపరచడం. దీంతో టాయ్‌చిటావో, సన్‌ఫోలను కీమింగ్‌టాంగ్ కేంద్రకమిటీలోకి ఎన్నుకున్నారు.

ఉత్తరాది దండయాత్ర సైన్యానికి చెందిన 6వ, 2వ సైన్యాలు, ఇతర తిరుగుబాట్లు కలిసి 1927 మర్చి 24న నాంకింగ్‌ను విముక్తి చేసాయి. అదే రాత్రి బ్రిటన్, అమెరికా, జపాన్, ఫ్రెంచియుద్ధనౌకలు నాన్‌కింగ్‌పైకి బయలుదేరి 2వేలమంది సైనికులను, పౌరులను చంపి, గాయపరిచి, ఫిరంగిగుండ్లతో బెదిరించి విప్లవం యొక్క గుండెకాయ అయిన నాన్‌కింగ్‌పై గట్టిదెబ్బ కొట్టారు. ఏప్రిల్ 12న చాంగ్‌కైషేక్ విప్లవ ప్రతిఘాతుక తిరుగుబాటు చేసాడు. చాంగ్‌కైషేక్ విద్రోహం ఆగ్నేయ రాష్ట్రాలలోనూ, కాంగ్‌టుంగ్‌లోనూ బీభత్సాన్ని సృష్టించింది. కమ్యూనిస్టు విప్లవకారులు పెద్దసంఖ్యల్లో హత్యగావించబడ్డారు. విద్రోహం, ప్రతిఘాతుక చర్యలు పెరిగాయి.

శతృబలం అనేకరెట్లు ఉండటం, పార్టీనాయకత్వం చేసిన మితవాద, అవకాశవాద తప్పులు, బూర్జువా ప్రజాస్వామిక విప్లవంలో కార్మికవర్గ నాయకత్వాన్ని విసర్జించడం, రైతాంగం, పెటీ బూర్జువా వర్గాలపైన, ముఖ్యంగా సాయుధ దళాలపైన కమ్యూనిస్టుపార్టీ నాయకత్వం వదులుకోవడం కారణంగా మొదటి అంతర్యుద్ధం ఓటమిపాలైంది.

1927 విప్లవం విఫలమైన తరువాత చైనాలో వర్గపొందికలో మార్పు వచ్చింది. రెండు శత్రుశిబిరాలుగా చీలిపోయింది. సామ్రాజ్యవాదులు, భూస్వాములు, నిరంకుశ దళారీ పెట్టుబడిదారులు, కోమింగ్‌టాంగ్‌లోని మితవాదులు అందరు కలిసి విప్లవ ప్రతిఘాతుక కూటమిగా తయారయ్యారు. బడా బూర్జువావర్గం ద్రోహం చేసింది. జాతీయ బూర్జువావర్గం లొంగిపోయింది. పెటీబూర్జువావర్గంలో ఒకభాగం విప్లవాన్ని విడిచివెళ్ళిపోయింది. కార్మికవర్గం, రైతాంగం పెటీబూర్జువాజీలో దారిద్ర్యంతో బాధపడుతున్నవాళ్ళు విప్లవ పోరాటంలో మిగిలారు. విప్లవపక్షం కన్న వారిబలం అనేకరెట్లు ఉంది. అందువలన విప్లవం ఊపు తగ్గిపోయి వెనకపట్టులో (ఆటులో) ఉంది.

అయితే అనాడు సి.పి.సిలో రెండు పెడధోరణులున్నాయి. అవి 1. పార్టీ కార్యదర్శి చెన్‌టూషీ మితవాద వైఖరి–బూర్జువావర్గ నాయకత్వంలో బూర్జువా ప్రజాస్వామిక విప్లవం జరిగి బూర్జువా ప్రజాస్వామిక రిపబ్లిక్ ఏర్పడాలి. కార్మికవర్గం ఐక్యం కావలసినది బూర్జువావర్గంతోనే అని భావించింది. 2. చాంగ్‌కువో–టావో యొక్క అతివాద వైఖరి–వీరు కార్మికవర్గ ఉద్యమాన్ని మాత్రమే చూసారు. రైతాంగాన్ని సైతం విస్మరించారు. ఈ రెండు ధోరణులకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పోరాడింది.

1926 మార్చిలో కా॥ మావో "చైనా సమాజంలో వర్గాల విశ్లేషణ", 1927 మార్చిలో "హూనాన్ రైతు ఉద్యమంపై నివేదిక"ను సమర్పించాడు. ఈ రచనలలో సరిఅయిన మార్క్సిస్టు–లెనినిస్టు దృక్పథంతో, సరైన పద్ధతిలో జాతీయవిప్లవం గురించిన లెనిన్ థీసిస్‌పై ఆధారపడి నూతన ప్రజాస్వామిక విప్లవానికి సంబంధించిన మౌళిక భావనలను అభివృద్ధి పరిచాడు.

చైనా విప్లవంలో ఎవరు శత్రువులు, ఎవరు నాయకత్వశక్తి, ఎవరు నమ్మదగిన మిత్రులు, ఎవరు ఊగిసలాడే మిత్రులు అనే ప్రశ్నలకు కా॥ మావో జవాబు చెప్పాడు. ఏ మార్గం ద్వారా ప్రజాబాహుళ్యాన్ని సమీకరించాలో, విప్లవ ప్రభుత్వాన్ని ఏర్పరచాలో, రైతాంగ సాయుధ బలగాలను నిర్మించాలో కూడా తెలియచేసాడు.

పార్టీ కార్యదర్శి చెన్‌టూషీ మితవాదపంథా అంతర్యుద్ధ కాలమంతటా ఆధిపత్యం వహించి వైఫల్యానికి కారణమైంది. 1927 ఆగస్టులో ఈ లొంగుబాటు వైఖరిని విమర్శించి అతన్ని తొలగించారు. దీని తర్వాత వెంటనే కేంద్రకమిటీలో అతివాద పంథా ఒకటి లీలీసాన్ నాయకత్వంలో ఆధిపత్యంలోకి వచ్చింది. చైనా విప్లవం "నిరంతరాయమైన వెల్లువ" స్థితిలో ఉన్నదంటూ పొరపాటు అంచనా వేసి, చాలా నగరాలలో సాయుధ తిరుగుబాటులకు పిలుపునిచ్చింది. ఇది భారీ ఎత్తున నష్టాలకు గురి చేసింది. 1928 ఏప్రిల్‌లోనే ఆ పంథాను విడిచిపెట్టారు. 1928 జూన్‌లో జరిగిన 6వ కాంగ్రెస్ ఈ అతివాద పంథాను సరిచేసింది. ఈ క్రమం అంతటా చైనా కమ్యూనిస్టు పార్టీ మితవాద, అతివాద అవకాశవాదాలను వాటి తాలూకు దుష్పరిణామాలనూ, ఓటములను ఎదుర్కొన్నది. మరోవైపు ఇదే సమయంలో కామ్రేడ్ మావో మార్క్సిజం–లెనినిజంను చైనా నిర్దిష్ట పరిస్థితులకు అన్వయింపు చేయడంలో విశేషమైన కృషి చేసాడు. ఇటువంటి అన్వయింపు ద్వారానే చైనా సామాజిక పరిస్థితులకనుగుణంగా విప్లవ సిద్ధాంతాన్ని అభివృద్ధి చేసాడు. ప్రజాసైన్యం, రాజ్యాధికారం వంటి మౌళిక విషయాలలో ఒక స్పష్టతను అందించాడు.

1928 అక్టోబర్‌లో "చైనాలో ఎర్రరాజ్యాధికారం ఎలా మనగలుగుతుంది". 1929 నవంబర్‌లో "చికాంగ్ కొండల్లో పోరాటం" అనే రెండు చారిత్రక ప్రాధాన్యత గల రచనలు చేసాడు. అవి ఎర్రసైన్య నిర్మాణానికి, అభివృద్ధికి సైద్ధాంతిక ప్రతిపదికను సమకూర్చాయి. వలస, అర్థవలసలలో దీర్ఘకాలిక ప్రజాయుద్ధపంథాకు సంబంధించిన అవగాహనకు అవి పునాదులు వేసాయి. చింకాంగ్ కొండల్లో మొదటి కేంద్రవిప్లవ స్థావరాన్ని తర్వాత అనేక విప్లవ స్థావరాలను ఏర్పరచి ప్రత్యక్ష నాయకత్వాన్ని అందించారు. అక్కడే సోవియట్లు నిర్మించి "చైనా సోవియట్ రిపబ్లిక్" తాత్కాలిక ప్రభుత్వ ఏర్పాటు చేసారు. 1931 నవంబర్ 7న కార్మికుల, రైతుల, సైనికుల మొదటి కాంగ్రెస్‌లో కా॥ మావో చైర్మన్‌గా, కా॥ చూటే కమాండర్ ఇన్‌చీఫ్‌గా ఎన్నికయ్యారు. ఈ కాంగ్రెస్ రిపబ్లిక్ యొక్క ప్రాథమిక చట్టాన్ని, వ్యవసాయచట్టాన్ని, ఆర్థిక విధానాలకు సంబంధించిన శాసనాలను ఆమోదించింది. 1932 ఏప్రిల్ 15న ఈ ప్రజా ప్రభుత్వం (1931లో జపాన్ ఈశాన్య చైనాపై దాడిచేసి ఆక్రమించుకున్నప్పటి నుండి దేశంలో జపాన్ వ్యతిరేకత పెరుగుతూ ఉంది) జపాన్‌కు వ్యతిరేకంగా యుద్ధ ప్రకటన జారీ చేసింది. కానీ శత్రు దిగ్బంధనం కారణంగా ఆ ప్రకటన కార్యచరణగా రూపుదాల్చలేదు.

మరల 'అతివాద' భావాలు తిరిగి పార్టీలో ప్రారంభమైనాయి. 1930కి ముందే లీలీసాన్‌పంథా తప్పని గుర్తించినప్పటికీ, వాంగ్‌మింగ్, చిన్‌షాంగ్‌చిన్‌ల నాయకత్వంలోని ఒక పిడివాద ముఠా 'పార్టీలో ప్రస్తుతం మితవాద పెడధోరణి ప్రమాదకరంగా ఉందని' విమర్శించారు. పెట్టుబడిదారులు, ధనికరైతులకు వతిరేకంగా

పోరాటాన్ని ఎక్కువ చేసి చెప్పారు. మధ్యస్థవర్గాల ఉనికిని తోసిపుచ్చారు. దేశవ్యాపితంగా విప్లవ వెల్లువ పెంపొందుతుందనీ, ఎదురుదాడికి జాతీయపంథా అవసరం అని నొక్కిచెప్పారు. పార్టీ 6వ కాంగ్రెస్, 4వ ప్లీనరీ 1931 జనవరిలో ఈ "అతివాదపంథా"ను ఆమోదించింది. 1931-34 మధ్య కాలంలో వాంగ్‌మింగ్‌పంథా పార్టీలో ఆధిపత్యంలో ఉంది. ఈ మధ్య కాలంలో చాంగైషేక్ ఎర్రస్థావర ప్రాంతాలపై మళ్ళీ మళ్ళీ చుట్టుముట్టి 5అణచివేతదాడి క్యాంపెయిన్స్ చేసాడు.

మొదటిది 1930 డిసెంబర్-1931 జనవరి వరకు లక్షసైన్యంతో దాడి జరిగింది. నాల్గవది 1933 ఏప్రిల్ నుండి అక్టోబర్ వరకు 2న్నర లక్షల సైన్యంతో జరిగింది. ఈ నాల్గింటిని గెరిల్లా పద్ధతిని మొబైల్ యుద్ధ చర్యలతో జోడించి శత్రువుకు గండి కొడుతూ కొంత భాగాన్ని విచ్ఛిన్నం చేసి, చికాకు పరిచి ఎర్రసైన్యం ఓడించింది. కానీ ఐదవదాడి సమయానికి అతివాదులు సెక్టేరియన్ విధానాన్ని అనుసరించి స్థావర యుద్ధానికి సిద్ధపడ్డారు. ఐక్యసంఘటనను వదులుకున్నారు. ఈ సారి శత్రువు ఒక సంవత్సర కాలం పథకం ప్రకారం ప్రధానమైన మూడు సోవియట్ జిల్లాలను 9 లక్షల సైన్యంతో దిగ్బంధించి 4లక్షల సైన్యంతో బురుజులు ఏర్పాటు చేసుకుంటూ దాడిని 1933 అక్టోబర్ నుండి 1934 అక్టోబర్ వరకు కొనసాగించాడు. ఈ ఐదవ దాడిని ఎదుర్కోలేక ఎర్రసైన్యం తిరోగమించింది.

1934 అక్టోబర్ నుండి వ్యూహాత్మక మార్పు చేపట్టాలని పార్టీ నిర్ణయించింది. ఇదే సుప్రసిద్ధ లాంగ్‌మార్చ్. లాంగ్‌మార్చ్ సాగే క్రమంలోనే 1935 జనవరిలో సి.పి.సి కేంద్రకమిటీ పొలిటికల్ బ్యూరో విస్తృత సమావేశం జరిగింది. అతివాద మిలటరీ పంథాను తిరస్కరించి మావో ప్రతిపాదించిన సరైన విప్లవ పంథాను ఆమోదించింది. కా॥ మావో నాయకత్వం స్థాపించబడింది. జపాన్ వ్యతిరేక ఉద్యమాన్ని మంచిగా సమన్వయించడానికి ఉత్తరదిశగా "లాంగ్‌మార్చ్" కొనసాగించాలని అప్పుడే నిర్ణయించారు. కేంద్ర ఎర్రసైన్యం 11 రాష్ట్రాలగుండా మార్చ్ చేసింది. వీటైన మంచుపర్వతాలు, నిర్జీవమైన గడ్డినేలలు, శత్రుచక్రబంధ దాడులు లాంటి ఎన్నో కష్టాలను ఎదుర్కొని 12500 కీ॥మీ మార్చ్ చేసింది. యాంగ్సీనది, ఉపనదుల్లో ఒకటైన 'టాటూనది' నిట్టనిలువునా ఉండే ఎత్తయిన పర్వతాలగుండా అత్యంత వేగంగా ప్రవహిస్తుంది. 300 మీ॥ వెడల్పు, 12 మీ॥ లోతు ఉంటుంది. శత్రు పహరాను రక్తతర్పణ చేస్తూ అక్కడ గొలుసులు వంతెనను స్వాధీనం చేసుకొని ఎర్రసైన్యం దాటింది. లాంగ్‌మార్చ్‌లో ముఖ్యఘట్టాన్ని దాటి విజయం సాధించింది.

చైనా విప్లవం ఎదుర్కొంటున్న సమస్యల పట్ల 3వ ఇంటర్నేషనల్ చాలా శ్రద్ధ చూపింది. జినోవీవ్, ట్రాట్స్కీ తదితరులు ఇచ్చిన తప్పుడు సూచనలను కా॥ స్టాలిన్ సరిచేసినా వలస, అర్ధవలసలలో విప్లవానికి సరైన మార్క్సిస్టు పరికరాలను అందించలేక పోయింది. 1935లో మావో నాయకత్వం స్థిరపడే వరకు చైనా పార్టీలో తలెత్తిన మితవాద, అతివాదపంథాలను సకాలంలో సరిదిద్దలేకపోయింది.

"జపాన్ సామ్రాజ్యవాద వ్యతిరేక ఎత్తుగడల గురించి" కా॥ మావో చేసిన రచన ఎమ్-ఎల్ ఐక్యసంఘటనా ఎత్తుగడలకు సంబంధించి ఒక ముఖ్యమైన అభివృద్ధి. 1937లో "జపాన్ వ్యతిరేక సంఘటన కాలంలో చైనా కమ్యూనిస్టు పార్టీ కర్తవ్యాలు" అనే నివేదికలో మరింతగా అభివృద్ధి పరిచాడు. ఇదే కాలంలో వైరుధ్యసూత్రాన్ని వివరంగా అర్థం చేయించి ప్రధాన వైరుధ్యం మారిందని చెప్పాడు. చైనా విప్లవ కార్యక్రమం మారిందని జపాన్ వ్యతిరేక విశాల ప్రజాఐక్యసంఘటనకు రావాలని పిలుపునిచ్చాడు. అంతర్యుద్ధాన్ని ఆపి చాంగైషేక్‌తో ఐక్యసంఘటనకు రావాలని పిలుపునిచ్చాడు. ఈ సమయంలోనే కా॥ మావో ఆచరణ, వైరుధ్యాలు అనే 2 తత్వశాస్త్ర అంశాలను అభివృద్ధి చేసాడు. ఈ కాలంలో రాసిన "చైనా విప్లవ యుద్ధంలోని వ్యూహాత్మక సమస్యలు" అనే రచన, ఎమ్-ఎల్ మిలటరీ విజ్ఞానశాస్త్రాన్ని అభివృద్ధి చేయడానికి ఎంతగానో తోడ్పడింది. 1938 మేలో రాసిన "జపాన్ వ్యతిరేక గెరిల్లా యుద్ధంలోని వ్యతిరేక సమస్యలు", "దీర్ఘకాల ప్రజాయుద్ధం గురించి" రచనలు ఎర్రసైన్యానికి మార్గదర్శకత్వం వహించడమే కాదు ప్రపంచ వ్యాపితంగా విముక్తి యుద్ధాలకు పునాదులను వేసాయి. 1939-40 మధ్య కాలంలో "నూతన ప్రజాస్వామ్యం", "చైనా విప్లవం, చైనా కమ్యూనిస్టు పార్టీ", "కమ్యూనిస్టు పత్రికకు పరిచయం" రచనలలో మార్క్సిస్టు విజ్ఞానశాస్త్రానికి చెందిన అభివృద్ధి గొప్పగా కనబడుతుంది. అంతేకాక విప్లవాన్ని విజయవంతం చేయడానికి ఐక్యసంఘటన, ప్రజాయుద్ధం, కమ్యూనిస్టు పార్టీ అనే మూడు మంత్రదండాలను అభివృద్ధి చేసాడు.

ఈ సైద్ధాంతిక ఆయుధాలతో సాయుధులైన చైనా ప్రజలు మొదట జపాన్ వ్యతిరేక ప్రతిఘటనా యుద్ధంలోనూ, అటు పిమ్మట చాంగైషేక్ నాయకత్వంలోని ప్రతిఘాతుకులకు వ్యతిరేకంగా పోరాడి విజయం సాధించారు. లాంగ్‌మార్చ్ ముగిసేనాటికి కేవలం 20వేలకు తగ్గిన ఎర్రసైన్యం 2వ ప్రపంచయుద్ధం, జపాన్ వ్యతిరేకయుద్ధం ముగిసేనాటికి 10లక్షలకు పెరిగింది. 1947 ఏప్రిల్‌లో కా॥ మావో "మిశ్రమ ప్రభుత్వం గురించి" అనే నివేదికను సమర్పించాడు. చాంగైషేక్ అమెరికా అండతో దాడికి సిద్ధపడినప్పుడు కా॥ మావో ఎర్రసైన్యాన్ని, పార్టీని, ఐక్యసంఘటన నిర్మాణాలను యుద్ధానికి సిద్ధపరిచాడు. కా॥ స్టాలిన్ పరిస్థితిని సరిగా గుర్తించక యుద్ధం వద్దని వారించినా కా॥ మావో నాయకత్వంలో చైనా కమ్యూనిస్టు పార్టీ ప్రజాయుద్ధాన్ని కొనసాగించి విజయాన్ని సాధించారు. చాంగైషేక్ సైన్యం 43లక్షల నుండి 20లక్షలకు తగ్గితే, ఎర్రసైన్యం10లక్షల నుండి 30లక్షలకు పెరిగింది. 1949లో కా॥ మావో ప్రజల ప్రజాస్వామిక నియంతృత్వం గురించి ప్రసంగం చేసాడు. "మనం విప్లవ యుద్ధంలో మౌళికమైన విజయం సాధించాం" ఇది పెద్ద ప్రయాణంలో మొదటి అడుగు మాత్రమే అన్నాడు. ఆ తర్వాత వాళ్ళు సోషలిస్టు సమాజ నిర్మాణానికి గొప్ప ముందజలు వేసారు. లీషివ్‌చీలాంటి వారి రివిజనిజాన్ని ఓడించారు. రష్యన్ కృశ్చేవ్‌లాంటివాళ్ళతో గ్రేట్‌డిబెట్ చేసి అంతర్జాతీయ రివిజనిజాన్ని ఓడించారు. గొప్ప సాంస్కృతిక విప్లవాన్ని నడిపారు. ప్రపంచానికి మార్గదర్శకత్వం వహించారు. అలా సి.పి.సి బోల్షివీకరించబడి విప్లవాల మార్గాన్ని మనకు ఆదర్శంగా నిలిపింది.

★

ఇంటర్వ్యూ

# ఐక్యపార్టీ ఆవిర్భవించిన దశమ వార్షికోత్సవాల సందర్భంగా భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) ప్రధాన కార్యదర్శి కా॥ గణపతితో ఇంటర్వ్యూ

(మావోయిస్టు సమాచార బులిటెన్‌కు ఇచ్చినది)

**"గత దశాబ్ద కాలంలో సాధించిన నూతనమైన, సాటిలేని, అపూర్వమైన విజయాలనే ఆధారంగా చేసుకొని, మరిన్ని నూతన, విశాల, మహత్తర విజయాలను సాధించేందుకై భారతదేశ విప్లవోద్యమం ఈ విపత్కర పరిస్థితిని తప్పనిసరిగా అధిగమిస్తుంది."**

**ఎం.ఐ.బి (మావోయిస్టు ఇన్ఫర్మేషన్ బులిటెన్) : పార్టీ దశమ వార్షికోత్సవం సందర్భంగా మీకూ మన కామ్రేడ్స్ అందరికీ ఎం.ఐ.బిలో మా అందరి తరపునా విప్లవాభినందనలు.**

**జి.పి : ధన్యవాదాలు. కేంద్రకమిటీ తరపున ఎం.ఐ.బిలో ఉన్న మన కామ్రేడ్స్ అందరికీ విప్లవాభినందనలు.**

**ఎం.ఐ.బి : ఈ పదేళ్ళలో పార్టీ సాధించి ప్రత్యేక విజయాలు ఏవని మీరనుకుంటున్నారు?**

**జి.పి :** 1925లో కమ్యూనిస్టు పార్టీ ఏర్పడిన నాటి నుండి మన దేశ విప్లవోద్యమ చరిత్ర కొన్ని ప్రముఖ ఘట్టాలను చూసింది. వీటన్నింటిలోకీ గత దశాబ్దకాలం సాటిలేనిదే కాకుండా ఇది నక్సల్బరీ కాలం నుండి ఇప్పటిదాకా నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేయడానికి కొనసాగిస్తున్న దీర్ఘకాలిక ప్రజాయుద్ధంలో అత్యంత ప్రముఖమైన దశ. మన దేశ వర్గ పోరాట చరిత్ర మొత్తంలోనే ఒక నూతనమైన అపూర్వమైన కాలానికి నిదర్శనంగా నిలిచిపోయేది.

ఈ దశాబ్దపు విశిష్టత–భారత నూతన ప్రజాస్వామిక విప్లవానికి ఏకైక మార్గదర్శక కేంద్రంగా ముందు నడవడంలో, విప్లవానికి సంబంధించిన మూడు మంత్రదండాలైన పార్టీ, సైన్యం, ఐక్య సంఘటనలు ముందుకన్నా మరింత బలోపేతం కావడంలో పార్టీ రాజకీయ పంథా, మిలిటరీ పంథా, ఐక్యసంఘటనల పాలసీ, ఇంకా వివిధ విధానాలను ఐక్యతా కాంగ్రెస్ డాక్యుమెంట్లు, విధానపత్రాలు, ముఖ్యమైన తీర్మాణాలు, సారాంశాలు, వ్యాసాలు మొదలైన ఐక్యపార్టీ డాక్యుమెంట్ల రూపంలో సుసంపన్నం చేయడంలో, గెరిల్లా యుద్ధతంత్రాన్ని నడిపించడంలో మలిటరీ పంథాలో అభివృద్ధి, విశిష్టమైన పురోగమనం. ముందేననడూ లేని విధంగా దీర్ఘకాలిక ప్రజాయుద్ధానికి వాస్తవమైన ప్రజా స్వభావాన్నివ్వడంలోనూ, విశాల ప్రజారాశులు శత్రువు అమలుచేస్తున్న క్రూరమైన విప్లవవ్యతిరేక, అణచివేత కేంపెయిన్‌లను ఓడించడంలో, సుసంపన్నమైన నూతన అనుభవాలను సాధించడంలో సామ్రాజ్యవాదం, భూస్వామ్యం, నిరంకుశ పెట్టుబడిదారీ విధానాలకు వ్యతిరేకంగా ప్రజాపోరాటలను నిర్మించడంలో, "జల్, జంగల్, జమీన్, ఇజ్జత్, అధికార్" (నీళ్ళు, అడవి, భూమి, ఆత్మగౌరవం, హక్కులు) వంటి సమస్యలపై, విశాల ప్రజారాశులను, ప్రత్యేకించి రైతాంగాన్ని సమీకరించడంలో సంపద్వంతమైన నూతన అనుభవాలను గడించడంలో, వ్యూహాత్మక ఐక్యసంఘటన నిర్మాణంలో భాగంగా ప్రాథమిక స్థాయిలో విప్లవ ప్రజా కమిటీలను నిర్మించడంలో, ఎత్తుగడల ఐక్యసంఘటనలో మరింత మెరుగైన, నూతన అనుభవాలను గడించడంలో, అభివృద్ధికి ప్రత్యామ్నాయ నమూనాగా విప్లవ ప్రజా కమిటీలను గుర్తించి, పాలక వర్గాల దేశాన్ని విక్రయించే, ప్రజావ్యతిరేక అభివృద్ధి నమూనానకు విరుగుడుగా విజయవంతంగా వాటిని అన్వయించగలగడంలో విలువైన అనుభవాలను గడించడంలో ప్రస్తుత గడ్డు పరిస్థితిలలో మనుగడ సాగిస్తూనే, సామ్రాజ్యవాదుల, ప్రత్యేకించి అమెరికా సామ్రాజ్యవాదుల మద్ధతుతో భారత ఫాసిస్టు పాలకులు దేశవ్యాప్తంగా అమలుచేస్తున్న మున్నెన్నడూ కనీవినీ ఎరుగని నిర్బంధానికి ఎదురొడ్డి నిలుస్తున్న భారత విప్లవోద్యమం, భారతదేశ, ప్రపంచ దేశాల విప్లవ ఆకాంక్షలను సజీవంగా నిలిపి ఉంచింది.

ప్రజాయుద్ధానికి మద్ధతుగా, ఆపరేషన్ గ్రీన్‌హంట్‌కి వ్యతిరేకంగా పోరాడుతున్న విప్లవ ప్రజారాశులకు, భారత సమాజంలోని అత్యంత విభిన్నమైన వర్గాల నుండి తగినంత మద్ధతు కూడగట్టడంలో, మావోయిస్టు శక్తుల అంతర్జాతీయ ఐక్యత, అంతర్జాతీయ సంఘీభావ, ఆధార వుద్యమ నిర్మాణంలో భారత ప్రజాయుద్ధం ఒక ముఖ్యమైన కేంద్రస్థానంగా నిలబడగలిగింది.

గత దశాబ్దానికి చెందిన ఈ నూతన ప్రత్యేకమైన అంశాలు మా పార్టీ నాయకులైన చారుమజుందార్, కన్హాయ్ చటర్జీల నాయకత్వంలో జరిగిన మహత్తర నక్సల్బరీ సాయుధ రైతాంగ పోరాటంలో పయనించిన ఒక కొత్త సిద్ధాంతం, కొత్త పంథా, కొంగ్రొత్త రాజకీయాలు, కొత్తపార్టీ, కొత్త సైన్యం ద్వారా సాధించినవి. ఒకవైపు క్రూరమైన శత్రు నిర్బంధాన్ని ఎదుర్కుంటూ, దానిని తిప్పికొడుతూ, మరోవైపు వుద్యమంలో కీలక సందర్భాలలో, పార్టీలో తలెత్తిన మితవాద, 'వామపక్ష' అవకాశవాద ధోరణులకు వ్యతిరేకంగా పార్టీ అంతర్గత పోరాటాన్ని కొనసాగిస్తూనే గత దశాబ్దకాలపు ఈ అనుభవాలను గడించింది.

భారత విప్లవోద్యమంలో అత్యంత ప్రముఖమైన అంశం దేశ విముక్తి కోసం కమ్యూనిస్టులు, ప్రజారాశులు చేసిన మహత్తర త్యాగాలు, ఇవేమీ లేకుండా గత పదేళ్ళలో సాధించిన ఏ ఒక్క విశిష్ట విజయాన్నీ మనం సాధించలేకపోయేవాళ్లం. పాలకవర్గాలు ప్రజలలో నెలకొల్పిన పతనమైన, కుళ్ళిన, వ్యక్తి కేంద్రక ఆలోచనలకూ, సంస్కృతికీ విరుద్ధంగా ఉన్నత మానవీయ విలువలతో ఒక ప్రత్యమ్నాయ ఆలోచననీ, సంస్కృతినీ ఈ త్యాగాల ద్వారానే ప్రజలముందుంచగలిగింది. ఈ విధంగా సమాజంలో విప్లవాత్మకమైన మార్పుకోసం అణగారిన వర్గాలనూ, తరగతులనూ ఈ త్యాగాలు ఉత్తేజితం చేశాయి.

**ఎం.ఐ.బి : ఇప్పుడు పార్టీ ఎదుర్కొంటున్న ప్రధాన సవాళ్ళు ఏమిటి? వాటిని అధిగమించేందుకు ఏ అవకాశాలున్నాయని మీరనుకుంటున్నారు?**

**జి.పి : ఉద్యమం ప్రస్తుతం ఎదుర్కొంటున్న ప్రధాన సవాళ్ళివి :**

**మొదటిది :** మన స్వీయాత్మక శక్తులను, ప్రత్యేకించి పార్టీ వ్యూహాత్మక నాయకత్వాన్ని కాపాడుకోవడం. కొత్త పార్టీ ఆవిర్భవించినప్పటినుండీ గ్రామ స్థాయి పార్టీ కమిటీ నుంచి మొదలుకొని కేంద్రకమిటీ వరకూ అనేక మంది నాయకత్వాన్ని కోల్పోయాము. దాంతో శత్రు దాడులనుండి మన స్వీయాత్మక శక్తులని కాపాడుకోవడం మన ముందున్న ప్రాధాన్యతా కర్తవ్యాలలో ముందు వరుసలో వుండాల్సిందిగా గుర్తించాం. స్వీయాత్మక శక్తుల ప్రాముఖ్యాన్ని, వాటిని పరిరక్షించాల్సిన అవసరాన్ని అర్థం చేసుకుని రహస్యంగా, సరైన పద్ధతులను మనం పాటించాలి. మన పని విధానంలోని తప్పులను సరిదిద్దుకొని ఆచరణ నుంచి మనం నేర్చుకున్న పాఠాలను దృఢంగా అమలు చేయాలి. కొత్త నాయకత్వాన్ని తయారు చేసుకోవడం, విప్లవాన్ని విజయవంతం చేసుకోవడం కోసం నాయకత్వ కొనసాగింపుతో కూడిన బలమైన పార్టీ ఉండాల్సిన అవసరాన్ని గూర్చి మొత్తం పార్టీ చైతన్యాన్ని పెంపొందించాలి.

**రెండవది :** గ్రామీణ మైదాన ప్రాంతాలలో, పట్టణ ప్రాంతాలలో విప్లవోద్యమం బలహీనపడింది. ఇప్పుడు పార్టీ ఎదుర్కొంటున్న గడ్డు పరిస్థితులకు దారి తీసిన అంశాల్లో ఇదొకటి. ఇంతకుముందు చాలాకాలంగా మన పార్టీ బలంగా ఉండి కాలక్రమేణా బలహీనపడిన ప్రాంతాలలో ఉద్యమాన్ని పునరుజ్జీవింపజేసి, విస్తరించడం మన ముందున్న ఒక సవాలు. అదే విధంగా కొత్త ప్రాంతాలలోకి, ప్రజాయుద్ధ పరిధిని విశాలం చేయడానికి సరికొత్త యుద్ధ క్షేత్రాలకు ఉద్యమాన్ని విస్తరించాల్సిన అవసరం ఉంది. మన ఉద్యమ ఉన్నత అనుభవాల వెలుగులో, పాత తప్పులు పునరావృతం కాకుండా జాగ్రత్తపడుతూ అంతకంతకూ విప్లవ పురగమనానికి అనుకూలంగా పెరిగిపోతున్న పరిస్థితులను వినియోగించుకోవాలి. ఈ విధంగా ఈ గడ్డు పరిస్థితిని మనం తప్పకుండా అధిగమించగలం, ఉద్యమాన్ని ముందుకు తీసుకుపోగలం.

**మూడవది :** సామాజిక-ఆర్థిక పరిస్థితులలో చోటు చేసుకున్న మార్పులు భారతదేశాన్ని పెట్టుబడిదారీ దేశంగా మార్చివేసాయంటూ విప్లవక్యాంపులో  దందరగోళాన్ని వ్యాపింపచేయడానికి కొందరు ప్రయత్నిస్తున్నారు. దీర్ఘకాలిక ప్రజాయుద్ధ పంథా ఇప్పటి పరిస్థితులకు తగినది కాదంటూ ఒక తప్పుడు భావాన్ని కూడా వాళ్ళు ముందుకు తీసుకొస్తున్నారు. అయితే, అర్ధ భూస్వామ్య అర్థవలస దేశాలైన భారతదేశం వంటి దేశాలలో నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చెయ్యడానికి దీర్ఘకాలిక ప్రజాయుద్ధ పంథాయే తగిన, ఏకైక మార్గమని ఆచరణలో రుజువయ్యింది. అందువలన మనం ఈ తప్పుడు అభిప్రాయాలకు వ్యతిరేకంగా జాగ్రత్త వహించి, వాటిని ఎండగట్టాలి. అదే సమయంలో ఆర్థిక, రాజకీయ, సామాజిక సాంస్కృతిక రంగాలలో మార్పులను లోతుగా అధ్యయనం చేసి మన ఎత్తుగడలలో తగిన మార్పులను చేసుకోవాలి.

**నాలుగవది :** కేంద్రంలో బ్రాహ్మణీయ హిందూ ఫాసిస్టు శక్తులు అధికారంలోకి వచ్చాయి. దీంతో భూస్వామ్య, అభివృద్ధి నిరోధక శక్తుల సిద్ధాంతం, రాజకీయాలు, సంస్కృతి మరింత బలోపేతం అవుతాయి. అంతర్జాతీయ ఫైనాన్సు, దళారీ, నిరంకుశ బూర్జువాజీ, మోడీ నాయకత్వంలోని బి.జె.పి అధికారంలోకి రావడానికి అండగా నిలిచింది. ఇందుకు కొన్ని ప్రాంతాల్లో సంఘపరివార్ నాయకత్వంలో మతతత్వ ధృవీకరణ (పోలరైజేషన్) తోడయ్యింది. బి.జె.పి అధికారంలోకి వచ్చాక భారతదేశ బడా బూర్జువాజీ, బడా భూస్వాముల అవసరాలకు అనుగుణంగా సామ్రాజ్యవాద అనుకూల, దేశాన్ని విక్రయించే విధానాలను ప్రమాదకర వేగంతో అమలు చేస్తోంది. అదే సమయంలో వివిధ రూపాల్లో హిందూ ఫాసిస్టు ఎజెండాను ముందుకు తీసుకుపోతోంది. ఇది ప్రజాస్వామిక, పురోగామి, లౌకిక, దేశభక్త శక్తులన్నీ పోరాటంలో ఏకమయేందుకు కొత్త దారులను తెరుస్తుంది. సమాజంలోని సరికొత్త అసంఖ్యాక వర్గాలు, సామాజిక సెక్షనులు, శక్తులు, ప్రజలు పోరాటంలోకి సమీకరించబడతారు. దీర్ఘకాలిక ప్రజాయుద్ధాన్ని పురోగమించజేసే అనేక కొత్త అవకాశాలు తెరుచుకుంటాయి.

**ఐదవది :** ప్రపంచ వస్తుగత పరిస్థితి రానురానూ విప్లవానికి అనుకూలంగా మారిపోతుంది. సామ్రాజ్యవాద ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఇంకా తీవ్ర సంక్షోభంలోనే కొట్టుమిట్టాడుతుంది. ప్రపంచ ప్రధాన వైరుధ్యాలు మరింత తీవ్రతరమవుతున్నాయి. పర్యవసానంగా ప్రపంచ వ్యాపితంగా విప్లవశక్తులు, ప్రజాస్వామిక శక్తులు, జాతి విముక్తి శక్తులు సామ్రాజ్యవాదానికీ, దాని స్థానిక తొత్తులకూ వ్యతిరేకంగా తమ బలాన్ని పెంచుకుంటున్నాయి. మావోయిస్టు శక్తులు కూడా సంఘటితమవుతున్నాయి. ఇదే సమయంలో ప్రస్తుతం సోషలిస్టు స్థావరాలు ఉనికిలో లేకపోవడం, అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలో స్వీయాత్మక శక్తులు బలహీనంగా ఉండటం కూడా మన ముందొక సవాలుగా నిలుస్తోంది.

**ఎం.ఐ.బి : పార్టీల విలీనం తరువాత, పి.ఎల్.జి.ఎలోనూ, గెరిల్లా యుద్ధాన్ని తీవ్రతరం చెయ్యడంలోనూ, విస్తరించడంలోనూ ఒక పరిణామాత్మక మార్పును మేం గమనించాం. కానీ ఇప్పుడొక మందకొడితనం కనిపిస్తోంది. దీన్ని మళ్ళీ వేగవంతం చేయడానికీ పురోగమింపజేయడానికీ పార్టీ ఏం చేయబోతోంది?**

**జి.పి :** మీ పరిశీలన సరి అయిందే. అందువల్లనే గత దశాబ్దంలో కొన్ని అద్భుత విజయాలను గెల్చుకున్నం. మీరన్న ఈ మందకొడితనం విషయం కూడా సరి అయినదే. 2011 నుండీ ఇది కనిపిస్తోంది. 2013లో పరిస్థితిని సమీక్షించిన కేంద్ర కమిటీ, మన ఉద్యమం చాలా విపత్కర పరిస్థితిని ఎదుర్కొంటోందని అంచనా వేసింది. అయితే ఈ పరిస్థితి విభిన్న గెరిల్లాజోన్‌లలో విభిన్న స్థాయిలలో ఉంది. గత పదేళ్ళ కాలంలో అభివృద్ధిలో అసమానత ఉంది. పర్యవసానంగా బలహీనపడటం కూడా అచ్చం మన దేశంలోని వివిధ గెరిల్లా జోన్‌లలో ఆర్థిక, సామాజిక, రాజకీయ పరిస్థితులలోని అసమానతలలాగే జరుగుతోంది. విభిన్న గెరిల్లాజోన్‌లలోనే కాదు, దేశవ్యాప్త విప్లవోద్యమంలో కూడా ఈ అసమానత ఉంది. ఇదొక దీర్ఘ కాలిక ప్రజాయుద్ధ సూత్రం. నిస్సందేహంగా మన స్వీయాత్మక ప్రయత్నాలవల్లే గెరిల్లాయుద్ధం పురోగమించింది. అందులో ఎటువంటి భేదాభిప్రాయానికీ తావులేదు. అయితే విభిన్న ఆర్థిక, సామాజిక, రాజకీయ, చారిత్రక, భౌగోళిక పరిస్థితుల ఆధారంగా గెరిల్లాయుద్ధం విభిన్నజోన్‌లలో పురోగమించింది. ఈ పరిస్థితులే గెరిల్లాయుద్ధంలో ఆటుపోట్లకు ఆధారభూతమయ్యాయి. ఈ వాస్తవాన్ని మనం విస్మరించకూడదు.

2011 నుంచే మనం కొన్ని రాష్ట్రాలలో/ గెరిల్లా జోన్‌లలో మిలిటరీ రంగంలో, ప్రజాపోరాటాలను నిర్మించడంలో, ఉద్యమాన్ని విస్తరింపజేయడంలో మనం కొన్ని చెప్పుకోదగ్గ విజయాలనే సాధించాం. కొన్ని గెరిల్లా జోన్‌లలో విప్లవ ప్రజా కమిటీలను కేంద్ర బిందువుగా తీసుకుని పార్టీని బలోపేతం చేసిన ఈ కాలంలో

ఉద్యమం అభివృద్ధి చెందింది. అయినా మనం మాంద్యాన్ని ఎదుర్కున్నాం. ఈ మాంద్యానికి గల కారణాన్ని గుర్తించిన పార్టీ, మొత్తంగా పార్టీని, పి.ఎల్.జి.ఎ.నూ, ప్రజాసంఘాలను ఈ పరిస్థితిని అధికమించేందుకు సన్నద్ధం చేసింది. దీనినొక సానుకూల అంశంగా చూడాలి. 2011 నుంచి ఆపరేషన్ గ్రీన్‌హంట్ రెండవ దశ మొదలై, మోడీ నేతృత్వంలోని ఎన్.డి.ఎ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దాని మూడవ దశ మొదలయ్యింది. తీవ్రమైన శత్రుదాడులూ, వాటిని తిప్పికొట్టే ఎదురు దాడులూ, వీటి మధ్యే ఇవన్నీ జరిగాయని మనం గుర్తుంచుకోవాలి. జల్, జంగల్, జమీన్, ఇజ్జత్, అధికార్‌ల కోసం ప్రజలు చేస్తున్న పోరాటాలకు తమ గొంతునూ, మద్దతునూ యివ్వడంలో సానుకూల పాత్రను పోషించి, ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ను తీవ్రంగా వ్యతిరేకించిన ప్రజాస్వామిక, దేశభక్త సెక్షన్లను పార్టీ, గుర్తించి వారిని హృదయపూర్వకంగా అభినందిస్తోంది. ప్రజల పోరాటస్ఫూర్తిని నిలిపి ఉంచడంలో ఈ సెక్షన్ల పాత్ర కూడా ఉంది.

2009 మధ్యకాలం నుండి విప్లవ ప్రతీఘాతక యుద్ధాన్ని తిప్పికొట్టడంలో విప్లవ శక్తులలో, విప్లవ ప్రతీఘాతక శక్తుల బలలాలో ఉన్న తేడా చాలా పెద్దది. ప్లటూన్ స్థాయి శత్రు బలగాల్ని నిర్మూలించడానికి కంపెనీ స్థాయి గెరిల్లా బలగాలు మోహరించబడ్డాయి. బెటాలియన్ స్థాయి గెరిల్లా బలగాలు కంపెనీ స్థాయి శత్రు బలగాలను నిర్మూలించడం మొదలుపెట్టాయి. ఈ పరిస్థితులలో శత్రువు వందలాది బలగాల నుండి మొదలుకొని లక్ష మంది దాకా బలగాలను ప్రతి గెరిల్లా జోన్‌లోనూ మోహరించాడు. ఈ ఎదురెదురు బలగాల బలాలలో ఉన్న తేడా వలన మన గెరిల్లా యుద్ధాన్ని కొనసాగించడానికి అననూకూల పరిస్థితులు తలెత్తాయి. పెద్ద సంఖ్యలో బలగాల మోహరింపు మన సాయుధ ప్రతిఘటనను అణచివేయడానికే. అంతే కాకుండా గత దశాబ్దంలో నందిగ్రామ్, లాల్‌గఢ్, నారాయణపట్న వంటి వివిధ గొప్ప ఉద్యమాల స్ఫూర్తితో అన్ని గెరిల్లా జోన్‌లలో పెల్లుబికిన ప్రజాపోరాటాలను అణచివేయడం కోసమే. ఈ విధంగా క్షీణిస్తున్న వ్యవస్థకు ఒక ప్రత్యామ్నాయంగా మావోయిస్టు ఉద్యమం ఆవిర్భవించింది.

ఇప్పుడు ఏర్పడిన మాంద్యాన్ని కేవలలం శత్రు నిర్బంధం ఫలితంగా వచ్చినదాని మాత్రంగానే చూడాల్సిన అవసరం లేదు. ఇది మన స్వీయాత్మక బలహీనతల దుష్ఫలితమే. ఈ పరిస్థితి నుండి బయటపడేందుకు మన తప్పులనూ, బలహీనతలనూ, పార్టీ గుర్తించి, పార్టీ, పి.ఎల్.జి.ఎ, ప్రజా ఉద్యమాల బోల్షెవీకరణకు పూనుకుంది. అదే సమయంలో ఇందుకు దారితీసిన వస్తుగత పరిస్థితుల వైపు కూడా మనం దృష్టిని సారించాలి. శత్రు దాడులు ఇంతకు ముందరి స్థాయిలో ఉన్నప్పుడు శత్రువును తిప్పి కొట్టేందుకు నిర్దిష్ట ఎత్తుగడలను చేపట్టి కొన్ని విజయాలను సాధించాం. ఇది శత్రువు కొన్ని ప్రతీఘాతుక ఎత్తుగడలను చేపట్టడానికి దారితీసింది. అందువలన ఒక కొత్త పరిస్థితి తలెత్తుతుంది. గెరిల్లాయుద్ధం ద్వారా, ప్రజానీకాన్ని కదిలించడం ద్వారా మనకంటే బలమైన శత్రు బలగాలను నిలవరించి, తిరిగి మనదే పైచేయి సాధించగలిగే ఎత్తుగడలను మనం తీసుకోవాలి. ఇందుకు గెరిల్లా యుద్ధాన్ని నిర్మించి, దాన్ని అభివృద్ధి చేసేందుకు మన ప్రజాపునాదిని మరింత లోతుగా నిర్మించుకోవడమనేది ఒక కీలక అంశం.

ఉద్యమంలో ఆటుపోట్లు ఒక కొత్త పరిస్థితి ఏర్పడేందుకు దారితీస్తాయి. దీనిని అర్థం చేసుకొని పార్టీనీ, పి.ఎల్.జి.ఎని ప్రజానీకాన్ని సంసిద్ధం చేయడంలో పార్టీ నుండి కొన్ని తీవ్రమైన తప్పులు జరిగాయి. కొత్త సవాళ్ళను ఎదుర్కోవడంలో పార్టీకున్న లోపాలవల్ల నష్టాలు పెరిగిపోయాయి. దీర్ఘకాలిక ప్రజాయుద్ధాన్ని సాగిస్తూ బలమైన శత్రువును తిప్పికొట్టే క్రమంలో నష్టాలు, సెట్‌బ్యాక్ జరుగుతాయి. అందుకే మావో దీర్ఘకాలిక ప్రజాయుద్ధం విజయం–ఓటమి–విజయం–ఓటమిగా పురోగమిస్తూ అంతిమంగా విజయానికి చేరువవుతుందని చెప్పారు. దీర్ఘకాలిక ప్రజాయుద్ధపంథా ఎల్లప్పుడూ ఒక కష్టతరమైన విధానం ద్వారానే ముందుకు సాగుతుంది. కొన్ని చిన్న పాక్షికమైన విజయాలు మరికొన్ని పెద్ద విజయాలు, కొన్ని ముందంజలూ, వెనుకడుగులూ ఉంటాయి. జిగ్ జాగ్ పద్ధతిలో ముందుకు కొనసాగడమే దీర్ఘకాలిక ప్రజాయుద్ధ సూత్రం. అందువలన ఈ దృక్కోణంలో మాంద్యాన్ని మనం చూడాలి.

అవసరమైన ఎత్తుగడలు తీసుకోవడమంటే ఇదే. దేశంలోని వివిధ ప్రాంతాలలో ఉద్యమం అసమానంగా అభివృద్ధి చెందుతున్న విషయాన్ని దృష్టిలో పెట్టుకొని ఆయా ప్రాంతాల్లో మారుతున్న నిర్దిష్ట పరిస్థితులనూ, మొత్తంగా దేశవ్యాప్తంగా విప్లవయుద్ధంలో జరుగుతున్న మార్పులనూ పరిగణనలోకి తీసుకొని మనం స్వీయరక్షణ ఎత్తుగడలను కానీ, ఎదురుదాడి ఎత్తగడలను కానీ అవలంబించాలి. ఇదంతా ప్రస్తుత విపత్కర పరిస్థితిని అధిగమించే లక్ష్యంతో జరగాలి. దేశంలోని వివిధ ప్రాంతాలలోనే కాదు ప్రతి ఒక్క గెరిల్లా జోన్‌లో కూడా, ఆ నిర్దిష్ట డివిజన్ / జోన్‌లోని ప్రత్యేక పరిస్థితులకు అనుగుణంగా మనం ఎదురుదాడి చేయడమో, స్వీయ రక్షణ ఎత్తుగడల్ని అనుసరించడమో చెయ్యాలి. కొన్ని ప్రాంతాలలో పరిస్థితి కొంత మెరుగ్గా ఉన్నప్పటికీ అక్కడ కూడా మనం మొత్తంగా ఎదుర్కొంటున్న గడ్డు పరిస్థితికి లోబడే, దాన్ని అధిగమించే లక్ష్యంతోనే మన ఎత్తుగడలుండాలి. స్వీయ రక్షణలో ఎప్పుడు ఎదురుదాడి కలిసే ఉంటుందనీ, ఎదురుదాడిలేని స్వీయ రక్షణ ఉండబోదనీ మనకు తెలుసు. అయితే మనం అవలంబించే అన్ని ఎత్తుగడల్లో మన స్వీయాత్మక శక్తులను, ప్రత్యేకించి అన్ని స్థాయిలలోని నాయకత్వాన్ని, కాపాడుకోవడమనేది చాలా ముఖ్యమైన విషయం.

ఈ నూతన పరిస్థితికి అనుగుణంగా మనల్ని మనం సంసిద్ధం చేసుకోవడంలో మనపార్టీలో రెండురకాల పెడధోరణులు చోటుచేసుకోవచ్చు. అవి: 1. శత్రువు అంతర్గత బలహీనతల్ని గుర్తించకుండా, పైకి కనిపించే శత్రుబలాన్ని మాత్రమే చూడడం, మన బలాలవైపు, అనుకూలతలవైపు, విప్లవయుద్ధంలో మన ప్రజల చారిత్రాత్మక పాత్రవైపు చూడకపోవడం, శత్రువును వ్యూహాత్మకంగా అర్థం చేసుకోకుండా, ఎత్తుగడల పరంగానే శత్రువుపై దృష్టి పెట్టడం. ఇలా చెయ్యడం కామ్రేడ్స్‌ను చొరవకోల్పోయేలా, స్వీయ రక్షణ పేరుతో నిర్లిప్తంగా మారిపోయేలా, చివరకు పోరాటపటిమను కోల్పోయేలా చేస్తుంది. ఇది ఒక మితవాద పెడధోరణి. 2. గెరిల్లాయుద్ధంలో తలపడుతూ పక్కనే జరుగుతున్న మార్పులను అర్థం చేసుకోలేకపోవడం, మన స్వీయాత్మక శక్తులు బలహీనపడడాన్ని పరిగణనలోకి తీసుకోకుండా ఎదురుదాడి ఎత్తుగడల్ని తీసుకునే ప్రయత్నం చేయడం. ప్రజలపట్ల నిర్లిప్త భావం, స్వీయరక్షణకు ప్రాధాన్యతను ఇవ్వకపోవడం అంటే స్వీయాత్మక శక్తులను రక్షించుకోకపోవడం. వారు శత్రువును ఎత్తుగడలపరంగా

చూడకుండా వ్యూహాత్మకంగా మాత్రమే శత్రువును అంచనా వేయడం, ఇది అతివాద పెడధోరణి.

అందువలన విప్లవ యుద్ధంలో వచ్చిన కొత్త మార్పులను, మన బలాలు, బలహీనతలను-శత్రు బలాలు, బలహీనతలను అధ్యయనం చేయాలి. దాంతోపాటు దేశంలో ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా, సాంస్కృతికంగా వచ్చిన మార్పులను అధ్యయనం చేయాలి. మన గెరిల్లా యుద్ధాన్ని వేగవంతం చేయడానికి ఇది చాలా కీలకమైనది. బోల్షెవీకరణ ద్వారా మనం సాధించాల్సిన ప్రధాన లక్ష్యంలో ఇది ఒకటి. ప్రజా పునాదిని పెంచుకోవడం, ప్రజల్ని కదలించి, గెరిల్లా యుద్ధంలోనూ ప్రజాయుద్ధ కార్యకలాపాలన్నింటిలోనూ వారి చురుకైన పాత్రను పెంపొందించడం మనం మళ్ళీ పైచేయి సాధించడానికి చాలా ముఖ్యం. కేంద్రకమిటీ, కేంద్రమిలటరీ కమీషన్, ఇంకా మొత్తం నాయకత్వ కమిటీలన్నీ ఈ అవగాహనతోనే పరిస్థితిని చక్కదిద్దుతున్నాయి.

**ఎం.ఐ.బి : పార్టీ ప్రధాన కార్యకలాపాలన్నీ ఆదివాసీ ప్రాంతాలకే పరిమితమైపోయిన వాస్తవాన్ని గురించి శ్రేయోభిలాషులు సైతం ఆదుర్దాపడుతున్నారు. దీర్ఘకాలిక ప్రజాయుద్ధ పంథా అటువంటి ప్రాంతాలకే తప్ప మొత్తంగా దేశానికి ప్రాసంగికం కాదని కొంతమంది వాదిస్తున్నారు. దీనికి మీ స్పందన ఏమిటి? ప్రజాయుద్ధాన్ని మీరు దేశ వ్యాప్తంగా ఎలా విస్తరింపజేస్తారు?**

**జి.పి :** భారతదేశం ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా అసమాన అభివృద్ధి కలిగిన విశాలమైన అర్ధ వలస, అర్ధ భూస్వామ్యదేశం. ఈ అభివృద్ధిలోని అ అసమానతే దేశవ్యాప్తంగా ఏక కాలంలో విప్లవాన్ని లేదా సాయుధ తిరుగుబాటును చేసే అవకాశాన్ని తోసిపారేస్తుంది. గ్రామీణ ప్రాంతాలలోని వెనకబడిన వ్యూహాత్మక ప్రాంతాలలో మనం స్థావర ప్రాంతాలను ఏర్పచాలి. సామాజిక వైరుధ్యాలు తీవ్రతరంగా వున్న, సాపేక్షికంగా బాగా వెనుకబడి వున్న ప్రాంతాలలో విప్లవయుద్ధాన్ని దీర్ఘకాలం కొనసాగించాలని దీని అర్థం. ఈ విధంగానే విప్లవోద్యమం దీర్ఘకాలిక ప్రజాయుద్ధ పంథాలో పురోగమించగలదు. పై పెచ్చు పాలకవర్గాల చేతిలో శక్తివంతమైన కేంద్రీకృత రాజ్యంతో పాటు సుశిక్షితమైన, ఆధునిక ఆయుధ సంపత్తి కలిగివున్న సైన్యంతో కూడిన బలమైన అణచివేత యంత్రాంగం ఉంది. అందుచేత మనం, శత్రువు పరిపాలన అమిత బలహీనంగా వుండే గ్రామీణ ప్రాంతం నుండి మన విప్లవ యుద్ధాన్ని సాగించాల్సి ఉంటుంది. మన స్వంత అనుభవాలూ, చైనా, వియత్నాం, లావోస్, కంబోడియావంటి దేశాల విప్లవ చరిత్రలు ఆర్ధభూస్వామ్య, అర్ధవలస దేశాల చరిత్రలూ దీర్ఘకాలిక ప్రజాయుద్ధ పంథాయే సరియైన పంథాగా నిస్సందేహంగా నిరూపించాయి.

భారతదేశంలో విముక్తి ప్రాంతాలను నిర్మించడం, ఎర్రసైన్యాన్ని నిర్మించడం, దీర్ఘకాలిక ప్రజాయుద్ధాన్ని కొనసాగించడం సాధ్యంకాదనే వాదన కొత్తదేమీకాదు. పాలకవర్గాలు, వాటి సేవకులైన మేధావులు, రివిజనిస్టు పార్లమెంటరీ వామపక్ష పార్టీలు, సూడో ఎం ఎల్ పార్టీలు-వీళ్ళంతా చాలా కాలంగా ఇటువంటి వాదనలు చేస్తునే వున్నారు. ప్రజాయుద్ధం వైపుకు నానాటికీ దగ్గరవుతున్న విప్లవ, ప్రజాస్వామిక, దేశభక్త శక్తులను గందరగోళపరచడానికే ఈ వాదనలన్నీ ముందుకు తెస్తున్నారు. పైగా, దీర్ఘకాలిక ప్రజాయుద్ధ పంథాని తోసిపుచ్చిన వామపక్ష శక్తులు తమ దీర్ఘకాల ఆచరణలో సమాజాన్ని మార్చడంలో ఏ మాత్రం ప్రగతిని సాధించలేకపోయారు. వాస్తవానికి అటువంటి మార్పుకు వాళ్ళు ఎప్పుడు వ్యతిరేకంగానే ఉన్నారు. పార్లమెంట్ చిత్తడి నేలలో గొంతుక దాకా కూరుకుపోయి ఉన్నారు. ఇలాంటి తప్పుడు వాదనల్లో మరో రకం-దీర్ఘకాలిక ప్రజాయుద్ధ పంథాని ఆదివాసీ ప్రాంతాలకు తప్ప దేశంలోని మిగతా ప్రాంతాలకు వర్తింపచేయలేమని. ఈ వాదనలో కూడా పసలేదు.

శత్రువు నుంచి వస్తున్న ఇటువంటి వాదనలను-ఉద్యమ కార్యకలాపాలన్నీ అధికంగా ఆదివాసీ ప్రాంతాలకే పరిమితం కావడం పట్ల కలవరం చెందుతున్న, భారత విప్లవాన్ని నిజంగా అభిలషించే-శ్రేయోభిలాషుల అభిప్రాయాల నుంచి విడిగా చూడాల్సి ఉంది. ఈనాడు మన ఉద్యమం మధ్య, తూర్పు భారతదేశంలోని ఆదివాసీ ప్రజల సంప్రదాయక నివాస ప్రాంతాలైన విశాల అటవీ ప్రాంతంలోనే సాపేక్షికంగా బలంగా ఉందనేది వాస్తవమే. గత దశాబ్దకాలంగా ఉద్యమం, దండకారణ్య, బీహార్-ఝార్ఖండ్ గెరిల్లా జోన్‌లను గుండెకాయగా చేసుకొని ముందడుగు వేసింది. వివిధ రకాల మైదాన ప్రాంతాల్లో ఉద్యమాన్ని అభివృద్ధి చేయడం గురించి ఉద్యమానికి ఒక స్పష్టమైన దృక్కోణం వుంది. దీనికి సంబంధించిన ఎత్తుగడల మార్గదర్శకాల గురించి "భారత విప్లవోద్యమ వ్యూహం-ఎత్తుగడలు" అనే మన డాక్యుమెంట్లో వివరించబడి వుంది. పట్టణ ప్రాంతాల పనిని గురించి కూడా మనకో విధాన పత్రం ఉంది. అయినప్పటికీ గ్రామీణ మైదాన ప్రాంతాల్లో, పట్టణ ప్రాంతాల్లో మన ఉద్యమం బలహీనపడింది. ఇందుకు ప్రధాన కారణాల్లో ఒకటి-ఈ మార్గదర్శకాల ననుసరించి పార్టీ శ్రేణులను సిద్ధపరచడంలో మన లోపం. ఈ ప్రాంతాల వ్యూహాత్మక ప్రాధాన్యాన్ని అర్థం చేసుకోవడంలో మనకున్న కొన్ని పరిమితులు, సామాజిక పరిస్థితులలో వస్తున్న మర్పులను విశ్లేషించే సామాజిక పరిశోధనను చేపట్టకపోవడం కూడా కారణాలే. ఫలితంగా చెప్పుకోదగ్గ సంఖ్యలోని మన స్వీయాత్మక శక్తులు శత్రువుకు సులభమైన లక్ష్యాలుగా మారడంతో మనం వారిని కోల్పోయాం, ఈ ప్రాంతాలలో ఉద్యమం తీవ్ర నష్టాలను చవిచూసింది. దేశంలో విశాలమైన వ్యవసాయక మైదాన ప్రాంతాలలో మన ఉనికి బలహీనంగా ఉండటానికి ఒక కారణం-రైతాంగాన్ని, ప్రత్యేకించి రైతుకూలీ, పేద రైతాంగాల్ని అధిక సంఖ్యలో గెరిల్లా యుద్ధంలోకి సమీకరించలేకపోవడం, అదే విధంగా ఆదివాసీ ప్రాంతాలలోని రైతాంగేతర వర్గాలను, వారిలో నూతనంగా ఆవిర్భవించిన మధ్య తరగతి ప్రజానీకంతో సహా-విప్లవోద్యమంలో కదిలించలేకపోవడంలోని మన లోపం కూడా వుద్యమం బలహీనపడటానికి దోహదం చేసింది. కేంద్ర కర్తవ్యాన్ని పరిపూర్తి చేయాలనే మన ప్రయత్నాలపై ఇది ప్రతికూల ప్రభావాన్ని వేసింది.

గ్రామీణ మైదాన ప్రాంతాల్లో, పట్టణ ప్రాంతాల్లో మన వుద్యమ బలహీనతలనూ, లోపాలనూ విశ్లేషించేటప్పుడు సానుకూల అంశాలపై కూడా దృష్టి పెట్టాడాన్ని విస్మరించకూడదు. అటువంటి ప్రాంతాల్లో పని చేయడం ద్వారా విప్లవోద్యమం విస్తృత అనుభవాన్ని మూటగట్టుకున్న విషయాన్ని మనం మరచిపోరాదు. విలీనం జరిగిన గత దశాబ్ద కాలంలో గడించిన నూతన అనుభవాలు మనం వెనుకంజ వేసిన ప్రాంతాల్లో తిరిగి వుద్యమ నిర్మాణాన్ని చేపట్టడంలో, బలహీనమైన ప్రాంతాల్లో తిరిగి బలం పుంజుకోవడం, అసలు మన

ఉనికే లేని ప్రాంతాలకు విస్తరించడం వంటి వాటిని చేయడానికి తగిన పాఠాలను నేర్పడంలో మనకు సహాయపడతాయి. గ్రామీణ, పట్టణ ప్రాంతాలలోని పీడిత ప్రజానీకంపై సానుకూల ప్రభావాన్ని వేసిన ప్రజా తిరుగుబాట్లయిన కళింగనగర్, సింగూర్, సందిగ్రామ్, లాల్‌గఢ్, నారాయణపట్న, తెలంగాణా ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం వంటి వాటినించి కూడా మనం పాఠాలు నేర్చుకోవాలి.

సామ్రాజ్యవాదుల, భూస్వాముల, దళారి నిరంకుశ పెట్టుబడిదారీ దోపిడీ పీడనల కాడి కింద నలిగిపోతున్న ప్రజానీకంలో అధిక భాగం విశాల గ్రామీణ ప్రాంతాలలోనూ, ఆదివాసీ ప్రాంతాల బయట ఉన్న నగర ప్రాంతాలలోనూ నివాసముంటున్నవారు. పోరాటం తప్ప వారి సమస్యల పరిష్కారానికి మరో మార్గం లేదు. కొనసాగుతున్న ప్రజా యుద్ధం పట్ల వారు ప్రభావితమవుతున్నారు. అందువలన విప్లవయుద్ధాన్ని వ్యాప్తిచేయడానికి అనుకూలమైన పరిస్థితులు ఈ ప్రాంతాల్లో ఉన్నాయి. ఈ ప్రజల్లో వివిధ వర్గాల, సెక్షన్ల నిర్దిష్ట పరిస్థితులను, డిమాండ్లను దృష్టిలో వుంచుకుని సృజనాత్మకంగా పనిచేయాల్సి వుంది. మనం గడించిన విస్తృత అనుభవాల వెలుగులో ఒక ప్రణాళికతో సృజనాత్మకంగా పని చేస్తూ సరైన పని విధానాన్ని అమలుపరుస్తూ, మన పాత తప్పులను సరిదిద్దుకుంటూ, మారుతున్న పరిస్థితులకు, శత్రువు ఎత్తుగడలకు తగిన సరైన ఎత్తుగడలను అమలుచేస్తూ, ఈ ప్రాంతాల ప్రజానీకాన్ని కదిలించడం ద్వారా గెరిల్లా యుద్ధాన్ని ముందుకు తీసుకెళ్ళగలం. ఈ విధంగా గత దశాబ్దంలో సాధించిన నూతనమైన, పాటిలేని అపూర్వమైన అనుభవాలపై ఆధారపడి భారత విప్లవం ఈ గడ్డు పరిస్థితిని అధిగమించి అనేక నూతన, విశాల, మహత్తర విజయాలను సాధించగలదు.

**ఎం.ఐ.బి : తమ మెరుగుపరిచిన లొంగుబాటు విధానాల పట్ల స్పందించి మరింత మంది మావోయిస్టులు లొంగిపోతున్నారంటూ ప్రభుత్వం చెప్పకొంటోంది. వాస్తవం ఏమిటి?**

**జి.పి :** మెరుగు పరిచిన లొంగుబాటు విధానమంటే వారి అర్థం ఏమిటీ? మరింత డబ్బు, మరిన్ని పునరావాస ప్యాకేజీలు. ఇది ప్రజలు ఆ రకంగా అనుకోవాలని. మరింత డబ్బునీ, మరింత మెరుగైన పునరావాసాన్నీ ఆఫర్ చెయ్యడం వల్ల లొంగుబాట్లు పెరిగిపోలేదు. ఇందుకు రెండు కారణాలున్నాయి. తమ హక్కులకోసం పోరాడే ఆదివాసీ, పేద ప్రజలను అణిచివేయడంలో ముందున్న ప్రపంచంలోని అత్యంత క్రూరమైన పాలకులలో భారత రాజ్యం కూడా ఒకటి. అదే విధంగా ప్రజలు తమ పోరాటాలకు మావోయిస్టు పార్టీ నేతృత్వాన్ని ఎంచుకున్నప్పుడు వారిపై జరిగే అణచివేతను వర్ణించేందుకు మాటలు చాలవు. సామ్రాజ్యవాద అనుకూల విధానాలను ప్రతిఘటిస్తున్నవారిని అణచివేయడానికి రాజ్యం తెగబడిన వివిధ అణచివేత పద్ధతులలో ఈ లొంగుబాటు విధానం కూడా ఒక భాగం. ఉద్యమ ప్రాంతాలలోని ప్రజలపై–వారు విప్లవకార్యకలాపాలలో పాల్గొన్నా లేకున్నా–ప్రభుత్వ బలగాల వేటకుక్కల్లా లంఘిస్తున్నాయి. ప్రతిఘటనలో చురుగ్గా వున్నవారిపై ప్రత్యేకమైన క్రూరత్వంతో కేంద్రీకరించి, చిత్రహింసలు పెట్టడం, అత్యాచారాలు చేయడం, ఆస్తులను ధ్వంసం చేయడం, మానసిక (సైకలాజికల్) యుద్ధం, భయపెట్టడం, (చంపుతున్నట్టో, చంపుతామనో బెదిరించడం లేదా నిజంగానే చంపేయడం) వంటి అన్ని రకాల చిత్రహింసలనూ ప్రయోగిస్తూ, పెద్ద సంఖ్యలో వారిని లొంగిపోయేలా చేస్తున్నారు. ఇవన్నీ సామూహిక లొంగుబాట్లకు దారితీస్తున్నాయి. పోలీసులు అలాంటివాటిని విజయగర్వంతో సగర్వంగా మీడియా ముందు ప్రదర్శిస్తున్నారు. నాలుగింట మూడువంతులకంటే ఎక్కువ లొంగుబాట్లు ఈ కోవకే చెందుతాయి.

ఈ లొంగుబాట్లలో మరో భాగం–పార్టీ నుంచీ, పి.ఎల్.జి.ఎ నుంచి, ప్రజాసంఘాల నుంచీ కొంతమంది వ్యక్తులు శత్రువు ముందు మోకరిల్లడం వంటివి. అవును. ఇటువంటి లొంగుబాట్ల సంఖ్య ఈ మధ్య కొద్దిగా పెరిగింది. నాయకత్వ స్థాయిలలో (రాష్ట్ర, జిల్లా, ఏరియా కమిటీల స్థాయిలో) ఉన్న కొద్దిమంది వ్యక్తులు కూడా లొంగిపోయారు. శత్రువు ఒక కొత్త దాడికి తెగబడి, క్రూరమైన అణచివేత ముందెన్నడూలేని స్థాయికి చేరుకున్నప్పుడు సరికొత్త త్యాగాలు చేయవలసిన అవసరం ఏర్పడుతుంది. ఇటువంటి సమయంలో ఉద్యమాన్ని వీడి శత్రువుముందు మోకరిల్లే బలహీన శక్తులు ఎప్పుడూ ఉంటూనే ఉంటాయి. అదే ఇప్పుడు కూడా జరుగుతోంది. మెరుగైన లొంగుబాటు విధానాలుగా చెప్పుకుంటున్న ఈ ప్రభుత్వ పాలసీ ప్రభావం కూడా కొంత ఉంటే ఉండవచ్చు. అయితే అది పెద్ద చెప్పుకోదగ్గ కారణం గానీ, ప్రధాన కారణంగానీ కాదు. ఈ రకమైన లొంగుబాటుకి మొదటి కారణం క్రూరమైన శత్రువులే. అంతే కాకుండా లొంగిపోయిన తరువాత కూడా వారి వారి వర్గ నేపథ్యాలనాధారంగా చేసుకొని రాజ్యం వారితో వ్యవహరిస్తోంది. అయితే వారిని ప్రజాద్రోహులుగా మార్చే ప్రయత్నాలలో మాత్రం ఏ మాత్రం తేడాలు ఉండవు. వారి నుంచి సమాచారాన్ని రాబట్టుకొనేందుకు రాజ్యం అన్ని విధాలా వారిపై వొత్తిడి తెస్తోంది. వారిని కిరాయి హంతకులుగా వినియోగిస్తోంది. వివిధ స్థాయిల్లో ఎదురుదాడిని తీవ్రతరం చేస్తూ వారిని అందులో పాల్గొనేలా చేస్తుంది. అందుచేత రాజ్యం లొంగుబాటు విధానాన్ని వారిని 'ప్రధాన స్రవంతిలో' భాగం చేయడానికో, వారికి 'మంచి జీవితాన్ని' ఇవ్వడానికో చేస్తున్నదని అమాయకంగా ఆలోచించేవారు లొంగుబాట్లనేవి 'ప్రజలపై యుద్ధం'లో భాగమే తప్ప మరేమీ కాదని అర్థం చేసుకోవాలి. ఉద్యమాన్ని బలహీనపరిచి తద్వారా యుద్ధాన్ని మరింత తీవ్రతరం చేసి, లొంగిపోయిన వారిని ద్రోహులుగా మార్చడమే రాజ్యం ఉద్దేశ్యం.

ఈ లొంగుబాట్లకు మరో కారణం కొంతమంది శతృనిర్బంధాన్ని, ఉద్యమంలో జరిగిన కొన్ని తాత్కాలిక నష్టాలను సరిగ్గా అర్థం చేసుకోలేకపోవడం వలన గందరగోళానికి గురికావడం. ఇంకా మరికొంత మందికున్న వ్యక్తిగత బలహీనతలు. అన్ని స్థాయిలలోని కేడర్‌లో రాజకీయ చైతన్యాన్ని, అంకితభావాన్ని పెంచడం, శత్రువు చేస్తున్న మానసిక యుద్ధానికి వ్యతిరేకంగా పోరాటాన్ని మరింత ఎక్కువ చేయడం, ఈ లొంగుబాట్లు మన స్వంత ప్రజలకే ఎలాగ వ్యతిరేకంగా పనిచేస్తున్నాయో అవి ఎంత మాత్రమూ పరిష్కారంకావో అర్థం చేయించడమే ఈ సమస్యలకు పరిష్కారం. ప్రస్తుతం మన పార్టీలో చేపట్టిన బోల్షెవీకరణ క్యాంపెయిన్ ఈ అంశం మీద కూడా శ్రద్ధ పెడుతోంది.

మరో విషయం నేను నొక్కి చెప్పదలిచిందేమంటే ఈ ఆపరేషన్ గ్రీన్‌హంట్ మొదటి రెండు దశల్లోనూ విప్లవ కేడర్, ప్రజానీకం అసమానమైన త్యాగాలు చేసారు. విప్లవాలు త్యాగాల ద్వారానే పురోగమిస్తాయి. ఎందుకంటే మొదటిగా ప్రజలు ఈ అనివార్యతను గుర్తిస్తారు. రెండోది మరింత ఉన్నతమైన చైతన్యంతో వారు తమని

తాము సిద్ధం చేసుకుంటారు. శత్రువు తన మానసిక యుద్ధంలో భాగంగానే లొంగుబాట్లను మాత్రమే హైలైట్ చేసి, త్యాగాల అంశాన్ని అణచి పెట్టేస్తాడు. మన విప్లవ ప్రచారయుద్ధంలో మనమీ అంశంపై శక్తివంతంగా కేంద్రీకరించాల్సి ఉంది.

విప్లవ యుద్ధాలు కొనసాగినంత కాలం రాజ్యం నిర్బంధమూ కొనసాగుతుంటుంది. అంచేత ఈ క్రూరమైన వ్యవస్థను కూలగొట్టేంతవరకూ, ఈ లొంగుబాట్లు ఉంటూనే ఉంటాయి. అవి కొన్ని సమయాల్లో సాపేక్షికంగా కాస్త తక్కువగానో, ఎక్కువగానో ఉంటుంటాయి. అత్యున్నత త్యాగంతో సహా, ఏ స్థాయిలోని త్యాగమైనా సరే అది విప్లవం పట్ల ఉన్న స్వచ్ఛంద అంకితభావం ఫలితమే. ఏ విప్లవానికైనా అవి తప్పనిసరిగా అనివార్యమైనవి.

**ఎం.ఐ.బి : బోల్షెవీకరణ క్యాంపెయన్ అవసరమైందని పార్టీ ఎందుకు భావిస్తోంది? ఈ క్యాంపెయిన్ నుంచి మీరు ఏమి ఆశిస్తున్నారు?**

**జి.పి :** పార్టీ 2013లో పార్టీ బోల్షెవీకరించాలనే పిలుపునిచ్చింది. పార్టీ, పి.ఎల్.జి.ఎ, ప్రజా సంఘాలలో అదిప్పుడు అమలవుతూ ఉంది. అదింకా పూర్తికావడానికి మరికొంత సమయం పడుతుంది. అప్పుడు మాత్రమే మన పార్టీని ఒక బోల్షెవీకరించబడిన పార్టీగా తీర్చిదిద్దడం ఎంతవరకూ విజయవంతమైందో మనమొక అంచనాకు రాగలం.

రష్యన్ బోల్షెవిక్ పార్టీగా ప్రసిద్ధి చెందిన కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ సోవియట్ యూనియన్ (బోల్షెవిక్) మొట్టమొదటిసారిగా బూర్జువాజీని కూలదోసి కార్మిక వర్గ నియంతృత్వాన్ని స్థాపించింది. ప్రపంచంలో ఏ కమ్యూనిస్టు పార్టీ అధికారంలో లేని ఆ సమయంలో ఈ పార్టీయే కార్మిక వర్గాన్నీ, పీడిత ప్రజలనూ అధికారంలోకి తెచ్చింది. మానవ చరిత్రలోనే మొదటిసారి సోషలిజాన్ని ముందుకు తెచ్చింది బోల్షెవిక్ పార్టీయే. అందువలన, మనం ఈ పార్టీనే నమూనాగా తీసుకుని, ఆ పార్టీనుంచి పాఠాలు నేర్చుకుని, ఇదంతా సాధ్యం చేసిన ఆ పార్టీ ఉన్నత లక్షణాలను స్వీకరించడం ద్వారా మన పార్టీని అటువంటి కార్మికవర్గ పార్టీగా మార్చేందుకు గట్టి ప్రయత్నం చేస్తున్నాం. అందువల్లనే మేము దీనికి బోల్షెవీకరణ క్యాంపెయిన్‌గా పేరు పెట్టాం. మరోవైపు చైనా, భారతదేశాలకు అనేక సారూప్యాలు ఉండటం చేత చైనా కమ్యూనిస్టు పార్టీ నమూనా కూడా మనకు చాలా ముఖ్యమైనదే. ఒక వెనకబడిన అర్ధవలస, అర్ధభూస్వామ్య దేశంలో, రైతాంగమే మెజారిటీగా ఉన్న చోట దీర్ఘకాలిక ప్రజాయుద్ధ పంథాని అభివృద్ధి చేసి, ప్రజాసైన్యాన్ని నిర్మించి, విజయవంతమైన ఐక్య సంఘటననూ, విముక్తి ప్రాంతాలనూ స్థాపించి, విప్లవాన్ని విజయవంతం చేసి, సోషలిజాన్ని నిర్మించిన చైనా కమ్యూనిస్టు పార్టీ గురించి తెలుసుకొని, ఆ పార్టీలోని మంచి లక్షణాలను స్వీకరించడం చాలా అవసరం. చైనా కమ్యూనిస్టు పార్టీ, తన ఆవిర్భావం నుంచీ కూడా, బోల్షెవిక్ పార్టీని నమూనాగా స్వీకరించి తనను తాను బలోపేతం చేసుకోవడానికి నిరంతర ప్రయత్నాలను సాగించింది. అంచేత చైనా కమ్యూనిస్టు పార్టీ అనుభవాలను ప్రత్యేకించి గ్రేట్ డిబేట్,నుంచి, మహత్తర శ్రామికవర్గ సాంస్కృతిక విప్లవం (జి.పి.సి.ఆర్) నుంచి తీసుకున్న పాఠాల వెలుగులో మన పార్టీ బోల్షివీకరణ క్యాంపెయిన్‌ని కొనసాగించాలని నిర్ణయించుకున్నాం. మన పార్టీ సుదీర్ఘ విప్లవ చరిత్ర నుంచి పొందిన అనుభవాల వెలుగులో మనపార్టీని బోల్షెవీకరించేందుకు పై రెండు పార్టీలను నమూనాలుగా తీసుకుంటున్నాం.

**ఈ క్యాంపెయిన్‌ని చేపట్టడానికి కారణాలు :** 1. శత్రువు అమలు చేస్తున్న దేశవ్యాప్త దురాక్రమణ దాడిలో మార్పు వచ్చింది. అది మరింత తీవ్రతరమైంది. 2. పార్టీకి తీవ్రమైన నష్టాలు జరిగాయి. ఉద్యమం చాలా గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటోంది. 3. పార్టీలో రైతాంగం, మధ్య తరగతి నేపథ్యాల నుంచి వచ్చిన వారిది మెజారిటీగా ఉంది. అందువలన పార్టీలో కార్మికవర్గ దృక్పథాన్ని మెరుగుపరచాల్సిన అవసరం ఉంది. 4.సమాజంలోనూ, విప్లవ యుద్ధంలోనూ వచ్చిన ప్రత్యేక ఆర్థిక, రాజకీయ మార్పులను అధ్యయనం చేయడంలోనూ, తగిన ఎత్తుగడలను రూపొందించడంలోనూ మన లోపాలు. 5. మన పార్టీలో కొన్ని తీవ్రమైన కార్మికవర్గ వ్యతిరేక ధోరణులు వునికిలోకొచ్చాయి. వాటిని సమూలంగా నిర్మూలించాల్సిన అవసరం ఉంది.

ఈ అంశాలన్నింటినీ దృష్టిలో ఉంచుకొని, సవాళ్ళను పరిష్కరించుకోవడం కోసం, పార్టీ సైద్ధాంతిక, రాజకీయ స్థాయిని పెంపొందించుకునేందుకు, విప్లవానికి శక్తివంతంగా నాయకత్వం వహించేలా వ్యవస్థాగతంగా పార్టీని బలోపేతం చేసేందకూ, మనం బోల్షెవీకరణ క్యాంపెయిన్‌ను చేపట్టాం. ఇలా చేయడం వలన మాత్రమే పార్టీ, పి.ఎల్.జి.ఎను ఒక శక్తివంతమైన ఆయుధంగా మలచగలుగుతుంది. వుద్యమంలో ప్రజల పునాదిని బలోపేతం చేయగలుగుతుంది. ఈ విధంగా మాత్రమే మనం ఈ గడ్డు పరిస్థితులనుంచి బయటపడి, పురోగమించగలం.

కొన్ని నిర్దిష్ట లక్ష్యాలను సాధించేందుకు మేమీ క్యాంపెయిన్‌ని ఒక ప్రణాళిక ప్రకారం నిర్వహించాలని నిర్ణయించాం.

**ఈ లక్ష్యాలను సాధించడం ద్వారా మేము ఈ క్రింది ఫలితాలను ఆశిస్తున్నాం :**

ఈ క్యాంపెయిన్ పార్టీని శ్రామికవర్గ ప్రాపంచిక దృక్పథంతో పునర్నిర్మించి పార్టీ లోపల, ప్రత్యేకించి నూతన బలగాలలో ఈ దృక్పథాన్ని మెరుగుపరుస్తుంది. ఎం.ఎల్.ఎమ్ సైద్ధాంతిక అధ్యయనాన్ని మరింత మెరుగుపరిచి, పార్టీ అంతటికీ అందులో శిక్షణనిస్తుంది. మొత్తంగా పార్టీకీ, పార్టీలోని ప్రతి యూనిట్‌కూ నూతన ప్రజాస్వామిక విప్లవ లక్ష్యం గురించి ఒక స్పష్టమైన అవగాహన వచ్చేలా తోడ్పడుతుంది. ప్రస్తుత పరిస్థితులలో సాధించివలసిన నిర్దిష్ట లక్ష్యాలను గురించి స్పష్టంగా అర్థం చేయిస్తుంది. మావో బోధించిన మూడు సూత్రాల పని పద్దతుల గురించి లోతుగా అర్థం చేసుకోవడానికి, తద్వారా మన పని పద్ధతిని మెరుగుపరుచుకునేందుకు సాయపడుతుంది. రహస్య పార్టీని నిర్మించి దాన్ని నడిపించడం గురించీ, అందులో లోపాలను గుర్తించి త్వరితంగా వాటిని దిద్దుకోవడం గురించీ, గెరిల్లా యుద్ధ ఆచరణ సూత్రాలను అమలు చేయడం గురించి మన అవగాహనను మెరుగుపరుస్తుంది. పార్టీలో కొనసాగుతున్న శ్రామికవర్గేతర ధోరణులను సరిదిద్దుకొని, వాటికి వ్యతిరేకంగా పోరాడేలా పార్టీ చైతన్యాన్ని, అప్రమత్తతను మెరుగుపరుస్తుంది. ఆలోచన, చర్యల మధ్య ఐక్యతను బలోపేతం చేసి, క్రమశిక్షణను మెరుగుపరుస్తుంది. పార్టీ ప్రజలతో దృఢంగా మమేకమై వారిని వివిధ ఆర్థిక, రాజకీయ, తదితర పోరాటాలలోకి కదిలించి, తన ప్రజా పునాదిని బలోపేతం చేసుకోవడంగా ఇది పరిణమిస్తుంది. వ్యవసాయకవిప్లవ యుద్ధంలోకి రైతాంగాన్ని సమీకరించడానికి ప్రాధాన్యమిచ్చి, రైతాంగేతర ప్రజానీకంపై, పట్టణ ప్రజానీకంపై ప్రత్యేక శ్రద్ధను పెట్టడానికి ఇది దారి తీస్తుంది.

మారుతున్న సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక పరిస్థితులను అధ్యయనం చేసి, అందుకు అనుగుణంగా మన ఎత్తుగడలను మార్చుకుంటూ, తద్వారా ఉద్యమాన్ని విజయవంతంగా అభివృద్ధి చేసుకోవడానికి దారితీస్తుంది.

విప్లవం ముందుకు సాగే క్రమంలో ఎదురయ్యే అత్యంత క్లిష్టమైన పరిస్థితులను, కష్టాలను, ప్రమాదాలను ఎదుర్కొనగల చైతన్యాన్ని ప్రదర్శించి, శత్రువుతో ధైర్య సాహసాలతో పోరాడగల సంసిద్ధతను కార్యకర్తల్లో కలిగి వుండేలా ఈ క్యాంపెయిన్ వారిని కాకలు తీరుస్తుందని మేము భావిస్తున్నాం. చివరగా, ఈ క్యాంపెయిన్ మా స్వీయాత్మక శక్తులను, ప్రత్యేకించి మా ఉన్నత స్థాయి నాయకత్వాన్ని, వుద్యమాన్ని శత్రువు చేస్తున్న అత్యంత క్రూరమైన దాడినుంచి రక్షించుకోగలిగేలా చేస్తుందని ఆశిస్తున్నాం. ఎమ్.ఎల్.ఎమ్‌ను లోతుగా అధ్యయనం చేసి, ఈ క్యాంపెయిన్‌కు దానిని హృదయంగా చేసినప్పుడు మాత్రమే ఈ ఫలితాలను సాధించగలం.

**ఎం.ఐ.బి : దీర్ఘకాలిక ప్రజాయుద్ధ పంథాకు కాలం చెల్లిందని శత్రువు ప్రచారం చేస్తున్నాడు. చావెజ్ 21వ శతాబ్దపు సోషలిజాన్ని కొంత మంది ప్రచారం చేస్తున్నారు. ప్రచండ-భట్టారాయ్ నాయకత్వంలోని యూనైటెడ్ కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ నేపాల్ (మావోయిస్టు) దీర్ఘకాలిక ప్రజాయుద్ధ పంథాను వదిలేసి పార్లమెంటరీ బాట పట్టింది. ప్రపంచీకరణ జరుగుతున్న ప్రస్తుత ప్రపంచంలో భారతదేశంలో గానీ, మరెక్కడైనా గానీ దీర్ఘకాలిక ప్రజాయుద్ధ పంథా ప్రాసంగికత గురించి అనేక ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. ఈ వాదనాలన్నింటికీ పార్టీ జవాబేమిటి?**

**జి.పి:** మార్క్స్, ఎంగెల్స్‌లు శ్రామికవర్గ సిద్ధాంతానికి పునాది వేసినప్పటి నుండీ, ప్రత్యేకించి ప్యారిస్ కమ్యూన్, భూస్వామ్య, పెట్టుబడిదారీ విధానాల వ్యతిరేక పోరాటంలో శ్రామిక విప్లవాలలో నుంచి వచ్చిన శ్రామికవర్గం ఒక విప్లవ శక్తిగా ఆవిర్భవించినప్పటి నుండీ ఈ దోపిడీ దారులు, ప్రగతి నిరోధక శక్తులూ కేవలం మన దేశంలోనే కాక ప్రపంచ వ్యాపితంగా కూడా మార్క్సిజం వ్యతిరేక ప్రచారం చేస్తున్నారు. రష్యా, చైనా దేశాల కమ్యూనిస్టు పార్టీలు రివిజనిస్టు పార్టీలుగా మారిపోయాక అసలు మార్క్సిజానికే కాలం చెల్లిందనే ప్రచారం ప్రారంభించారు. ఇందుకు కారణం స్పష్టమే ! విప్లవాలూ, మార్క్సిజమూ వారిని అంతం చేస్తాయి.

దీర్ఘకాలిక ప్రజాయుద్ధ పంథాకు కాలం చెల్లిందని ఎలా చెప్పగలరు? మావో మరణం తర్వాత, ప్రపంచంలోని విప్లవ పోరాటాలన్నీ-అవి నూతన ప్రజాస్వామిక విప్లవాలు గానీ లేదా జాతి విముక్తి పోరాటాలు గానీ-దీర్ఘకాలికమయ్యాయి. వాటిలో కొన్ని నమ్మకద్రోహానికి గురికావడమో, వదిలివేయడమో జరిగినప్పటికీ, స్వాభావరీత్యా అవి దీర్ఘకాలికమైనవనేది వాస్తవం. ఎప్పటివరకూ వెనకబడిన దేశాల అర్ధభూస్వామ్య వ్యవస్థ రూపం మారకుండా వుంటుందో, ఎంతకాలం సామ్రాజ్యవాదం మనదేశం లాంటి దేశాలను తన క్రూరమైన పట్టులో బిగించి ఉంచి వాటిని స్వతంత్రంగా అభివృద్ధి చెందనీయదో-అంతవరకూ విముక్తికోసం దీర్ఘకాలిక ప్రజాయుద్ధ పంథా తప్ప మరో మార్గమే లేదు. కొన్ని భూస్వామ్య రూపాలు మారుతే మారొచ్చు గాక, కానీ, సామ్రాజ్యవాదుల, దళారీ నిరంకుశ పెట్టుబడిదారుల ప్రయోజనాలకు సేవ చేసినంతకాలం భూస్వామ్యం చెక్కుచెదరకుండా నిలిచి ఉంటుంది. అందువల్లనే ప్రజలు సామ్రాజ్యవాద వ్యతిరేక, భూస్వామ్య వ్యతిరేక యుద్ధమైన నూతన ప్రజాస్వామిక విప్లవ విజయం కోసం పార్టీ నాయకత్వం కింద దీర్ఘకాలిక ప్రజాయుద్ధాన్ని సాగిస్తున్నారు. ఈ యుద్ధం దీర్ఘకాలికంగా వుంటుందనీ, మన పార్టీ నాయకత్వాన ప్రజలే యుద్ధాన్ని కొనసాగిస్తారనీ మన దేశపు నిర్దిష్ట లక్షణాలు నిర్ణయిస్తాయి. అందువల్లనే ఈ దీర్ఘకాలిక ప్రజాయుద్ధ పంథా అగ్రగణ్యత, అనివార్యత కూడా.

ఇప్పుడు చావెజ్ గురించీ, 21వ శతాబ్దపు సోషలిజంగా పిలిచే అతని నమూనా గురించీ చెప్పుకుందాం. ఇప్పటివరకూ ప్రపంచంలో విప్లవాలకు రెండే మార్గాలు స్థిరపరచబడ్డాయి. అవి- తిరుగుబాటు, దీర్ఘకాలిక ప్రజాయుద్ధం. ఈ రెండింటిని ఆయా దేశాల వాస్తవ, నిర్దిష్ట పరిస్థితులకనుగుణంగా అన్వయించుకోవాలి. నూతన చారిత్రక సందర్భాలలో ఈ రెండు పంథాలకూ కొన్ని మార్పులు, చేర్పులు ఉండవచ్చు. అందుకే విప్లవాన్ని యాంత్రికంగానో, పిడివాదంగానో కాక సృజనాత్మకంగా చేయాలని మార్క్సిజం చెబుతుంది. అయితే ఈ మార్పుచేర్పులు ఎలాంటివైనా విప్లవ రూపాంతరీకరణ చెందే పరిధిలోనే ఉండాలి. అందువల్లనే ఒక నిర్దిష్ట దేశానికి సంబంధించిన నిర్దిష్ట పరిస్థితులకు అనుగుణంగా సాగించినప్పటికీ అది తప్పనిసరిగా విప్లవమే అయి ఉండాలి. ఒక వర్గరహిత సమాజంవైపు వెళ్ళాలనే దృష్టి కోణం లేకుండా ఉనికిలో ఉన్న శిథిల వ్యవస్థనే సంస్కరించే ప్రయత్నం చేయడం వల్ల ఉపయోగం లేదు. చావెజ్ నమూనా కేవలం సంస్కరణ మాత్రమే, విప్లవం కాదు. రూపంలో కానీ, వస్తురీత్యా గానీ అది సోషలిజమే కాదు.

రష్యా, చైనా విప్లవాల తర్వాత ప్రపంచంలో అనేక మార్పులు వచ్చాయి. పెట్టుబడిదారీ దేశాల్లోనూ, మూడవప్రపంచ దేశాల్లోనూ పెటీ బూర్జువావర్గం గణనీయంగా పెరిగిపోయింది. అందులో ఒక వర్గానికి ఉదారవాద బూర్జువా ఆలోచనలుంటే మరో వర్గానికి ఉహాజనిత సోషలిస్టు ఆలోచనలుంటాయి. ఎక్కడైతే బూర్జువా ప్రజాస్వామిక విప్లవాలు లేదా నూతన ప్రజాస్వామిక విప్లవాలు చోటు చేసుకోలేదో, ఎక్కడైతే విప్లవోద్యమాలు వారిని పెద్ద సంఖ్యలో తన అక్కున చేర్చుకోలేదో అటువంటి దేశాలలోని ఈ పెటీబూర్జువా వర్గం బూర్జువా పార్లమెంటరీ వ్యవస్థ చట్రంలోనే ఒక మార్పుకు లేదా సంస్కరణకు అనుకూలంగా ఉంటుంది. చావెజ్ శ్రామికవర్గానికి, రైతాంగానికి ప్రయోజనకరంగా వుండేలా కొన్ని చర్యలు చేపట్టాడు. ఆ దేశపు ప్రధాన ఉత్పత్తి చమురు. చమురు, ఇంకా కొన్ని ఇతర పరిశ్రమలను అనేక పరిమితులతో జాతీయం చేసినా, భూస్వామ్య, దళారీ నిరంకుశ పెట్టుబడిదారి విధానం రూపు మాసిపోలేదు. ప్రపంచ పెట్టుబడిదారి వ్యవస్థతో వారు వేరు పడలేదు కూడా. కాబట్టి చావెజ్ పాలనలో ఆ దేశ వ్యవస్థలో వచ్చిన మౌలిక మార్పేమి లేదు. సామ్రాజ్యవాద ఆధిపత్యం నుంచి వారు స్వేచ్ఛగా లేరు. వెనిజులాలోని భూస్వామ్య, దళారీ పెట్టుబడిదారి శక్తులలోని ఒక ప్రధాన వర్గం పేద ప్రజానీకానికి ఎంత వ్యతిరేకంగా ఉందంటే, చావెజ్ అమలు చేసిన ఈ మాత్రపు సంస్కరణలు కూడా అది తీవ్రంగా వ్యతిరేకిస్తుంది. ఈ వ్యతిరేకతే ప్రచ్ఛన్న ఊతంగా పని చేసి, చావెజ్ నమూనాకు విపరీత ప్రచారాన్ని తెచ్చి పెట్టింది. ఏదేమైనా చావెజ్ ఎన్నడూ ప్రజలను వర్గపోరాటంలోకి నడిపించలేదనేది మనం గుర్తుంచుకోవాలి. చావెజ్, బొలివర్, చేగువేరాలను ఆరాధించినప్పటికీ అతని నమూనాలో బొలివరిజం గానీ, చేగువేరిజం గానీ లేవు. అది ప్రధానంగా సంస్కరణవాదం. అందుకే మన దేశంలోని దివాళాకోరు సి.పి.ఐ, సి.పి.ఎమ్‌లు కూడా అతని

వారసత్వాన్ని ఎత్తిపడుతున్నాయి.

నేపాల్‌లో పార్లమెంటరీ వ్యవస్థ అర్ధభూస్వామ్య విధానంపై ఆధారపడినదీ, సామ్రాజ్యవాద కాడికింద నలుగుతున్నది. ఒక వైపు భారత విస్తరణవాద ఆధిపత్యం కిందా, మరోవైపు చైనా ప్రభావం వైపు కింద వుంది. అటువంటి వ్యవస్థలో చేరిన ఎవరైనా విప్లవాన్ని వదిలివేయాల్సిందే. నూతన ప్రజాస్వామిక విప్లవంలో చెప్పుకోదగ్గ విజయాలు సాధించినప్పటికీ, యునైటెడ్ కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ నేపాల్ (మావోయిస్టు) కు చెందిన ప్రచండ-భట్టారాయ్ ఆధునిక రివిజనిస్టు ముఠా ఈ రివిజనిస్టు మార్గాన్నే ఎంచుకుంది. ఇది నమ్మకద్రోహం తప్ప మరొకటి కాదు. లక్షలాది మంది ప్రజలకు, వేలాది మంది అమరులకు వారు నమ్మకద్రోహం చేసారు. వారికి ముందున్న రివిజనిస్టులందరిలాగే తమ స్వార్థ ప్రయోజనాల కోసం, పాలకవర్గాలతో అధికారాన్ని పంచుకోవడం కోసం వారీపని చేసారు.

ప్రపంచీకరణ వల్ల ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక రంగాలలో అనేక మార్పులు చోటుచేసుకున్నాయని మేము అంగీకరిస్తాం. కానీ ఈ మార్పులు ఎవరి కోసం వచ్చాయి? నియంతృత్వ పెట్టుబడి ప్రయోజనాలను నెరవేర్చడానికే ఈ మార్పులు తెచ్చారు. గత 23 సంవత్సరాలుగా ప్రపంచ పెట్టుబడిదారి వ్యవస్థ ఈ మార్పులను తీసుకువచ్చింది. ఈ మార్పులు పెట్టుబడిదారి, సామ్రాజ్యవాద, మూడవ ప్రపంచ దేశాలలోని ఒక సెక్షన్ పాలకవర్గాలకు శ్రమనూ, శ్రమ జీవులనూ అపరిమితంగా దోచుకోవడానికీ, వలసలు, అర్ధవలసలలోని సహజ వనరులను, ఇతర వనరులను విచక్షణారహితంగా దోచుకోవడానికి అవకాశం ఇచ్చాయి. ఇది సంపన్న, పేద వర్గాల ఆదాయాల మధ్య ఒక అతి పెద్ద అగాధానికి దారి తీసింది. పెట్టుబడి సాంద్రత, కేంద్రీకరణ అసాధారణ స్థాయికి చేరుకుంది. పశ్చిమ ఆసియాలో, తర్వాత ఆఫ్ఘనిస్తాన్‌లో అమెరికా సామ్రాజ్యవాదపు వివరీత జోక్యం పెరిగిపోయినది ఈ సమయంలోనే. దాదాపు మొత్తం సామ్రాజ్యవాద, పెట్టుబడిదారి దేశాలన్నీ, ప్రత్యేకించి అమెరికా, దాని తొత్తు పాలనలన్నీ నయా ఫాసిజానికి తిరిగాయి. జి.డి.పి పెరుగుదల, ఆర్థిక వ్యవస్థ పెరుగుదల, ఉద్యోగాలు, సంపద, ఒకటేమిటి-నయాఉదారవాద విధానాలే వీటన్నింటి పెరుగుదలకు సాటిలేని పరిష్కారమని పాలకవర్గాలు చిత్రించే ప్రయత్నం చేసాయి. ఈ చిత్రణలన్నీ 2008 నాటి ప్రపంచవ్యాప్త ఆర్థిక సంక్షోభంలో పేకమేడల్లా కూలిపోయాయి.

ఈ నయా ఉదారవాద విధానాల ద్వారా సామ్రాజ్యవాదం ప్రజల జీవితాల్లో సృష్టించిన విధ్వంసాన్ని మనం గమనించాలి. ఇటువంటి విధ్వంసం కేవలం ఆర్థిక సంక్షోభం వల్లనే రాలేదు. దురాక్రమణ యుద్ధాలు, పెరిగిపోతున్న నయావలసవాదుల జోక్యం, మూడవ ప్రపంచ దేశాలపై సామ్రాజ్యవాద శక్తుల అదలింపు, పెత్తనం-ఇవన్నీ కారణాలే. 'ప్రపంచీకరణ' చేపట్టిన సామ్రాజ్యవాదులు సంక్షోభంలోంచి బయటపడేందుకు దిక్కుతోచని స్థితిలో ఎప్పుడు చేసినట్లే ప్రపంచ ప్రజానీకంపై, ప్రత్యేకించి మూడవ ప్రపంచ ప్రజానీకంపై యుద్ధాలకు, మరింత తీవ్రమైన దోపిడీకీ, అణచివేతకు, నిర్బంధాలకు పాల్పడ్డారు. సామ్రాజ్యవాదాన్ని, వారి స్థానిక తొత్తులను పారదోలకుండా మూడవ ప్రపంచ దేశాల ప్రజలు స్వేచ్ఛగా ఊపిరి పీల్చుకోలేరు.

అందువలన మనం మార్పులన్నింటినీ దృష్టిలో ఉంచుకొని మన వ్యూహాన్ని సుసంపన్నం చేసుకోవాలి. మన ఎత్తుగడలను మార్చుకోవాలి. తదనుగుణంగా విప్లవయుద్ధంలోకి ప్రజలను కదిలించాలి. మన నినాదాలు, రాజకీయ ఎత్తుగడలు, మిలిటరీ ఎత్తుగడలు, పని పద్ధతులు-వీటన్నింటిలోనూ మార్పులు తేవాల్సి ఉంది. అప్పుడు మాత్రమే మనం పురోగమించగలం. రాజకీయ పంథాను, దీర్ఘకాలిక ప్రజాయుద్ధ పంథాను వదిలివేయడం ఎంతమాత్రం పరిష్కారం కాదు. వాటికి మరింత దృఢంగా అంటిపెట్టుకోవడమే పరిష్కారం. మనం ఎటువంటి ఎత్తుగడలు తీసుకున్నా, అంతిమంగా అవి ఇందుకే ఉపయోగపడాలి.

మన దేశ, ప్రజల విముక్తి కోసం ప్రస్తుత అర్ధవలస, అర్ధ భూస్వామ్య వ్యవస్థను కూల్చివేసే విజయవంతమైన నూతన ప్రజాస్వామిక విప్లవం కావాలి. సరైన సిద్ధాంతం, రాజకీయ పంథా, సరైనా మిలటరీ పంథా, బలమైన అగ్రగామి పార్టీ, బలమైన ప్రజాసైన్యం, బలమైన ఐక్య సంఘటన-ఇవీ నూతన ప్రజాస్వామిక విప్లవం విజయవంతం కావడానికి వుండవలసినవని మరోసారి నొక్కి చెప్తున్నాము.

**ఎం.ఐ.బి : "వస్తుగత ప్రపంచ పరిస్థితి విప్లవానికి మరింత అనువుగా మలుపు తిరుగుతోంది" అని పార్టీ అంచనా వేసింది. ఈ నేపథ్యంలో అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమ ప్రస్తుత పరిస్థితి ఏమిటి? అవేకియనిజం, ప్రచండ-భట్టారాయ్ ముఠా నేపాల్ వప్లవోద్యమానికి చేసిన నమ్మకద్రోహం అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంపై ఎటువంటి ప్రభావం చూపుతున్నాయి?**

**జి.పి :** వస్తుగత ప్రపంచ పరిస్థితి వప్లవ పురోగమనానికి అద్భుతంగా ఉంది. ఇంతకు ముందే చెప్పినట్లుగా ప్రపంచ పెట్టుబడి దారీ వ్యవస్థ 'మహామాంద్యం' నాటి తీవ్రమైన సంక్షోభంలో కొనసాగుతోంది. విచ్చలవిడి లే-ఆఫ్‌ల, వుద్యోగవకాశాలు కుంచించుకుపోవడం, నిరుద్యోగం, దారిద్ర్యం ఒకవైపున, శ్రామిక ప్రజలపై తీవ్రతరమైన దోపిడీ, అణగారిన దేశాలూ, ప్రజలపై నయావలసవాద దోపిడీ మరో వైపున. అమెరికా సామ్రాజ్యవాదులు, ఇరాక్, అఫ్ఘనిస్తాన్ తదితర అనేక యుద్ధ రంగాల్లో నిండా మునిగిపోయినప్పటికీ దురాక్రమణ యుద్ధం తగ్గుముఖం పట్టే సూచన కనిపించడం లేదు.

సామ్రాజ్యవాదానికీ, దాని స్థానిక తొత్తులకూ వ్యతిరేకంగా విప్లవ, ప్రజాస్వామిక, జాతి విముక్తి పోరాట శక్తులు ప్రపంచ వ్యాప్తంగా బలోపేతమవుతున్నాయి. శ్రామికులు, రైతులు, మధ్య తరగతి ప్రజలు, నల్లజాతివారు, వలస వచ్చినవారు, ముస్లిములు వంటి తదితర పీడిత జాతులు, మహిళలు, విద్యార్థులు, యువత వంటి వివిధ అణగారిన వర్గాలవారు వీధుల్లోకి వస్తున్నారు. ఉద్యోగాల్లో కోత, నిరుద్యోగం లేదా తక్కువ ఉద్యోగాలు ఉండటం, నిజ వేతనాలను తగ్గించడం, సామాజిక పరిరక్షణా వ్యయాన్ని ఉపసంహరించడం వంటి ప్రభుత్వ 'కఠోర' చర్యలకు వ్యతిరేకంగా జరుగుతున్న సామూహిక శ్రామికుల ప్రదర్శనలతో అనేక యూరోపియన్ యూనియన్ దేశాలు అట్టుడికిపోతున్నాయి. ధనిక పేదల మధ్య వ్యత్యాసం విశాలమవుతుండటం, వర్గవైషమ్యాలు తీవ్రతరమవుతుండటంతో పెట్టుబడిదారీ దేశాలలోని ప్రజలు భారీ సంఖ్యలో పోరాటాలలోకి వస్తున్నారు. యూరప్, ఉత్తర అమెరికా దేశాలలోని నల్లజాతి ప్రజలు, ముస్లిములు, వలసవాదులు, ఇతర అణగారిన వర్గ ప్రజలు తమ ప్రజాస్వామిక హక్కుల కోసం

పోరాడుతున్నారు. వెనకబడిన దేశాలలో కూడా సంపదలోని హెచ్చుతగ్గులు, శ్రామిక ప్రజల బీదరికం, దుర్భర దారిద్ర్యం, రాజకీయ అణచివేతవంటివి ప్రజా తిరుగుబాట్లకు దారి తీస్తున్నాయి. అనేక ఆసియా, ఆఫ్రికా దేశాలు సంక్షోభాలతో అంత:కలహాలతో రగిలిపోతున్నాయి. రక్తపాతం, హత్యాకాండల నడుమ కూడా ఇరాకీలు, అఫ్ఘనీలు, పాలస్తీనావారు, కుర్దులు, ఇంకా అనేక మంది ప్రజలు తమ సాయుధ, జాతి విముక్తి పోరాటాలను కొనసాగిస్తున్నారు. యూరప్‌లోని స్కాట్లు, కీటలోనియన్లు, ఇంకా కొన్ని దేశాల జాతీయ ఆకాంక్షల ఉద్యమాలు ఉనికిలోకి వస్తున్నాయి. దక్షిణ అమెరికాలోని బ్రెజిల్ వంటి దేశాల ప్రజలు ప్రభుత్వాలు చేపట్టిన ప్రజావ్యతిరేక, నయా ఉదారవాద విధానాలకు వ్యతిరేకంగా సామూహిక నిరసనలు చేపట్టారు.

అయితే అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలోని స్వీయాత్మక శక్తులు ప్రపంచంలో ఈనాడు నెలకొని ఉన్న అనుకూల వస్తుగత పరిస్థితిని అందిపుచ్చుకోవడంలో వెనకబడి ఉన్నాయి. ప్రపంచ సోషలిస్టు ఉద్యమ పురోగమనానికి ఈ పరిస్థితిని ఉపయోగించుకోవడంలో వస్తుగత పరిస్థితికి మావోయిస్టు శక్తుల స్వీయాత్మక సామర్థ్యానికీ మధ్య వైరుధ్యం ఉంది. ప్రధానంగా ఆయా దేశాల నిర్దిష్ట పరిస్థితులకు అనుగుణంగా విప్లవాన్ని కొనసాగించి ఈ స్వీయాత్మక బలహీనతను అధిగమించగలమని మనం నేర్చుకున్న చారిత్రక పాఠాల ద్వారా మనకు తెలుసు. ప్రజల సమస్యల్ని పరిష్కరించడంలో రివిజనిస్టు, సంస్కరణవాద శక్తుల అసమర్థత రుజువవుతుండటంతో, వారు మావోయిస్టు శక్తులతో కలిసి ముందుకు సాగే అవకాశాలు పెరుగుతున్నాయి. అనేక దేశాలలో మావోయిస్టు పార్టీలు, సంస్థలు బలాన్ని పుంజుకుంటున్నాయి. కొన్ని కొత్త పార్టీలు ఆవిర్భావ క్రమంలో ఉన్నాయి. మవోయిస్టు పార్టీల, సంస్థల, శక్తుల మధ్య ఐక్యత కూడా పెరుగుతున్నది. శక్తివంతమైన ఒక కొత్త విప్లవ కెరటం కార్యరూపం దాల్చగల సామర్థ్యం పెరుగుతున్నది. అనేక అడ్డంకులను ఎదుర్కొంటూ ఫిలిప్పీన్స్, భారత దేశాలలోని దీర్ఘకాలిక ప్రజాయుద్ధాలు కొనసాగుతున్నాయి. అనేక ఇతర దేశాలలో కూడా మావోయిస్టు పార్టీలు పోరాటాలు చేపడుతున్నాయి. అంతర్జాతీయ మావోయిస్టు శక్తులు భారతదేశ ప్రజాయుద్ధానికి మద్దతుగా, విప్లవ ప్రతిఘాత ఆపరేషన్ గ్రీన్‌హంట్, ఓప్లాన్ బయానిహాన్‌లకు వ్యతిరేకంగా అంతర్జాతీయ మద్దతు కూడగట్టడం, రాజకీయ ఖైదీల హక్కుల కోసం పోరాటాలు వంటి సంఘీభావ కార్యక్రమాలు చేపట్టాయి. ఈ విధంగా అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమం, మావోయిస్టు శక్తులు ప్రజల పోరాటాలలో నిర్దిష్ట పాత్రను నిర్వహించి, తద్వారా భవిష్యత్తులో ఒక విప్లవ కెరటాన్ని లేవనెత్తగల స్థితిలోనే ఉన్నాయి.

ప్రచండ-భట్టారాయ్ ముఠా రివిజనిజం, నేపాల్ ప్రజలకు ప్రపంచ సోషలిస్టు విప్లవానికి వారు చేసిన ద్రోహం, అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమానికి తీవ్ర నష్టాన్నే కలుగజేసాయి. ఈ ద్రోహాలు మహోన్నత ప్రజాయుద్ధాన్ని అంతర్గతంగానే ధ్వంసం చేసి, అణగారిన నేపాల్ ప్రజలపై శతృవు తిరిగి తన పైచేయిని సాధించేందుకు సహాయపడ్డారు. ఇది కేవలం నేపాల్ ప్రజలకే కాక మొత్తం అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమానికే ఒక వెనుకంజ. అయితే ప్రచండ-భట్టారాయ్ ముఠాకు వ్యతిరేకంగా, సామ్రాజ్యవాదుల, వారి ఏజెంట్ల ముందు ఈ ముఠా నిస్సిగ్గుగా లొంగిపోవడానికి వ్యతిరేకంగా నిజమైన మావోయిస్టు శక్తులు చేసిన తీవ్రమైన పోరాటం-మరీ ముఖ్యంగా స్వయంగా నేపాల్ ప్రజలు ఈ ద్రోహులకు వ్యతిరేకంగా చేసిన పోరాటం-ఈ ముఠా అభివృద్ధి నిరోధక స్వభావాన్ని, ఎం.ఎల్.ఎంను అభివృద్ధి చేసి, సుసంపన్నం చేసే పేరుతో చేసిన ద్రోహాన్ని బట్టబయలు చేసింది. ఈ ఆధునిక రివిజనిస్టులు సామ్రాజ్యవాదానికి, భూస్వామ్య, దళారీ నిరంకుశ పెట్టుబడికి, భారత విస్తరణవాదానికీ అత్యంత నమ్మకమైన తొత్తులుగా మారిపోయారు. నేపాల్ ప్రజానీకం, అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమం వీరి వర్గ కుమ్మక్కును పూర్తిగా తిరస్కరించారు. ఈ ఊసరవెల్లులను చరిత్ర చెత్తబుట్టలోకి విసిరి పారేసిన నేపాల్ ప్రజానీకం విప్లవ మార్గంలో తప్పనిసరిగా ముందుకే సాగుతారు.

అదే విధంగా అవేకియనిజంగా పిలుస్తున్న ఈ సరికొత్త సంయోజనం కూడా కొన్ని మావోయిస్టు పార్టీలను తీవ్రంగా దెబ్బతీసింది. ఎందుకంటే, ఈ అవేకియనిజం అనేది ముసుగు వేసుకున్న రివిజనిజం, దివాలాకోరుతనం తప్ప మరేంకాదు. అంతర్జాతీయ కమ్యూనిస్టు వుద్యమంపై ఇది తాత్కాలికంగా కొంత ప్రతికూల ప్రభావాన్నే వేసినప్పటికీ తప్పనిసరిగా ఇది ఓడిపోతుంది. ప్రపంచ శ్రామికవర్గ సైనిక విభాగంగా మన పార్టీ, ఈ అవేకియానిజంకి వ్యతిరేకంగా, అంతర్జాతీయంగానూ, మన దేశంలోనూ కమ్యూనిస్టు ఉద్యమంలో ఉన్న అన్ని రూపాల రివిజనిజానికి వ్యతిరేకంగా తన పోరాటాన్ని కొనసాగిస్తుంది.

**ఎం.ఐ.బి : మోడీ నాయకత్వంలోని ఎన్.డి.ఎ ప్రభుత్వం సామ్రాజ్యవాద ఎజెండాను అమితవేగంతో అమలు చేస్తుంది : ఆర్.ఎస్.ఎస్ తన హిందూత్వ కోరలను అమితవేగంతో వ్యాపింపజేస్తుంది. మావోయిస్టులను ఇప్పటికీ భారతదేశ అంతర్గత భద్రతకు అతిపెద్ద ముప్పుగా భారతరాజ్యం పరిగణిస్తుందని హెూమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ నొక్కి చెబుతున్నాడు. అన్ని రంగాలలో ఫాసిస్టు దురాక్రమణ పెరిపోయిందనేది సత్యమే. దీన్ని తిప్పికొట్టేందుకు పార్టీ ప్రణాళిక ఏమిటి?**

**జి.పి :** 1990ల నుంచి అధికారంలో ఉన్న వరుస ప్రభుత్వాలు అమలు చేసిన ఉదారీకరణ-ప్రైవేటీకరణ-ప్రపంచీకరణ విధానాలను ఎన్.డి.ఎ ప్రభుత్వం అధికారంలో ఉన్న ఈ 5నెలలలో మరింత తీవ్రంగా అమలు చేస్తున్నది. ఇంతకుముందరి యు.పి.ఎ ప్రభుత్వాల కంటే వేగంగా, మరింత దుకుడుగా ఈ విధానాలను అమలు చేయాలనే ఉద్దేశంతోనే సామ్రాజ్యవాదులు, దళారీబడాపెట్టుబడిదారులు, బడాభూస్వాములు మోడీ, బి.జె.పిలను అధికార పీఠంపై కూర్చోబెట్టారు. అందువల్లనే 'బలహీనుడైన' మన్‌మోహన్‌సింగ్ స్థానంలో 'బలమైన' నరేంద్రమోడీ వచ్చాడు. సామ్రాజ్యవాద చోదక విధానాలు, శ్రమజీవులపై నిర్దాక్షిణ్యదోపిడీ, ముస్లింలు, దళితులు, ఆదివాసీలపై హిందూ ఫాసిస్టుల అణచివేత-ఇది మోడీ నాయకత్వం కింద గుజరాత్‌లో జరిగిన మారణకాండ. ఈ 'గుజరాత్ నమూనా' యే దేశమంతటా ఇప్పుడు కొనసాగించబడుతోంది.

మోడీ ప్రభుత్వ నయావుదారవాద దుర్మార్గ విధానాలు ఇప్పటికే యాతనలు పడుతున్న శ్రామికులు, రైతులు, ప్రభుత్వ ఉద్యోగులు, మహిళలు, విద్యార్థులు, యువత వంటి వివిధ సెక్షన్ల ప్రజల కష్టాలను మరింత తీవ్రతరం చేస్తాయి. ముస్లింలపై హిందూ ఫాసిస్టుల దాడులు మరింతగా పెరిగిపోతాయి. భూస్వామ్య, అభివృద్ధి నిరోధక శక్తులు బలాన్ని పుంజుకోవడంతో దళితులపై అత్యాచారాలు

పెరిగిపోతున్నాయి. అణగారిన జాతులు వలన పీడనకు గురవుతున్నాయి. ఎన్.డి.ఎ దూకుడు విస్తరణవాద విధానాలకు తోడుగా 'అతిపెద్ద దేశం'గా డబ్బా కొట్టుకోవడం దక్షిణాసియా ప్రజలలో వ్యతిరేకతను రేకెత్తిస్తాయి. ఇటువంటి విషయాలలో మనం జోక్యం చేసుకుని ప్రజలను పోరాటాలలోకి సమీకరించాలి.

ఉదారీకరణ-ప్రైవేటీకరణ-ప్రపంచీకరణ ఎజెండాను దూకుడుగా అమలు చేస్తున్న ఫలితంగా మన దేశంపై నయావలసవాద ఉచ్చు మరింతగా బిగుసుకుంటుంది. తత్ఫలితంగా పెల్లుబికే ప్రజాగ్రహాన్ని దారి మళ్ళించేందుకు సంఘ్‌పరివార్ తీవ్ర జాతీయవాదాన్ని ఎగదోస్తూ, దేశ అభిమానం గురించి బూటకపు మాటలు చెప్తోంది. దేశాన్ని హోల్‌సేల్‌గా అమ్మేస్తున్న మోడీ ప్రభుత్వ నిజస్వరూపాన్ని బహిర్గతం చేయడం ద్వారా ఇటువంటి మోసపుటెత్తులను సవాల్ చేయాలి. సామ్రాజ్యవాద అనుకూల, భూస్వామ్యవాద అనుకూల స్వాభావం కలిగిన మోడీ ఎజెండాను ఎండగట్టేందుకు విశాల ప్రచార కార్యక్రమాన్ని చేపట్టాలి.

మోడీ 'అభివృద్ధి' ఎజెండాను దూకుడుగా ముందుకు తీసుకుపోవడం ముందెన్నడూ లేని వేగంతో స్థానాచలనానికి, డిటాచ్‌మెంట్‌కు దారి తీస్తుంది. ఆదివాసీల ఉనికి ప్రమాదంలో పడుతుంది. ఇది ప్రజా పోరాటాలను ముందుకు తెస్తుంది. తగిన పోరాట రూపాలను ఎంచుకొని ప్రత్యేక్షంగా లేదా సహాయకంగా ఉండేలా మనం ఇందులో చురుకుగా జోక్యం చేసుకోవాలి.

ప్రజలమీద జరిగే ఈ దాడులు అత్యంత క్రూరమైన చట్టాలతో పాటు వస్తాయి. శ్రమజీవుల హక్కులను పరిరక్షించే పాత చట్టాలు ఇప్పటికే సవరించబడటమో లేదా అసలు లేకుండా పోవడమో జరిగిపోయింది. ప్రజల జల్-జంగల్-జమీన్‌లనూ, జీవనాధారాలనూ లాగివేసుకుంటూ సామ్రాజ్యవాదులకు, బడా భూస్వాములకు, దళారీ నిరంకుశ పెట్టుబడిదారులకు అనువైన కొత్త చట్టాలను ప్రవేశపెడుతున్నారు. కనీస న్యాయాన్ని కూడా ఘోరంగా ఉల్లంఘించడం, రాజకీయ ఖైదీలపై క్రూరమైన పీడన, సమస్యలపై పోరాడే కార్యకర్తలపై అణచివేత పెరిగిపోతున్నాయి. ఇటువంటి సమస్యలన్నింటిలో మనం శక్తివంతంగా కలుగజేసుకోవాలి. పౌరహక్కుల ఉద్యమాలను విశాల ప్రాతిపదికపై నిర్మించడానికి, బలోపేతం చేయడానికి మంచి అవకాశం ఉంది.

ఎన్నికల తర్వాతి పరిస్థితిని సమీక్షిస్తూ కేంద్రకమిటీ, ఆర్.ఎస్.ఎస్ ఆధిపత్యంలోని ఎన్.డి.ఎ ప్రభుత్వం కేంద్రంలో అధికారంలోకి రావడం, దేశవ్యాప్తింగా బ్రాహ్మణీయ హిందూ ఫాసిస్టు శక్తులను తరిమికొట్టాలనే తక్షణ కర్తవ్యాన్ని ముందుకు తెచ్చిందని గుర్తించింది. విప్లవ, ప్రజాస్వామిక, లౌకిక, దేశభక్త ఆర్గనైజేషన్లనూ, శక్తులనూ, అశేష ప్రజారాశులనూ, వ్యక్తులను ఏకం చేసి బలమైన విశాల పునాది గల ప్రజావుద్యమాలను నిర్మించడం ద్వారా దీనిని సమర్థవంతంగా తిప్పికొట్టవచ్చు. సామ్రాజ్యవాద, భూస్వామ్య అనుకూల మోడీ ఎజెండా నిజస్వభావాన్ని ఎండగట్టేందుకు విస్తృతమైన, నిర్దిష్ట ప్రచార కార్యక్రమాన్ని చేపట్టాలి. ఈ మూడవ దశ ఆపరేషన్ గ్రీన్‌హంట్‌కు వ్యతిరేకంగా జరుగుతున్న ప్రతిఘటనలో వారిని ఏకం చేసే కర్తవ్యంతో ఈ కార్యకలాపాలను నిర్వహించాలి. ఫాసిస్టు హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్, తన ముందరి యు.పి.ఎ ప్రభుత్వ వైఖరినే చిలకపలుకుల్లా వల్లిస్తూ మావోయిస్టులే "ఇప్పటికీ అతిపెద్ద అంతర్గత ముప్పు" అని, మావోయిస్టు ఉద్యమాన్ని అడ్డుకోవడమే ప్రభుత్వం ముందున్న ప్రధాన కర్తవ్యమని ప్రకటించాడు. పార్టీని బోల్షెవీకరించడం, ప్రజాయుద్ధాన్ని తీవ్రతరం చేయడం, పెద్ద ఎత్తున విప్లవ యుద్ధంలోకి ప్రజల్ని కదిలించడం ద్వారా ఈ తాజా విప్లవ ప్రతీఘాతుక దాడిని ఎదుర్కోవడానికి పార్టీని సంసిద్ధం చేస్తున్నాం.

**ఎం.ఐ.బి : ఆపరేషన్ గ్రీన్‌హంట్ మూడవ దశ ప్రారంభమైంది. దీనిని ఎదుర్కొనేందుకు పార్టీ ఎలా సిద్ధపడుతుంది?**

**జి.పి :** 2009-మధ్య కాలంలో 2వ సారి పదవిలోకొచ్చిన కాంగ్రెస్ నాయకత్వంలోని యు.పి.ఎ-2 ప్రభుత్వం మొదట చేపట్టిన పనుల్లో ఒకటి, ఆపరేషన్ గ్రీన్‌హంట్-ప్రజలపై యుద్ధంను-ప్రారంభించడం. ఇది పోరాడుతున్న మన దేశ ప్రజలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా సాగుతున్న బహుముఖీన, విప్లవ ప్రతీఘాత యుద్ధం. మోడీ నేతృత్వంలోని ఎన్.డి.ఎ ప్రభుత్వం తన ముందరి ప్రభుత్వం వైఖరినే మరింత దూకుడుగా, మరింత నిర్దాక్షిణ్యంగా కొనసాగిస్తోంది, ముందరి రెండు దశలతో పోలిస్తే ఈ గ్రీన్‌హంట్ మూడవ దశ మరింత విస్తారంగా, మరింత తీవ్రంగా ఉంది.

యు.పి.ఎ ప్రభుత్వాలు అధికారంలో ఉండగా అప్పటి ప్రతిపక్షంలో ఉన్న బి.జె.పి, మావోయిస్టు ఉద్యమాన్ని అణచివేయడానికి ఒక సమగ్ర కేంద్రీకృత విధానాన్ని రూపొందించనందుకు అధికార పక్షాన్ని విమర్శించింది. బి.జె.పి నేతృత్వంలోని ఎన్.డి.ఎ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మొత్తంగా ఎల్.ఐ.సి చట్రం కింద ఆపరేషన్ గ్రీన్‌హంట్ మూడవ దశ రూపంలో అటువంటి సమగ్ర విధానాన్నే అమలు చేస్తున్నది. నేతల తలలకు ఉదారంగా వెలలు కట్టి కొత్త లొంగుబాటు విధానాలను ప్రకటించి, ప్రజల చేతిలో శిక్షలకు గురైన విప్లవ ప్రతీఘాత శక్తులకు ఇచ్చే పరిహారాన్ని పెంచి, బూటకపు సంస్కరణలు, పౌరచర్యల కార్యక్రమాలు మొదలైన వాటిని తీవ్రంగా చేపట్టింది. యుద్ధ చర్యలకు బలగాలను చేరవేయడానికి వాయుసేనను వినియోగించడం, ఆధునిక డ్రోన్/యు.ఎ.వి టెక్నాలజీని ఉపయోగించేందుకు అమెరికా, ఇజ్రాయిల్ దేశాల సన్నిహిత సహకారాన్ని తీసుకోవడం-ఈ మూడవ దశలో చేపట్టిన కొన్ని నూతన అంశాలు. ఈ చర్యలకు తోడుగా కేంద్ర, రాష్ట్ర కమాండో బలగాల కొత్త యూనిట్‌లను ఏర్పాటు చేయడం, ఇప్పటికే ఉన్నవాటి సంఖ్యను పెంచడం, పోరాట సామర్థ్యాలను పెంచేందుకు సాయుధ బలగాల ఆధునీకీకరణ, ప్రచార సాధానాల, ఇంటలిజెన్స్ నెట్‌వర్క్‌లను, ప్రత్యేకించి మన ఉద్యమ ప్రాంతాలలో మెరుగుపరచడం, బూటకపు ఎన్‌కౌంటర్లు చేయడం, కొట్టడం, ప్రజల సొత్తును దోచుకోవడం, అరెస్టులు చేయడం, కస్టడీలో చిత్రహింసలు పెట్టడం, అత్యాచారాలు చేయడం వంటి క్రూరమైన నిర్బంధాన్ని మరింత పెంచారు. అయితే, మానసిక యుద్ధంలో భాగంగా యుద్ధక్షేత్రంలో నెలకొన్న పై పరిస్థితులకు పూర్తి భిన్నమైన చిత్రాన్ని మీడియా ద్వారా చిత్రించారు.

శతృవు దురాక్రమణ దాడికి మన సమాధానం ఆపరేషన్ గ్రీన్‌హంట్ మూడవ దశను స్పష్టంగా అర్థం చేసుకోవాల్సిన అవసరం వుంది. మధ్య, తూర్పు భారతదేశపు ఆదివాసీ ప్రజలు దీర్ఘకాలిక ప్రజాయుద్ధాన్ని పురోగమింపచేయడంలో చారిత్రక పాత్రను పోషించారు. వారు పెద్ద సంఖ్యలో ఉద్యమంలో చేరారు. తమ చెమటనూ, రక్తాన్ని ధారపోసి ఉద్యమాన్ని రక్షించుకున్నారు.

ఉద్యమ విస్తరణకు తగిన ప్రాతిపదికను నిర్మించారు. అందువల్లనే మధ్య, తూర్పు భారతదేశపు ప్రాంతాలు విప్లవోద్యమానికి దృఢమైన దుర్గాలుగా నిలిచాయి. ఈ ఆపరేషన్ గ్రీన్‌హంట్ మూడవ దశ ద్వారా శత్రువు తన ప్రయత్నాలన్నింటిని కేంద్రీకరించి వీటిని నాశనం చేయాలని చూస్తున్నాడు. తన దురాక్రమణ దాడికి పరిణామాత్మక, గుణాత్మక మార్పులు చేసి మన పార్టీని, సైన్యాన్ని, నూతనంగా ఆవిర్భవిస్తున్న నూతన ప్రజాస్వామిక అధికార అంగాలను నాశనం చేయాలని చూస్తున్నాడు. ఆ విధంగా పాత రాజ్యాన్ని, పతనమైన రాజకీయ వ్యవస్థను తిరిగి ప్రతిష్ఠించాలని చూస్తున్నాడు.

ఈ పాత, కొత్త నిర్బంధ రూపాలు మావోయిస్టు ఉద్యమానికే గురి పెట్టినప్పటికీ, వారు ఒక్క మావోయిస్టులనే టార్గెట్ చేయడం లేదు. ప్రజలపై చేస్తున్న ఈ యుద్ధం తప్పనిసరిగా మొత్తం అణగారిన ప్రజలకు విస్తరిస్తుంది. అన్ని రకాల పీడిత వర్గాలు, శ్రామికులు, రైతులు, దళితులు, ఆదివాసీలు, మత మైనారిటీలు, అణచబడ్డ జాతులు, మహిళలు తదితర సామాజిక సెక్షన్లకు చెందిన ప్రజలు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా, సాంస్కృతికంగా, న్యాయపరంగా, మిలటరీ పరంగా దాడులకు గురవుతున్నారు. ఆ విధంగా యుద్ధరంగం విస్తారమవుతుంది. బ్రాహ్మణీయ హిందూ ఫాసిస్టు సిద్ధాంతం, దేశాన్ని తెగనమ్మే మోడీ ప్రభుత్వ విధానాల మేళవింపైన శత్రు దాడిపై మనం రాజకీయంగా, మిలటరీ పరంగా ఎదురుదాడి చేయాలి.

మోడీ, రాజ్‌నాథ్‌సింగ్, జైట్లీ, వెంకయ్యనాయుడు, గడ్కరీ, లేదా ఏ ఇతర ఎన్.డి.ఎ ప్రభుత్వ ప్రతినిధి అయిన ప్రజలను మోసపుచ్చేందుకు వారు చెప్పుతున్నది ఒకటి, చేస్తున్నది పూర్తిగా వ్యతిరేకమైనది. ఈ పాలక వర్గాలు పూర్తిగా రాజ్యాంగేతర, న్యాయేతర మార్గాలను వుపయోగించి ప్రజలపై తమ దురాక్రమణ దాడిని ఎక్కువపెడుతుండటంతో, ఫాసిస్టు మోడీ ప్రభుత్వ ప్రజావ్యతిరేక వైఖరీ అంతకంతకూ బట్టబయలవుతుంది. మనం వీటి ప్రభావానికి అత్యధికంగా గురయ్యే అన్ని సెక్షన్లతో ఏకమై ఈ దాడిని దృఢంగా ఎదుర్కొని ఓడించాల్సి ఉంది. అందుకు మన విధానాలు, ఎత్తుగడలు ఎలా ఉండాలంటే–మొత్తం ప్రజాస్వామిక, ప్రగతిశీల, లౌకిక, దేశభక్తి శక్తులన్నీ కలిసి ప్రజల పక్షాన నిలిచి మోడీ అభివృద్ధి నిరోధక విధానాలను, ప్రత్యేకించి ఆపరేషన్ గ్రీన్‌హంట్ మూడవ దశను ఓడించేలా ఉండాలి. పార్లమెంటరీ 'వామపక్షాలు' కూడా ప్రజల సమస్యలను చేపట్టేందుకు శతృదాడిని తమదైన పద్ధతిలో ఎదుర్కోవాల్సిన అవసరం తోసుకొస్తోంది. లేదంటే వారు తమ ప్రాసంగికతను కోల్పోతారు. ఈ పోరాటంలో కలిసేందుకు వారు ముందుకు రావాలి. బహుముఖాలైనా ఈ శతృదాడిని తిప్పికొట్టేందుకు కలిసిరావాలని పార్టీ పిలుపునిస్తోంది.

**శత్రు దురాక్రమణ దాడికి వ్యతిరేకంగా ఏకం కండి!**

**ఉమ్మడి శత్రువుకు వ్యతిరేకంగా ఎదురుదాడి చేయండి!!** ✶

## ఎర్రజెండా ఎగరాలి

**మనలో ప్రతి ఒక్కరూ ఎర్రజెండానెగురవేయాలి. మనుషులున్న ప్రతిచోటా మన జెండా ఎగరాలి. సంస్థలు, కర్మాగారాలు, వర్క్‌షాపులు, సహకార సంఘాలు, వ్యవసాయ క్షేత్రాలలో మన జెండా తప్పక ఎగరాలి. ఆ విధంగా ప్రజారాశులను ఉత్తేజపరచాలి. జెండా ఎగురవేయటంలో వైఫల్యం ఉందటే వర్గవైఖరి హీనస్థాయిలో ఉండడమే. ఎర్రజెండా ఎగురవేయటానికి భయపడకండి. ఎక్కడెక్కడ ఎర్రజెండా ఎగురవేయాల్సి ఉందో అక్కడల్లా తప్పని సరిగా ఎగరాలి. ప్రతి కొండకొమ్మునా, ప్రతి పల్లెపల్లెనా మన జెండా ఎగరాలి. ఎర్రజెండా మనకు స్ఫూర్తిదాయని, త్యాగాలను తలపించి, వుత్తేజాన్నిచ్చే శౌర్యప్రదాయిని. ఎగిరే జెండాలు వెలిసిపోతే వెంటనే మార్చాలి. జెండా రంగు వెలసిపోయినా మార్చకుండా ఉంటే మనం మన పనిలో నిర్లక్ష్యం చూపుతున్నట్లే. అమరవీరుల త్యాగాల పట్ల కొంత నిర్లక్ష్యం ఉన్నట్లే. మనం మన వీపులు తట్టుకోవాలి. వెంటనే లేచి నిలబడాలి. ఎర్రజెండానెగురవేయాలి. మనం మనజెండా ఎగురవేయకపోతే ఇతరులు మరో రంగు జెండా ఎగురవేస్తారు.**

–కా॥ మావో

కరపత్రం

# పోలీసులారా ! జనమైత్రి పేరుతో మీరిచ్చే వితరణలు, విందులు మాకొద్దు !

# భూమి, ప్రజాస్వామ్యం కావాలి–వాటిని పోరాడి సాధించుకుంటాం !!

– మన్యంలో రాజ్యం మనకు పోలీసుల రూపంలోనే కనిపిస్తుంది. రాజ్యానికి అనేక కోరలున్నాయి. వాటిల్లో చట్టసభలు (పార్లమెంటు, అసెంబ్లీలు), కోర్టులు, చట్టాలు, పోలీసు వ్యవస్థ, కార్యనిర్వాహక వ్యవస్థ (కలెక్టరు ఇతర ఉన్నత స్థాయి అధికారులు) ముఖ్యమైనవి. ఈ వ్యవస్థలన్నీ ప్రజలను దోపిడీ, పీడనలకు గురిచేస్తూ, దళారీ నిరంకుశ బూర్జువా, భూస్వామ్య వర్గాలకు సేవచేసేవే. అందుకే ఈ వ్యవస్థలన్నీ దళారీ, నిరంకుశ బూర్జువా భూస్వామ్య వర్గాలకు కోరల్లా పని చేస్తుంటాయి. అయితే వీటిల్లో పోలీసు వ్యవస్థ ప్రధానమైన కోరలా పని చేస్తుంటుంది.

– ప్రజలు ఎక్కడైతే చైతన్యవంతులై దోపిడీ పీడనలకు వ్యతిరేకంగా తమ హక్కుల కోసం పోరాడుతుంటారో, రాజ్యం అక్కడ ప్రధానంగా పోలీసువ్యవస్థను ప్రయోగిస్తుంది. మిగిలిన వ్యవస్థలు నామమాత్రమవుతాయి. ప్రజలను మోసం చేసేందుకూ, అణచిపెట్టి వుంచేందుకు పోలీసు వ్యవస్థ అనేక అవతారాలు ఎత్తుతుంది. న్యాయవ్యవస్థ మొదలు కార్యనిర్వాహక వ్యవస్థ, చట్టసభల వరకు అన్ని వ్యవస్థలను సమన్వయిస్తూ, నాయకత్వ పాత్ర నిర్వహిస్తూ అన్ని పనులను తానే నిర్వహిస్తూ ఉంటుంది.

ప్రస్తుతం మన్యంలో ఇదే పరిస్థితి నెలకొని ఉంది. మనకు ఇక్కడ పోలీసువ్యవస్థ మినహా మిగిలిన వ్యవస్థలు ఏవి కనిపించడం లేదు. వున్నా అవి నామమాత్రంగానే ఉన్నాయి. ఇవి ఏ రూపంలో ఉన్నా వాటన్నింటి ముఖ్య కర్తవ్యం ఇక్కడి ప్రజాస్వామిక ఉద్యమాన్ని అణచివేయడమే.

ఇక నిర్దిష్టంగా పోలీసువ్యవస్థను మనం పరిశీలించినట్లైతే అది రెండుతలల విషపురుగులాగా పని చేస్తున్నది. ఒక తలతో చట్టం, శాంతి భద్రతలంటూ కల్లబొల్లి ఉపదేశాలను విరామం లేకుండా బోధిస్తున్నది. జనమైత్రి పేరుతో దుప్పట్లు, వంటపాత్రలు, గొడుగులు, ఆట వస్తువులు వంటి రకరకాల వస్తువులను ప్రజలకు వితరణ చేస్తున్నది. ఇంకా సంతలకు వస్తున్న ప్రజలకు టీలు, బిర్యానీలు ఇస్తూ తన కపట ప్రేమను వలకబోస్తున్నది. మరో తల ద్వారా మన్యం నంతా భీభత్సానికి గురిచేస్తున్నది. ప్రజల న్యాయమైన పోరాటాలను క్రూరంగా అణచివేస్తున్నది. ముఖ్యంగా కాఫీ ప్లాంటేషన్ ఆక్రమణ పోరాటంలోనూ, బాక్సైట్ గనులకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటంలోనూ పాల్గొంటున్న వేలాది మంది ప్రజలపై అక్రమ కేసులు బనాయిస్తున్నది. అరెస్టు అయిన వారిని తీవ్ర చిత్రహింసలకు గురిచేస్తున్నది. వాకపల్లి, భల్లుగూడ వంటి గ్రామాలలో మహిళలపై సామూహిక అత్యాచారాలకు పాల్పడింది. ఎందరో మన్యం యువతను బూటకపు ఎన్‌కౌంటర్లలో కాల్చి చంపుతున్నది. మన్యంలో గుట్ట, మెట్ట, చెట్టు, చేమ, మైదానం అంటూ మినహాయింపు లేకుండా ఒక్క అంగుళం వదలకుండా నిరంతరం కూంబింగ్‌లు నిర్వహిస్తూ తెల్ల భీభత్సాన్ని సృష్టిస్తున్నది.

ఈ విధానాన్ని మనం క్రర, కంద విధానం అంటున్నాము. అంటే ఒకచేత్తో మిఠాయి పెడ్తూ మరోచేత్తో కొట్టడంగా దీన్ని చూడాలి. పోలీసులు నిర్వహిస్తున్న ఈ మోసపూరిత విధానాన్ని మనం లోతుగా అర్థం చేసుకోవాలి. వాళ్ళు ఏ పద్ధతి అనుసరించినా వాళ్ళ లక్ష్యం ఒక్కటే. అది మన సంఘాన్ని, విప్లవోద్యమాన్ని సమూలంగా నిర్మూలించి ప్రజలను శాశ్వతంగా బానిసత్వంలోకి నెట్టడమే.

ఈ సందర్భంగా మనం పోలీసులు నిర్వహిస్తున్న 'జనమైత్రి' కార్యక్రమాన్ని గురించి లోతుగా ఆలోచించాల్సి ఉంది. జనమైత్రి కార్యక్రమం ద్వారా పోలీసులు మనకు దానం ఇస్తున్నట్లు ఫోజులు కొడ్తున్నారు. మనల్ని ఇతరులపై ఆధారపడే వాళ్ళుగా మలుస్తున్నారు. ఇక్కడ మనం ఆలోచించాల్సింది ఒకటుంది. మన ఆదివాసీ ప్రజానీకానికి ఎప్పుడూ ఒకరిపైన ఆధారపడిన చరిత్ర లేదు. కష్టపడే సంస్కృతి మన వారసత్వ సంపదగా ఉంది. కష్టాలకు మనమెప్పుడు వెరవలేదు. మన ఆత్మగౌరవాన్ని కాపాడుకోవడంలో తలవంచకుండా పోరాడిన చరిత్ర మనకుంది. ఈ క్రమంలోనే కోమురం భీం, బిర్సాముండా, చక్రొబిసోయి, లక్ష్మణనాయక్, అల్లూరి వంటి ఎందరో వీరయోధులు మన సమాజం నుండి వుద్భవించారు. ఇటువంటి మహోత్కృష్టమైన చరిత్ర కల్గిన మనం పోలీసుల కుట్రలకు, కుహకాలకు బలికావద్దు. వాళ్ళు మోసపూరితంగా నిర్వహిస్తున్న జనమైత్రి కార్యక్రమాలను తిప్పికొట్టాలి. మనది ఒకళ్ళపై ఆధారపడే జాతి కాదని వాళ్ళకు సూటిగా తెలియచేయాలి. మన న్యాయమైన హక్కులను పోరాడే సాధించుకుంటామని నినదించాలి. ముఖ్యంగా కాఫీ ప్లాంటేషన్, బాక్సైట్, భూమి, ప్రజాస్వామ్యం గురించి పల్లెత్తుమాట కూడా మాట్లాడని పోలీసులు జనమైత్రి వంటి మోసపూరితమైన పథకాలతో మన ముందుకు వస్తున్నారు. మరోవైపు ఆపరేషన్ గ్రీన్‌హంట్ పేరుతో మన్యంను యుద్ధభూమిగా మారుస్తున్నారు. పోలీసులు అనుసరిస్తున్న ఈ ద్వంద్వనీతిని ఎండగట్టండి.

*ప్రియమైన ప్రజలారా !*

మన ప్రజలు గొప్ప సంస్కృతిని కలిగి వున్నారు. ఇది మన పూర్వీకుల నుండి వారసత్వ సంపదగా మనకు లభించింది. భవిష్యత్ తరాలకోసం మనం ప్రకృతిని, పర్యావరణాన్ని కాపాడుకొంటూ వస్తున్నాం. మన సంస్కృతిలో శ్రమ కేంద్రబిందువుగా ఉంటూ వచ్చింది. శ్రమ ద్వారా సంపదను సృష్టిస్తున్నాం. సంపదను మనకోసమే కాకుండా సమాజం కోసం కూడా సృష్టిస్తున్నాం. మన ఆర్థికానికి 'స్వావలంబన' ఆలంబనగా వుంటూ వస్తున్నది. కానీ నేడు మనల్ని పాలిస్తున్న దళారీ నిరంకుశ బూర్జువా భూస్వామ్య వర్గాలు పార్లమెంటరీ ప్రజాస్వామ్యం ముసుగులో మనపై నిరంకుశత్వాన్ని అమలు చేస్తున్నారు. వీరు తమ ప్రభువులైన సామ్రాజ్యవాదులకు దేశ సంపదను అప్పనంగా అప్పచెప్తూ ప్రజలను

పత్రికా ప్రకటన

# బూటకపు 65వ గణతంత్ర దినోత్సవాలకు వ్యతిరేకంగా ఎ.ఒ.బి వ్యాపిత బందును విజయవంతం చేయండి! గణతంత్ర ఉత్సవాలకు ముఖ్య అతిథిగా వస్తున్న అమెరికా అధ్యక్షుడు (గత్తపెట్టుబడిదారుల ప్రతినిధి) ఒబామాకు నిరసన తెలియచేయండి !!

మన రాజ్యాంగం భారతదేశాన్ని సార్వభౌమ, ప్రజాస్వామ్య, లౌకిక, సోషలిస్టు, గణతంత్ర దేశంగా చెప్తున్నది. వాస్తవంగా గడిచిన 65సం॥రాలలో భారత రాజ్యం అనుసరించిన విధానాల వల్ల రాజ్యాంగ పీఠికలో రాసుకున్న ఈ అంశాలు అలంకార ప్రాయంగా మిగిలాయి. వాస్తవంగా దేశంలో పరిస్థితి చూసినప్పుడు అశేష పీడిత ప్రజానీకంపై దళారీ నిరంకుశ బూర్జువా, భూస్వామ్య వర్గాల నియంతృత్వమే కొనసాగున్నది. దేశం వివిధ సామ్రాజ్యవాదుల అదుపు ఆజ్ఞాలలో అర్థవలసగా దోపిడీకి గురి చేయబడుతూ వస్తున్నది.

భారత రాజ్యం 1947 నుండి కూడా లౌకిక రాజ్యంగా వ్యవహరించలేదు. కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూఏ పార్టీ అధికారంలోకీ వచ్చినప్పటకి కూడా రాజ్యం బ్రహ్మణవాద, హిందుమత అనుకూల వైఖరితోనే వ్యవహరించింది. అప్పటినుండి దేశంలో మతపరమైన దాడులు, ప్రధానంగా ముస్లీం మైనారిటీలపై సాగకుండా ఒక రోజు కూడా గడవలేదు. 1984లో కాంగ్రెస్ పాలనలో వేలాది మంది సిక్కులు ఊచకోతకు గరైనారు. బాబ్రీ మసీదు కూల్చివేత, గుజరాత్ మారణహోమం, ముజాఫర్‌నగర్ ఘాతుకం...ఇలా చెప్పుకుంటూపోతే ముస్లీం మైనారిటీల రక్తం పారనిరోజు లేదంటే అతిశయోక్తి కాదు. క్రిష్టియన్‌లపై దాడులు కూడా రోజు రోజుకు పెరుగుతున్నాయి. ఒడిశా రాష్ట్రంలో కొందమాల్ జిల్లాలో హిందూ మతోన్మాద శక్తులు క్రిష్టియన్‌లపై దాడి చేసి పెద్ద ఎత్తున ఊచకోతకు పాల్పడ్డారు. నేడు మోడి నాయకత్వంలో బి.జె.పి అధికరంలోకి వచ్చిన తరువాత భారత రాజ్యం యొక్క స్వభావం మరింత నగ్నంగా బహిర్గతమవుతున్నది. వాళ్ళు బహిరంగంగానే భారతదేశాన్ని హిందూ రాజ్యంగా ప్రకటిస్తున్నారు. హిందుత్వానికి మాత్రమే ఇక్కడ స్థానం అంటూ మైనారిటీ మతస్థులను మరింత భయోత్పాతానికి గురి చేస్తున్నారు.

భారతదేశం బలం దాని 'భిన్నత్వంలో ఏకత్వం'లోనే ఉందనీ పాలకులు చెప్తున్నారు. కానీ ఈ దేశంలో కులాల, జాతుల, సాంస్కృతిక వైవిధ్యాలు ఏమాత్రం గౌరవించబడలేదు. దళితులు అమానవీయమైన అంటరానితనానికి గురైనారు. స్వయం నిర్ణయాధికారంతో పాటు విడిపోయే హక్కు కోసం పోరాడుతున్న కాశ్మీర్, ఈశాన్య రాష్ట్రాలలో వివిధ జాతుల ప్రజలను భారత రాజ్యం అమానవీయంగా అణచివేస్తున్నది. భారత సైన్యం ఈ పీడిత జాతులపై చేస్తున్న ఆకృత్యాలకు సాధికారత కల్పిస్తూ 'సైనిక ప్రత్యేక అధికారాల చట్టాన్ని' రూపొందించారు.

మన దేశానికి సంబంధించి 'సార్వభౌమ' అనే పదానికి అర్థం లేకుండాపోయింది. 1947లో మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని మనల్ని నమ్మించారు. వాస్తవంగా అప్పటినుండి బ్రిటన్ ప్రత్యక్ష పాలన స్థానంలో వివిధ సామ్రాజ్యవాదుల పరోక్ష పాలన ప్రారంభమైంది. సామ్రాజ్యవాదులు మన శ్రమని దోపిడీ చేస్తున్నారు. మన వనరుల్ని కొల్లగొడుతున్నారు. వినిమయ సంస్కృతిని, స్వార్థపర వ్యకివాదాన్ని, పెద్ద ఎత్తున్న ప్రోత్సహిస్తున్నారు. సంపద్వంతమైన, వైవిధ్యభరితమైన మన నాగరికతను, సంస్కృతిని అవమాన పరుస్తూ వాటి స్థానంలో తమ దిగజారిన విలువలను బలవంతంగా రుద్దుతున్నారు. ఐ.ఎమ్.ఎఫ్ ప్రంపంచ బ్యాంకు, డబ్ల్యూ.టి.ఒ వంటి సంస్థల ద్వారా వినాశకరమైన ఆర్థిక విధానాలను అమలు చేస్తూ భారత ప్రజలకు నూతన బానిస సంకెళ్ళను తొడుగుతున్నారు. ఈ సారి ఒబామా భారత పర్యటన ఉద్దేశ్యం కూడా బహుళజాతి సంస్థల ఆదిపత్యాన్ని భారతదేశంపై మరింత పెంచడానికే.

---

మరింతగా బానిసత్వంలోకి నెడ్తున్నారు. దళారీలుగా వ్యవహరిస్తూ తమ బొక్కసాలు నింపుకొంటున్నారు. ముఖ్యంగా గ్లోబలీకరణ ప్రారంభమైన తరువాత మన నీరు, భూమి, అడవి, ఆత్మగౌరవాన్ని హరించివేసి మన సమాజాన్ని పూర్తిగా ధ్వంసం చేయాలని చూస్తున్నారు. జనధనయోజన, నగదు బదిలీ పథకం వంటి పథకాలతో మనల్ని బూర్జువా సమాజంలోకి లాగాలని చూస్తున్నారు. సామ్రాజ్యవాదుల మార్కెట్‌కు మనల్ని కట్టిపడేయాలని చూస్తున్నారు. ఇప్పటికే సామ్రాజ్యవాదుల మార్కెట్‌కు బందించబడ్డ మైదాన ప్రాంత రైతాంగం ఎంతటి సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారో మనం చూస్తున్నాం. రైతాంగ ఆత్మహత్యలనేవి నేడు అక్కడ నిత్యకృత్యమైనాయి. ఈ దోపిడీ వర్గాల ఆర్థిక రాజకీయ లక్ష్యాలను నెరవేర్చేందుకు పోలీసులు మన్యంలో నిర్భంధకాండను రోజురోజుకు తీవ్రతరం చేస్తున్నారు. ఈ పోలీసు వ్యవస్థ స్వతంత్ర్యమైంది కాదు. దోపిడీ పాలకవర్గాలు కుక్క అనుకుంటే పోలీసులు దాని తోకలాంటివాళ్ళు. కుక్క తన తోకను తన ఇష్టానికి అనుగుణంగా ఊపినట్లుగానే పాలకవర్గాలు తమ ప్రయోజనాలకనుగుణంగానే పోలీసులను వాడుకుంటారు. కిరాయి స్వభావం కలిగిన పోలీసులు ఈ దోపిడీ వర్గాలకు సేవ చేసేందుకు ఎంతటి కిరాతకానికైనా పాల్పడతారు. కనుక మనం ఈ దోపిడీ వర్గాలకు వారి సాయుధ బలగాలకు వ్యతిరేకంగా నీరు, అడవి, భూమి, ఆత్మగౌరవం, ప్రజాస్వామ్యంకోసం సాయుధం కావాలి !

ఆదివాసి విప్లవ రైతుకూలీ సంఘం

పెదబయలు ఏరియా

★

ఇక ఈ రాజ్యం స్వభావాన్ని 'ప్రజాస్వామ్యం' అనడం అత్యంత హాస్యాస్పదమైన విషయం. ఈ రోజు భారతదేశంలో గ్రామీణ ప్రాంతంలో భూస్వాముల పరిపాలన ప్రత్యక్షంగా కొనసాగుతున్నది. విశాల రైతాంగం శ్రమను అమ్ముకుంటూ లేదా చిన్న మడిచెక్కలలో కాళ్ళీడ్చుకు తిరుగుతూ దుర్భర జీవితాలను వెళ్ళదీస్తున్నారు. కొద్దిమంది భూస్వాముల చేతుల్లో వందల, వేల ఎకరాల భూమి ములుగుతూ ఉంది. దళితులపై అమానవీయమైన అంటరానితనం కొనసాగుతున్నది. మహిళలు అసహ్యకరమైన ఆచారాల మధ్య మగ్గుతున్నారు. ఆదివాసీలు వుపేక్షకు గురి అవుతున్నారు. ఈ దేశంలో భూస్వామ్య విధానం కులవ్యవస్థతో విడదీయరాని సంబంధాన్ని కలిగి ఉంది. మనచుట్టూ సంకేతికత ఎంతగా పెరిగినప్పటికీ సంకుచిత సాంప్రదాయ సంకెళ్ళు ప్రజలను బలంగానే బంధించి ఉన్నాయి. అయితే ఈ దేశంలో ఉన్న నిరంకుశ భూస్వామ్య వ్యవస్థకు, దాని రాజ్యానికి 'పార్లమెంటరీ ప్రజాస్వామ్యం' అనే ముసుగును కప్పి ఈదేశ పాలకవర్గాలు ప్రజలను మోసం చేస్తున్నాయి. వాస్తవంగా ప్రజలకు ఈ దేశంలో 'ఓట్ల డబ్బాలో ఓట్లు వేయడం' మినహా నిజమైన ప్రజాస్వామ్యం లేదు. ఉన్నదలా దళారీ నిరంకుశ బూర్జువా, భూస్వామ్య వర్గాల నియంతృత్వమే.

1991 నుండి పాలకవర్గాలు మన రాజ్యాంగం పీఠికలో 'సోషలిజం' అనే పదాన్ని రాసుకొన్నామన్న విషయాన్ని మరిచిపోయారు. ప్రజల జ్ఞాపకాలలో కూడా లేకుండా చేస్తున్నారు. దాని ఫలితంగానే నేడు దేశంలో కొద్దిమంది దనాఢ్యులు ఒక వైపునా తమ సంపదను ఇబ్బడిముబ్బడిగా పెంచుకుంటుంటే రోజుకు కనీసం 20రూ॥లు సంపాదన లేని ప్రజలు 60% కి పైగా ఉన్నారనే సత్యం, రాజ్యంగం చెప్తున్న సోషలిజం బండారాన్ని బహిర్గతం చేస్తున్నది.

పై వాస్తవాలు ఈ దేశ రాజ్యాంగం బోలుతనాన్ని తెలియజేస్తున్నాయి. భారత దోపిడీ పాలకవర్గాలు విదేశీ ప్రయోజనాలను, సామ్రాజ్యవాదుల ప్రయోజనాలను నెరవేర్చేందుకు రాజ్యాంగాన్ని ఒక సాధనంగా చేసుకున్నాయి. అవి వలసవాద పాలకుల కమీషన్ ఏజెంట్లుగానే పుట్టాయి. తమ పెరుగుదల కోసం అన్ని కోణాలలోనూ అవి వారిపై ఎప్పటికీ ఆధారపడ్డాయి. ఈ పరాధీనతలపైనే అవి వర్ధిల్లుతాయి. అవి మన దేశాన్ని, దేశ ప్రజలను, వనరులను, విదేశీ దోపిడీ దారులకు తెగనమ్ముతాయి. అవి ఎంతగా అధునిక టెక్నాలజీని వినియోగించుకున్నప్పటికీ ప్రధానంగా బ్రహ్మణవాద ఫ్యూడల్ విలువలను నిలిపి ఉంచుతాయి. ఈ సత్యాలనే నేడు మనం దేశంలో చూస్తున్నాం. మోడి అధికారంలోకి వచ్చిన తరువాత దేశంలో అర్ధవలస, అర్ధభూస్వామ్య వ్యవస్థను దృఢంగా నిలబెడుతూ సామ్రాజ్యవాదులకు సేవచేసేందుకు చాంపియన్‌గా ముందుకు వస్తున్నాడు. నేడు సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న సామ్రాజ్యవాదులకు మోడి నమ్మకమైన ఏజెంటుగా వ్యవహరిస్తున్నాడు. దేశాన్ని సామ్రాజ్యవాదులకు మరింతగా పరాధీనం చేస్తున్నాడు. ఈ వినాశకరమైన విధానాలను వ్యతిరేకిస్తున్న ప్రజాస్వామిక వాదులపైనా, పర్యావరణ వాదులపైనా, విప్లవోద్యమంపైన తీవ్రమైన అణచివేతకు పూనుకుంటున్నాడు. ముఖ్యంగా హిందూమతోన్మాతద శక్తులను సంఘటిత పరుస్తూ ప్రజలపై ఫాసిస్టు దాడికి సన్నాహాలు చేస్తున్నాడు. రాజ్యాన్ని మరింతగా పటిష్టీకరిస్తున్నాడు.

### *ఒబామా భారత్‌కు ఎందుకు వస్తున్నట్లు?*

పై నేపథ్యంలోనే మన దేశానికి ఒబామా రాకను చూడాలి. ఒబామాను పీడితులైన నల్లజాతి (నిగ్రో) ప్రతినిధిగా చూడరాదు. ఒబామా అమెరికాలో రిపబ్లికన్ పార్టీ నేతగా అక్కడి గుత్త పెట్టుబడిదారుల ప్రయోజనాలను నెరవేరుస్తున్నాడు. అమెరికాలో బుష్ నేతృత్వంలోని కన్సర్వేటివ్ పార్టీ అధికారం నుండి దిగిపోయిన తర్వాత నూతనంగా అధికారంలోకి వచ్చిన ఒబామా పాత విధానాలనే శక్తివంతంగా అమలు చేస్తున్నాడు. ప్రపంచంపై అమెరికన్ ఆధిపత్యాన్ని నిలబెట్టేందుకు వివిధ జాతులపైనా, దేశాలపైనా ఆక్రమణపూరిత యుద్ధాలను కొనసాగిస్తున్నాడు. ఆఫ్ఘనిస్తాన్, ఇరాక్, లిబియా దేశాలలో తమ సంకీర్ణ సాయుధ బలగాలైన నాటో (ఎన్.ఎ.టి.ఒ) బలగాలతో దాడులు కొనసాగిస్తున్నాడు. జాత్యాహంకార పూరిత జియోనిస్టు ఇజ్రాయిల్‌కు సైనిక సహకారం అందిస్తూ పాలస్తీనపై నిరంతరం సైనిక దాడులు కొనసాగిస్తున్నాడు. ఇంకా ప్రపంచ వ్యాపితంగా అమెరికన్ గుత్తపెట్టుబడిదారుల మార్కెట్లను పెంచేందుకు అనేక దేశాలలో ఆర్థిక, రాజకీయ, సైనిక జోక్యాన్ని పెంచుతున్నాడు. మరోవైపు అమెరికన్ సామ్రాజ్యవాదుల నేతృత్వంలో, భారత దోపిడీ పాలకవర్గాల ఆశీర్వాదంతో అధికారంలోకి వచ్చిన మోడి భారతదేశ సర్వ సంపదలనూ, మానవ వనరులను అమెరికన్ బహూళజాతి సంస్థలకు సమర్పించేందుకు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్నాడు. జనవరి 26 రిపబ్లిక్ దినోత్సవం వారికి కలిసి వచ్చింది. మోడి ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ఒబామాకు బ్రహ్మాండమైన ఆహ్వానాన్ని పలుకుతున్నాడు. బ్రహ్మరథం పడుతున్నాడు. ఈ కలయిక భారతదేశాన్ని మరింత ప్రమాదంలోకి నెడుతుంది. ద్వైపాక్షిక సంబంధాల పేరిట, వ్యూహాత్మక నిర్ణయాల పేరిట భారతదేశంపై అమెరికన్ సామ్రాజ్యవాదుల పట్టు మరింత పెంచుతారు. భారతదేశ వనరులను అమెరికన్ గుత్తపెట్టుబడిదారి సంస్థలు దోచుకొనే విధంగా అవమాన కరమైన ఒప్పందాలు జరుగుతాయి. అమెరికా ప్రపంచాధిపత్య వ్యూహంలో భాగంగా దక్షిణ ఆసియాలో భారతదేశాన్ని అమెరికా ఉపగ్రహంగా మార్చేందుకు సన్నాహాలు జరుగుతాయి. ఇప్పటికే దక్షిణాసియాలో పెద్దన్న పాత్ర పోషిస్తున్న భారతదేశాన్ని చైనాకు పోటీకి నిలబెట్టేందకు అమెరికా ప్రయత్నిస్తుంది. ఈ విషయాలన్నింటిని దృష్టిలో పెట్టుకున్నప్పుడు, అమెరికా అధ్యక్ష్యుడు ఒబామా భారత పర్యటనను ప్రజలు, ప్రజాస్వామిక వాదులు, మేధావులు తీవ్రంగా వ్యతిరేకించాలి. భారతదేశాన్ని నిజమైన సర్వసత్తాక, ప్రజాస్వామిక, లౌకిక, గణతంత్ర రాజ్యంగా మలుచుకునేందకు ఈ దోపిడీ పాలకవర్గాలకు వ్యతిరేకంగా జరుగుతున్న నూతన ప్రజాస్వామిక విప్లవంలోకి సమీకృతులు కావాలని ప్రజలకు, ప్రజాస్వామిక వాదులకు, మేధావులకు విజ్ఞప్తి చేస్తున్నాం.

**అధికార ప్రతినిధి**

**సి.పి.ఐ (మావోయిస్టు)**

**ఎ.ఒ.బి–ఎస్.జడ్.సి**

★

పత్రికా ప్రకటన

## కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరశిస్తూ ఫిబ్రవరి 20న ఎ.ఒ.బి వ్యాపితంగా తలపెట్టిన బందును విజయవంతం చేయండి !

## 'అభివృద్ధి' పేరుతో సామ్రాజ్యవాదుల బందిపోటు దోపిడీకి రెడ్ కార్పేట్ పరుస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దళారీ విధానాలను ఖండించండి !

## బాక్సైట్ తవ్వకాలను, పోలవరం డ్యాం నిర్మాణాన్ని క్రియాశీలకంగా అడ్డుకోండి !!

కేంద్రంలో మోడీ నేతృత్వంలోని బి.జె.పి అధికారంలోకి వచ్చిన తరువాత నయా ఉదారవాద విధానాలు వేగం అందుకున్నాయి. మోడీ అనుసరిస్తున్న ఉదారవాద విధానాలు మన్‌మోహన్‌సింగ్ (యు.పి.ఎ-2) ప్రభుత్వం అనుసరించిన విధానాల కొనసాగింపే. అయితే మన్‌మోహన్‌సింగ్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేకత ముందు చతికిలపడింది. సంస్కరణలను చురుగ్గా కొనసాగించలేకపోయింది. ఈ నేపథ్యంలో సామ్రాజ్యవాదులు వారి తైనాతీలైన భారత పాలకవర్గాలు 16న లోక్‌సభ ఎన్నికలలో పెద్ద ఎత్తున డబ్బులు వెదజల్లి మోడి నేతృత్వంలోని బి.జె.పిని అధికారంలోకి తెచ్చారు. సంఘపరివార్ శక్తులు (ఆర్.ఎస్.ఎస్, విశ్వహిందుపరిషత్, భజరంగదళ్ వంటివి) మోడిని అధికారంలోకి తెచ్చేందుకు ముందునుండే ముజఫర్‌నగర్, షామిలి, అస్సాంలలో మైనారిటీలపై దాడులు కొనసాగించి హిందువుల ఓట్లను కొల్లగొట్టేందుకు పకడ్బంది వ్యూహాన్ని రూపొందించాయి. ఎన్నికల వ్యూహాన్ని రూపొందించడమే కాకుండా ముందుండి అమలు జరిపాయి.

సామ్రాజ్యవాదుల వారి తైనాతీలైన భారత పాలకవర్గాల మానస పుత్రుడైన మోడీ అధికారంలోకి వచ్చిన తరువాత, వారి అంచనాలకు అనుగుణంగానే నయాఉదారవాద విధానాలను ఉరకలు పెట్టిస్తున్నాడు. తాను అనుసరిస్తున్న ఈ విధానాలన్ని దేశాన్ని అగ్రశక్తిగా నిలబెడ్తాయని ప్రజల్ని భ్రమల్లో ముంచెత్తుతున్నాడు. మోడి ఆడుతున్న ఈ నాటకానికి కార్పోరేట్ మీడియా బ్రహ్మరథం పడుతున్నది. మరోవైపు మోడి తన ప్రయత్నాలను అడ్డుకునే విప్లవ శక్తులను, ప్రజాస్వామిక వాదులను, పర్యావరణవాదులను నిరంకుశంగా అణచివేసేందుకు ఫాసిస్టు తరహా పాలనకు పటిష్టమైన పునాదులు వేస్తున్నాడు. ముఖ్యంగా 'దేశభక్తి' ముసుగులో జాతీయోన్మాదాన్ని రెచ్చగొడ్తూ ఉద్రేకపూరితమైన ఉపన్యాసాలు ఇస్తూ, యువతను దేశం ఎదుర్కొంటున్న సమస్యల గురించి ఆలోచించకుండా పక్కదారి పట్టిస్తున్నాడు. వారిని తాను నిర్మించబోయే 'ఉజ్వల భారతదేశానికి' గుడ్డి మద్దతు దారులుగా తయారు చేసి తన ప్రయత్నాలను అడ్డుకొనే విప్లవ, ప్రజాస్వామిక, పర్యావరణ శక్తులపై దాడులు నిర్వహించే ఫాసిస్టు శక్తిగా రూపొందించేందుకు పథకాలు రచిస్తున్నాడు. పైకి కనిపించే ఈ 'జాతీయోన్మాదం' సారాంశంలో 'హిందుమతోన్మాదమే. అయితే కుల వివక్షత, అంటరానితనం వంటి అమానవీయమైన లక్షణాలు కలిగిన బ్రాహ్మణవాద హిందుమతోన్మాదం ద్వారా ప్రజలను ఐక్యం చేయడం కష్టం కనుక, వారి ప్రధాన ఎజెండ అంశమైన హిందుమతోన్మాదాన్ని చాపకింద నీరులాగా ప్రవేశపెట్టేందుకు ప్రయత్నిస్తున్నాడు. మోడి తన విదేశీ పర్యటన సందర్భంగా ఇతర దేశాధిపతులకు భగవద్గీతను కానుకగా ఇస్తున్నాడు. కేంద్రమంత్రి సుష్మాస్వరాజ్ ఏకంగా భగవద్గీతను 'జాతీయగ్రంథం'గా గుర్తించాలని ప్రకటించింది. మరో మంత్రి జ్యోతిసాధ్వి రాముని సంతానమైతేనే బి.జె.పికి ఓట్లు వేస్తారనీ, అక్రమసంతానం వేయరని వివాదస్పద వ్యాఖ్యాలు చేసింది. అర్.ఎస్.ఎస్ అధినేత మోహన్‌భగవత్ దేశాన్ని హిందురాజ్యంగా మార్చాలని బహిరంగంగా ప్రకటించాడు. ఈ వ్యాఖ్యాలు అడపదడప వ్యక్తమవుతున్నప్పటికీ వారి అసలు ఉద్దేశాన్ని బహిర్గతపరుస్తున్నాయి.

గడిచిన 10 నెలల కాలంలో మోడి 'అభివృద్ధి' పేరుతో చేసిందల్లా 'మేక్ ఇన్ ఇండియా' పేరుతో విదేశీ పెట్టుబడులను ఆహ్వానించడమే. సామ్రాజ్యవాదుల ద్రవ్యపెట్టుబడికి ఆటంకాలు లేకుండా చేయడమే. ఇందుకనుగుణంగా పర్యావరణ చట్టాలనూ, కార్మిక చట్టాలను నీరు కారుస్తున్నాడు. రైల్వేలు, రక్షణ, భీమ రంగాలను ప్రైవేటీకరిస్తున్నాడు. లాభాల బాటలో నడుస్తున్న ప్రభుత్వరంగ సంస్థలైన కోల్ ఇండియా, ఓ.ఎన్.జి.సి, ఎన్.హెచ్.పి.సిలలో ప్రభుత్వ వాటాలను కారుచౌకగా కార్పోరేట్ సంస్థలకు విక్రయిస్తున్నాడు. ఎన్నికలకు ముందు వందరోజులలో నల్లధనాన్ని దేశానికి రప్పిస్తానని ప్రగల్భాలు పలికి నేడు చేతులెత్తేసాడు. మాటలలో ప్రజలకు ప్రథమ సేవకుడినని చెప్పుకొంటూ సామ్రాజ్యవాదులకు నిరంకుశ దళారీ బూర్జువా, భూస్వామ్య శక్తులకు ప్రథమ సేవకుడిగా నిరూపించుకొన్నాడు. ముఖ్యంగా విదేశీ, దేశీయ కార్పోరేట్ శక్తుల ప్రయోజనాలను నెరవేర్చేందుకు రూపొందిస్తున్న విధానాలను చట్టరూపంలో తెచ్చేందుకు రాజ్యసభలో మేజారిటి లేకపోవడంతో ఏర్పడుతున్న అవరోధాలను అధిగమించేందుకు ఆర్డినెన్స్‌లు తెస్తున్నాడు. గడిచిన 6నెలల కాలంలో దోపిడీ శక్తులకు అనుకూలంగా 8 ఆర్డినెన్స్‌లు తెచ్చి తనది నిరంకుశపాలన అని నిరూపించుకొన్నాడు. మరోవైపు దేశ ప్రజలపై ప్రేమను ఒలకబోస్తూ స్వచ్ఛభారత్, మరుగుదొడ్ల పథకం, జనధనయోజన్ వంటి పథకాలను ప్రవేశపెడ్తున్నాడు. అసలు దేశాన్ని కాలూష్యపూరితంగానూ, మురికి కూపంగానూ, మార్చిన విదేశీ, దేశీయ సంస్థలపై గానీ, ప్రజలకు విద్య, వైద్యం, త్రాగునీరు, సాగునీరు, మరుగుదొడ్లు, వంటి కనీస సౌకర్యాలు లేకుండా దశాబ్దాలుగా నిర్లక్ష్యం చేసిన పాలకవర్గాలను గాని కించిత్

విమర్శించకుండా గొప్పసంస్కర్తలాగా ఫోజులు కొడ్తున్నాడు.

ఇక ఆంధ్రప్రదేశ్, ఒడిశా ముఖ్యమంత్రులైన చంద్రబాబు, నవీన్‌పట్నాయక్‌లు 'అతని కంటే ఘనుడు ఆచంట మల్లన్న' అన్న తీరులో మోడిని మించి సామ్రాజ్యవాదులకు నమ్మిన బంట్లులా వ్యవహరిస్తున్నారు. వీరిద్దరు విదేశీ పెట్టుబడుల కోసం 'కాలికి బలపం' కట్టుకొని తిరుగుతున్నారు. చంద్రబాబు ఏకంగా రాష్ట్ర రాజధాని నిర్మాణం కోసం సింగాపూర్ పెట్టుబడిదారులను ఆహ్వానించాడు. వందల ఎకరాలు అవసరమున్న రాజధాని కోసం 33 వేల ఎకరాలు అవసరమని ప్రకటించి గుంటూరు, మంగళగిరి, విజయవాడ పరిసరాలలోని మూడు పంటలు పండే ప్రాంతాన్ని 'పూలింగ్' పేరుతో రైతులనుండి బలవంతంగా స్వాధీనం చేసుకొంటున్నాడు. ఇట్లా స్వాధీనం చేసుకున్న మేజారిటి వ్యాపారం భూమిని రియల్ ఎస్టేట్ బిజి ద్వారా తాను, తన పరివారం వేల కోట్లు సంపాదించుకునే పథకాన్ని రూపొందించాడు. మరోపైపు పి.సి.పి.టి.ఆర్ (పెట్రో కారిడర్ పెట్రో ఇన్‌వెస్ట్‌మెంట్ రీజియన్) పేరుతో విశాఖ, కాకినాడ మధ్య గల లక్ష ఎకరాల భూమిని రైతుల నుండి చంద్రబాబు ప్రభుత్వం స్వాధీనం చేసుకొంటున్నది. ఇప్పటికే 91 వేల ఎకరాల భూమిని స్వాధీనం చేసుకున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇక్కడ ఏర్పాటు చేయబోయే పెట్రో కెమికల్ పరిశ్రమల వలన సముద్రతీరం కాలుష్యానికి గురి అవుతుందని మత్స్యకారులు ఆందోళన పడుతున్నా, వేల సంవత్సరాలుగా తమ జీవనంకై ఆధారపడుతున్న భూమి తమ చేతుల నుండి జారిపోవడాన్ని రైతాంగం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నా చంద్రబాబు మాత్రం ప్రజలపై పోలీసులను, గూండాలను పురిగొల్పి నిరంకుశ పద్ధతులలో భూములను స్వాధీనం చేసుకుంటున్నాడు. తమ యజమానులైన సామ్రాజ్యవాదుల, దేశీయ కార్పోరేట్ శక్తుల ప్రయోజనాలను నెరవేర్చడంలో చాంపియన్‌లా వ్యవహరిస్తున్నాడు. ఇంకా పారిశ్రామిక పార్కులు, థర్మల్ ప్లాంట్లు , గనులు, ఎక్స్‌ప్రెస్ హైవేలు, కోస్టల్ కారిడార్లు, పెట్రో కారిడర్ల పేరుతో లక్షలాది ఎకరాల భూమిని ఆదివాసీలు, రైతాంగం, పట్టణ, పేద మధ్య తరగతి ప్రజల నుండి బలవంతంగా గుంజుకొని కారుచౌకగా బహుళజాతి సంస్థలకు, దళారీ నిరంకుశ బూర్జువా వర్గానికి అప్పనంగా అప్పచెపుతున్నాడు. లక్షలాది మంది ఆదివాసీలను, రైతాంగాన్ని, పట్టణ పేద మధ్యతరగతి ప్రజలను నిర్వాసితుల్ని చేసి వాళ్ళ జీవితాలను అంధకారంలోకి నెడ్తున్నాడు. ఇక ఒడిశా ముఖ్యమంత్రి నవీన్‌పట్నాయక్ సామ్రాజ్యవాదులకు దళారీగా వ్యవహరించడంలో అందరికంటే ముందున్నాడు. ప్రకృతి వనరులు దండిగా ఉన్న ఒడిశా రాష్ట్రాన్ని సామ్రాజ్యవాదుల దోపిడీకి ఒక నిలయంగా మార్చాడు. ఇప్పటికే కళింగనగర్‌లో టాటాలు నిర్మించతలపెట్టిన ఉక్కు పరిశ్రమను అడ్డుకొన్న ఆదివాసీలపై తన పోలీసుల ద్వారా కాల్పులు జరిపించి 9 మందిని హత్య గావించాడు. పోస్కో ఉక్కు పరిశ్రమను వ్యతిరేకిస్తున్న ప్రజలపై తీవ్రమైన దమనకాండను అమలు జరుపుతున్నాడు. మాలి, దేవమాలి, నియమగిరి పర్వతాలపై బాక్సైట్ గనులు తవ్వి అక్కడి ఆదివాసీ ప్రజలను విస్తాపితుల్ని చేసే ప్రయత్నాన్ని అక్కడి ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ప్రభుత్వ నిర్బంధాన్ని ఎదుర్కొంటున్నారు.

*ప్రియమైన ప్రజలారా !*

సామ్రాజ్యవాదం తీవ్రమైన ద్రవ్య, ఆర్థిక సంక్షోభంలో వుంది. అది సంక్షోభంలో నుండి బయట పడేందుకు వెనకబడిన దేశాలలోని ప్రకృతి వనరులతో పాటు శ్రమశక్తిని చౌకగా కొల్లగొట్టేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నది. దానికి ఇంతకన్న ప్రత్యామ్నాయం లేదు. ఈ పరిస్థితికి అనుగుణంగానే మన దేశంలో దళారీ పాలకవర్గాలు (దళారీ నిరంకుశ బూర్జువా, భూస్వాములు) 'అభివృద్ధి' పేరుతో సామ్రాజ్యవాదులకు రెడ్‌కార్పేట్ (ఎర్ర తివాచీ) పరుస్తున్నారు. విదేశీ పెట్టుబడులను పెద్ద ఎత్తున ఆహ్వానిస్తున్నారు. విదేశీ పెట్టుబడులకు లాభాలు చేకూర్చే పలు ఖనిజ నిక్షేపాలు, సముద్రతీరం, చౌక శ్రమశక్తి ( దేశ జనాభాలో 60 శాతం 35 సంవత్సరాల లోపు యువత ఉంది ) భారతదేశంలో వున్నాయని ప్రకటిస్తున్నారు. అయితే 1947 నుండే ఈ దళారీ పాలకవర్గాలు సామ్రాజ్యవాదుల ప్రయోజనాలను కాపాడుకుంటూ వస్తున్నారు. వీరు సామ్రాజ్యవాదానికి సాంఘిక పునాదిగా ఉన్నారు. వీరు 1947 నుండి అధికారంలో ఉంటూ సామ్రాజ్యవాదుల పరోక్షపాలన, దోపిడీ ఆజమాయిషీలను దేశంలో అమలు అయ్యేలా దళారీ పాత్ర నిర్వహిస్తూ వస్తున్నారు. 1990 ల తర్వాత సామ్రాజ్యవాదుల నయావలస దోపిడీ మరింత తీవ్రతరమయ్యింది. ఈ దోపిడీ దేశంలో 'సంస్కరణలు' నయా ఉదారవాద విధానాలైన 'ఎల్.పి.జి' పేర్లతో కొనసాగుతున్నది. ఈ 25ఏళ్ళ కాలంలో దేశం "అభివృద్ధి" చెందిందనీ, జి.డి.పి ముందెన్నడు లేని స్థాయికి చేరిందనీ, మన్‌మోహన్ ప్రభుత్వ వైఫల్యం వల్లనే ప్రస్తుతం కొంత వెనకబడిందనీ కాకి లెక్కలు చూపుతూ ప్రస్తుతం రెండవ తరం సంస్కరణలు అమలు జరిపి దేశాన్ని 'ఉజ్వల భారత్' గా మలుస్తామని మోడి ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటిస్తున్నది.

వాస్తవంగా ఈ 25 ఏళ్ళ కాలంలో దేశం అభివృద్ధి చెందిందా? మరింత విధ్వంసం అయిందా? అనే విషయాన్ని లోతుగా పరిశీలిస్తే అర్థమవుతుంది. దేశంలో మిట్టల్‌లు, జిందాలు, అంబానీలు, టాటాలు, బిర్లాలు, రూయాలు, ఇన్ఫోసిస్ నారాయణమూర్తి, జి.ఎమ్.ఆర్ లాంటి వాళ్ళు మరింత సంపన్నులైతే నూటికి 77 మంది ప్రజలు రోజుకు 20 రూ॥ ఖర్చు పెట్టలేని స్థితికి చేరి దరిద్రరేఖకు దిగువకు చేరారు. మార్కెట్ శక్తుల చేతుల్లో వ్యవసాయం, చేనేతరంగం విధ్వంసం అయ్యింది.

బహుళ జాతి సంస్థలు ప్రవేశంతో స్థానిక పరిశ్రమలు కూనరిల్లాయి. ఉపాధి పెరగకపోగా నిరుద్యోగాలు పెరిగాయి. యు.పి.ఎ 2వ పాలన అంతమయ్యే నాటికే దేశ వ్యాపితంగా 10 కోట్ల మంది నిరుద్యోగులు ఉన్నారని ప్రభుత్వ లెక్కలు చెప్తున్నాయి. ప్రస్తుతం చదువులు అయిపోయి మరో 5కోట్ల మంది జీవితంలోకి ప్రవేశిస్తున్నారు. వీరితో కలుపుకుంటే నిరుద్యోగులు 15 కోట్లకు చేరుతారు. ఈ 25 ఏళ్ళ కాలంలో జరిగినన్ని అవినీతి కుంబకోణాలు ముందెన్నడు జరగలేదు. ద్రవ్యోల్బణం రెండంకెల స్థాయికి చేరి ధరలు చుక్కలనంటుతున్నాయి. అక్రమార్జితాలు నల్లధనం రూపంలో దేశ సరిహద్దులను దాటడం ఈ కాలంలో రెట్టింపయింది. సామ్రాజ్యవాదుల కనుగుణంగా రూపొందించిన సెజ్‌లు, గనులు, పరిశ్రమల వల్ల పర్యావరణం ఘోరంగా దెబ్బతిన్నది. లక్షలాది మంది శ్రమజీవులు విస్తాపితులయ్యారు. అనేక సమూహాలు వారసత్వ సంపదగా పొందిన సంస్కృతి, విజ్ఞానం, నైపుణ్యం ధ్వంసమైపోగా వారు రెక్కలు తెగిన పక్షుల్లా దిక్కుతోచని పరిస్థితులకు నెట్టబడ్డారు.

ఇక దేశం అభివృద్ధి చెందడమంటే వారి దృష్టిలో దోపిడీ వర్గాలు వారి అవసరాలు తీర్చే నిపుణులు జీవించేందుకు అవసరమైన పార్కులు, హైస్పీడ్ రైళ్ళు, ఓడరేవులు, ఎక్స్‌ప్రెస్ హైవేలు, స్మార్ట్ సిటీలు, స్మార్ట్ విలేజస్, కోస్టల్ కారిడర్లు, పెట్రో కారిడర్లు నిర్మించడమనేదే. ఈ అభివృద్ధిని మరింతగా సాధించేందుకు మోడి, చంద్రబాబు, నవీన్, చంద్రశేఖర్ రావు ఇంకా ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు పోటీ పడుతున్నారు.

వాస్తవంగా ఈ 25 ఏళ్ళ కాలంలో నయాఉదారవాద విధానాల పేరుతో దేశ అర్థిక వ్యవస్థను, రాజకీయాలను, సంస్కృతిని, రక్షణ రంగాన్ని సామ్రాజ్యవాదులు నియంత్రించడం పెరిగింది. ప్రభుత్వ కీలక విధానాలన్నింటినీ వారే నిర్ణయిస్తున్నారు. సహాయం, ఋణం పేరుతో దేశ ఆర్థిక వ్యవస్థను వారి ద్రవ్య సాలె గూటిలోకి ఇరికించారు. సలహాదారులు, నిపుణుల పేరుతో ప్రభుత్వ శాఖలపై పట్టు పెంచుకొంటున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే సామాజిక అవసరాలలో రాజ్యం ఉపసంహరణ చాలా సాధారణమైపోతుండగా మానవ కార్యకలాపాలన్నింటినీ ' సామ్రాజ్యవాద మార్కెట్' నిర్దేశిస్తున్నది.

దేశ ప్రయోజనాలకు, ప్రజల ప్రయోజనాలకు వ్యతిరేకమైన ఈ 'సోకాల్డ్ అభివృద్ధి' ని ప్రజలంతా వ్యతిరేకించాలి. ఈ దేశ దోపిడీ పాలకులైన మోడి, చంద్రబాబు, నవీన్‌పట్నాయక్, ఇతర రాష్ట్రాల నేతలు దేశంలో అర్ధ వలస, అర్ధ భూస్వామ్య వ్యవస్థను దానితో విడదీయలేనంతగా పెనవేసుకు పోయిన కుల పీడన, బ్రాహ్మణ వాదాలను కాపాడేందుకు కంకణం కట్టుకున్నవారే. సామ్రాజ్యవాదులకు సేవచేయడంలో ముందు పీఠిన నిలుచున్నవారే.

కనుక దేశంలో భూస్వాములనుండి రైతాంగ విముక్తి కోసం ప్రజాస్వామిక విప్లవాన్నీ, సామ్రాజ్యవాదుల నుండి దేశ విముక్తి కోసం జాతీయ విముక్తి యుద్ధాన్ని నిర్వహించాలి. అందుకనుగుణంగా దున్నేవారికే భూమి ప్రతిపదికగా సాయుధ వ్యవసాయ విప్లవం ఇరుసుగా కలిగిన నూతన ప్రజాస్వామిక విప్లవంలో భాగస్వాములు కావల్సిందిగా ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నాము. ముఖ్యంగా ఈ దోపిడీ పాలక వర్గాలకు వ్యతిరేకంగా ఐక్య ఉద్యమాలు నిర్వహించేందుకు కలిసి రావల్సిందిగా దళిత, ఆదివాసీ, పర్యావరణ, ప్రజాస్వామికవాదులకు విజ్ఞప్తి చేస్తున్నాము. నిర్దిష్టంగా ఎ.ఒ.బి ప్రాంతంలో కేంద్ర రాష్ట్ర పాలకవర్గాల ప్రజాస్వామిక విధానాల వలన ఉత్పన్నమైన బాక్సైట్, పోలవరం సమస్యలపై విస్తృతంగా కలిసి రావలసిందిగా కోరుతున్నాము.

**బాక్సైట్ గనులు :** మన్యంలో 90ల నుండి పాలకవర్గాలు బాక్సైట్ గనులు తవ్వాలని ప్రయత్నిస్తున్నప్పటికీ ప్రజల ప్రతిఘటనతో అది వాయిదా పడ్తు వస్తున్నది. ప్రస్తుతం అరకు, జర్రెల గ్రూపులలో ఉన్న సుమారు 5 మిలియన్ టన్నుల బాక్సైట్‌ను ప్రభుత్వం ఐ.టి.డి.ఎ ద్వారా తవ్వించి రస్ అల్ ఖైమా గ్రూపుకు అందించాలని చూస్తున్నది. ఈ మధ్య ఆగస్టు 8న యు.ఎన్.ఒ ప్రకటించిన ఆదివాసీ దినం రోజు చంద్రబాబు ఆదివాసీలనుద్దేశించి 'మీరు కొండలు దిగి రండి మిమ్మల్ని లక్షాధికారులను చేస్తానని' మాట్లాడాడు. నవంబర్ 2014లో 'ఐబాస్' ( ఇంటర్నేషనల్ బాక్సైట్ అల్యూమినా అండ్ అల్యూమినియం సొసైటి ) ఆధ్వర్యంలో విశాఖలో మూడు రోజుల పాటు సదస్సు జరిగింది. ఇందులో వేదాంత సి.ఇ.ఒ టామ్ ఆల్బనీతో పాటు దేశ విదేశాలకు చెందిన 200 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. వీరు తూర్పు కనుమల్లో పుష్కలంగా ఉన్న బాక్సైట్ నిల్వలను గుర్తిస్తూ గనుల అవసరాన్ని నొక్కి వక్కాణించారు. చంద్రబాబు ఏకంగా 100 పోలీస్ ఔట్‌పోస్టులు నిర్మించి బాక్సైట్ ఖనిజాన్ని వెలికితీస్తానని ప్రకటించాడు. బాక్సైట్ గనుల తవ్వకాలకు ప్రధాన ఆటంకంగా ఉన్న విప్లవోద్యమాన్ని దెబ్బతీసేందుకు కేంద్రంతో కలిసి దాడి తీవ్రతను పెంచేందుకు ప్రయత్నాలు చేస్తున్నాడు. అలాగే ఒడిశా రాష్ట్రం కోరాపూట్ జిల్లాలలోని మాలి, దేవమాలి, రక్తకొండ ప్రాంతాలలో బాక్సైట్ తవ్వకాలకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఆంధ్ర, ఒడిశా ప్రభుత్వాలు సామ్రాజ్యవాదుల ప్రయోజనాలకు అనుగుణంగా చేపడ్తున్న ఈ గనుల తవ్వకాలకు వ్యతిరేకంగా ప్రజలు మిలిటెంట్ ఉద్యమాలను చేపట్టి కొనసాగిస్తున్నారు. ఈ ఉద్యమాలను తీవ్రతరం చేసేందుకు ప్రజా శ్రేయోభిలాషుల్ని కలసి రావలసిందిగా ఐక్యఉద్యమంలో భాగస్వాములు కావలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం.

పోలవరం డ్యాం : ఈ డ్యాం నిర్మాణం వల్ల ఎ.పిలో ఖమ్మం, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని 9 మండలాలలో 276 గ్రామాలు ముంపుకు గురి అవుతున్నాయి. 1,20,000 మంది ప్రజలు నిర్వాసితులవుతున్నారు. ఒడిశా రాష్ట్రం మల్కనగిరి జిల్లాలో 25 గ్రామాలు మునిగిపోతాయి. చతీస్‌ఘడ్ రాష్ట్రంలో మరికొన్ని గ్రామాలు మునిగిపోతున్నాయి. ఈ సందర్భంగా నిర్వాసితులయ్యే ప్రజలంతా ఆదివాసీలే. ఇప్పటికే దేశంలో 'అభివృద్ధి' పేరుతో పాలకవర్గాలు చేసిన నిర్వాకం వల్ల నిర్వాసితులైన వారిలో 40 శాతం ఆదివాసీలున్నారు. ఈ సారి కూడా ఆదివాసీల హక్కులను, వారి రక్షణ కోసం రూపొందించిన చట్టాలను ఏ మాత్రం పట్టించుకోకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యుద్ధ ప్రాతిపదికన పోలవరం డ్యాం నిర్మాణానికి పూనుకున్నారు. ఈ ప్రాజెక్టు ప్రధానంగా కోస్టల్ కారిడార్‌లో నిర్మించే సెజ్‌లు, సాఫ్ట్‌వేర్ సోర్స్‌లకు అవసరమైన నీటిని అందించేందుకు నిర్మిస్తున్నారు. పాలకవర్గాలు వేలాదిమంది ఆదివాసీల జీవితాలను నిర్లక్ష్యం చేసి పోలవరం డ్యాం నిర్మించడాన్ని వ్యతిరేకిద్దాం. ఈ పోరాటాన్ని కూడా ఐక్యఉద్యమంగా నిర్మించేందుకు ప్రజాశ్రేయోభిలాషులందరిని కలిసి రావలసిందిగా కోరుతున్నాం. ఈసందర్భంగానే ఫిబ్రవరి 20న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఎ.ఒ.బి వ్యాపితంగా మావోయిస్టు పార్టీ తలపెట్టిన 'బంద్' కార్యక్రమాన్ని విజయవంతం చేయవల్సిందిగా ప్రజాస్వామిక వాదులకు, అన్ని సెక్షన్ల ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నాం.

**అధికార ప్రతినిధి**

**ఎ.ఒ.బి స్పెషల్ జోనల్ కమిటీ**

**సి.పి.ఐ. మావోయిస్టు**

★

## సి.ఎల్.సి నిజనిర్ధారణ రిపోర్టులు-వివిధ దినపత్రికలలో సంక్షిప్తంగా ప్రచురితమైనవి

# ప్రజాఉద్యమాల అణచివేతలో భాగమే విశాఖ ఎస్.పి తప్పుడు ప్రచారం

విశాఖ ఏజెన్సీ చింతపల్లి మండలం బలపం పంచాయితీలో గత 19వ తేదీ అక్టోబర్ 2014 న ఇన్‌ఫార్మర్ హత్య, ఇద్దరు మావోయిస్టులను  ఆదివాసీలు చంపిన సంఘటనపై పౌరహక్కుల సంఘం రాష్ట్రకమిటీ తేదీ 11-1-2015న నిజనిర్ధాణ కమిటీగా ఏర్పడి చింతపల్లి మండలం బలపం గ్రామపంచాయితీలోని వీరవరం గ్రామాన్ని సందర్శించినది. గెమ్మెల సంజీవరావు రక్త బంధువులు, గ్రామస్తులు, మావోయిస్టు (సి.పి.ఐ) పార్టీ వర్గాల నుండి సేకరించిన రిపోర్టు.

ఈ నిజనిర్ధారణలో పౌరహక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వి. చిట్టిబాబు, జి. లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి చిలుకా చంద్రశేఖర్, సహాయ కార్యదర్శులు యన్. శ్రీమన్నారాయణ, వి. రఘునాథ్, యన్. నారాయణ రావులు రాష్ట్ర కమిటీ సభ్యులు గుంటి రవి, విశాఖ జిల్లా కన్వీనర్ పి.వి. రమణ మరియు సూర్యనారాయణ, అన్నపూర్ణ, జ్ఞానానందం, హైదరాబాదు కార్యవర్గ సభ్యులు నర్రా పురుషోత్తం పాల్గొన్నారు.

నిజనిర్ధారణకు వెళ్ళే మార్గంలో అంటించబడిన గోడ ప్రతులు మాకు కనిపించాయి. వాటిపై “మావోయిస్టులపై ఆదివాసీల తిరుగుబాటు'' “అంతం కాదిది ఆరంభం'' అనే ఆసక్తికర హెడ్డింగులు కలిగి ఉన్నాయి. గుమ్మిగూడిన ప్రజానీకం ఇవి పోలీసులు అంటించారని మాతో చెప్పినారు. బలపం గ్రామ పంచాయితీలో ఆదివారం సంత కావటంతో చుట్టుపక్కల గ్రామస్తులు అధిక సంఖ్యలో అక్కడే ఉన్నారు. వీరవరం గ్రామంలో మాకు జనం పలుచగా కనిపించినారు, అయితే ముఖ్యులతో మాట్లాడే అవకాశం లభించింది. తొలుత హైదరాబాదులోని విరసం నేత వరవరరావు, విశాఖలోని సి.ఎల్.సి బాధ్యుడు రాంమ్మూర్తి, అన్నపూర్ణ, రఘురాం, ఇండ్లముందు జరిగిన నిరసన ప్రదర్శనలో పాల్గొన్న ఆదివాసీలతో మాట్లాడినాము. తాము సంజీవరావు బంధువులు పిలవటం వలన ఆయా ప్రాంతాలకు వెళ్ళామనీ, వారే ఖర్చులు వగైరాలు భరించారనీ, హైదరాబాదులో సినిమా హీరోయిన్‌ని కూడా చూపించారనీ, మా చేతుల్లోని ప్లెకార్డులు, బ్యానర్లు వగైరాలు పోలీసులేయిచ్చి ఆయా ఇండ్లవద్దకు తీసుకెళ్ళి నిలబెట్టారనీ, అది మావోయిస్టు (సి.పి.ఐ) పార్టీకి వ్యతిరేకంగా అని మాకు చెప్పలేదనీ, తెలిస్తే మేము వెళ్ళేవారం కాదనీ, మీరు చెప్పేంతవరకు మమ్ములను మావోయిస్టు (సి.పి.ఐ) పార్టీపై దుష్ప్రచారానికి తీసుకెళ్ళారని మాకు తెలియదనీ, మాకు చదువు రాదని తెలిపినారు. ఈ సందర్భంగా పోలీసుల అభిప్రాయంతో వారు వ్యతిరేకించినారు. సంజీవరావు మరణాన్ని గురించి మాట్లాడుతూ ప్రతిచోట మాదిరిగానే మా ప్రాంతంలో కూడా ప్రజా ఉద్యమాలకు వ్యతిరేకంగా పోలీసులకు సమాచారం అందించేవారున్నారనీ, అన్ని చోట్ల మాదిరిగానే అటువంటి వారిపై మా ప్రాంత ప్రజలు విసిగి వేసారి భరించలేని స్థితిలో చర్యలు తీసుకున్నామనీ, 90 నుండి 100 మంది వరకు ఇప్పటి వరకు అనేక తప్పుడు కేసులలో కోర్టులు, పోలీసు స్టేషన్ల చుట్టూ, తిరుగుతున్నామనీ, అనేకసార్లు పోలీసువారి చేతుల్లో చిత్రహింసలకు గురైనామనీ, కనుక అటువంటి వారిపై చర్య తీసుకోవడంలో తప్పులేదని సంజీవరావు హత్యను సమర్ధించుకొన్నారు. అటువంటి వారిని చంపడం ప్రభుత్వం దృష్టిలో నేరమైనా మా దృష్టిలో తప్పుకాదన్నారు. అయితే మాకు బాధ కలిగించే అంశమేమిటంటే సంజీవరావు మరణానికి ప్రతీకారంగా ఇద్దరు మావోయిస్టులను చంపడం, ఇందుకు మేము బాధపడుతున్నాము. ఈ ఘటనతో మా గ్రామానికి చెడ్డ పేరు వచ్చినదని చింతిస్తున్నాము. ప్రభుత్వ కాఫీ తోటల స్వాధీనం జరుగుతున్న పోరాటంలో భాగంగానే ఈ ఘటనలు చోటుచేసుకున్నాయి. గుదలం పంచాయితీకి చెందిన సింహాచలం అనే స్వామికి గెమ్మెల సంజీవరావు ప్రధాన అనుచరుడనీ, అతనికి సంజీవరావు సన్నిహిత సంబంధాలు ఏర్పడినాయని వారు ఆరోపించారు.

జరిగిన సంఘటన పూర్వపరాలు పరిశీలించగా తేది 19-10-2015న సాయంత్రం సుమారు 2-30 గం॥ల సమయంలో మావోయిస్టు (సి.పి.ఐ) పార్టీకి చెందిన ముగ్గురు ఆ గ్రామంలో నుండి వెళ్ళే సమయంలో వారికి సంజీవరావు, సింహాచలం వారి అనుచరులు తారసపడ్డారు. ఆ సమయంలో గ్రామస్తులు కొందరు ప్రజావ్యతిరేకి సంజీవరావును ఇప్పుడు వదిలితే తిరిగి దొరకడనీ, శిక్షించడానికి కుదరదని అభ్యర్ధించారు.  ఆ అభ్యర్ధనను తోసిపుచ్చలేని దళసభ్యులు సంజీవరావును పట్టుకొని శిక్షించడం జరిగినది. దీనితో సంజీవరావు అక్కడికక్కడే మరణించినాడు. అనంతరం అక్కడే ఉన్న సంహాచలాన్ని బంధించి వీరవరం గ్రామం వైపు తీసుకొస్తుండగా సమాచారం తెలుసుకున్న సిహాచలం, సంజీవరావుల అనుచరులు, కుటుంబ సభ్యులు దళసభ్యులతో వాగ్వివాదానికి దిగినారు. వారిని సముదాయించే ప్రయత్నంలో భాగంగా ఆ దళ కమాండర్,  సభ్యులు ఎటువంటి మారణాయుధాలను ఉపయోగించదలచుకోలేదు. ఇది అదునుగా తీసుకొని దళ కమాండర్ తలపై బండరాయితో మోది ఇష్టం వచ్చినట్లు కొట్టడం జరిగినది. దాన్ని అడ్డుకున్న సభ్యున్ని కూడా కొట్టారు. అక్కడే ఉన్న సింహాచలం ప్రోత్సాహంతో పడిపోయిన దళ కమాండర్ ఆయుధాన్ని తీసుకొని ఇరువురిని అక్కడికక్కడే కాల్చిచంపారు. ఆదివాసీలపై ఆయుధాన్ని ప్రయోగించడం మంచిది కాదని వుపేక్షించటమే వారిరువురి ప్రాణాలు బలిగొన్నది. కనీసం ఆయుధాన్ని తమ రక్షణ కోసం కూడా వినియోగించుకోవాలని వారు భావించలేదు. వారి ఎదుట వున్నది ఆదివాసీలే, కనుక వారిపై ఆయుధాలని ఉపయోగించ దలచుకోలేదు.

ఈ ఘటనపై ఉద్యమకారులకు చెందిన వర్గాలకథనం ఈ విధంగా వుంది. సంజీవరావు, సంహాచలంలను అనేకసార్లు వారి పద్ధతులను మార్చుకోమన్నా వారు మార్చుకోలేదనీ, ఈ నిర్ణయానికి అందుకే రావలసి వచ్చిందనీ, వారిపై చర్య తీసుకునే పద్ధతులలో జరిగిన లోపాలవల్ల ఈ ఘటనలు రెండూ చోటు చేసుకున్నాయని, మావోయిస్టులను చంపిన ఘటనలో పాల్గొన్న వారిని గ్రామస్తులే

గ్రామబహిష్కరణ చేసారు. అందుకోసం వారు గ్రామంలోకి రావటానికి భయపడుతున్నారు. తప్పు చేసినవారు తప్పును అంగీకరిస్తూ, వుద్యమకారులకు లేఖ ద్వారా తెలియజేసినట్లూ, వారు దానిని పరిశీలిస్తున్నట్లూ, త్వరలో దానిపై ఒక నిర్ణయాన్ని తీసుకొనునట్లు తెలిసినది. కాగా ఆ లేఖలో వారు సంజీవరావును సి.పి.ఐ మావోయిస్టు పార్టీ చంపడం కూడా తొందరపాటు చర్యేనని వ్రాసినట్లు తెలిసినది.

మొత్తం ఘటనల పూర్వపరాలు ఇలా ఉండగా పోలీసులు మాత్రం ఈ ఘటనలను తమకు అనుకూలంగా, ఉద్యమకారులకు వ్యతిరేకంగా మలుచుకోవటానికి ప్రయత్నిస్తున్నారు. అందులో భాగంగానే గోడప్రతులు, కరపత్రాలు, విరసం హక్కుల నేతల ఇండ్లముందు ప్రదర్శనలు వంటి కార్యక్రమాలనూ, న్యాయమూర్తులకు, జిల్లాకలెక్టర్‌లకు అర్జీలు ఇప్పించే ప్రయత్నాలు గావిస్తున్నారు. ఈ సంఘటన ఆధారంగానే యావత్తు ఆదివాసీ ప్రజానీకం సి.పి.ఐ మావోయిస్ట పార్టీకి వ్యతిరేకంగా కదులుతున్నారని ప్రచారం చేస్తుంది. తద్వారా ఆదివాసీలకు మావోయిస్టులకు మధ్య అగాధాన్ని సృష్టించడం ద్వారా మావోయిస్టుల అనిచివేతకు ఆదివాసులను ఉపయోగించుకోవచ్చునని భావిస్తున్నది. అయితే విశాఖ జిల్లా ఎస్.పి తప్పుడు ప్రచారాన్ని నమ్మే విధంగా మాత్రం ఆదివాసీ ప్రజానీకం లేరు.

**డిమాండ్స్ :** 1. ఏజెన్సీ ప్రాంతంలో కూంబింగ్‌ను పోలీసులు వెంటనే నిలిపివేయాలి.

2. ఏజెన్సీ ప్రాంతంలోని ప్రభుత్వ భూములలోని కాఫీ తోటలన్నింటిని ఆదివాసీలకే పంపిణీ చేయాలి.

3. ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ను నిలిపివేయాలి.

4. ఆదివాసీల స్వయం ప్రతిపత్తిని గుర్తిస్తూ "జల్, జంగల్, జమీన్" లపై వారికే సర్వాధికారాలు ఉండేటట్లు చర్యలు చేపట్టాలి.

**సత్తెనపల్లి**
**తేది : 16-1-2015**

**పౌరహక్కుల సంఘం ప్రధాన కార్యదర్శి**
**(చిలుకా చంద్రశేఖర్)**

★

---

# నారింజోల పోలీసు కాల్పులపై పౌరహక్కుల సంఘం

**(పత్రికా ప్రకటన)**

ఒడిశా రాష్ట్రం, మల్కనగిరి జిల్లా, గుమ్మ బ్లాక్‌లోని చిత్రకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని 'నారింజోల' గ్రామంలో జనవరి 5న సంయుక్తంగా ఆంధ్ర, ఒడిశా పారా మిలటరీ బలగాలు సాధారణ పౌరులపై కాల్పులు జరిపి ఒకరిని హత్య చేసిన విషయమై పౌరహక్కుల సంఘం రాష్ట్ర కమిటీ నిర్వహించిన నిజనిర్ధారణ నివేదికను మీ ముందు విడుదల చేస్తున్నాము. ఈ నిజనిర్ధారణలో పాల్గొన్నవారు రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిట్టిబాబు, ప్రొఫెసర్ జి. లక్ష్మణ్‌లు, రాష్ట్ర సహాయ కార్యదర్శులు వి. రఘునాథ్, ఎన్. నారాయణరావ్‌లు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకా చంద్రశేఖర్, విశాఖ జిల్లాకు చెందిన సభ్యులు అన్నపూర్ణ, విశాఖ జిల్లా కమిటీకి చెందిన సహాయ కార్యదర్శి సూర్యనారాయణ పాల్గొన్నారు.

**జరిగిన సంఘటన వివరాలు :**

2015 జనవరి 5న ఉదయం సమారు 4గం॥లకు, బలిమెల నదిలోకి చేపల వేటకు వెళ్ళి తిరిగి వస్తున్న బుద్ర ముదాలి మరియు ఇద్దరు సంకు చలాన్, లచ్చ పలాసీలు పడవ నుండి ఒడ్డుకు దిగుతున్న సమయంలో పారా మిలటరీ బలగాలు కాల్పులు జరిపిన ఘటనలో బుద్ర ముదాలి వయస్సు 17 సం॥లు అక్కడికక్కడే చనిపోయాడు. పైన తెలిపిన మిగతా ఇద్దరు తీవ్రంగా గాయపడినారు. గాయపడిన వ్యక్తులు చనిపోయిన బుద్ర ముదాలి శవాన్ని గ్రామంలోకి తీసుకువచ్చారు. అదేరోజు సంకు చలాన్ వయస్సు 20 సం॥లు, లచ్చ పలాసీ వయస్సు 18 సం॥లు, గ్రామస్తుల సమక్షంలో పారా మిలటరీ బలగాలు వారిద్దరిని అరెస్టు చేయడం జరిగింది. ఇట్టి కాల్పులకు సంబంధించి బయట ఎక్కడైనా మాట్లాడిన తీవ్రమైన పరిణామాలు ఉంటాయని హెచ్చరించి ఆ ఇద్దరిని తీసుకువెళ్ళడం జరిగింది.

బుద్ర ముదాలి భార్య (16 సం॥లు) తో పాటు కుటుంబీకులు మరియు గ్రామపెద్దలు హత్య జరిగిన మరుసటి రోజు అనగా జనవరి 6న చిత్రకొండ పోలీస్‌స్టేషన్‌కు పిర్యాదు చేయడానికి వెలితే వారిని కూడా పోలీసు బలగాలు అదుపులోకి తీసుకొని అక్రమ నిర్భందంలో 18 రోజులు ఉంచడం జరిగింది. బుద్ర ముదాలి భార్య, తండ్రి కునా ముదాలిలను 3 రోజుల పాటు మానసిక హింసకు గురిచేసారు. కుటుంబీకులను, గ్రామపెద్దలను చిత్రకొండ మరియు మల్కనగిరి పోలీసు అధికారులు బుద్ర ముదాలి హత్య విషయంపై మీరు పిర్యాదు చేయడానికి ప్రయత్నిస్తే అందరిపై కేసులు పెట్టి జైలుకు పంపిస్తామని బెదిరించడం జరిగింది. అదే సమయంలో గ్రామస్తులు, గాయపడిన ఇద్దరిని మల్కనగిరి హాస్పిటల్‌లో పోలీస్ పహారాలో వైద్యం అందజేస్తున్నారని గ్రామస్తులు తెలియచేసారు. ఈ విషయాన్ని ఆనాటి పత్రికలు కూడా ప్రకటించాయి. 18 రోజుల తర్వాత భార్య, తండ్రిలను పోలీసులు విడుదల చేస్తూ 'కార్యం' ఖర్చు నిమిత్తం 10వేల రూపాయల నగదు ఇచ్చారు. బుద్ర ముదాలిని హత్య చేసిన పారా మిలటరీ బలగాలపై పోలీసులు ఎటువంటి కేసు నమోదు చేయలేదు. శవపంచనామ, పోస్టుమార్టంకు ఆస్కారమే లేదు. అదే విధంగా గాయపడిన సంకి చలాన్, లచ్చ పలాసీ ఈ రోజుకు కూడా పోలీసు నిర్భందంలోనే ఉన్నారు. ప్రత్యక్ష సాక్షులు అవ్వడం వల్లనే పోలీసులు పై నిర్భందానికి పాల్పడ్డారు. కూంబింగ్ ఆపరేషన్‌లో పాల్గొని, అమాయకుల చావుకు కారణమై దౌర్జన్యాలు,

బెదిరింపులకు పాల్పడుతున్న పారా మిలటరీ బలగాలపై ఇప్పటి వరకు వారిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదు.

ఆంధ్రప్రదేశ్-ఒడిశా రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్రం పారా మిలటరీ బలగాలకు విచ్చలవిడి అధికారాలు ఇవ్వడం వల్లన ఆదివాసీ జీవన విధానానికి తీవ్రమైన హక్కుల ఉల్లంఘన జరుగుతున్నది.

**డిమాండ్స్:**

1. బుద్ర ముదాలి హత్యకు పాల్పడిన ఒడిశా, ఆంధ్ర, కేంద్ర పారా మిలటరీ దళాలపై హత్యా కేసు నమోదు చేసి విచారణ జరిపించాలి.

2. ఈ హత్యకు ప్రత్యక్ష సాక్షులైనా సంకు చలాన్, లచ్చ పలాసీలను వెంటనే విడుదల చేయాలి.

3. బాధిత కుటుంబానికి 10 లక్షలు నష్ట పరిహారం, 5 ఎకరాల పొలాన్ని అందచేయాలి.

4. గాయపడిన వారికి లక్ష రూపాయల నష్ట పరిహారాన్ని అందచేయాలి.

5. ఆదివాసీ జీవన విధానంపై హక్కుల ఉల్లంఘనకు పాల్పడుతున్న ఆంధ్ర, ఒడిశా మరియు కేంద్ర పారా మిలటరీ బలగాలను తక్షణం వైదొలగించాలి.

6. ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ను వెంటనే నిలిపివేయాలి.

తేది : 22-3-2015

**పౌరహక్కుల సంఘం**
(ప్రధాన కార్యదర్శి)
చిలుక చంద్రశేఖర్

★

# చంద్రబాబు 20 హత్యలు

## పౌరహక్కుల సంఘం ఆంధ్రప్రదేశ్

ముఖ్యమంత్రి గారి స్వంత గ్రామం నారావారిపల్లె కేవలం పది కిలోమీటర్ల దూరంలోని శేషాచల అటవీ ప్రాంతం కూలీల రక్తంతో మరోసారి ఎరుపెక్కింది. తిరుమల కొండకు వెళ్ళే మరో మెట్లదారైన శ్రీవారి మెట్టు మార్గానికి రెండు కిలోమీటర్ల దూరంలో రెండు వేర్వేరు ప్రాంతాలలో 20 మంది ఎర్రచందనం కూలీలను పోలీసులు కాల్చి చంపారు. సుమారు 450 మంది ఎర్ర కూలీలు, కొంతమంది స్మగ్లర్లతో కలిసి మారణాయిధాలతో పోలీసులపై దాడులు చేశారని, ఆత్మరక్షణార్థం కాల్పులు జరపవలసి వచ్చిందని పోలీసు అధికారులు ఎన్‌కౌంటర్ కథ చెప్పారు.

**పోలీసుల కథనం**

పోలీసుల కథనం మేరకు 6-4-2015 రాత్రి 7 గం॥లకు స్మగ్లర్లు పెద్ద ఎత్తున ఎర్రకూలీలను అడవుల్లోకి పంపించారనే సమాచారం టాస్క్‌ఫోర్స్‌కు చేరింది. ఈ సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ సిబ్బంది ఒక్కో బృందంలో 15మంది చొప్పున (12 మంది పోలీసులు, ముగ్గురు అటవీ సిబ్బంది) రెండు బృందాలుగా విడివిడి కూంబింగ్ చేపట్టారు. 7-14-2015వ తేదీన ఉదయం 5గం॥ల ప్రాంతంలో ఈ బృందాలకు వందల సంఖ్యలో ఎర్రకూలీలు తారసపడి, వీరిపై మరణాయుధాలతో దాడులకు దిగారు. లొంగిపోవాలని పోలీసులు హెచ్చరించినా వారు వినకపోవడంతో, విధిలేని పరిస్థితుల్లో అత్మరక్షణార్థం పోలీసులు కాల్పులు జరిపారు. సచ్చినోడిబండ ప్రాంతంలో 11 మంది, ఈతగుంట సమీపంలోని చీకటిగల కోనలో 9 మంది మృతి చెందారు. మిగిలిన 430 మంది ఎర్రకూలీలు దుంగలతో పారిపోగా, 9 మంది పోలీసులకు గాయాలయ్యాయి. ఘటనాస్థలంలో మూడు గొడ్డళ్ళు, రెండు నాటు తుపాకులను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్టు తెల్పారు.

**అనుమానాలు**

టాస్క్‌ఫోర్స్ సిబ్బంది సంఖ్యను తాజాగా ప్రభుత్వం 450 మందికి పెంచి, ఒక ఐ.జి స్థాయి అధికారిని వారికి పర్యవేక్షణగా వేసింది. ప్రస్తుతం 50 మంది టాస్క్‌ఫోర్స్ సిబ్బందికి ఎ.కె47 లాంటి అత్యాధునిక ఆయుధాలతో పాటు బుల్లెట్ ప్రూఫ్ జాకెట్లు, నైట్ విజన్ గ్లాసులు వున్నాయి. అడవుల్లోని కీలక ప్రాంతాలైన 15చోట్ల అమర్చిన సి.సి కెమెరాలు ఉన్నాయి. సిసి కెమెరాలు సైతం వందల సంఖ్యలో ఎర్రచందనం కూలీలు శేషాచలం అటవీ ప్రాంతంలోకి ప్రవేశించారని చెప్తున్నాయి. ఈ నేపథ్యంలో కేవలం 15 మంది బృందంతోనే పోలీసులు కూంబింగ్‌కు ఎందుకు వచ్చారు. మరింత సిబ్బందిని తీసుకెళ్ళడానికి కనీసం ప్రయత్నించలేదు. గతంలోనూ (డిసెంబర్ 13, 2013) ఇద్దరు అటవీసిబ్బంది డేవిడ్, శ్రీధరరావులను ఎర్రకూలీలు చంపేసిన నేపథ్యంలో అనవసర రిస్క్‌ను పోలీసులు ఎందుకు తీసుకున్నారు. సి.సి కెమెరాలను పర్యవేక్షిస్తున్న పోలీసు అధికారులు సైతం అదనపు సిబ్బందిని వారికి తోడుగా ఎందుకు పంపించలేకపోయారు. సంఘటన జరిగిన రెండు ప్రాంతాలు వాహనాలు వెళ్ళే కూతవేటు దూరంలో ఉన్నాయి. ఈ రెండు ప్రాంతాలు దాదాపు చదునుగా ఉన్నాయి. మోకాళ్ళను మించని తుప్పలు తప్పితే అక్కడ కనీసపు ఎత్తులో చెట్లు లేవు. ముఖ్యంగా చుట్టుపక్కల మూడు కిలోమీటర్ల దూరంలో వరకు ఒక్క ఎర్రచందనం చెట్టు కూడా లేదు. పోలీసులు తారసపడినప్పుడు సుమారు 30 నుండి 40 కిలోల బరువున్న ఎర్రచందనం దుంగలను కూలీలు మోస్తున్నట్టు, పోలీసులు తారసపడిన వేంటనే పోలీసులపై రాళ్ళు వేసారని చెప్పారు. ఆ ప్రదేశంలో అసలు రాళ్ళే లేవు. మరికొందరూ గొడ్డళ్ళతో దాడి చేసారని, గొడ్డళ్ళు విసిరారని చెప్తున్నారు. ఈ రెండు చేయడానికి వారి దగ్గర మూడు గొడళ్ళే ఉన్నాయి. పోలీసులు కాల్పులు జరిపిన వెంటనే నిజానికి వివేకం ఉన్న ఎంతటి యోధులైనా ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని పరుగెత్తుతాడు. ఇవి చేయకపోగా వీరావేశంలో రొమ్మును ఎదురొడ్డి ఎర్రకూలీలందరూ దమ్ముంటే కాల్చమన్నట్టు పోలీసుల తూటాలకు ఎదురెళ్తారా. రెండు ప్రాంతాల్లోనూ కేవలం 10 నుండి 16 మీటర్ల

దూరంలోనే కూలీల మృతదేహాలు పడి ఉన్నాయి. వారి శవాలను ఒక క్రమపద్ధతిలో పేర్చినట్లు, వారిపక్కనే దుంగలు సైతం ఉంచబడ్డాయి. ప్రతిదుంగపై తీవ్రమైన మమకారం వున్నట్టు చనిపోయిన కూలీలు కాలో, చేయో వేసుకుని పడిపోయారు. చాలా దుంగలు సంవత్సరం నాటివి. అవి బాగా ఆరి శుభ్రంగా చెక్కబడి ఉన్నాయి. 8 గం॥ల ముందర అడవుల్లోకి వచ్చిన కూలీలు అంత వేగంగా చెట్టును కొట్టి దుంగలకు డ్రెస్సింగ్ చేయలేరు. ఎర్రచందనం దుంగనుంచి 5రోజుల వరకు ఎర్రటినీరు కొంచెం కొంచెం వస్తూనే ఉంటుంది. ఆశ్చర్యంగా కొన్ని దుంగలకు పెయింట్లు, క్రైంనెంబర్లు వేసున్నాయి. సాధారణంగా పోలీసులు రికవరీ చేసిన దుంగలకు పెయింటింగ్‌లు, క్రైంనెంబర్లు వేస్తుంటారు. అవే ఇక్కడ ప్రత్యక్షం అయినాయి. పారిపోయిన సుమారు 430 మంది దుంగలతో ఎంత దూరం పారిపోగలరు. అడవి చుట్టూరా పోలీసులు పెద్ద ఎత్తున మోహరించిన సందర్భంలో వీరు పారిపోవడం అసాధ్యం. ఇంతవరకు ఒక్క కూలీ, ఒక్క దుంగ పట్టుబడలేదు. పోలీసులు అడవిలో క్యాంపు నిర్వహిస్తున్నారు. క్యాంపు నుండి సంఘటన ప్రాంతం కేవలం 3 కిలోమీటర్ల దూరంలోనే ఉంది. ముందు రోజు రాత్రి 8 గం॥లకే కూంబింగ్ చేపట్టిన పోలీసులు మరుసటి రోజు ఉ॥ 5గం॥లకు కేవలం 3 కిలోమీటర్లే ప్రయాణించడం మరోవింత. కనీసం ఒకర్ని కూడా ప్రాణాలతో పట్టుకోకపోవడం మరిన్ని అనుమానాలకు తావిస్తోంది. 9 మంది పోలీసులకు గాయాలయ్యాయని చెప్తున్నారు. వారంతా ఎన్‌కౌంటర్ మరుసటి రోజు ఎలాంటి అలసట లేకుండా విధులను సైతం నిర్వర్తించారు. చుట్టుపక్కల గ్రామాల్లోని ప్రజలు ఘటన జరిగిన ముందురోజు అడవిలో కాల్పుల శబ్దం విన్నామని పత్రికలకు చెప్పడం మరింత బలాన్ని చేకురుస్తుంది.

గతంలో ఫోరెన్సిక్ డాక్టర్లు పేర్కొన్న ప్రకారం దూరం నుండి కాల్పులు జరిపినట్లయితే తూటాలు వ్యక్తి శరీరానికి చేరే నాటికి వేగం నియంత్రించబడి శరీరంలోనే ఉండిపోతాయి. 10 నుండి 15 మీటర్ల దూరం నుండి నుండి కాల్చినట్లయితే తూటాలు శరీరం గుండా వేగంగా దూసుకుపోయి మరోవైపు నుండి క్రింద పడిపోతాయి. చాలా మంది కూలీలు శరీరాల్లో తూటాలు లభ్యం కాలేదు. అంటే వారిని చాలా దగ్గర నుండి కాల్చినట్టు అర్థం అవుతుంది. ఆశ్చర్యంగా తూటాలు సంఘటన స్థలంలో లభ్యం కాలేదు. సుమారు గంట నుండి గంటన్నర పాటు కాల్పులు జరిపినట్లు పోలీసలు చెపితే అక్కడ క్రింద పడిన తూటాలు చాలా కనిపించాలి. కానీ ఆ విధంగా జరగలేదు. సంఘటన స్థలంలో చిన్న చిన్న తుప్పలు, చెట్లు చెక్కు చదరకుండా అలాగే ఉన్నాయి. అక్కడ గంటపాటు యుద్ధం జరిగిందనడానికి ఆధారాలేవు. అది దాదాపు మైదాన ప్రాంతం కావడంతో కనీస సంఖ్యల్లో రాళ్లు కూడా లేవు. కర్రపు మరకలు అసలే లేవు. రెండు టాస్క్‌ఫోర్స్ బృందాలకు ఒకేసారి కూలీలు తారసపడటం, వారిపై కాల్పులు జరిపి రెండు ఎన్‌కౌంటర్లను ఒకేసారి ముగించడం జరిగింది. ఎక్కువ మంది కూలీల శరీరాల్లో తూటాలు ఛాతీ, తల భాగాల్లో తగిలున్నాయి. పోలీసులు ఆత్మరక్షణార్థం కాల్పులు జరిపితే మోకాలి క్రింద భాగంలోనే కాల్చాలి. వారిని చంపాలనే ఉద్దేశంతోనే కాల్చినట్లుగా తూటాల గాయాలున్నాయి. రాజమండ్రి సెంట్రల్ జైలులో శిక్షననుభవిస్తున్న టి.వి.భాస్కర్‌నాయుడే ఈ ఎర్రకూలీలను తన అనుచరుల ద్వారా చంపించాడని పోలీసలు ప్రకటించారు. జైలు గోడల మధ్యనున్న భాస్కర్ నాయుడు జైలు అధికారులకు తెలియకుండా ఎలా స్మగ్లింగ్ చేస్తున్నాడనేది శేషప్రశ్న. దుర్ఘటన ఉదయం 6గం॥లకు ముగిసిపోయినప్పటికీ, ధర్నా చేసిన పిదప మధ్యాహ్నం 12 గం॥లపైనే మీడియా వారిని అనుమతించారు.

**మృతుల బంధువులు ఆరోపణలు**

మృతుడు పళణి సోదరి లక్ష్మీ, మరో మృతుడు మునస్వామి తల్లి పద్మ మీడియా సమక్షంలోనే పోలీసులపై తీవ్రమైన ఆరోపణలు చేసారు. తిరువణ్ణామలై జిల్లా, మురుగంబాడి గ్రామం, వేటగిరి పాలెంకి చెందిన 8 మంది కూలీల నిమిత్తం తిరుపతికి వస్తున్న క్రమంలో వీరిని అనుమానంతో 6-4-2015వ తేదీ సాయంత్రం నగరి-పుత్తూరు మధ్యలో బస్సులో నుండే పోలీసులు అరెస్టు చేశారని, ఒకరిని (శేఖర్) మాత్రం అరెస్టు చేయకపోవడంతో, అతను తన గ్రామంలోని పెద్దలకు చెప్పడంతో వారు లాయర్లతో మాట్లాడి తమ వారిని విడిపించే నిమిత్తం తిరుపతికి ప్రయాణమవుతున్న సందర్భంలో వారి మరణవార్తని వినాల్సొచ్చిందని వాపోయారు. ఈ విషయాన్ని తిరువన్నామలై జిల్లా, అనందపురం మాజీ కౌన్సిలర్ పళనిస్వామి, పడవేడు పఖుదూర్ గ్రామానికి సర్పంచ్ మూర్తి ధృవీకరించాడు.

**మంత్రుల బాధ్యతారాహిత్య ప్రకటనలు**

కేంద్రమంత్రి వెంటయ్యానాయుడుగారు, రాష్ట్ర అటవీశాఖమంత్రి, చిత్తూరు జిల్లాకే చెందిన బి. గోపాలక్రిష్ణారెడ్డిగారు, హోంమంత్రి చినరాజప్పగారు తమిళకూలీలకు ఆంధ్ర అడవుల్లో పనేంటని, వారు ఎర్రచందనం స్మగ్లింగ్‌కు పాల్పడటానికే వచ్చారని వాదిస్తున్నారు. మూడు నెలల ముందే ట్రాన్స్‌ఫోర్స్ ఐ.జి కాంతారావు గారు తమిళనాడు ప్రభుత్వానికి లేఖ పంపుతూ, శేషాచల అటవీ ప్రాంతం నిషిద్ధ ప్రాంతమని, అందులో తమిళకూలీలు ప్రవేశించకుండా చూసుకోవాలని హెచ్చరించినట్లు పేర్కొన్నారు. శేషాచల అటవీ ప్రాంతం నిషిద్ధ ప్రాంతంగా ఇంతవరకు ప్రకటించలేదు. ఆ విధంగా ప్రకటిస్తే సుమారు 4,756 చదరపు కిలోమీటర్ల పరిధిలో విస్తరించిన శేషాచలం అటవీ ప్రాంతంలోని గ్రామాలు, చివరికి వెంకన్న ఆలయానికి ప్రజలెవ్వరూ రాలేరు. మరోవైపు ఆడవిలో 144 సెక్షన్ ఉందని, కనిపిస్తే కాల్చివేత ఉత్తర్వులివ్వాలని ప్రభుత్వానికి లేఖ వ్రాసినట్టు పోలీసు అధికారులు సెలవిస్తున్నారు. విస్తారమైన శేషాచల అటవీ ప్రాంతాన్ని నమ్ముకుని జీవనం గావిస్తున్న లక్షల మంది ప్రజలు జీవించే హక్కు దీనివల్ల కాలరాయబడుతుంది. ఇప్పటికే అడవిలో వెళ్ళే ధైర్యం చాలక పరిసర గ్రామాల ప్రజలు పక్క రాష్ట్రం కర్ణటక, తమిళనాడులకు వలసపోతున్నారు. సీమనుండి 4 లక్షల మంది కర్నటక రాష్ట్రానికి వలసెళ్ళినట్టు ప్రభుత్వ గణాంకాలు చెప్తున్నాయి. బాధ్యతారాహిత్యంగా మాట్లాడకుండా ప్రభుత్వం తన చిత్తశుద్ధిని నిరూపించుకోవడానికి సి.బి.ఐ విచారణకి ప్రయత్నిస్తేనే ప్రజలకు ప్రభుత్వంపై నమ్మకం ఉంటుంది.

**హక్కుల సంఘాల వాదనలు**

జాతీయ మానవ హక్కుల సంఘం ఈ సంఘటనను సుమోటోగా స్వీకరించింది. సంఘటనపై సి.బి.ఐ దర్యాప్తును, ఎన్‌కౌంటర్లో పాల్గొన్న పోలీసులపై హత్యానేరం కింద కేసు నమోదు కోరుతూ పౌరహక్కుల సంఘం హైకోర్టును ఆశ్రయించగా అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేయాలని తీర్పు వెలువడింది. తమిళనాడు

హైకోర్టులో మృతుల బంధువులు రీ పోస్ట్‌మార్టమ్ నిర్వహించాలని దరఖాస్తు చేసుకున్నారు. సుప్రీంకోర్టులోనూ ఈ ఎన్‌కౌంటర్ ఏకపక్ష కాల్పులని, ఇవి ప్రభుత్వ హత్యలని వాజ్యం దాఖలైంది. మృతుల శరీరాలు బాగా కమిలివుండటం, 11 మంది శరీరాలపై వట్టి కట్‌డ్రాయర్ మాత్రమే ఉండటం, వారి దేహాలపై చిత్రహింసలకు గురి చేసినట్లు తూటాల గాయలుండటం, అతి దగ్గర నుండి కాల్చినట్లు తూటాల గాయాలుండటం, సాక్ష్యం లేకుండా దొరికిన అందర్నీ కాల్చి చంపడం లాంటి పలు అనుమానాల రీత్యా వారు బూటకపు ఎన్‌కౌంటర్‌గా పేర్కొంటూ, సి.బి.ఐ చేత దర్యాప్తు చేయించాలని వాదిస్తున్నారు.

**అమిళుల ఆవేదన**

మరోవైపు ఎఫ్.ఐ.ఆర్ మొత్తం 450 మందిమీద పెట్టడం పలు అనుమానాలకు తావిస్తోంది. 20మంది చనిపోగా, మిగిలిన వారు పారిపోయారని చెప్తూ, ప్రతి తమిళ కూలీని ఈ కేసులో ఇరికించడానికి, మరిన్ని తమిళ కూలీల ప్రాణాలు తీసేదానికి ప్రభుత్వం ఎత్తుగడ వేస్తుందని వారు నిరసనలకు పాల్పడుతున్నారు. పొరుగు రాష్ట్రంలోకి తమిళ కూలీలు అడుగు పెట్టడానికి భయపడే విధంగా ఆంధ్రప్రభుత్వం 20 మంది కూలీలని అన్యాయంగా చంపేసిందని వారు ఆందోళన చెందుతున్నారు. వారి ఆందోళనలను తగ్గించే దిశగా, వారి అనుమానాలను నివృతి చేసే దిశగా ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విస్మయాన్ని కల్గిస్తుంది. చెన్నైలో ఆంధ్రులు భారీ ఎత్తున పెట్టుబడులు పెడుతున్నారు. మరోవైపు ఆస్తులు కొనుగోలు చేస్తున్నారు. వీరికి రాబోయే ప్రమాదాన్ని ప్రభుత్వం గుర్తించనట్టులేదు.

**ఆపరేషన్ క్లీన్ శేషాచలం**

ప్రభుత్వం చంపడం ద్వారానే స్మగ్లింగ్‌ని అరికట్టవచ్చని బలంగా నమ్ముతుంది. నాలుగు లేయర్లుగా స్మగ్లింగ్ జరుగుతున్న నేపథ్యంలో క్రింది లేయర్లలోని చెట్లు కొట్టి, డ్రస్సింగ్ చేసి, రోడ్డు ప్రాంతానికి దుంగలని తరలిస్తూ ముఖ్యమైన భూమికను వహిస్తున్న కూలీలను చంపడం ద్వారా స్మగ్లింగ్‌ను అరికట్టాలనుకుంటుంది. ప్రధానమైన స్మగ్లర్లు అన్నీ పార్టీల్లోనూ ఉండటం, వారే అసెంబ్లీలో కూర్చొని స్మగ్లింగ్‌ని ఆపాలని అరవడం ప్రజలందరూ చూస్తున్నదే. ఎన్నికల్లో ఎర్రచందనం స్మగ్లింగ్ ధనాన్ని పెద్ద ఎత్తున గుమ్మరిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం వారి జోలికెళ్ళే సాహసం చేయలేదు. ఈ హత్యలను రాజకీయ హత్యలుగా పరిగణించాల్సి ఉంది. ప్రతిపక్ష పార్టీలు ఆదాయవనరుల కోసం ఎర్రచందనం స్మగ్లింగ్ పైనే ఆధారపడుతున్నట్లు పసిగట్టిన ప్రభుత్వం వారికి చెక్ పెట్టడానికి ఇప్పటికే గంగిరెడ్డిని పోకన్ చేసి, ఆ సామాజిక వర్గాన్ని భయాందోళనలకు గురిచేసి, వారిని నయానో, భయానో తమ పార్టీలోకి రప్పించడానికి, లేదా రాజకీయాలకు దూరంగా ఉండటానికి పావులు కదుపుతోంది. తద్వారా రాయలసీమలో తె.దే.పాను శక్తివంతమైన పార్టీగా నిలపాలని ప్రయత్నిస్తున్నారు. ఈ రాజకీయ ఎత్తుగడకు తమిళకూలీలు పావులుగా ఉపయోగపడటమే ఇక్కడ అత్యంత విషాదం.

**ఎన్‌కౌంటర్ల పరంపర**

2011లో మొదలైన ఎన్‌కౌంటర్ల పరంపర మొత్తం 8 ఎన్‌కౌంటర్లతో 31 మంది కూలీలతో కొనసాగుతోంది. చనిపోయిన వారందరూ పేదలు, దళితులు తమిళ కూలీలే కావడం విషాదం. ఇందులో ఒక్క స్మగ్లర్ లేకపోవడం యాధృచ్ఛికం కాదు. అన్ని ఎన్‌కౌంటర్లలోనూ ఒక్క పోలీసుకు తీవ్రగాయాలవ్వలేదు. 2013లో జరిగిన కూలీల దాడిలో ఇద్దరు అటవీ సిబ్బంది చనిపోయారు. దానిపై జ్యుడిషియల్ విచారణకు అటవీ సిబ్బంది విజ్ఞాపన చేసినా ప్రభుత్వం పట్టించుకోలేదు. అటవీ అధికారుల మధ్య వైరుధ్యాల్లో భాగంగానే ఆ ఇద్దరు బలైనారని స్థానికులు నమ్ముతున్నారు. ఇందులో పాల్గొన్న కూలీలను శిక్షించాలని అన్ని సంఘాలు ముక్తకంఠంతో నినదించాయి. అప్పటినుండి ప్రతీకారేచ్ఛ హత్యలకు ప్రభుత్వం పాల్పడుతోంది. పిట్టకన్నా చెట్టుకన్నా మనిషి ప్రాణానికి ఏ మాత్రం వలువలేదని పోలీసు సిబ్బంది భావిస్తున్నారు. ఒక్క చెట్టు కోసం పదుల సంఖ్యలో విలువైన మనుషుల ప్రాణాలను తీయడానికి ఏ మాత్రం వెనకాడటం లేదు. ప్రఖ్యాత సెలబ్రిటీ సల్మాన్‌ఖాన్ అటవీప్రాంగణంలో జంతువులను వేటాడటం వల్ల ఇప్పటికీ కోర్టు చుట్టూ తిరుగుతున్నా, బూటకపు ఎన్‌కౌంటర్లలో పాల్గొంటున్న పోలీసులపై ఇప్పటివరకు ఒక్క కేసు నమోదు కాబడలేదు. పైగా ప్రోత్సాహకాలు, అదనపు ఇంక్రిమెంట్లు, అగ్జిలరీ ప్రమోషన్లు ఇవ్వబడ్డాయి.

**స్మగ్లింగ్ నివారణ**

ఎర్రచందనం స్మగ్లింగ్ 2008కి ముందర జరుగుతున్నప్పటికీ ప్రభుత్వం పెద్దగా పట్టించుకోలేదు. అప్పట్లో శేషాచల ప్రాంత ప్రజలు ఎర్రచందనం దుంగలను పొయ్యిల్లోకి, ఇంటికి కలపగా వాడేవారు. ఈ తరహా ఎర్రచందనం చెట్లు ప్రపంచంలో ఎక్కడా లేకపోవడం, శేషాచల అటవీ ప్రాంతానికే పరిమితం గావడంతో, వీటిని అరుదైన, సంరక్షించాల్సిన బాధ్యతగా గుర్తించి వీటి రవాణాను నిషేధించింది. ఇది అంతర్జాతీయ మార్కెట్‌లో డిమాండ్‌కు కారణమైంది. దీంతో స్మగ్లింగ్ ఊపందుకుంది. అప్పటికవరకు కట్టెముక్కగా ఉన్న ఎర్రచందనం ఆస్థిగా మారడంతో సమస్య మొదలైంది. దాని ఉపయోగపు విలువ కన్నా మారకపు విలువ వేలరెట్లు పెరగడం మనిషి ప్రాణం కన్నా, దని విలువను అమాంతం పెంచేసింది. సీమలో నీటివనరులు లేకపోవడంతో వ్యవసాయం కుంటుబడింది. పెట్టుబడులు లేకపోవడంతో పరిశ్రమలు కనీసస్థాయిలోనూ లేవు. ఆదాయం కోసం ఫ్యూడల్ వర్గాలు ఎర్రచందనం స్మగ్లింగ్‌నే భారీ పరిశ్రమగా చేశారు. వేలమందికి ఉపాధిని, రాజీయాల్లోకి పెట్టుబడులను, సేవారంగంల్లో పెట్టుబడులను ఇదే అందిస్తోంది. చివరికి ప్రభుత్వం ఈ వనరుల నుండి ఇప్పటికీ వెయ్యికోట్ల ఆదాయాన్ని గడించింది. ఇందులో నయా పైసా కూడా రాయలసీమకు ఖర్చు పెట్టలేదు. కాని ఈ చందనంపై తమిలకూలీలకు హక్కులేదని అటవీశాఖమంత్రి వాదిస్తున్నారు. రాజధాని సమస్యతో పాటు, అనేక చిక్కుల్లో వున్న ముఖ్యమంత్రిపై నమ్మకాన్ని అన్ని వర్గాల ప్రజలు క్రమంగా స్వల్పకాలంలోనే కోల్పోతున్న క్రమంలో, త్వరలో స్థానిక ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో అందరి దృష్టిని మరల్చడానికి తమిళకూలీలను చంపినట్టు విశ్లేషకులు భావిస్తున్నారు. అందుకే భాషాప్రతిపదికను తమిళ-ఆంధ్రుల మధ్య చిచ్చుపెట్టే విధంగా తే.దే.పా మంత్రులు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారు. ఈ చిచ్చును రగల్చడం వల్ల తాత్కాలిక వుపశమనాన్ని ప్రభుత్వం పొంది తన పబ్బం గడుపుకోవాలని ప్రయత్నిస్తోంది.

ఆంధ్రప్రదేశ్ సరిహద్దు ప్రాంతాల్లోని వేలూరు–తిరువణ్ణామలై జిల్లాల మధ్య విస్తరిస్తున్న జువ్వాది కొండల్లోని సుమారు 272 గ్రామాల్లో గిరిజనులు నివసిస్తున్నారు. అడవిలోని చెట్లను నరికి కలపను అమ్ముకోవడం, పశుపోషణ, వ్యవసాయం వీరి ప్రధానమైన జీవవనరులు. వీరప్పన్ అనుచరులుగా వీరిని పేర్కొంటున్నప్పటికీ, వీరిని వీరప్పన్‌కు సంబంధాలు లేవు. వీరికి ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందకపోవడం, నిరక్షరాస్యత, పనులు లేకపోవడం, అటవీ అధికారుల ఆంక్షలు వీరిని వలసదారి పట్టించాయి. వీరి దారిద్ర్యాన్ని ఆసరాగా చేసుకొని స్మగ్లర్లు నియమించిన దళారీలు రోజుకు 3 వేల చొప్పున పది రోజులకు కాంట్రాక్టు కుదుర్చుకొని వారిని ఆశపెట్టి తిరుపతికి తీసుకువస్తారు. వీరిని అరెస్ట్ చేస్తే కుటుంబాన్ని ఆదుకుంటామని, జైలునుండి విడిపించి తీసుకువస్తామని మాయమాటలు చెప్తారు. అరెస్టయితే అస్సలు పట్టించుకోరు. ఇప్పటివరకు 5000 మందికి పైగా కూలీలను ఆంధ్రప్రభుత్వం అరెస్ట్ చేస్తే, అందులో 50 శాతం మంది లాయర్లు పెట్టుకునే స్తోమత లేక జైళ్ళల్లో మగ్గుతున్నారు. వీరికి ఉపాధినీ, కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించాలి. అలాగే శేషాచలంలో ప్రతిచెట్టుకు నంబరు వేసి, ప్రభుత్వమే వాటిని మార్కెట్ చేయాలి. అసలైన స్మగ్లర్లను అరెస్టు చేసి, వారి ఆస్తులను జప్తు చేయాలి. ఎర్రచందనం సంరక్షణకు అటవీ సిబ్బందిని పెంచాలి. ప్రతి గ్రామంలోని వాచర్‌ను ప్రభుత్వం నియమించి వారికి ఉపాధిని కల్పించగలిగితే ఎర్రచందనం స్మగ్లింగ్ దాదాపుగా తగ్గే అవకాశాలున్నాయి.

list of the date of killings

1. 2011 Vaaraadi from Tamilanadu (place of death: sankariah gari palem villege, chandragiri mandal, Chittor dist)

2. Dec, 2012 Murugan from Tamilnadu (place of death: karivepakula konda, Chamala forest, chittor distrist)

3. Sambariyan Mani from Tamilnadu ( place of death: naear kalyani dam, bobadi hill, Chittor district)

4. 29-1-2014 Venkatesh, 25 years Siva, 28 years Vijayakanth, 25 years Daniyar Attimur villede, polur tq, Tiruvannamalia Dist, Tamilnadu (Place of death: Guddedula banda, 12kms from Tirumala Venkateswara Temple, Chittor dist)

5. 21-6-2014 A. Veeramani, 35 years, vinayakapuram South, hamlet of Attimala pattu, Vannurpuram post, Arani, Tq, Tiruvannamalia Distyrict, Tamilnadu (place of death: Forest area in Kadapa District)

6. Unidentified red labour (place of death: Forest area in koduru(m), (place of death: Kadatala hill forest, Bhakarapeta reason, Chittor dist) Is it precious

– మునస్వామి (30), మూర్తి (38) – తిరువణ్ణామలై జిల్లా, పోలూరు.

– మహేంద్రన్ (22) – తిరువణ్ణామలై జిల్లా, పోలూరు తాలుకా, గాందీనగర్.

– పళణి (35) – తిరువణ్ణామలై జిల్లా, పోలూరు తాలుకా, కాలసముద్రం.

– పెరుమాళ్ (37), శశికుమార (35), మురగన్ (42) – తిరువణ్ణామలై జిల్లా, పోలూరు తాలుకా, వేటగిరిపాలెం.

– హరిక్రిష్ట, వెంకటేశన్, శివకుమార్, లక్ష్మణ్ – ధర్మపురి జిల్లా, అమర్ తాలుకా, చిత్తేరి పంచాయితి, కలసపాకం గ్రామం.

– గోవిందస్వామి, చిన్నస్వామి, వెల్లిముత్తు, రాజేంద్రన్, జరదీమలై – తిరువణ్ణామలై జిలా&, జావదీమలై , నమ్మేయంబట్టు.

– పన్నీరు సెల్యం తిరుణ్ణామలై జిల్లా, జరదీమలై, మేల్‌కాపుర్.

– 34 వయస్సు గల మృతదేహాన్ని ఇంకా గుర్తంచవలసి వుంది.

## Demands

1. All tha police men who were involved in the above fake encounters should be larged IPC 302 marder cases agaanist tham as per the orders of the Supreme Court. Beore that thay have to suspend from their servises untill they prove not guilty.

2. All the Police, Forest and Custom men who allegedly involved withthe smuggling mafia shall be suspended immediately by the Governament. Only the staff who were not copereted with the present ruling party were suspended till date.

3. A Judicial probe headed with High Court sitting judges to be ordered by the Government in to the smuggling, fake encounts, forest official murders, involvement of insiders and entire episodes, in order to reveal the actual facts to the public.

4. The Government answered for why no signal kindpin was being arested by the police as there were teries of stories published and telecated in the print and electronic meda about the links of policians, bureaucrats, with the smuggling mafia.

5. Dissonance of political parties between to social upper casts,the poor helpless daliths became scapegoats. Hence all the cases lorged aganist poor labours shall be with drawn unconditionally since majority were ot arested will doing the smuggling and arrested at bustands and railway stations with over anticipations of the Police.

6. The Police officials ancouncing often that there was a shoot at sight orders in the Forest surrondings area, even not issued by the Govt any order to that effect. As a result, thousand of the adivasies, girijans, and other daliths who were depending on the Forest for their different livelihood, apprehendedand they are lasting livelihood. It is a true violation of human rights. Thay have to stop to pretend the people depending on the Forests hitherto. As per the schedule of 5th and 6th of the Constitution of India, 1\70 Act, they are empowered to utilized the Forest products.

7. The Govt to withdraw the section 144 in the Forests and itssurroundings which is irregular and inhumen. All the surroundings of the Forest stretched with about 200 villeges, all were belondto presant labours and self employedas they have to depend on the Forest for their livelihood, with no option lelt.

8. The Government should release at Rs. 10lack as compensation to the deceased families and also provide one job to each deceased family and free educationfrom KG to PG to their children.

9. The Government has to produse white paper about all the killings and detentions caused in the protection of Red sandal smuggling.

10. The Forest department shall be explored to the media and public, how much tones of red sanders available with them of qualithyand Grade.

11. The money earned by the Govt through e procuring tenders should be utilized for the development of Rayalaseeme people as it was national treasure of the Seema region.

12. Red sandal cropping should be legalized and encourage the presant who are interested in cropping of sandalwood by providing free plants and allied measures in order to avoid black marketing.

13. All the contract and outsourcing staff in the Forest deportment should be regularized with sufficient salaries as there were changes to lured them by the smugglers easily since theygetting less weges and being exploited.

14. The Tamilnadu Government should launch social welfare schemes and ensure that all the poor peole would be covered. Un Employment is the major problems in the said regions they have to given suitable employment by the central and state Governments by utilizing their traditional skills of wood cutting, chopping etc...

15. The Government shall introduce the proper lodisic system fir the protectionof the endangered species and to defend the ramped smuggling in a sustaines way.

16. The TTD also has to take up steps to grow the redsandel tree in proper manner and use the money for the development of the Chittor District on obtaining through Sales.

17. The Government has adopt different publicith methods for the awere of the people living in the Vicinage of Seshachalam Forest about the importence and protections of the Redsandels trees.

✶

## ఎలప్పుడూ ప్రజలతోనే ఉండాలి

**ఒక వ్యక్తి ఎంతటి పదవిలో ఉన్నా, అతడికి ఎంతటి అధికారం ఉన్న, పేరు ప్రతిష్టలున్నా అతడు కార్యరంగానికి వెళ్ళి, ప్రజలతో కలవకపోతే, లేదా ప్రజలతో సన్నిహిత సంబంధాలు ఉన్న కేడర్లతోనూ, ప్రజలలోని పాజిటివ్‌గా ఉన్న వ్యక్తులతోనూ తరుచూ సాంప్రదించకపోతే 6 నెలలు ప్రజలతో సంబంధాలు లేకపోయినా, వారిని సంప్రదించకపోయనా అతడు ఏమీ తెలుసుకోలేడు. అతనికి భావదారిద్ర్యం సంక్రమిస్తుంది. అందుచేత ప్రతిఒక్కరూ కార్యరంగంలోకి వెళ్ళాలి. ప్రజలతోనూ, ప్రజలతో సన్నిహితంగా ఉన్న కేడర్లతోనూ, ప్రజలలోని పాజిటివ్‌గా ఉండే వ్యక్తులతోనూ కలగలసిపోవాలి. వారి ఆలోచనలు, కార్యాచరణ, కష్టాలను గురించి వివరంగా తెలుసుకొని, స్పష్టంగా సమీక్షించి తిరిగి వారికి సాధ్యమైన పరిష్కారాలను గురించి వివరించాలి.**

**-కా॥ మావో**

అమరుల చరిత్ర

# పొడియా పోరాట కెరటం కామ్రేడ్ జోగాల్‌కు అరుణారుణ జోహార్లు!

2015, మార్చి / ఏప్రిల్ మాసాలలో జరిగిన రాజకీయ తరగతులకు మల్కనగిరి డివిజన్, పొడియా ఏరియా కమిటీ సభ్యుడు కామ్రేడ్ జోగాల్ కూడా విద్యార్థిగా హాజరయ్యాడు. ఈ కార్యక్రమం జరుగుతున్నప్పుడు జ్వరం వచ్చింది. మలేరియా జ్వరానికి వైద్యం అందించారు. తాత్కాలికంగా కోలుకుంటున్నట్లుగా కనిపిస్తూ అకస్మాత్తుగా తీవ్రమైన జ్వరానికి లోనయ్యాడు. అప్పటికీ క్యాంపు నడుస్తున్న ప్రాంతంలో శత్రువు వందలాది గ్రేహౌండ్స్ బలగాలను మోహరించి కూంబింగ్ చేస్తున్నాడు. మందులు తెప్పించే ప్రయత్నంలో ఒక టీం పోలీసు కాల్పులకు గురయ్యింది. అనారోగ్యం మరింత విషమించింది. పోలీసుల చుట్టివేత మధ్యనే వైద్యం కోసం పంపే ప్రయత్నంలో దారిలోనే ఏప్రిల్ 4,2015న తుది శ్వాస విడిచాడు. ఆయనను బ్రతికించుకోవడం కోసం పార్టీ చేసిన ప్రయత్నం విఫలం అయింది. ఆయన మృత శరీరాన్ని కొద్ది మంది పి.ఎల్.జి.ఎ సభ్యులు, ప్రజలు కలిసి రహస్యంగానే ఖననం చేయాల్సి వచ్చింది. ఊహించని కామ్రేడ్ జోగాల్ అమరత్వం పార్టీనీ, పి.ఎల్.జి.ఎనూ, ప్రజలనూ, ఆయన కుంటుంబ సభ్యులను తీవ్ర దిగ్భ్రాంతికీ, విషాదానికీ, దు:ఖానికి గురి చేసింది. వుద్యమానికి తీవ్రమైన నష్టాన్ని కలగచేసింది.

కామ్రేడ్ జోగాల్ విప్లవ జీవితం, ఆచరణ విప్లవకారులందరికీ ఆదర్శమైంది. అనుసరణీయమైంది. మల్కనగిరి జిల్లా, పొడియా బ్లాక్ శీలకోట గ్రామంలో నిరుపేద ఆదివాసీ కుటుంబంలో పుట్టాడు. తల్లిదండ్రుల ఇద్దరి సంతానంలో జోగాల్ పెద్దవాడు. తమ్ముడు చిన్ననాటినుండే బుద్ధిమాంద్యంతో పెరిగాడు. గ్రామంలోనే తను ఇష్టపడిన యువతిని ప్రేమించి పెళ్ళి చేసుకున్నాడు. గ్రామంలో ప్రజల ఆదరాభిమానాలు చురగొన్న చురుకైన యువకుడు కామ్రేడ్ జోగాల్. తనున్న ప్రాంతానికి పార్టీ వెళ్ళినప్పుడు పరిచయంలోకి వచ్చాడు. విప్లవ రాజకీయాలను ఆకలింపు చేసుకున్నాడు. కుటుంబం కన్న అమితంగా ప్రజలను ప్రేమించాడు. ఈ వ్యవస్థను ద్వేషించాడు. ప్రజా శత్రువుల పట్ల విపరీతమైన వర్గకసిని ప్రదర్శించడం ఆయన మొదటి లక్షణం. గ్రామంలోని విప్లవ రైతుకూలీ సంఘం సభ్యుడిగా, మిలీషియా కమాండర్‌గా పని చేసాడు. గ్రామ ప్రజలను ఐక్యం చేసి, పాత అధికారాన్ని ధ్వంసం చేసి సంఘం అధికారాన్ని స్థాపించాడు. ఏరియాలోనే చుట్టుపక్కల గ్రామాలకు మార్గదర్శకంగా నిలిచాడు. గ్రామంలోని యువతి, యువకులను వెంట పెట్టుకొని చుట్టుప్రక్క గ్రామాలలో విప్లవ రాజకీయ ప్రచారంలోనూ, పార్టీ నిర్ణయించిన ప్రజా శత్రువులు, శత్రుఏజెంట్లను శిక్షించడంలోను జోగాల్ కీలకమైన పాత్ర పోషించాడు. సారా నిషేద ఉద్యమంలో ప్రజలను కదిలిస్తూనే మద్యం దుకాణాలపై దాడులకు నాయకత్వం వహించాడు.

గ్రామాలపై పోలీసు దాడులను నిరసిస్తూ పోలీసు క్యాంపుల ఏర్పాటు ప్రయత్నాలను అడ్డుకోవడంలో భాగంగా పొడియా బ్లాక్ ఆఫీస్, పాత పోలీస్టేషన్ మరియు పంచాయితీ ఆఫీసు భవనాలను మిలీషియాను కదిలించి కూల్చివేసాడు. అనేక గ్రామాలనుండి ప్రజలను పార్టీకి పరిచయం చేసి విప్లవోద్యమంలో భాగస్వాములను చేసాడు. ఈ క్రమంలో సహజంగానే శత్రువుకు ముఖ్య టార్గెట్‌గా మారాడు. తన కోసం శత్రువు గ్రామాలపై, కుటుంబంపై అనేక మార్లు దాడులు చేసాడు. లొంగిపొమ్మని హెచ్చరించాడు. వర్తమానాలు పంపాడు. అప్పటికే ఆయనకు 5గురు పసిపిల్లలున్నారు. తన మీదనే ఆధారపడిన కుటుంబం వున్నప్పటికీ, వారిని ప్రజలలో భాగంగానే చూసాడు. ప్రజల విముక్తికి పూర్తికాలం పని చేయాలని నిర్ణయించుకొని 2012లో పూర్తికాలం కార్యకర్తగా పార్టీలో చేరి, పొడియాదళం సభ్యుడయ్యాడు. ఆ గ్రామం నుండి ఆరుగురు పూర్తికాలం కార్యకర్తలను తయారు చేసి దళంలోకి రిక్రూట్ చేసాడు. ఏరియాలోని ప్రజలనూ, యువతి, యువకులను రాజకీయంగా ప్రభావితం చేసాడు.

కామ్రేడ్ జోగాల్ రిక్రూట్ అయిన తరువాత దళంకు నూతన శక్తి వచ్చింది. దళం అనేక విషయాలపై అతనిపై ఆధారపడేది. స్థానిక టెర్రయిన్‌పై పట్టు ఉండటం, ప్రజలతో ఉన్న సన్నిహిత సంబంధాలు, ఆయనలో ఉన్న కష్టపడి పనిచేసేతత్వం, క్రమశిక్షణ, నిరాడంబర పనిశైలి, మిలటరీ పరంగా ఉండే నిబద్ధత ఇవన్నీ ప్రజలలో మరింత విశ్వాసాన్ని పెంచాయి. దళానికి కొండత అండగా నిలిచాడు. పార్టీ చెప్పిన ఎలాంటి పనులనైనా, ఎంతకష్టమైన, ఎంత దూరమైన అత్యంత బాధ్యతాయుతంగా, పట్టుదలగా పూర్తిచేయడం ఆయన ప్రత్యేకత.

జనమిలీషియా కమాండర్‌గా 2012లో డివిజన్ టి.సి.ఒ.సిలో పాల్గొని జన్నుగూడ అంబుష్‌లో బి.ఎస్.ఎఫ్ కమాండర్‌తో పాటు నలుగురిని ఖతం చేసి ఆయుధాలను స్వాధీనం చేసుకున్న ఘటనలో చురుకుగా పాల్గొన్నాడు. 2013 సెప్టెంబర్ 13న శీలకోట వద్ద దళం, మిలీషియా మకాం వేసిన సమాచారం ఒక ద్రోహి ద్వారా సేకరించిన ఎస్.పి వందలాది బలగాలతో చుట్టు ముట్టి జరిపిన కాల్పుల్లో 13మంది మిలిషియా సభ్యులు అమరులయ్యారు. ఆ సంఘటన నుండి చాలా చాకచక్యంగా తప్పుకొన్నాడు. పోలీసులు చేసిన ఈ కిరాతక హత్యలను ప్రజలలోకి తీసుకెళ్ళి విస్తృతంగా ప్రచారం చేసి ప్రజలకు ధైర్యం కల్పిస్తూ శత్రువుపై ప్రతిఘటనకు సిద్ధపరిచాడు. శీలకోట సంఘటన తర్వాత అతివిశ్వాసంతో దూకుడుగా వస్తున్న పోలీసులను దడాలు వద్ద అంబుష్‌లో యిరికించి, కాల్పులు జరిపి పరుగులు పెట్టించిన దానిలోనూ, గంపకొండ బి.ఎస్.ఎఫ్ క్యాంపుకు కిలోమీటర్ దూరంలో పెట్రోలింగ్ పార్టీపై కాల్పులు జరిపి ఇద్దరిని గాయపర్చి మిగిలిన వారిని పరుగెత్తించిన సంఘటనలోనూ, ఎమ్.వి-21 నెంబర్ బి.ఎస్.ఎఫ్ క్యాంపుపై బిగ్‌గన్‌ను పేల్చి శత్రువుకు కంటిమీద కునుకు లేకుండ చేయడంలో చురుకైన భూమిక పోషించాడు. శీలకోట ఎన్‌కౌంటర్‌కు కారకుడైన ఇన్‌ఫార్మర్లను ప్రజలపై ఆధారపడి విచారించి, గుర్తించి ఖతం చేసి శత్రువుకు సవాల్ విసిరాడు.

2013 పొడియా ఏరియా ఆర్గనైజేషన్ విస్తరణలో భాగంగా కొంద్రపాల్‌కు 1+2 నిర్మాణంలో భాగంగా వెళ్ళి ఏరియా సర్వే

# గ్లోబలైజేషన్ భ్రమలను కాలదన్ని ప్రజల విముక్తి కోసం ప్రజాయుద్ధ బాట పట్టి అమరుడైన కామ్రేడ్ సూర్యంకు ఎర్రెర్రని జోహార్లు!

కామ్రేడ్ సూర్యం (సోను) ప్రకాశం జిల్లా, కొరిశపాడు గ్రామానికి చెందిన మధ్య తరగతి కుటుంబంలో పుట్టాడు. తనకు ఊహ తెలిసే నాటికి తండ్రి విప్లవోద్యమంలో కొంత కాలం పనిచేసి ఇంటిముఖం పట్టడం, మేనత్త ఆమె భర్త విప్లవ కార్యాచరణ నుండి వైతొలిగి పోలీసులకు లొంగిపోవడం వంటి సంఘటనలు జరిగాయి. ఈ ఘటనలు జరిగినప్పటికీ ఆయనపై విప్లవోద్యమం బలమైన ప్రభావాన్ని వేస్తూ వచ్చింది. ఎందుకంటే ఆయన కుటుంబ నేపథ్యం అటువంటిది. కుటుంబం వర్గ రీత్యా మధ్య తరగతికి చెందినది కావడంతో పాటు కులం రీత్యా నిచ్చెన మెట్ల కుల వ్యవస్థలో కింది కులానికి చెందిన బట్టలుతికే (చాకలి) కులం కావడంతో విప్లవం ఆయనకు సన్నిహితం అవుతూ వచ్చింది. తాను తన కుటుంబం ఎదుర్కొనే అన్ని ఆర్థిక, సమాజిక సమస్యలకు ఏకైక పరిష్కారాన్ని ఇవ్వగలిగే విప్లవోద్యమానికి ఆయన కూడా చిన్నతనం నుండి దగ్గరవుతూ వచ్చాడు. ఈ పరిణామాన్ని తండ్రి పూర్తిగా ప్రోత్సహించకపోయినప్పటికీ అడ్డుకోలేదు.



దీంతో విద్యార్థి దశ నుండే విప్లవ కార్యాచరణను మెరుగుపరుచుకుంటూ వచ్చాడు. తాను విద్యార్థిగా ఉన్నప్పుడు శాస్త్రీయ విద్యావిధానం కోసం, విద్యార్థుల హాస్టల్ సమస్యలపైనా, స్కాలర్‌షిప్‌ల కోసం జరిగే పోరాటాలలో చురుకుగా పాల్గొన్నాడు. ఒకవైపున సామ్రాజ్యవాద సంస్కృతి యువతను పెడదారి పట్టిస్తుంటే తాను మాత్రం వాటిని పక్కకు నెట్టి పురోగామి భావాలను అభివృద్ధి చేసుకున్నాడు. తనతోటి విద్యార్థులను విప్లవ రాజకీయాలకు ప్రభావితం చేసేందుకు కృషి చేశాడు. కుటుంబ పేదరికం వల్ల ఇంటర్‌తో చదువును ఆపివేశాడు. తన ఈ పరిస్థితికి ఈ వ్యవస్థే మూలకారణంగా భావించాడు.

చదువును అర్థంతరంగా ఆపేయడంతో ఇంటివద్ద ఉంటూ ఒకవైపున తండ్రితోపాటు పొలం పనుల్లో పాల్గొంటూ మరోవైపున భగత్‌సింగ్ వంటి విప్లవ వీరుల సంస్మరణ సభలను తన గ్రామంలోనే జరుపుతూ యువతను పురోగామి, విప్లవ భావాలవైపు ఆకర్షించేందుకు ప్రయత్నించాడు. ఈ పరిమిత కార్యక్రమాలు ఆయనను సంతృప్తి పరచలేకపోయాయి. భారతదేశంలో విప్లవం అంటే దీర్ఘకాలిక ప్రజాయుద్ధమనీ, సాయుధ రైతాంగ యుద్ధమనీ అవగతం చేసుకుంటూ తన భావాలను అభివృద్ధి చేసుకున్నాడు. ఈ క్రమంలోనే మధ్య, తూర్పు భారతం (దండకారణ్యం, బిహార్, ఝార్ఖండ్) లో కొనసాగుతున్న ప్రజాయుద్ధంపైనా, అక్కడి ఆదివాసీ ప్రజలపైనా సామ్రాజ్యవాదుల దన్నుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ఆపరేషన్ గ్రీన్‌హంట్ దాడికి వ్యతిరేకంగా, ప్రజాయుద్ధానికి మద్ధతుగా పట్టణ, మైదాన ప్రాంతాలలో జరుగుతున్న కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటూ వచ్చాడు. ఖమ్మం జిల్లా చర్లలో ఆపరేషన్ గ్రీన్‌హంట్‌కు వ్యతిరేకంగా జరిగిన ప్రచార కార్యక్రమంలో, సభ నిర్వహణలో చురుకైన పాత్ర నిర్వహించాడు.

ఈ క్రమంలోనే జూన్ 2014లో విప్లవోద్యమంలో పూర్తికాలం పని చేయాలనే నిర్ణయానికి వచ్చి ఎ.ఒ.బి ఉద్యమ ప్రాంతాన్ని తన

---

చేయడంలోనూ, ప్రజలతో సంబంధాలు నెలకొల్పుకొని, ప్రజా పోరాటాలకు నాయకత్వం అందించి వారిని నిర్మాణయుతం చేయడంలోనూ కా॥ జోగాల్‌ది క్రియాశీలక పాత్ర. 2014లో ఏరియా కమిటీ సభ్యుడిగా ప్రమోట్ చేయబడ్డాడు. ఆపరేషన్ గ్రీన్‌హంట్‌లో భాగంగా శత్రువు ఏరియాలో అనేక పోలీసు క్యాంపులు పెట్టి నిరంతరం కూంబింగ్‌లు, దాడులు, అక్రమ అరెస్టులు కొనసాగిస్తూ మరోవైపు జోగాల్‌పై ఒత్తిడి పెంచడంలో భాగంగా 2013లో కుటుంబంపై దాడి చేసి వృద్ధుడైన తన తండ్రిని, బుద్ధిమాంద్యంతో ఉన్న తన తమ్ముడు దూలను అరెస్టు చేసి, తప్పుడు కేసులు బనాయించి జైలులో పెట్టాడు. అయితే అది తనలో మరింత పట్టుదలను పెంచిందే తప్ప కృంగదీయలేదు. ఒక క్షణం కూడా ఊగిసలాట ప్రదర్శించలేదు. ఈ మొత్తం విప్లవ కార్యాచరణలో జోగాల్‌కు, ఆయన భార్య అత్యంత సన్నిహితంగా ఉంటూ సహకారాన్ని అందించేది. ఆమె అన్నీ తానై పిల్లలను పోషిస్తూ జోగాల్ లక్ష్యసాధనకు ఏ మాత్రం ఆటంకం కలుగకుండా చూసుకునేది. జోగాల్ అమరుడైన కొద్ది నెలల్లోనే జూన్‌లో తమ్ముడు దూల జైలు అధికారుల నిర్లక్ష్యం వల్లనూ, సరైన వైద్యం అందించకపోవడం వల్లనూ, తీవ్ర అనారోగ్యంతో అమరుడైనాడు. కా॥ జోగాల్ విప్లవ జీవితంలో నెలకొల్పిన ఉన్నత కార్మిక వర్గ విలువలు, శత్రువుపట్ల ఆయన స్పష్టమైన వర్గ దృక్పథం, ప్రజలతోనూ, క్యాడర్‌తోనూ మమేకమైన తీరు, కుటుంబ విషయంలో కనబరిచిన చైతన్యం, నిస్వార్థ, నిరాడంబర జీవిత ఆచరణ మనందరం ఆదర్శంగా తీసుకుందాం. జోగాల్ ఆశయ సాధనకు మరింత దృఢ సంకల్పంతో అంకితమై చివరి నెత్తుటి బొట్టు వరకు ప్రజలను విప్లవీకరించే కృషి కొనసాగిద్దామని ప్రతినబూనుదాం. ప్రజల నుండి అనేక మంది జోగాల్‌లను తయారు చేయడమే ఆయనకు నిజమైన నివాళి అవుతుంది.

★

కార్యక్షేత్రంగా ఎంచుకున్నాడు. పార్టీ ఆయన్ని ఎమ్.కె.బి డివిజన్ గుమ్మ ఏరియాలో దళ సభ్యుడిగా పని చేసేందుకు పంపింది. ప్రారంభంలో ఇక్కడి ఎత్తైన పర్వతాలు, లోతైన అగాధాలు, కొత్త భాష, మలేరియా ఆయన్ని కొంత కలవరపరిచాయి. వీటితో పాటు అందరు విద్యార్థులకు మల్లెనే ఊహలలో ఉంటూ స్థిరత్వం కొరవడిన మనస్తత్వం సూర్యానికి కూడా కొంత మేరకు ఉండటంతో నిలదొక్కుకునే విషయంలో ఘర్షణకు గురైనాడు. అయితే విప్లవంలో ప్రజలు నిర్వహిస్తున్న పాత్ర, పార్టీ, పి.ఎల్.జి.ఎల కార్యాచరణ ఆయన్ని ఉత్తేజపరచడంతో పాటు తన పరిమితులను అధిగమింపచేశాయి. ఈ క్రమంలోనే దళంలో సెంట్రీ, పెట్రోలింగ్ వంటి మిలటరీ కర్తవ్యాలను నిర్వహించడంతో పాటు దళంలో జరిగే అధ్యయనం, చర్చలలో చురుకుగా పాల్గొంటూ వచ్చాడు. ఇక్కడి ఏరియా పార్టీ కమిటీ ప్రజలను విప్లవంలోకి సమీకరిసున్న పద్ధతులను శ్రద్ధగా గమనిస్తూ వాటిని వంటపట్టించుకుంటూ వచ్చాడు. ఈ క్రమంలోనే ఆయనలో కొంత స్థిరత్వం కూడా ఏర్పడింది. ఈ మార్పును గమనించిన స్థానిక పార్టీ ఆయనకున్న సమర్థతలను దృష్టిలో ఉంచుకొని కొన్ని నిర్దిష్ట పనులను అప్పచెప్పడం ప్రారంభించింది.

అయితే ఈ కాలంలో శతృవు ఆ ప్రాంతంలో ఆపరేషన్ ఆల్‌ఔట్ పేరుతో వరుస 'చుట్టుముట్టి అణచివేత క్యాంపెయిన్'లను కొనసాగిస్తూ వచ్చాడు. ఇటువంటి పరిస్థితులలో కామ్రేడ్ సూర్యం మిగిలిన కామ్రేడ్స్‌తో పాటు నిబ్బరంగా ఉంటూ అక్కడి పి.ఎల్.జి.ఎ నిర్వహించే ప్రతిఘటనా కార్యక్రమాలలో తన వంతు పాత్రను అందిచాడు. శతృవు జూన్ 17న ఆ ప్రాంతంపై మరో పెద్ద దాడి అభియాన్‌ను ప్రారంభించడంతో–ఈ విషయాన్ని ముందుగానే గమనించిన గుమ్మ దళం రక్షణ ప్రాంతానికి చేరే ఉద్దేశంతో గొబ్బురపడ గ్రామ అటవీ ప్రాంతానికి చేరింది. ఆ ప్రాంతం దళం కొత్తగా విస్తరించిన ప్రాంతం కావడంతో పాటు, అక్కడి ఆధిపత్య శక్తులలో ప్రధానంగా సి.పి.ఎమ్ పార్టీకి చెందినవాళ్ళు వున్నారు. వీరు ఆ ప్రాంతంలోకి మన ప్రవేశాన్ని వ్యతిరేకిస్తూ వచ్చారు. ఈ నేపథ్యంలో గొబ్బురిపడ గ్రామ నాయక్, అతని అనుచరులు ఆ గ్రామానికి పోలీసులు 19 రాత్రికి వచ్చిన విషయాన్ని దళానికి అర్థం కాకుండా చేసి, దళం మకాంను పూర్తిగా రెక్కి చేసి, దళం సమాచారాన్ని పోలీసులకు అందించారు. దీంతో పోలీసులు జూన్ 20 ఉదయం 7:30గం။ల ప్రాంతంలో ప్లాన్ ప్రకారం సెంట్రీ పోస్టు తప్పించి డేరాపై నేరుగా దాడి చేసారు. అదే సమయంలో దొడ్డికి వెళ్ళి వంటరిగా తిరిగి వస్తున్న కామ్రేడ్ సూర్యంపై ర్యాపిడ్ ఫైరింగ్ చేసి హత్య చేసారు. డేరాపై జరిగిన ఈ అకస్మాత్తు దాడి నుండి నాయకత్వ కామ్రేడ్స్‌తో పాటు మిగిలిన సభ్యులు సురక్షితంగా తప్పుకున్నారు.

అయితే శత్రు నిర్బంధంలో చిక్కుకున్న ఆ దళం సూర్యం అమరత్వ వార్తను సకాలంలో బహిర్గతపర్చలేక పోయింది. దీంతో శతృవు ఆయన మరణవార్తను కుటుంబ సభ్యులకు తెలపకుండా మృతదేహాన్ని ఖననం చేశాడు. వారం రోజుల తర్వాత సూర్యం అమరత్వ వార్తను పార్టీ ద్వారా తెలుసుకున్న కుటుంబ సభ్యులు, ప్రజాస్వామిక వాదులు సూర్యంను ఖననం చేసిన ప్రాంతానికి వెళ్ళి, మృతదేహానికి చెందిన మిగిలిపోయిన ఆనవాళ్ళను సేకరించుకొని స్వగ్రామంలో వందలాదిమంది ప్రజలతో ఘనంగా అంతిమయాత్ర నిర్వహించారు. ఉద్యమ ప్రాంతంలోని పార్టీ, పి.ఎల్.జి.ఎ, విప్లవ ప్రజానీకం యుద్ధరంగం నడుమనే ఆయనకు ఘనంగా నివాళి అర్పించారు.

ఆంధ్రప్రదేశ్‌లో ఉద్యమం తాత్కాలిక సెట్‌బ్యాక్‌కు గురై, పాలక వర్గాల భావజాలం యువతను భ్రమల్లో ముంచెత్తుతున్న నేటి తరుణంలో కామ్రేడ్ సూర్యం ఈ దేశ భవిష్యత్ గురించి ఆలోచిస్తు, గొప్ప సమాజిక బాధ్యతతో, పీడిత ప్రజల విముక్తి కోసం ప్రజాయుద్ధంలో తన వంతు రక్తాన్ని ధారపోయడం నేటి యువతకు, ప్రత్యేకంగా పట్టణ, మైదాన ప్రాంత యువతకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుంది. ఆ అమరుడికి తలవంచి వినమ్రంగా జోహర్లు అర్పిస్తూ ఆయన ఆశయాన్ని సాధించడం కోసం తుది వరకు పోరాడదాం !

★

**కేడర్లతో వ్యవహరించడంలో గతితార్కిక పద్ధతులు అవసరం!!**

**మన కేడర్లు, కామ్రేడ్లు వారు ఎవరైనప్పటికీ వారు వైరిశుక్తులో, విద్రోహ శుక్తులో కానంతకాలం వారితో వ్యవహరించేటప్పుడు మనం ఐక్యతా వైఖరిని చేపట్టాలి. అధిభౌతికవాద పద్ధతులను కాక గతితార్కిక పద్ధతులను అవలంభించాలి. గతితార్కిక పద్ధతులంటే ఏమిటి? అంటే మనం అన్నింటిని విశ్లేషించి చూడాలి. మనిషి తప్పనిసరిగా తప్పులు చేస్తాడనీ గుర్తించాలి.అతడు తప్పులు చేసినంత మాత్రానే అతనికి సంబంధించిన వాటన్నింటిని నెగేట్ చేయకూడదు. ఒక తప్పు కూడా చేయని వ్యక్తి ఈ భూ ప్రపంచంలో లేనేలేడని లెనిన్ ఓ మారు అన్నారు. ఏ వ్యక్తికి అయినా సరే ఇతరుల ఆసరా, అవసరం ఉంటుంది. కావునా తప్పులు చేసిన కామ్రేడ్స్‌తో ఎలా వ్యవహరించాలి? ముందుగా తప్పు చేసినవారి తప్పుడు భావజాలాన్ని సమగ్రంగా విమర్శించి దాన్ని పూర్తిగా నిర్మూలించడానికి పోరాటాన్ని నిర్వహిస్తాం. రెండవది అతడికి సహాయపడటం. ఒకటి పోరాడటం, రెండవది సహాయపడటం. దీనితో ఆరంభమైన మనం అతడికి బయటపడే మార్గంవుండేందుకు గాను తన తప్పుల్ని సరిదిద్దుకోవడంలో సహాయపడతాం.**

**–కా॥ మావో**

**పోరాట ప్రవంతి**

# ఈస్ట్ డివిజన్

## సాగులు ప్రజాకోర్టు

2013 డిసెంబర్‌లో జరిగిన సాగులు ఘటన తరువాత ఆ గ్రామంలో చాలా పరిణామాలు జరిగాయి. అప్పటి విశాఖ జిల్లా ఎస్.పి దుగ్గల్, ఒ.ఎస్.డి దామోదర్‌లు సాగులుకు వచ్చి ఆ ఘటనలో చనిపోయిన వారికి సంస్మరణసభను నిర్వహించి, వారి కుటుంబాలకు 5లక్షల రూపాయల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించాడు. తదుపరి పరిణామాలను పరిశీలించినట్లతే గ్రామంలోని ఆధిపత్య శక్తులుగా ఉన్న అడపా శంకర్రావు, వీరన్న పడాల్, చిన్నయ్య పడాల్, నారాయణరావులు గ్రామాన్ని మరల తమ నియంత్రణలోకి తెచ్చుకునేందుకు పావులు కదపసాగారు. గ్రామం విడిచిపెట్టి పోయిన కువ్వి కుటుంబాలు కొన్ని మళ్ళీ గ్రామంలోకి వచ్చే ప్రయత్నం చేయగా వారికి అభ్యంతరం తెలిపారు. గతంలో స్వాధీన పరుచుకొని సాగుచేసుకుంటున్న కాఫీతోట(ఎ.పి.ఎఫ్.డి.సి)ను ఎవరు సాగు చేయకుండా నియంత్రిస్తున్నారు. గ్రామంలో గల కొన్ని పేద కుటుంబాలకు పోరాడి సాధించుకున్న ఈ కాఫీతోటే ఆధారం. అయినప్పటికీ వీరి ఆధిపత్యాన్ని ఎదిరించలేకపోయారు. గ్రామంలోని ఒక సెక్షన్ ప్రజలు ప్రభుత్వ సంస్కరణలకు ఆకర్షితులయ్యి, పాకెట్ ప్రజా సంఘాలు, మిలీషియా అభ్యంతరం తెలుపుతున్నా గ్రామాన్ని కలుపుతూ వేస్తున్న రోడ్డు పనులకూ, సంబంధిత ప్రొక్లెయిన్‌కూ కాపలాగా నిలిచి సాగులు గ్రామం వరకూ రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేసారు. ఈ మొత్తం పరిణామాలపై పాకెట్ ప్రజలతో, ప్రజాసంఘాలతో పలుమార్లు చర్చించి, గ్రామంలోని పెత్తందార్లను వేరుపర్చి, ప్రజల్లో ఎండగట్టి గ్రామంలోని పేదవర్గాన్ని ప్రజల పక్షాన నిలిపే ప్రయత్నం చేయాలనీ, అదే సమయంలో గ్రామంలో గల పెత్తందార్ల ఆధిపత్యాన్ని నియంత్రించేందుకు వారిపై కొన్ని ఆంక్షలు, షరతులు విధించాలని నిర్ణయించడమైంది. ఈ ప్రజాకోర్టుకు పెదపాడు పాకెట్‌కు చెందిన 13 గ్రామాల నుండి 350 మంది (170 మంది మహిళలు) హాజరయ్యారు. తొలుత ఘటన నేపథ్యాన్నీ, ఆ తరువాత గ్రామంలో జరుగుతున్న పరిణామాలను వివరించి, మృతుల కుటుంబాల చేత మాట్లాడించారు. వారు ఘటనలో తమవారి మృతిపట్ల ఆవేదన వ్యక్తం చేస్తూ, ఘటనలో బాధ్యతారాహితంగా వ్యవహరించిన సంఘ నాయకత్వాన్నీ, మిలీషియాను తప్పుబట్టారు. అదే సమయంలో పెత్తందారుల కుట్రలో తమ వాళ్లు తెలియక భాగమైనారనీ, అలాగే తమ వారి మరణానంతరం తాము ప్రజలపై విశ్వాసం ఉంచి, తమ బతుకుదెరువుకు ప్రజల మద్దతు కోరి ఉండాల్సిందనీ, అలా కాకుండా శతృవు ప్రకటించిన ఎక్స్‌గ్రేషియాలో 2లక్షల చొప్పున తీసుకుని తప్పు చేసామనీ, అలా తీసుకున్న డబ్బు గాయపడిన వారి వైద్యానికీ, చదువులు, అప్పులు మొదలైన అవసరాలకు ఖర్చయిపోయి నేడు పేదరికాన్ని అనుభవిస్తున్నామనీ, తమను ప్రజలు క్షమించి ఆదుకోవాలని కోరారు. ఇది తీవ్రమైన రాజకీయ తప్పిదమనీ, అయినప్పటికీ ప్రజలు క్షమించి సహకరిస్తారనీ, అయితే దీన్ని ఒక హెచ్చరికగా భావించి, వారు ప్రభుత్వ మరియు పోలీసు సంస్కరణలకు దూరంగా వుండాలనీ, ఈ షరతులను ఉల్లంఘించిన ఎడల వారికి గ్రామం నుండి బహిష్కరించాలని ప్రజాకోర్టు నిర్ణయించింది.

ఇక రెండవ సమస్యగా ఘటన తరువాత సాగు చేయకుండా విడిచిపెట్టిన ఎ.పి.ఎఫ్.డి.సి కాఫీతోట గురించి చర్చించారు. సాగులు గ్రామ ప్రజలు మాట్లాడుతూ, తమపై కొనసాగుతున్న గ్రామ పెద్దల, ప్రభుత్వ, పోలీసు ఒత్తిళ్ళ మూలంగానే ఎ.పి.ఎఫ్.డి.సితోటలను విడిచిపెట్టామనీ, తాము తీవ్రమైన పేదరికాన్ని అనుభవిస్తున్నామని గ్రామంలోని 26 కుటుంబాలలో 17 కుటుంబాలు ప్రజాకోర్టును అభ్యర్థించాయి. వీరి అభ్యర్థనకు ప్రజాకోర్టు సానుకూలంగా స్పందించింది. గ్రామ పెద్దల ఆధిపత్యాన్ని ధిక్కరిస్తూ కాఫీ తోటల సాగుకు ముందుకు వచ్చిన 17 కుటుంబాలకు మళ్ళీ ఎ.పి.ఎఫ్.డి.సితోటలో సాగుకు అవకాశం కల్పిస్తున్నట్లు ప్రకటించి మిగతా 9కుటుంబాలు కూడా పునరాలోచించుకుని ప్రజల పక్షాన నిలవాలనీ, గ్రామం ఐక్యం కావాలనీ ప్రజాకోర్టు పిలుపునిచ్చింది. చివరగా గ్రామ పెత్తందార్లను ప్రజాకోర్టు నిలదీసింది. సమస్య నిర్ధిష్టతకు వస్తే కువ్వివీధి ప్రజలు మళ్ళీ గ్రామానికి వచ్చి నివసించాలనీ, గ్రామ ప్రజలు ఎ.పి.ఎఫ్.డి.సితోట సాగుచేసుకునేందుకు ఆటంకంగా నిలుస్తూ వారిని నయానా, భయానా ప్రభుత్వ సంస్కరణల వైపు మళ్ళిస్తున్న పెత్తందార్లయిన అడపా శంకర్రావు, వీరన్న పడాల్, చిన్నయ్య పడాల్, నారాయణరావులు ఈ ప్రజాకోర్టులో వరుసగా తమ తప్పులను అంగీకరిస్తూ ప్రజలు తమను క్షమించి చివరి అవకాశం ఇవ్వాల్సిందిగా కోరారు. ఇందుకు ప్రజాకోర్టు స్పందిస్తూ వీరు అనుసరిస్తున్న తెగ ఆధిపత్య,రాజకీయాల మూలంగా గతం నుండి గ్రామంలో అనేక సమస్యలకు వీరు కారణమయ్యారనీ, వీళ్ళు పద్ధతి మార్చుకోనట్లయితే తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరిస్తూ వారిపై కొన్ని షరతులను విధించింది. అవి 1. ఒక సంవత్సర కాలం పాటు గ్రామం విడిచి ఎటూ వెళ్ళరాదు. 2. 'కువ్వి' ప్రజల జీవికకు ఎటువంటి ఆటంకాలు కల్పించరాదు. 3. గ్రామంలో ఎ.పి.ఎఫ్.డి.సి కాఫీతోట సాగుకు సిద్ధపడిన వారిపై ఏ రకమైన ఒత్తిడికి పాల్పడరాదు. 4. ప్రభుత్వ సంస్కరణలకు దూరంగా వుండాలి. ఈ షరతులను ఉల్లంఘించినట్లయితే గ్రామ బహిష్కరణ తప్పదని ప్రజాకోర్టు హెచ్చరించింది.

2013 సాగులు ఘర్షణను ఉపయోగించుకుని గ్రామాన్ని రెండుగా చీల్చి ప్రజల్లో అనైక్యతను సృష్టించేందుకు ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం చేస్తున్న ప్రయత్నాలను ఈ ప్రజాకోర్టు వమ్ము చేసింది. ప్రభుత్వ పక్షాన చేరిన ప్రజావ్యతిరేకులను వేరు చేసి, వారి కుటిల ఎత్తుగడలను ప్రజల్లో బహిర్గతపర్చింది. గ్రామంపై పెత్తందార్ల ఆధిపత్యాన్ని కట్టడి చేస్తూ పలు షరతులు విధించిన ఈ ప్రజాకోర్టు ప్రభుత్వ కుట్రలను ఓడిస్తూ పేద ప్రజలంతా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చింది.

## అపారమైన ప్రజల సహకారంతో జరిగిన విప్లవ ప్రజా నాయకుడు, అమరుడు కామ్రేడ్ శరత్ దినకార్యం

2014 అక్టోబర్ 19న కోరుకొండ ఘటనలో అమరుడైన కామ్రేడ్ శరత్ దినకార్యం ఆయన స్వగ్రామమైన కొయ్యూరు మండలం కన్నవరం గ్రామంలో జరిగింది. దీనికి గూడెం, కొయ్యూరు మండలాలకు చెందిన ప్రజలు, బంధుమిత్రులు 1000 మందికి పైగా హాజరయ్యారు. ఈ కార్యనిర్వాహణకు ముందుగా ప్రజాసంఘాలిచ్చిన పిలుపుకు స్పందించిన ప్రజలు, బంధుమిత్రులు తమ శక్తి మేరకు విరాళాలు అందించారు. 2 మండలాల నుండి దాదాపు 8 క్వింటాల బియ్యం, 7 గొడ్లు, 35 వేల రూపాయల వరకు నగదును విరాళంగా ఇచ్చారు. ప్రజల ఆదరాభిమానాలను చూరగొన్న విప్లవ ప్రజానాయకుడు కామ్రేడ్ శరత్ దినకార్యం ఈ విధంగా అపారమైన ప్రజల సహకారంతో ప్రజల మధ్య నిర్వహించబడింది.

## ప్రజల డిమాండ్‌కు తలొగ్గి సంతల ఏర్పాటుకు అనుమతినిచ్చిన ప్రభుత్వం

కొయ్యూరు మండలం బూదరాళ్ళ పంచాయితీ 33 గ్రామాలతో ఎంతో విశాలమైనది. ఈ పంచాయితీ ప్రజలు పెదవలస, గూడెం, కొయ్యూరు సంతలపై ఆధారపడతారు. వీరందరికీ ఈ సంతలు ఎంతో దూరాభారం, వ్యయప్రయాసాలతో కూడుకున్నవి. పంచాయితీలోనే అందుబాటులో సంతలుండాలన్న ఆకాంక్షను వీరు సుదీర్ఘకాలం నుండి వ్యక్తం చేస్తున్నారు. 2014 జనవరిలో ఏర్పాటు చేసిన 'సంత సాధన కమిటీ'లో కూడా ఈ పంచాయితీ ప్రాతినిధ్యం ఉంది. ఆ తరువాత కొయ్యూరు, పెదవలసలలో జరిగిన ప్రజాందోళనల సందర్భంగా కూడా ఈ సంత డిమాండ్‌ను ప్రభుత్వం ముందుంచారు. ఆయా సందర్భాలలో ప్రభుత్వాధికారులు హామీలిచ్చినప్పటికీ దాదాపు ఏడాది కాలంగా సంత ఏర్పాటును దాటవేస్తూ వచ్చారు. 2015 మార్చిలో బూదరాళ్ళ పంచాయితీ పర్యటనకు వచ్చిన సబ్‌కలెక్టర్‌ను పంచాయితీ ప్రజలు సంత విషయమై నిలదీసారు. ఎట్టకేలకు ప్రజల డిమాండ్‌కు తలొగ్గి ప్రభుత్వం సంత ఏర్పాటుకు ఆమోదం తెలపడంతో కొయ్యూరు, కె.డి పేట షావుకార్లు ముందుకువచ్చి గరిమెండ, బూదరాళ్ళ గ్రామలలో సంతలను ఏర్పాటు చేసారు. పంచాయితీలోనే సంతలు ఏర్పాటు కావడంతో ప్రజలకు దూరపు సంతల మూలంగా ఎదురవుతున్న సమస్యలు పరిష్కారమైనాయి.

## సప్పర్లలో (టి.యు.ఎఫ్ ఆధ్వర్యంలో) విజయవంతమైన బాక్సైట్ తవ్వకాలకు వ్యతిరేకంగా జరిగిన మీటింగ్

అల్లూరి వర్ధంతి పురస్కరించుకొని మే 7, 2015న గాలికొండ, ధారకొండ, దుప్పిలవాడ, గుమ్మిరేవుల, సీలేరు, అమ్మవారి ధారకొండ ప్రజలు సుమారు 1000 మందికి పైగా బాక్సైట్ తవ్వకాలకు వ్యతిరేకంగా సాంప్రదాయక ఆయుధాలతో సప్పర్లలో ధర్నా చేసారు. సేట్రాయిపల్లి నుండి సప్పర్ల హాస్పిటల్ వరకూ సుమారు రెండు కిలోమీటర్లు బ్యానర్లు, ఫ్లెకార్డులు పట్టుకొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీ చేసారు. 11గం॥ నుండి 3గం॥ల వరకు ధర్నా జరిగింది. ముందు ధర్నా చేసి తర్వాత మీటింగ్ నిర్వహించారు. చంద్రబాబు మనల్ని అభివృద్ధి పేరు చెప్పి మోసం చేస్తున్నాడనీ, అలాంటి పాలకుల మాటలు నమ్మి మోసపోవద్దనీ, మన ఆదివాసీలను అడవి నుండి దూరం చేయడానికి ప్రభుత్వాలు మాట్లాడుతున్న మాటలన్నీ అసత్యాలనీ ప్రజలు తమ అభిప్రాయాలను సభాముఖంగా మాట్లాడారు. అందుకోసం మన 6 పంచాయితీల ప్రజలంతా ఏకమై బాక్సైట్‌ను అడ్డుకోవాలనీ, ప్రాణాలకైనా తెగించి బాక్సైట్‌ను అడ్డుకుంటామని ప్రజలు నినదించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దిష్టిబొమ్మ దగ్ధం చేసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమ నిరసనను తెలిపారు.

## లొంగుబాట్లకు వ్యతిరేకంగా ప్రజాకోర్టు

గాలికొండ ఏరియా పి.కె గూడెం పాకెట్ ఎ.వి.ఆర్.సి.ఎస్, మన్యం పితూరిసేన నాయకత్వంలో మే 23న లొంగుబాట్లకు వ్యతిరేకంగా ప్రజాకోర్టు జరిగింది. దీనికి పెదపాడు, పి.కె గూడెం పాకెట్‌ల నుండి 300 మంది (120 మంది మహిళలు) ప్రజలు హాజరయ్యారు. చెరుకుంపాకలు గ్రామానికి చెందిన (గూడెం పంచాయితీ, గూడెం మండలం) సన్నమనాయుడు, చంటి, రాంబాబులు సుదీర్ఘకాలంగా ఎ.వి.ఆర్.సి.ఎస్ సంఘనాయకత్వంగా పనిచేస్తూ, శతృవు ఒత్తిళ్ళను రాజకీయ చైతన్యంతో అధిగమించలేక 12 మే 2015న శతృవుకు లొంగిపోయారు. వీరిని ఈ ప్రజాకోర్టు నిలదీసి కొన్ని ఆంక్షలు విధించింది. కాఫీ, బాక్సైట్ పోరాటాలలో అరెస్టులకు వెరువక పురోగమిస్తున్న ప్రజలకు నాయకత్వం వహించాల్సిన సంఘనాయకత్వం కనీస రాజకీయ చైతన్యాన్ని ప్రదర్శించక శతృవు ముందు మోకరిల్లడాన్ని ప్రజలు తీవ్రంగా తప్పుపట్టారు. దీనిని ప్రజాఉద్యమానికి చేసిన ద్రోహంగా పరిగణిస్తూ వారికి పోరాడి సాధించుకున్న భూమి, కాఫీ తోటలపై హక్కును సడలించాలని తీర్పునిచ్చారు.

ప్రజాఉద్యమాలను బలహీనపరిచేందుకు శతృవు అనేక కుటిల ఎత్తుగడలను అవలంబిస్తూ లొంగుబాట్లను ప్రోత్సహిస్తున్నాడనీ, పోరాడనిదే ప్రజల బతుకు మారదనీ, లొంగుబాటు కన్న మరణం మేలనీ, లొంగుబాట్లను వ్యతిరేకించాలని ప్రజాకోర్టు ఈ సందర్భంగా ప్రజలకు విజ్ఞప్తి చేసింది.

## గాలికొండ ఏరియాలో విజయవంతమైన అమరుల, విప్లవకారుల బంధుమిత్రుల సభ

శతృవు ఎల్.ఐ.సి యుద్ధ వ్యూహాన్ని అనుసరించి సైనిక, రాజకీయ రంగాలలో మానసిక యుద్ధాన్ని అమలు చేస్తున్నాడు. ఇందులో ప్రజాసంఘాలపై, పార్టీపై సైద్ధాంతిక, రాజకీయ దుష్ప్రచార దాడికి పాల్పడుతూ పత్రికా ప్రకటనలివ్వడం, కౌన్సిలింగ్‌ల పేరిట విప్లవకారుల కుటుంబాలను మానసికంగా వేధించడం, తమవాళ్ళ లొంగిపోయి సాధారణ జీవితం గడపాలని కోరుకుంటున్నట్లు విప్లవకారుల కుటుంబాలచే బలవంతపు ప్రకటనలు ఇప్పించడం మొదలైన ఎత్తుగడలు అవలంభిస్తున్నాడు. వీటిని సమర్ధవంతంగా ఎదుర్కొనేందుకు ప్రజాసంఘం, పార్టీ కార్యకర్తలను రాజకీయంగా సంఘటితపర్చి వారిలో మానసిక స్థైర్యాన్ని నింపేందుకు సి.ఆర్.బి రూపొందించిన సర్క్యులర్ వెలుగులో, గాలికొండ ఏరియాలో ఈ సభను నిర్వహించడం జరిగింది. ఈ సభకు అమరవీరుల కుటుంబాలను సైతం ఆహ్వానించడం జరిగింది. ఈ ఆహ్వానాన్ని అందుకొని 10 దళ సభ్యుల కుటుంబాలు, 6 ప్రజాసంఘ కార్యకర్తల కుటుంబాలు, 11 అమరుల కుటుంబాలు, వారి బంధుమిత్రులు

మొత్తం 120 మంది హాజరైనారు. బాహ్యావలయంలో సెంట్రీ, అబ్జర్వేషన్, పెట్రోలింగ్‌ల రక్షణ కల్పించగా ఈ సభను మే 25,2015న నిర్వహించడం జరిగింది. గాలికొండ ఏరియా కమిటీ కార్యదర్శి కా॥ ఎక్స్ అధ్యక్షతన ఈ సభ ఉదయం 8గం॥ 30నిమిషాలకు అమరుడు గాలికొండ ఏరియా పూర్వ కార్యదర్శి కా॥ శరత్, కోరుకొండ కాఫీ అధ్యక్షుడు కా॥ గణపతిల కమ్యూన్‌లో, అమరుడు కా॥ మంగరాజు మీటింగ్ హాల్‌లో, అమరుల స్థూపం వద్ద కా॥ రణిత పార్టీ జెండాను ఆవిష్కరించడంతో ప్రజలు, మీటింగ్ ఆహ్వానితులు, స్థానిక బలగాలు జెండా ప్రోటోకాల్‌ను అనుసరించి, అంతర్జాతీయ గీతాన్ని ఆలపించి సభను ప్రారంభించారు. సభాధ్యక్షుడు అమరవీరుల త్యాగాలనుద్దేశించి మాట్లాడుతూ గాలికొండ ఉద్యమంలో అమరులైన వారినీ, మొత్తం పార్టీ విప్లవోద్యమంలో అమరులైనవారినీ, ముఖ్యంగా ఈ ఏడాది కాలంలో అమరులైన కా॥ శరత్, కా॥ గణపతిలనూ, కోరాపుట్ అమరుడు కా॥ పూర్ణో, మల్కనగిరి అమరుడు కా॥ లాలు, కా॥ జోగాల్‌లను స్మరించుకున్నారు. అమరవీరుల సంస్మరణార్థం అయుధాలను "నీచే శస్త్ర్" చేసి, మౌనం పాటించి సైనిక సంతాపం ప్రకటించారు. అనంతరం ఆయుధాలను "సీధా శస్త్ర్" చేసి "అమరవీరుల ఆశయాలను కొనసాగిస్తా"మని నినదించడంతో సభ తిరిగి ప్రారంభమైంది. ముందుగా అధ్యక్షుడు అమరవీరుల కుటుంబాలను పరిచయం చేస్తూ, ఆయా అమరుల విప్లవ కృషినీ, వారి త్యాగాన్నీ, అమరత్వాన్ని వివరించారు. అనంతరం విప్లవకారుల, ప్రజాసంఘ కార్యకర్తల కుటుంబాలను సభకు పరిచయం చేసి, సభ యొక్క ప్రాధాన్యతను వివరిస్తూ మాట్లాడారు. అడవి, నీరు, భూమిపై హక్కు కోసం, పేద ప్రజల రాజ్యం కోసం నేడు మావోయిస్టు పార్టీ నాయకత్వంలో జరుగుతున్న ప్రజాయుద్ధం గురించీ, దోపిడీ ప్రభుత్వాలు ఎల్.ఐ.సి బహుముఖదాడి ద్వారా ఈ ప్రజాయుద్ధాన్ని అణచివేసి తమ దోపిడీ పాలనను కొనసాగించేందుకు చేస్తున్న ప్రయత్నాలను వివరిస్తూ, ప్రజాయుద్ధం ద్వారానే ప్రజల బతుకు మారుతుందనీ మాట్లాడి, ప్రజాయుద్ధం యొక్క ప్రాధాన్యతను వివరించారు. ఈ బహుముఖ దాడిలో భాగంగా శత్రువు మానసిక యుద్ధాన్ని సాగిస్తున్న తీరును, అందులో భాగంగా విప్లవకారుల కుటుంబాలపై అవలంభిస్తున్న వేధింపులనూ, మానసిక యుద్ధ ఎత్తుగడలనూ వివరించారు. అమరుల కుటుంబాలు ఒక్కొక్కరు మాట్లాడుతూ "పదిమంది మంచి కోరి పేద ప్రజల రాజ్యం కోసం తమవాళ్ళు ప్రాణత్యాగం చేసారనీ, అందుకు తాము గర్విస్తున్నామనీ, ప్రజాసైన్యం లేకుండా ప్రజలకుండేదేమిలేదనీ, కనుక ప్రజాసైన్యం ఉండాలనీ, ప్రజాయుద్ధం కొనసాగాలనీ, అమరుల ఆశయాలను కొనసాగించాలనీ, అందుకు తాము పార్టీనీ, ప్రజాసైన్యాన్ని కాపాడుకుంటామని వివరించారు. అనంతరం విప్లవకారుల కుటుంబాలు మాట్లాడాయి. తమవాళ్ళు పార్టీలోనూ, ప్రజాసైన్యంలోనూ పని చేస్తున్నందుకు ప్రభుత్వం, పోలీసులు తమను మానసికంగా వేధిస్తున్నారనీ, ఆ వేధింపులు తాము ఎదుర్కొంటామనీ, తమవాళ్ళు మాత్రం ధైర్యంగా పార్టీలోనూ, ప్రజాసైన్యంలోనూ కొనసాగాలనీ, ప్రజాయుద్ధంలో నూతన విజయాలను సాధించాలనీ తాము కోరుకుంటున్నట్టు చెప్పారు. కుటుంబాల గురించి చింతించవద్దనీ, ఇక్కడి ప్రజాసంఘాలు తమకు మద్దతుగా ఉన్నాయనీ, లొంగుబాటు ఆలోచన దరిచేరనీయవద్దనీ సూచించారు. రెండు గంటల భోజన విరామం అనంతరం సభ మళ్ళీ ప్రారంభమయింది. ప్రజాసంఘ కార్యకర్తల కుటుంబీకులు, బంధుమిత్రులు మాట్లాడారు. వారు ప్రధానంగా శత్రువు నూతనంగా అమలు చేస్తున్న సంస్కరణ కార్యక్రమాల గురించీ, "జనమైత్రి" పేరిట చేస్తున్న విప్లవ ప్రతీఘాతుక ప్రచారం గురించీ, ప్రజాసంఘాలపై, ప్రజాపోరాటాలపై అమలు చేస్తున్న అణచివేత, నిర్బంధం గురించీ నేరుగా తమపై లొంగిపొమ్మని సాగిస్తున్న వేధింపుల గురించీ, తరచుగా తమపై జరుపుతున్న విచక్షణారహిత కాల్పుల గురించీ మాట్లాడారు. ప్రజా సంఘ కార్యకర్తలు మాట్లాడుతూ తాము నిత్యం నిర్బంధం ఎదుర్కొంటూ రహస్య జీవితం గడుపుతున్నామనీ, శత్రువు ప్రజలనూ, పార్టీనీ వేరు చేసి పార్టీని నిర్మూలించేందుకూ, ప్రజాపోరాటాలను అణచివేసేందుకు ప్రయత్నిస్తున్నాడనీ, ఎంత తీవ్ర నిర్బంధం ఎదురైనా పార్టీనీ, ఉద్యమాన్నీ వదలబోమని మాట్లాడారు. అనంతరం దళ సభ్యులు, ఏరియా కమిటీసభ్యులు మూడున్నర దశాబ్దాల ఏరియా ఉద్యమాన్ని ఉద్దేశించి మాట్లాడారు. చివరిగా సభా ఆహ్వానితులు, విప్లవకారులు అందరూ "అమరుల బాటలో దృఢంగా శత్రువుకు వ్యతిరేకంగా పోరాడతామనీ, మోసపు యుద్ధాన్ని తిప్పికొడతామనీ, లొంగుబాట్లను అసహ్యించుకుంటామనీ, ప్రజారాజ్యాధికారం సాధించుకుంటామనీ, దోపిడీ లేని నూతన సమాజ నిర్మాణం కోసం చివరి ఊపిరి వరకూ పోరాడతామనీ, శత్రువు ముందుతలవంచబోమనీ" ప్రతిజ్ఞ చేసారు. చివరిగా అంతర్జాతీయ గీతం ఆలపించి జెండా అవనతం చేయడంతో సభ ముగిసింది.

★

---

# శ్రీకాకుళం-కోరాపుట్ డివిజన్

## నారాయణపట్నాలో తిరిగి ప్రజాయుద్ధంలోకి సమీకృతులవుతున్న ప్రజలు

నారాయణపట్న-లక్ష్మీపురం ఏరియా పరిధిలో శత్రువు మన పార్టీపై దుష్ప్రచారాన్ని, పుకార్లను సృష్టించి ప్రజల్లో భయందోళనలను, గందరగోళాలను రేకెత్తించి ప్రజలను పార్టీకి దగ్గర కాకుండా చేయడానికి ప్రయత్నం చేస్తున్నారు. అలాగే ప్రజల పోరాటాల నుండి పక్కదారి పట్టించి తమకు అనుకూలంగా మలచుకోవాలనే ఉద్దేశంతో జనసంపర్క్ శిబిరాలు పెద్ద ఎత్తున ఏర్పాటు చేసి యువతీ, యువకులతో ధింసా నృత్యాలు, వాలీబాల్ వంటి క్రీడల్లో పోలీసులు కలిసి పాల్గొనడం, ప్రజలకు వైద్యం, వస్తువులు అందివ్వడం వంటి కుటిల ఎత్తుగడలతో ప్రజలను మభ్య పెట్టి, ప్రలోభాలకు గురి చేసి, ఇన్‌ఫార్మర్ నెట్‌వర్క్‌ను, కోవర్టు యంత్రాంగాన్ని తయారు చేసుకోవడం, విప్లవ ప్రతీఘాతుకత్వాన్ని పెంచడం కోసం శత్రువు తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నాడు. మరోవైపు ప్రజలు పోరాడి సాధించుకున్న భూములను తిరిగి భూస్వాములు ఆక్రమించుకొని అమ్మేస్తున్నారు. ఇప్పటికే ఉన్న పోలీసు క్యాంపులు తోడు మరిన్ని పోలీసు క్యాంపుల ఏర్పాటుకు, మైనింగ్‌కు అనుకూలంగా పెద్దఎత్తున

రోడ్లు, బ్రిడ్జి నిర్మాణాలు చేస్తున్నారు. ఈ విధంగా నారాయణపట్న-బందుగాం ఏరియాలో పోలీసులు, ప్రభుత్వం చేస్తున్న కుటిల ఎత్తుగడలను వ్యతిరేకిస్తూ, పోలీసుల దుష్ప్రచారాన్ని బహిర్గతం చేస్తూ, వాస్తవాలను ప్రజలకు తెలియచేస్తూ, ప్రజల సహకారంతో నారాయణపట్న ప్రాంతంలో పోస్టర్స్ ద్వారానూ, గ్రామాలలో మౌఖికంగాను పార్టీ, పి.ఎల్.జి.ఎ ప్రచారం చేస్తున్నాయి. మనం చేస్తున్న ప్రచారంతో ప్రజల్లో ఒక్క మేరకు గందరగోళాలు, భయందోళనలు తొలగి పార్టీపైన విశ్వాసం ఏర్పడుతున్నది. గతంలో శత్రు దుష్ప్రచారంతో గ్రామాలు వదిలి పారిపోయిన సాధారణ ప్రజలు కొంత మంది సంఘనాయకులు తిరిగి గ్రామాలకు వచ్చి పార్టీని కలవడం కోసం ప్రయత్నం చేయడం ఒక మంచి పరిణామంగా చెప్పుకోవచ్చు. శతృవు ఒత్తిడికి గ్రామాల ప్రజలు సరెండర్స్ అయినప్పటికీ పార్టీకి వ్యతిరేకంగా వుండమనీ, రహస్యంగా సహకరిస్తామని ప్రతిజ్ఞలు చేస్తున్నారు. పోలీసు క్యాంపుల మధ్యకు వెళ్ళి క్యాంపుల దగ్గరే పోస్టర్లు వేస్తున్నారు. ఈ పరిణామాలు నారాయణపట్నాలో పూర్తిగా పార్టీని నిర్మూలించామనీ, ఇక పార్టీ లేదనీ భుజాలు చరుచుకుంటున్న భూస్వాములకు, పోలీసులకు చెంపపెట్టు అయింది. మరోపక్క మెజారిటీ పీడిత ప్రజలకు పార్టీపై విశ్వాసం పెరుగుతుండటంతో తిరిగి రహస్యంగా సంఘటితం కావడానికి పునాది ఏర్పడుతున్నది.

శతృవు మనల్ని పొడబధ్ర పంచాయితీలో పూర్తిగా దెబ్బతీసామని బింకాలు పోతున్న సమయంలోనే అక్కడి ప్రజలు మన యాక్షన్ టీంకు అన్ని రకాల సహాయసహకారాలు అందించడంతో, పొడబధ్ర బి.ఎస్.ఎఫ్ క్యాంపుకు అతి సమీపంలోనే ఆంబుష్ నిర్వహించి ప్రభుత్వాన్ని, పోలీసులను ఖంగు తినిపించారు. ఈ సంఘటన నారాయణపట్నా ఏరియాలో ప్రజాయుద్ధానికి అనుకూలంగా మారుతున్న పరిస్థితులకు సంకేతంగా నిలిచింది.

## ఐక్యవేదికల నేతృత్వంలో పురోగమిస్తున్న ప్రజా పోరాటాలు

మే 14న జరిగిన పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికలలో నూతనంగా అధికారంలో వచ్చిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సామ్రాజ్యవాద అనుకూల ఆర్థిక సంస్కరణలను వేగవంతం చేస్తున్నాయి. ముఖ్యంగా ఒడిశాలో నవీన్ పట్నాయక్ నేతృత్యంలోని బి.జె.డి ప్రభుత్వం రాష్ట్రాన్ని బహుళజాతి సంస్థలకు టోకున అమ్మడంలో ఒక అడుగు ముందు ఉంది. దీంతో రాష్ట్ర వ్యాపితంగా భూమికోసం, విస్తాపనకు వ్యతిరేకంగా వేలది మంది ప్రజలు వీదుల్లోకి వస్తున్నారు. అనేక ప్రజా పోరాటాలు మిలిటెంట్‌గా బద్దలవుతున్నాయి. ఇదే పరిస్థితి కోరాపూట్ జిల్లాలో కూడా ఉంది.

ముఖ్యంగా బాక్సైట్ పోరాటాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున కదులుతున్నారు. కొన్ని చోట్ల తవ్వకాలను నిలిపి వేసారు. తవ్విన దగ్గర మట్టి తరలింపును కూడా అనుమతించడం లేదు. మట్టి తరలింపుకు వచ్చిన ట్రాన్స్‌పోర్ట్ కంపెనీ అధికారులపై దాడులు చేస్తున్నారు. వారికి తోడుగా వస్తున్న గుండాలనూ, పోలీసులను ఎదుర్కొంటున్నారు. ఈ పోరాటాల్లో ప్రజల సంఘటిత శక్తి రోజురోజుకు బలపడుతున్నది. ఈ సమస్యలతో ప్రజలకు శతృవులుగా ముందుకొస్తున్న హిండాల్కో, వేదాంత వంటి కార్పోరేట్ సంస్థలకు వ్యతిరేకంగా పోరాడటమే కాకుండా ఈ కార్పోరేట్ సంస్థలకు అండగా ఉన్న దేశ దోపిడీ పాలకవర్గాలనూ, వారి యజమానులైన సామ్రాజ్యవాదులను గుర్తించి వారికి వ్యతిరేకంగా రాజకీయ పోరాటానికి సన్నద్ధమవుతున్నారు.

ఈ పోరాటాల్లో పాలొంటున్న ప్రజలు పోరాట కమిటీలు ఏర్పరచుకుంటున్నారు. పోరాటాల మధ్య సమన్వయం కోసం ఐక్యవేదికలను ఏర్పరచుకొని వాటి నేతృత్వలో ప్రజలు చురుగ్గా కదులుతున్నారు. అంతే కాకుండా తమ సహజ సంపదను కాపాడుకునేందుకు ప్రజలను చైతన్య పరిచే విధంగా 'డొంగర పూజ' వంటి సాంప్రదాయ పండగలను నిర్వహించుకుంటున్నారు. ఈ సారి కోరాపూట్ జిల్లాలో జరిగిన 'డొంగర పూజ' కు మూడువేల మందికి పైగా ప్రజలు హజరైనారు.

మైనింగ్ వ్యతిరేక పోరాటమే కాకుండా జిల్లాలో ప్రభుత్వ నిర్లక్షానికి గురైన నూక దొరలు, కొటియాలు, గురువ వంటి తెగలు రిజర్వేషన్ కోసం మిలిటెంట్‌గా దీర్ఘకాలిక పోరాటానికి సిద్ధమవుతున్నారు. ముఖ్యంగా ఈ తెగలకు చెందిన విద్యార్థులు, యువకులు రిజర్వేషన్ సాధించడంలో భాగంగా కొన్ని నిర్దిష్ట సమస్యలపై కలెక్టర్ ఆఫీసుకు ర్యాలీలు, ధర్నాలు నిర్వహిస్తున్నారు. నిరాహార దీక్షలు చేపడుతున్నారు. అంతేకాకుండా తమ డిమాండ్‌కు ప్రజల మద్దతును కూడగట్టేలా గ్రామాలలో సభలు నిర్వహిస్తున్నారు.

మరోవైపు తుఫాను నిధుల అవినీతిపై ఐక్యవేధికల నేతృత్వంలో ప్రభుత్వ అధికారాలను ఘెరావ్ చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యల్లో మహిళలు, యువత అధికారులను, మంత్రులను నిలదీస్తున్నారు.

ఈ ప్రజాపోరాటాలతో పాటు, గ్రామీణ ప్రాంతంలో ప్రజలు పార్టీ నేతృత్వంలో పోరాడి కొన్ని సమస్యలను పరిష్కరించుకొంటున్నారు. నందపూర్ ఏరియా పెద్దపాడు గ్రామంలో మహిళలు సంఘ నాయకత్వంలో కదిలి మధ్యంను ధ్వంసం చేసారు. సారాను నిషేధించాలని డిమాండ్ చేసారు. ఈ పోరాట ప్రభావంతో గొల్లూరు, అంపవెల్లిలలో సారా పాక్షికంగా బంద్ అయింది.

డివిజన్‌లో పెద్ద ఎత్తున జరుగుతున్న ఈ పోరాటాలతో పాటు మావోయిస్టు పార్టీ, పి.ఎల్.జి.ఎల ప్రభావం ప్రజలలో పెరుగుతుండటంతో బెంబేలెత్తిన నవీన్ ప్రభుత్వం వాటిని అణచివేసేందుకు కేంద్ర, రాష్ట్ర సాయుధ బలగాలను పెద్దఎత్తున మోహరిస్తున్నది. ఇందులో భాగంగానే రాళ్ళగడ్డలో బి.ఎస్.ఎఫ్ క్యాంప్ పెట్టింది. మరోవైపు పెద్దపాడులోని బిర్లాకంపెనీ గెస్ట్‌హౌస్‌లో మరోపోలీసు క్యాంపు పెట్టేందుకు సన్నాహాలు జరుగుతుండగా వందమందికిపైగా మిలీషియా కదిలి దానిని ధ్వంసం చేసారు.

## పోలీస్ ఇన్‌ఫార్మర్ నోవకు ప్రజాకోర్టులో మరణశిక్ష

నారాయణపట్న-లక్ష్మీపురం ఎ.సి పరిధిలో బజర్‌ఘుడ్ పాకెట్‌లోని ప్రజలు సంఘటితమయ్యి, స్థానిక పెత్తందార్ల అధికారాన్ని నిర్వీర్యం చేసి విప్లవ ప్రజా కమిటీని ఏర్పర్చుకున్నారు. దీన్ని దెబ్బతీయడం కోసం ఈ పాకెట్‌పై శతృవు సీరియస్‌గా కేంద్రీకరించాడు. కుంబరిపుట్ బి.ఎస్.ఎఫ్ క్యాంపు పెట్టిన తర్వాత శత్రు దాడి మరింత పెరిగింది. 2014లో ఆర్.పి.సి అధ్యక్ష, ఉపాధ్యాక్షులను నయానా, భయానా లొంగదీసుకున్నారు. సరెండర్ అవ్వాలని ఒత్తిడి తెస్తూ గ్రామాలపై దాడులు పెరిగాయి. మరీ ముఖ్యంగా ఇన్‌ఫార్మర్ నెట్‌వర్క్ ఏర్పాటు కోసం తీవ్ర ప్రయత్నాలు

చేసారు. దాంట్లో భాగంగానే బజర్‌ఘడ్ గ్రామంలో వార్డ్ మెంబర్ నోవను తమకు అనుకూలంగా మలుచుకున్నారు. వీడు గతం నుండి సర్పంచ్‌తో కలిసి ప్రభుత్వ సంస్కరణలు, పథకాల ద్వారా గ్రామానికి, ప్రజలకు చెందిన డబ్బులను కాజేయడం, తన భార్యనే అంగన్‌వాడి హెల్పర్‌గా పెట్టి పిల్లలకు ఇవ్వాల్సినవన్నీ అమ్ముకోవడం వంటి అవినీతి పనులకు పాల్పడేవాడు. గ్రామ ప్రజలపై పెత్తనం చెలాయించేవాడు. ఈ విషయంపై సంఘం, ఆర్.పి.సి వీడికీ రెండుసార్లు దేహశుద్ధి చేసి హెచ్చరించడం జరిగింది. అప్పటినుండి ప్రజలకు అనుకూలంగా వున్నట్లు నటిస్తూనే పార్టీపట్ల వ్యతిరేకతను పెంచుకున్నాడు. ఆ తరువాత పోలీసు క్యాంపు వచ్చి నిర్బంధం పెరగడం, వివిధ కారణాల రీత్యా మన పార్టీ కార్యకలాపాలు బలహీనపడటంతో తిరిగి వీడి ఆధిపత్యాన్ని నిలుపుకోవడం కోసం పోలీసులు ఇచ్చే డబ్బులకు, సారాకు అలవాటు పడి పార్టీ సమాచారాన్ని ఇవ్వడానికి పోలీసులతో ఒప్పందం చేసుకున్నాడు. అలా వీడిచ్చిన సమాచారంతో మన దళంపై రెండుసార్లు పోలీసులు దాడికోసం ప్రయత్నించారు. ప్రజల సహకారంతో మన కామ్రేడ్స్ తృటిలో తప్పుకున్నారు. అలాగే గ్రామాలలో సంఘనాయకులనూ, మిలీషియాను బలవంతంగా బెదిరించి తీసుకెళ్ళి సరెండర్ చేయించాడు. ఆ సంధర్భంగా సరెండర్ అయినవాళ్ళకు ఇచ్చిన డబ్బులు కూడా వీడే తీసుకున్నాడు.

ఆ పాకెట్‌లో మిగతా గ్రామాలను కూడా సరెండర్ కావాలనీ, లేదంటే అరెస్టులు, ఫైరింగులు తప్పవని ఒత్తిడి చేయడం, సరెండర్ కాని గ్రామాలకు పోలీసులను తీసుకెళ్ళి సంఘనాయకులను, మిలీషియాను పట్టించటానికి ప్రయత్నించడం, ప్రజలను కొట్టించడం, డంపులను చూపించమని ఒత్తిడి చేయడం ఈ విధంగా రోజు రోజుకు పోలీసుల అండతో వీడి ఆకృత్యాలు తీవ్రమయ్యాయి. వీడి అండతో పోలీసులు గ్రామానికి వచ్చి, ఇళ్ళలో పడుకోవడం మొదలుపెట్టారు. ఈ పాకెట్‌లో మరికొందరిని ఇన్‌ఫార్మర్‌లుగా మారమనీ, డబ్బులు దొరుకుతాయని చెప్పి వాళ్ళద్వారా మన సమాచారం సేకరించడానికి ప్రయత్నం చేసాడు. అలా రెండుచోట్ల మనం పెట్టుకున్న మైన్స్ సమాచారాన్ని పోలీసులకు ఇచ్చాడు. వీడి సమాచారంతో పోలీసులతో వచ్చి వాటిని నిర్వీర్యం చేసారు. ఆ సందర్భంగా వీడికి డబ్బులిచ్చారు. వారం సంతరోజు పోలీసుక్యాంపుకు వెళ్ళడం, సమాచారం చెప్పడం ప్రజలందరూ చూసేవారు. ఇవన్నీ జరుగుతున్న కాలంలో (10 నెలలు) మన పార్టీ ఆ ఏరియాలో లేకపోవడం, పార్టీ లేదనీ, ఇక రాదనీ, తనకు పోలీసు సపోర్టు ఉందనీ, ఎవరు ఏమి చేయలేరని తాగి మాట్లాడటం, ప్రజలను బెదిరించడం, కొట్టడం వంటివన్నీ బహిరంగంగానే చేసాడు. ఈ పరిస్థితులలో మన పార్టీ 2015 మే 1న ఆ పాకెట్‌కు వెళ్ళడంతో ప్రజలు పోలీసుల ఒత్తిడికి సరెండర్ అయినప్పటికీ వీడు చేసిన పనులు, ఆకృత్యాలన్నీ మనకు చెప్పి వెంటనే వాడిమీద చర్య తీసుకోవాలని కోరారు. అలా ప్రజల మద్దతుతో మే 2 తేదీ రాత్రికి వాడ్ని మన పి.ఎల్.జి.ఎ పట్టుకొని ఇంటరాగేషన్ చేసింది. వీడు చేసిన తప్పులన్నీ ఒప్పుకున్నాడు. 3 వ తేదీన చుట్టుపక్కల గ్రామాల ప్రజలను పిలిచి ప్రజాకోర్టు నిర్వహించగా వీడి ఆకృత్యాలను కళ్ళారా చూసిన ప్రజల ముందు వీడు తప్పులు ఒప్పుకోక తప్పలేదు. ఇతడికోసం ప్రజలలో కనీసం ఇద్దరైనా పూచీ వుంటారా అని ప్రజలను అడిగాం. ఎవరూ సిద్ధపడలేదు. అతడి మీద నమ్మకం లేదన్నారు. అతడిని విడిచిపెడితే ప్రజలకు, పార్టీకి మరింత నష్టం కలిగే అవకాశం వుంటుందన్నారు. అలా ప్రజల అభిప్రాయాల మేరకు వీడికి మరణశిక్ష విధించడం జరిగింది. వీడికి సహకరించిన మరో నలుగురికి దేహశుద్ధి చేసి ప్రజలముందు తప్పు ఒప్పించి కొన్ని షరతులు పెట్టి విడిచిపెట్టడం జరిగింది.

ఈ పాకెట్‌లో శతృదుష్ప్రచారం, ప్రభుత్వం, పోలీసు సంస్కరణలు, లొంగుబాట్లు వీటన్నింటి వెనక ప్రభుత్వం కుట్రను ప్రజలకు చెప్పి వాటిని వ్యతిరేకించాలనీ, పోలీసులకు సహకరించవద్దనీ, పోలీసు కుట్రలకు మోసపోవద్దనీ, రహస్యాన్ని పాటించాలనీ, ఇన్‌ఫార్మర్‌లుగా మారవద్దనీ పార్టీని కాపాడుకోవాలనే విషయాలు చెప్పడంతో ప్రజలందరూ ప్రతిజ్ఞలు చేశారు.

## రోడ్డు నిర్మాణానికి వ్యతిరేకంగా వాహనాల దగ్ధం

పార్టీ నాయకత్వంలో జరుగుతున్న ప్రజాఉద్యమాలను అణచివేయడంలో భాగంగానే ప్రభుత్వం మన ఉద్యమ ప్రాంతాల్లో ముఖ్యంగా రోడ్డు నిర్మాణానికి కొట్లాది రూపాయలు ఖర్చు పెడుతుంది. ఆదివాసీ ప్రాంతాల్లో మైనింగ్స్ ద్వారా ప్రజల సంపదను దోచుకోవడం, దాన్ని వ్యతిరేకించే ప్రజా పోరాటాలను, నాయకత్వం వహించే పార్టీని నిర్మూలించడం కోసం ఆంధ్ర-ఒడిశా పోలీసుల మధ్య మరింత సమన్వయంతో దాడులు చేయడం కోసం కోరాపుట్ జిల్లాలో మన ఉద్యమ ప్రాంతాల్లో డబుల్ రోడ్లు, బ్రిడ్జిల నిర్మాణాల పనులను ప్రభుత్వం యుద్ధ ప్రతిపాదికన ప్రారంభించింది. 2015 ఫిబ్రవరిలో దీన్ని వ్యతిరేకిస్తూ మన పార్టీ విస్తృతంగా ప్రజల్లో ప్రచారం చేయడంతో పాటు, రోడ్డు పనులను బంద్ చేయాలనీ, లేనిచో కాంట్రాక్టర్లకు శిక్ష తప్పదని హెచ్చరిస్తూ పత్రిక ప్రకటన, పోస్టర్స్ ద్వారా పార్టీ వైఖరిని ప్రచారం చేయడం జరిగింది. అయినప్పటికీ పోలీసు క్యాంపులు వున్న దగ్గర పోలీసుల మద్ధతుతో రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. దీంట్లో భాగంగానే పొట్టంగి బ్లాక్ కొటియాలో పోలీసు క్యాంపు నిర్మాణం కోసం ముందుగానే కుందెలి నుండి కొటియా వరకూ డబుల్ రోడ్ల నిర్మాణం కోసం పనులను ప్రారంభించారు. ఈ విషయాన్ని ఆ ప్రాంత ప్రజలతో చర్చించి డబుల్ రోడ్డుని వ్యతిరేకించాలనీ, అప్పటికే వున్న సింగిల్ రోడ్డును మరమత్తుల మేరకు అనుమతించాలని నిర్ణయించడం జరిగింది. ప్రజలు నిర్ణయాన్ని బహిరంగంగానే ప్రకటించినప్పటికీ వాటిని బేఖాతర్ చేసి రోడ్లు నిర్మాణ పనులు యధావిధిగా కొనసాగిస్తున్నారు. దాంతో మన పి.ఎల్.జి.ఎ, ప్రజలు కలిసి 2015 జూన్ 11వ తేదీన రాత్రి కొటియా పంచాయితీ కురుడపొదర్ గ్రామం వద్ద ఉన్న రోడ్డు నిర్మాణ వాహనాలను, యంత్రాలను దగ్ధం చేసి, మన పార్టీ వైఖరిని పోస్టర్స్ ద్వారా ప్రచారం చేయడం జరిగింది.

## బాక్సైట్ వ్యతిరేక పోరాటం

చంద్రబాబు అధికారానికి వచ్చాక విశాఖ ఏజెన్సీలోని బాక్సైట్ తవ్వకాలను జరపాలని నిర్ణయించాడు. ఆంధ్ర-ఒడిశా సరిహద్దు కొండల్లోని బాక్సైట్ తవ్వకాలను చేపడితే ఆంధ్ర ప్రజలతో పాటు ఒడిశా ప్రజల జీవితాలు అల్లకల్లోలం కావడం ఖాయం. దాని ప్రభావం ఎలాంటిదో ఒడిశా ఆదివాసీల జీవిత అనుభవంలోని విషయమే. అందువలన ఆంధ్ర ప్రభుత్వం బాక్సైట్ తవ్వకాల నిర్ణయాన్ని విరమించుకునే విధంగా ఒడిశా ప్రభుత్వం ఒత్తిడి

చేయాలనీ, ఎలాంటి పరిస్థితుల్లోనైనా బాక్సైట్ తవ్వకాలను అడ్డుకుంటామని ఒడిశా-ఆంధ్ర సరిహద్దు ప్రజలు బాక్సైట్ పోరాటాన్ని ప్రారంభించారు.

ఆంధ్రప్రదేశ్‌లోని అరకు, డుంబ్రిగూడ మండలానికి ఆనుకొని వున్న పొట్టంగి బ్లాక్‌లోని 5 పంచాయితీలు (నంచక, సొంబైయ్, పేటూరు, అంపవల్లి, గొల్లూరు) ల పరిధిలోని ఆంధ్ర-ఒడిశా కొండల్లో బాక్సైట్ నిలువలున్నాయి. ఈ బాక్సైట్‌ను ఆంధ్ర ప్రభుత్వం వెలికితీయాలని నిర్ణయించింది. విశాఖ ఏజెన్సీలోని బాక్సైట్‌ని వెలికితీస్తే ఆదివాసీల గుండెల్లో నిప్పులు పోసినట్లేనని బాక్సైట్‌కు వ్యతిరేకంగా అన్ని వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున పోరాడుతున్నారు. దాని ప్రమాదాన్ని గుర్తించిన ఒడిశావాసులు కూడా బాక్సైట్ తవ్వకాలను వ్యతిరేకిస్తూ పోరాటానికి నడుం బిగించారు. ఆంధ్ర ప్రభుత్వం బాక్సైట్ నిలువలున్నట్లు చిట్టంగొంది, రఖ్తకండి, సింగమాలి, మాలి పర్వతాలను ప్రకటించింది. ఈ ప్రాంతంలోని 1000 కుటుంబాలు తరలిపోవాల్సి ఉంటుందని పేపర్లలో ప్రకటించారు. ఈ కొండలకు ఉత్తరం వైపున ఒడిశాకు చెందిన 5 పంచాయితీలకు చెందిన 100 గ్రామాలలో వేలాది కుటుంబాలు నివసిస్తున్నారు. దాదాపు 50వేల మంది ప్రజలు ఈ కొండలలోని నీటి వనరులే సాగునీరు, తాగునీరుగా వాడుకుంటున్నారు. ఇక్కడ వందలకొలది ఊటలు, గెడ్డలు ప్రవహిస్తున్నాయి. గొల్లూరు జీవనదిలాంటి గెడ్డగా పేరుగాంచింది. ఈ ప్రజలకు వ్యవసాయానికి అతి ముఖ్యమైన గెడ్డ. విజయనగరం జిల్లా పాచిపెంట డ్యాం ఈ నదిపై ఆధారపడి నిర్మించారు. విజయనగరంలోని బొబ్బిలి వరకు మైదాన ప్రాంతవాసుల పంట పొలాలకు ఈ డ్యాం నీరే ఆధారం. బాక్సైట్ కొండలు ఎన్నో వనమూలికలకు నిలయంగా ఉన్నది. చిట్టంగొంది, రక్తఖండి, సింగమాలి, మాలి పర్వతాలలోని బాక్సైట్ తవ్వకాలు జరిపితే వేలాది ప్రజల జీవితాలపై దాని ప్రభావం ఉంటుంది. అందువలన బాక్సైట్ తవ్వకాలకు వ్యతిరేకంగా పోరాటానికి ప్రజలు సిద్ధమయ్యారు.

విశాఖ ఏజెన్సీలోని అన్ని వర్గాల ప్రజలు బాక్సైట్ తవ్వకాలకు వ్యతిరేకంగా తీవ్రమైన ఆందోళన కొనసాగిస్తున్నారు. దాని ప్రమాదాన్ని తెలుసుకున్న ఒడిశా ప్రజలు ఆంధ్ర-ఒడిశా ప్రజలు సమైక్యంగా పోరాటాన్ని ప్రారంభించారు. జూన్ 2వ తేదీన అరకులో జరిగిన బాక్సైట్ వ్యతిరేక ధర్నా కార్యక్రమంలో 40 బైక్‌లు మరియు కాలినడకన ధర్నా కార్యక్రమంలో పాల్గొన్నారు. జులై 4వ తేదీన అంపవల్లి పంచాయితీలో పెద్దపాడు గ్రామంలో అంచలిక బికాస్ కమిటీ ఆధ్వర్యంలో బహిరంగ సభ జరిపారు. ఆంధ్ర-ఒడిశాకు చెందిన 2000 మంది 90 గ్రామాలకు చెందిన ప్రజలు ఈ సభకు హాజరయ్యి, బాక్సైట్‌కు వ్యతిరేకంగా ర్యాలీ చేసి బహిరంగ సభ జరిపి ఆంధ్ర ప్రభుత్వం చేపడుతున్న బాక్సైట్ తవ్వకాలను అడ్డుకుంటామని నినదించారు.

బాక్సైట్ వ్యతిరేక ఈ బహిరంగ సభలో ఒడిశాలో దొరల సంఘం, విస్థాపన వ్యతిరేక సంఘాలు, అరకు మండలం గిరిజన సంఘాల నాయకులతో పాటు అన్ని రాజకీయ పార్టీల ప్రజలు పాల్గొన్నారు. నవీన్‌పట్నాయక్ ఆంధ్ర ప్రభుత్వం చేపడుతున్న బాక్సైట్ తవ్వకాలకు వ్యతిరేకంగా ఒత్తిడి చేయాలని డిమాండ్ చేసారు. ఈ ప్రాంతంలో పోలీసు క్యాంపుల ఏర్పాటును వ్యతిరేకించారు. కోరాపుట్ జిల్లాలో ఇప్పటికే కొనసాగుతున్న మాలి పర్వత, డంగురేవుల, చిన్నమట్టి విస్థాపన వ్యతిరేక పోరాటాలు కంపెనీల కుట్రలను, నిర్బంధాన్ని ఎదుర్కొంటూ ముందుకు సాగుతున్నాయి. మట్టి తరలింపును, మట్టి నమూనా సేకరణను సంవత్సరాలనుండి అడ్డుకుంటూ సంఘటితంగా పోరాడి రాసలీల కంపెనీ లీజురద్దు అయ్యే విధంగా పోరాడారు. నేడు చిట్టంగొంది, రక్తఖండి బాక్సైట్ వ్యతిరేక (ఒడిశా-ఆంధ్ర) ప్రజల పోరాటం పురోగమిస్తున్నది. నాల్కో, హెచ్.ఎ.ఎల్ కంపెనీలు సృష్టించిన విస్థాపన సమస్య కోరాపుట్ ప్రజల అనుభవాలకీ సంబంధించిదే. ఈ అనుభవాల వెలుగులో బాక్సైట్ వ్యతిరేక పోరాటం తీవ్రతరమవుతుంది. దళారీ నిరంకుశ బూర్జువా వర్గం, సామ్రాజ్యవాదం సమైఖ్యంగా పోలీసు నిర్బందంతో ప్రజా పోరాటాలను అణచివేస్తూ ప్రజల ఆస్తులను కొల్లగొట్టాలని ప్రయత్నిస్తున్నారు. ఈ విషయాన్ని బహిర్గతం చేస్తూ శ్రీకాకుళం-కోరాపుట్ డివిజన్ కమిటీ ప్రజల సమైక్య ఉద్యమానికి పిలుపునిచ్చింది.

**భూ పోరాటాలు**

శ్రీకాకుళం-కోరాపుట్ డివిజన్‌లో నారాయణపట్నం భూ పోరాట ప్రభావం జిల్లా ప్రజలపై తీవ్రంగా ఉంది. నందపూర్ ఏరియా కమిటీ పరిధిలో మన పార్టీ కార్యకలాపాలు ప్రారంభమైనప్పటి నుండి భూముల సమస్యను ప్రజలు ముందుకు తెచ్చారు. ఈ ప్రాంతంలోని ఆదివాసేతరులు, స్థానికేతరులు ఆదివాసీలను మోసం చేసి భూములు లాక్కున్నారు. ఈ సమస్యను ప్రజలు పార్టీ ముందుకు తెచ్చారు.

దిగువ గొల్లూరు పంచాయితీలోని ఎగువ గొల్లూరులో జీవన్‌పట్నాయక్, కరంట్ వెంకట్రావ్, పాత్రో అనే ఆదివాసేతరులు ప్రజల భూములను ఆక్రమించుకున్నారు. పలు విధాలుగా స్వాధీనం చేసుకొని పట్టాలు చేసుకున్నారు. జీవన్‌పట్నాయక్-3 ఎకరాలు, కరెంట్ వెంకట్రావ్-4 ఎకరాలు, పాత్రో-50 సెంట్లు తరి పొలాలు వీరి పేర్లతో పట్టాలున్నాయి. వీడిని ఏనాడు సాగు చేయలేదు. ఈ గ్రామంలోనే కాక అనేక గ్రామాలలో కరెంట్ వెంకట్రావ్, జీవన్‌పట్నాయక్‌లకు భూములు, వ్యాపారాలు కలిగి ఉన్నారు. అన్ని గ్రామాల ప్రజలకు వీరు శతృవులుగా ఉన్నారు. జీవన్‌పట్నాయక్ మండల సోభాపతిగా ఉన్నాడు. వీన్ని మన పార్టీ ప్రజావ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినందుకు గత సంవత్సరం 2014 నవంబర్‌లో ఖతం చేసింది. ఈ ముగ్గురికి సంబంధిన 7 ఎకరాల భూములను గతంలో పార్టీ స్వాధీనం చేసుకొని ప్రజలకు సాగు చేసుకొమని చెప్పింది. డుంబ్రి, శ్యామ్ అమరులైన తర్వాత నిర్బంద భయంతో భూములు సాగు చేయడం లేదు.

ఎగువ గొల్లూరు గ్రామంలో వర్గ విశ్లేషణ చేయగా 11 కుటుంబాలు భూమి లేనివారిగా తేలారు. 16 కుటుంబాల వారికి 7 ఎకరాల భూమిని అందరికీ సమానంగా పంపకం చేయాలని గ్రామంలో నిర్ణయించుకొన్నారు. ప్రతి కుటుంబానికి, ఆడ-మగ పేర్లతో గ్రామస్తులు సంతకం చేసి 16 కుటుంబాలకు గ్రామం పట్టా ఇచ్చారు. భవిష్యత్తులో ఈ భూములను ఎవరు అమ్మకూడదనీ, ఎవరు కొనకూడదని నిర్ణయించారు. పోలీసులు, భూస్వాములు భయపెడితే గ్రామం ఉమ్మడిగా 16 కుటుంబాలకు మద్ధతుగా నిలవాలని తీర్మాణం చేశారు. ఈ భూములు నేడు 16 కుటుంబాలకు చెందిన ప్రజలు సాగు చేసుకుంటున్నారు.

పద్మాపురం (పేటూరు పంచాయితీ) గ్రామంలోని దొరలకు సంబంధించిన 10 ఎకరాల 40 సెంట్ల భూమిని జగత్‌రాయ్ అనే దళిత భూస్వామి (పుక్కెలి గ్రామం) ప్రజలను మోసం చేసి ఆక్రమించాడు. ఈ గ్రామంలో 100 కుటుంబాలకు పైగా ఉంటాయి. దొరలు-దళితులు నివసిస్తున్నారు. పార్టీ ఈ గ్రామంలో సంఘం ఏర్పాటు చేయడంతో పాటు 3 సంవత్సరాల క్రితం భూ పోరాటాన్ని చేపట్టింది. రెండు కులాల ప్రజలు భూ పోరాటంలో పాల్గొన్నారు. పోలీసు నిర్బంధం పెరగడంతో దళిత కుటుంబాలు భూముల సాగుకు సిద్ధపడటం లేదు. నిర్బంధం మధ్యనే భూస్వామి బెదిరింపుల మధ్యనే నూకదొరలు మాత్రం పట్టు విడవకుండా 40 కుటుంబాలు భూములు సాగు చేస్తున్నారు. మెట్ట భూమిగా ఉన్న దీనిని కాలువ ద్వారా నీరు తెచ్చి పొలాలుగా చేసుకోవాలనే నిర్ణయంతో ధైర్యంగా నిలబడ్డారు.

పేటూరు పంచాయితీలోని పురిగూడ-గెమ్మలపాడు గ్రామాల మధ్య ఉన్న 10 ఎకరాల భూమిని కరెంట్ వెంకట్రావ్ అతితక్కువ ధరకు కొని స్వాధీనం చేసుకున్నాడు. ఈ భూములు ఆనాటి నుండి సాగు చేయడం లేదు. ప్రజల చేతనే భూస్వామి సాగు చేయించి సగం వాటా తీసుకునేవాడు. ప్రజలు సంఘం పెట్టుకొని 10 ఎకరాల మెట్ట భూమిని ప్రజలు సమిష్టిగా సాగు చేసుకుంటున్నారు. ఈ భూములు కుటుంబాల వారిగా పంపకాలు చేయాల్సి ఉంది.

అంపవల్లి పంచాయితీలోని పెద్దపాడు గ్రామంలో 25-30 సంవత్సరాల క్రితం ఒడిశా మైనింగ్ కార్పొరేషన్ (ఒ.ఎమ్.సి) పుట్టబందు గ్రామస్తుల వద్ద 7 ఎకరాల భూమిని అతితక్కువ ధరకు కొని కబ్జా చేసారు. కంపెనీలో ఉద్యోగాలు ఇస్తామనీ, స్థానికంగా అభివృద్ధి చేస్తామని ఒప్పందాలతో ఆ భూములను కంపెనీ స్వాధీనం చేసుకుంది. భూములు కోల్పోయిన రైతాంగం విస్తాపితులయ్యారు. కంపెనీలో ఎలాంటి ఉద్యోగాలు కానీ, అభివృద్ధి కానీ ఆ గ్రామస్తులకు దక్కలేదు. ఈ భూములను, ఆ భూముల్లో ఉన్న చింతచెట్లు, టేకుచెట్లను ప్రజలు స్వాధీనం చేసుకోవాలనీ సంఘం ఏర్పాటు చేసుకొని పోరాటానికి సిద్ధపడ్డారు. చింతచెట్లను దులిపి 4 క్వింటాల చింతపండును దక్కించుకున్నారు. వర్షాకాలం ప్రారంభం కాగానే రెండు పుట్టబందుల గ్రామస్తులు, ఆ పాకెట్ సంఘం మద్ధతుతో భూముల్లో దుక్కులు దున్నారు. చింతచెట్లు దులిపినప్పుడు, భూములు దున్నినప్పుడు ప్రశ్నిస్తే కంపెనీ మనుషులు మా పంటలు, మా భూములు వీటన్నిటిపై మాకే హక్కుందని గట్టిగా సమాధానం చెప్పి సాగుచేస్తున్నారు. ప్రభుత్వం ఈ విషయంలో తమపై కేసులు పెట్టి పోలీసుల చేత వేధింపులు, కోర్టుకు తిప్పే అవకాశం ఉందని ప్రజలు గ్రహించి దానికి వ్యతిరేకంగా పోరాడాలని సంఘటితంగా ఉన్నారు. సంఘం ఏర్పడి పోరాటాల ద్వారా భూములు సాగు చేసుకోవడంతో ప్రజలకు వారి సంఘటిత శక్తిపై విశ్వాసం పెరిగింది.

కోటతేడ గ్రామంలో రాజుల కాలంనాటి 60-70 ఎకరాల భూములు ఉన్నాయి. ఇవి రాజులకు చెందినవని ప్రజల్లో ఉంది. 30 సంవత్సరాల క్రితం ఈ గ్రామంలో రాజులు ఉండేవారు. ప్రజలు వారి భూములను సాగు చేసి రాజులకు ఇచ్చేవారు. ఈ పాకెట్‌లో ఆదివాసీ విప్లవ రైతుకూలీసంఘం ఏర్పడి పని చేస్తుంది. ఈ భూములను ప్రజలకు పంచి ఇవ్వాలనీ కమిటీ నిర్ణయించింది. ప్రజల్లో ప్రచారం నిర్వహించి భూముల సాగుకు ప్రజలను సిద్ధం చేసింది. ఈ భూముల్లోకి భూములు లేని వారినే ఎంపిక చేసి ఆ భూముల్లో దింపి సాగు చేయించాలని కమిటీ నిర్ణయించింది.

★

# ఎమ్.కె.బి డివిజన్

## శత్రు ఇంటలిజెన్సీపై పార్టీ నేతృత్వంలో ధ్వంస కార్యక్రమాన్ని ఒక క్యాంపెయిన్‌గా చేపట్టి విజయవంతం చేసిన గుమ్మ ఏరియా ప్రజానీకం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఆపరేషన్ గ్రీన్‌హంట్ పేరుతో కొనసాగిస్తున్న బహుముఖ దాడి ప్రస్తుతం విప్లవోద్యమం కొనసాగుతున్న వ్యూహాత్మక ప్రాంతాలలోని నాయకత్వ నిర్మూలన లక్ష్యంతో కేంద్రీకరించబడింది. వ్యూహాత్మక దృష్టితో ఇంటలిజెన్సీ (ఇన్‌ఫార్మర్ నెట్‌వర్క్) ని ఏర్పాటు చేసుకొని దీర్ఘకాలిక, తక్షణ లక్ష్యాలను నిర్దేశించుకొని సమాచారం ఆధారంగా ఒకే సమయంలో పెద్ద ఎత్తున సాయుధ బలగాలను మోహరించి విస్తృత ఏరియాను కవర్ (దిగ్బంధం) చేస్తూ పోలీసు ఉన్నతాధికారుల ప్రత్యక్ష భారీ ఆపరేషన్స్ చేపడుతున్నారు.

ఇలాంటి ఆపరేషనే 2015 జనవరి 3 నుండి 6 వరకు ఎమ్.కె.బి డివిజన్‌లోని గుమ్మ ఏరియా కటాఫ్ ప్రాంతాన్ని కేంద్రంగా చేసుకొని చేపట్టారు. డివిజన్‌లో టి.సి.ఒ.సి కోసం నవంబర్ (2014)లో బలగాలు సమీకరించబడుతున్న సమాచారం పోలీసులకు అందింది. దానితో మొత్తం నెట్‌వర్క్‌ను అప్రమత్తం చేసి ఎ.పి-ఒ.ఎస్ ఇంటలీజెన్సీ రంగంలోకి దిగింది. నవంబర్, డిసెంబర్ మాసాలలో పార్టీ నాయకత్వం, పి.ఎల్.జి.ఎ బలగాల ప్రతి కదలికపై నిఘా పెట్టి, అందిన సమాచారంపై ఆధారపడి రెండు రాష్ట్రాల పోలీసు ఉన్నతాధికారులు పకడ్బంది పథకంతో, విజయం సాధిస్తామనే సంపూర్ణ విశ్వాసంతో నాయకత్వ నిర్మూలనను లక్ష్యంగా పెట్టుకొని ఆపరేషన్ ఆలౌట్ పేరుతో వేలాది, వివిధ రకాల బలగాలను అన్ని వైపుల నుండి (రిజర్వాయర్‌లకు ఇరువైపుల కూడా) జనవరి 3 మోహరించారు. 4వ తేదీ ఉదయానికే ప్రజలు బలగాల మోహరిపు సమాచారం పార్టీకి అందజేసారు. అప్రమత్తమైన పి.ఎల్.జి.ఎలోని ఒక యూనిట్ శత్రువు కదులుతున్న దిశలో ఎదురుకోవడానికి మోహరించింది. జనవరి 5 ఉదయం 6గం॥ల సమయంలో బెజ్జంగి వద్ద పి.ఎల్.జి.ఎ శత్రుబలగాలలోని ఒక బ్యాచ్‌పై దాడి చేసింది. అదే రోజు ఒంటిగంట సమయంలో మరోమారు డాంగ్రపొదర్ గ్రామ సమీపంలో ఎదురుకాల్పులు జరిగాయి. దీనికి ముందే ఉదయం 5గం॥ల ప్రాంతంలో నది దాటుతామనే అంచనాతో శత్రువు నది అవతల ఆంబూష్ పార్టీ ఏర్పాటు చేశాడు. అదే సమయంలో నారింజోల గ్రామస్తులు చేపల వేటకు వెళ్ళి, తిరిగి వస్తున్న క్రమంలో వారిపై పోలీసులు కాల్పులు జరిపారు. అందులో బుద్ద కిర్సనీ అక్కడికక్కడే చనిపోగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ అభియాన్ జనవరి 3 నుండి 6 వరకు కనసాగింది. శత్రువు

పథకాన్ని పి.ఎల్.జి.ఎ బలగాలు విఫలం చేయడంతో బిక్కమొఖం వేసుకొని వాడి బలగాలు నష్టపోకుండా చాలా జాగ్రత్తలు పాటిస్తూ ఒక్కొక్కటిగా వెనక్కి తీసుకున్నాడు. 2008 జూన్ 29న ఎ.పి గ్రేహౌండ్స్ బలగాలు ఎ.పి-ఒ.ఎస్ సరిహద్దులో కూంబింగ్ నిర్వహించి బలిమెల రిజర్వాయర్‌లో అతి విశ్వాసంతో లాంచిలో ప్రయాణం చేస్తుండగా పి.ఎల్.జి.ఎ చేసిన అంబూష్‌లో 38 మంది కుక్కచావు చచ్చారు. ఆ సంఘటన తర్వాత ఈ ప్రాంతంలో గ్రేహౌండ్స్ అడుగు పెట్టే సాహసం చేయలేదు. తిరిగి 7 సంగలల తర్వాత ఎ.పి గ్రేహౌండ్స్, ఒ.ఎస్ ప్రత్యేక బలగాలు బి.ఎస్.ఎఫ్ సమన్వయంతో చేపట్టిన అతిపెద్ద ఆపరేషన్ ఇది. ఈ ఆపరేషన్‌లో 5గురు మావోయిస్టులు చనిపోయారనే ఒక తప్పుడు వార్తను ప్రచారంలో పెట్టారు.

ఈ భారీ ఆపరేషన్ తర్వాత అప్పటి వరకు ప్రజలకు, విప్లవోద్యమానికి లొంగివున్న ప్రజావ్యతిరేకులు, కొందరు తెగ పెద్దలు, పాత రాజకీయ ఆధిపత్య శక్తులు, మత పెద్దలు, శతృవు ఏజెంట్లు, ప్రభుత్వ అధికారులు ప్రజలను, ప్రజానిర్మాణాలను భయపెట్టి లొంగదీసుకోవడానికి ప్రయత్నాలు ప్రారంభించారు. మావోయిస్టు దళాలు మకాంలు వేసే అడవులు నరకాలనీ, వారి మీటింగ్‌లకు వెళ్ళవద్దనీ, నిర్మాణాలలో చేరవద్దనీ, వారు అభివృద్ధి నిరోధకులనే ప్రచారంతో ప్రజలను నియంత్రించాలని చూసారు. ఈ విషయాలపై ప్రజలతో చర్చించే క్రమంలో ప్రజాద్రోహులైన కొందరిని గుర్తించాం. జొంత్రి గ్రామం పెత్తందారు గోపి కొద, పోలీసు ఏజెంటుగా పని చేస్తున్న సోమలను ప్రజల్లో పెట్టి విచారించగా తీగ లాగితే డొంకంతా కదిలినట్లు ఒక్కొక్కటిగా ఈ నెట్‌వర్క్ అంతా బయటపడింది. ఒండ్రపల్లి సర్పంచ్ (ఇన్‌చార్జ్) రాజు, బచ్చులపొదురు వార్డ్ మెంబర్ దొన్నులను ఆలౌట్ ఆపరేషన్‌కు ముందు గుమ్మాలో అరెస్టు చేసి ఆ తర్వాత ద్రోహులుగా మార్చుకున్నారు. వీరి ద్వారా మన మకాంను ఫైనల్ చేసుకున్నారు. రామ్‌గూడ జోగుర్‌నాథ్ పరివర్తన స్వచ్ఛంద సంస్థ ఆర్గనైజర్‌గా పని చేస్తూ ఈ సంస్థ డైరెక్టర్ నిత్యానందు ద్వారా నేరుగా ఎస్.ఐ సంబంధంలో ఉంటూ ఫోన్ ద్వారా సమాచారం అందిస్తున్నాడు. డిసెంబర్‌లో రాంగూడ వద్ద రిజర్వాయర్‌లో దళాలు పడవలో దాటారనే సమాచారం అందించాడు. గతంలో వీడిని ప్రజల్లో పెట్టి విచారించి వదిలిపెట్టాం. ఈ మధ్య టీచర్‌గా ఒండ్రపల్లిలో స్కూల్‌లో చేరాడు. గుమ్మ బ్లాక్ సెంటర్‌లో పౌరసరఫరాల శాఖ బియ్యం గోడౌన్‌లో సెక్యూరిటీ గార్డులుగా పని చేస్తున్న ఒరపొదరు గ్రామానికి చెందిన సాహేబ్, జొంత్రి గ్రామానికి చెందిన మాధవ్, త్రినాథ్, రామోలను బి.ఎస్.ఎఫ్ ఇంటలీజెన్సీ అధికారి బిశాలు బెదిరించి, ఆ తర్వాత డబ్బుల ఆశ చూపి, లొంగదీసుకొని ఏజెంట్లుగా మార్చుకున్నాడు. వీరు గ్రామాలతో సంబంధాలలో ఉంటూ దళాల, సంఘాల, పార్టీ సానుభూతి పరుల సమాచారం రెగ్యూలర్‌గా అందిస్తున్నారు. జొంత్రి గ్రామ తెగ పెద్ద కొడుకు దాస్ నాటక గురుగా, చిన్న కాంట్రాక్టర్‌గా పని చేస్తూ రెగ్యూలర్‌గా చిత్రకొండ, గుమ్మ, మల్కనగిరికి వెళ్ళి వస్తుంటాడు. లంపెన్ జీవితం, అనేక మంది మహిళలపై అత్యాచారాలు చేసాడు. పోలీసులతో సంబంధాలలో ఉంటూ వారి గైడెన్స్‌తో సంఘం వాళ్ళని సరెండర్ అవ్వమని ఆర్గనైజ్ చేయడం, ఏజెంట్లను తయారు చేయడం, వివిధ రూపాలలో సమాచార సేకరణ, సమన్వయం చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నాడు. సోమ ఇంజన్ డొంగ (పడవ) డ్రైవర్‌గా, కిరాణ దుకాణం నడుపుతూ సామానుల పేరుతో చిత్రకొండకు వెలుతూ సమాచారాన్ని అందించేవాడు. జొంత్రి గ్రామంలో సోను, ఆయన అల్లుడు పెద్దఆమ్లిబెడకు చెందిన ఎస్.పి.ఒగా పనిచేస్తున్న మోనోతో సంబంధంలో ఉంటూ ఫోన్ ద్వారా దళ సమాచారం అందిస్తున్నాడు. డాక్డపొదరు గ్రామంలో ఇంజన్ డొంగ (పడవ) నడుపుతున్న దామే, ఆమ్లిబెడకు చెందిన ఎస్.పి.ఒ మోనో ద్వారా ఇన్‌ఫార్మర్‌గా మారి దళం రిజర్వాయర్ దాటిన వెంటనే ఫోన్ ద్వారా సమాచారం అందించే ఏర్పాటులో ఉన్నాడు. అదే గ్రామానికి చెందిన గురు డిడో డెవలవ్‌మెంట్ కార్పొరేషన్ కింద గ్రామంలో చిన్న కాంట్రాక్టర్‌గా పని చేస్తూ రెగ్యూలర్‌గా ఆఫీసుల పేరుతో బయట తిరుగుతూ ఎస్.పి.ఒ మోనోకు సమాచారం అందిస్తున్నాడు. అలాగే శంకర్ అనే కార్పెంటర్ మొదిలిపడలో పని చేస్తుండగా కానిస్టేబుల్ పాంగి ఆర్గనైజ్ చేసి, డంపులు పట్టివ్వమని దళ సమాచారం ఇవ్వమని ఆర్గనైజ్ చేసాడు. డంపులు పట్టిస్తే డబ్బులిస్తామని ఆర్గనైజ్ చేసి ఒంగూర్‌గూడ గోపి అనే యువకుడిని ఒనకడిల్లీ బి.ఎస్.ఎఫ్ ఇంటలీజెన్సీ కానిస్టేబుల్ సాహు ఆర్గనైజ్ చేసి డంపులో ఉన్న రెండు 303 తుపాకులు స్వాధీనం చేసుకున్నారు. ఈ నెట్‌వర్క్‌లో కొడిగొంది గ్రామానికి చెందిన మాజీ సమితి సభ్యుడు, లంపెన్, అరాచకుడు, తాగుబోతు అయిన శ్యామ్ చాలా కాలంగా గ్రామాన్ని విడిచి బయట ఉంటూ సమాచారాన్ని సేకరించే పూర్తికాల ఇన్‌ఫార్మర్‌గా పని చేస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన మాజీ వార్డు సభ్యుడు బంగ్రు ఎస్.పి, ఇంటలీజెన్సీ కానిస్టేబుల్ సంబంధంలో ఉంటూ దళ కదలికలు తెలియజేయడం, సానుభూతి పరులు చిత్రకొండ, గుమ్మకు వెలితే సమాచారమందిస్తున్నాడు. ఈ నెట్‌వర్క్‌లో డాబగూడ గ్రామానికి చెందిన రవి పేరు బయటకు రాగానే గ్రామాన్ని వదిలి భార్య పిల్లలతో పారిపోయి పోలీసుల చెంతకు చేరాడు. వీరే కాకుండా ప్రభుత్వ ఉద్యోగులను కూడా ఆర్గనైజ్ చేసారు. జొంత్రి, పనసపూట్, ఒండ్రపల్లిల అంగన్‌వాడీల టీచర్లు పోలీసులకు సమాచారం చేప్పే పనిలో చురుకుగా ఉన్నారు. అలాగే ప్రజలు సంతలకు వెళ్ళినప్పుడు, ఎన్.ఆర్.ఇ.జి.ఎస్ (ఉపాది హామి), ఇందిరా ఆవాస్ డబ్బుల కోసం బ్యాంకులకు వెళ్ళినప్పుడు, బ్లాక్ కార్యాలయాలకు, హాస్పిటల్స్‌కు, పిల్లలను పాఠశాలకు పంపడానికి వెళ్ళినప్పుడు పట్టుకొని పార్టీ సమాచారం ఇవ్వాలని లేకుంటే అరెస్టు చేస్తామని బెదిరించి జనరల్ సమాచారం రెగ్యూలర్‌గా సేకరిస్తున్నారు. నిరుద్యోగ, లంపెన్ యువతకు డబ్బులు ఆశ చూపి లోబర్చుకుంటున్నారు. ఫోన్‌ల ద్వారా వీరు సమాచారం అందిస్తున్నారు. దిగజారిపోయిన విప్లవ ద్రోహులైన మాజీలు ప్రవీణ్, మల్లేష్‌లు ఉపయోగపడుతున్నారు.

సిమిలిపొదొర్ గ్రామంలో కువ్వి తెగ ప్రజలున్నారు. మెజారిటీ కుటుంబాలు క్రిష్టియన్ మత విశ్వాసాలను కలిగి ఉన్నారు. గ్రామంలో రెండు చర్చిలున్నాయి. ఈ గ్రామంలో శతృవు ఇన్‌ఫార్మర్స్‌ను తయారు చేయడానికి సీలిగుమ్మ గ్రామం నుండి చర్చి ఫాస్టర్ ముసుగులో ఉన్న పోలీస్ ఏజెంట్ అద్దు (కువ్వి) ఈ గ్రామంతో బంధుత్వం నెరిపి చర్చి ఫాదర్స్ ద్వారా గ్రామ ప్రజలను పార్టీకి దూరం చేసి సంఘాన్ని నిర్వీర్యం చేసే ప్రయత్నం చేసాడు. గ్రామంలో చోటుచేసుకుంటున్న పరిణామాలను పసిగట్టిన పార్టీ లోతుల్లోకి వెళ్లి పరిశీలించి అనుమానస్పదంగా ఉన్న కొందరిని పట్టుకొని విచారించగా మొత్తం పథకం బయటపడింది. దానితో శతృ మరో దాడి పథకాన్ని నిర్వీర్యం చేయగలిగాం.

ఈ నెట్‌వర్క్ మొత్తాన్ని ప్రజలపై ఆధారపడి వారి భాగస్వామ్యంతో క్లియర్ చేసాం. ప్రజల ఆమోదంతో విప్లవ ద్రోహులకు శిక్షలు విధించాం. జొంత్రి గ్రామంలో దానును ఒంగూర్‌గూడలో గోపిని పి.ఎల్.జి.ఎ ఖతం చేసింది. జొంత్రి సోమ, ఒరపొదురు సాహేబ్‌లను గ్రామబహిష్కరణ చేసి వారి ఆస్తులను ప్రజలకు పింపిణీ చేసాం. జొంత్రిలో గోపి కొడ, ఒండ్రపల్లి సర్పంచ్ రాజు, బచ్చులపొదుర్ దొన్ను, రామ్‌గూడ జోగురునాథ్ డక్డాపొదుర్ దామో, గురు, శంకర్‌లకు దేహశుద్ధి చేసాం.

ఈ నెట్‌వర్క్‌ను శత్రువు చాలా సమయం తీసుకొని దీర్ఘకాలిక దృష్టితో అత్యంత రహస్యంగా, పకడ్బందిగా అన్ని వనరులు ఉపయోగించుకొని వివిధ పద్ధతులను అనుసరించి తయారు చేసాడు. ఈ మొత్తంలో నెట్‌వర్క్‌లో కీలకపాత్ర పోషించిన జొంత్రి గ్రామానికి చెందిన గోపి కొడ, గుసుంపొదొర్ గోపాల్ (మాజీ సర్పంచ్), సహదేవ్‌లు పోలీసు అధికారుల గైడెన్స్‌తో పార్టీ అందరినీ చివరికి సంఘాలలో పని చేస్తున్న వారిని కూడా శిక్షిస్తుందని తప్పుడు ప్రచారం లేవదీసి ప్రజలను గందరగోళ పరిచి గ్రామాలు వదిలి పారిపోయి పోలీసుల రక్షణలో ఉంటూ క్యాంపులు పెట్టాలని డిమాండ్ చేస్తున్నారు. గుసుంపొదొర్ గోపాల్, సహదేవ్‌ల ఆస్తులను ప్రజలు స్వాధీనం చేసుకొని పంపణీ చేసుకున్నారు.

శత్రువు ఇలాంటి పద్ధతులు అన్ని ప్రాంతాలలో కూడా అమలు చేస్తాడు. ప్రజలు, ప్రజానిర్మాణాలు, పార్టీ అప్రమత్తంగా ఉంటూ, ప్రతివిషయాన్ని విమర్శనాత్మకంగా, నిశితంగా పరిశీలించాలి. ప్రజలను రాజకీయంగా చైతన్యపరుస్తూ ప్రజా, విప్లవ ద్రోహులుగా మారవద్దని అర్థం చేయించాలి. ప్రజలే శత్రువు ఏజెంట్లను గుర్తించి శిక్షించలేకపోతే విప్లవోద్యమం, పార్టీకి తీవ్రమైన నష్టాలు జరిగి శత్రువు లక్ష్యం నెరవేరుతుంది.

## పోలీసు ఏజెంట్లను గ్రామ బహిష్కరణ చేసి వారి ఆస్తులను స్వాధీనం చేసుకున్న గుమ్మ ఏరియా విప్లవ ప్రజానీకం

గ్రామాలలో విప్లవ ప్రజాసంఘాలు నిర్మాణమై పాత అధికారాన్ని ప్రశ్నించడం ప్రారంభం కాగానే అప్పటివరకు గ్రామ పెత్తందారులుగా ఉన్న తెగ నాయకులు, రాజకీయ నాయకులు, మత పెద్దలు ప్రజలను విప్లవ రాజకీయాల వైపు వెళ్ళకుండా అడ్డుకొవడం ప్రారంభించారు. చివరకు పోలీసులను ఆశ్రయించి ఇన్‌ఫార్మర్‌గా పని చేస్తూ పోలీసుల ద్వారా గ్రామాలపై దాడులు, అక్రమ అరెస్టులు, దళాలపై కాల్పులకు కారకులయ్యారు. గ్రామాలలో పోలీస్ క్యాంపులు పెట్టాలని డిమాండ్ చేశారు. అలాంటి పరిస్థితులలో వారిని ప్రజలు గుర్తించి విచారించి తగిన శిక్షలు విధిస్తున్నారు. అందులో భాగంగానే ఒండ్రుపల్లి పంచాయితీలోని జొంత్రి గ్రామంలో సోమ, ఒరపొదొర్‌లోని గాసి, గుసుంపొదొర్‌లోని గోపాల్, సహదేవ్‌లను ప్రజలు గ్రామ బహిష్కరణ చేసారు. వారంతా ఒండ్రుపల్లి పంచాయితీలో గతం నుండి తెగ పెత్తందార్లుగా ప్రజలపై దోపిడీ పీడనలు కొనసాగిస్తూ నూతనంగా ఏర్పడుతున్న సంఘ ఆధిపత్యాన్ని అడ్డుకోవడంలో కీలక పాత్ర పోషించారు.

సోను కిరాణ దుకాణం, రైతుల నుండి అపరాలను కొనే వ్యాపారిగా, ఇంజన్ దొంగ డ్రైవర్‌గా, చేపల వ్యాపారిగా ఉంటూ అనేక ప్రజా వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతూ వివిధ సందర్భాలలో, పార్టీ, ప్రజల చేత హెచ్చరికలకు గురయ్యాడు. చివరకు పోలీసులను ఆశ్రయించి వారి ఏజెంటుగా మారాడు. రెగ్యూలర్‌గా పార్టీ సమాచారాన్ని అందిస్తున్నాడు. ఈ విషయాలపై ప్రజలు, పార్టీ విచారించి దేహశుద్ధి చేయగా వాస్తవాలను అంగీకరించాడు. ఈ కుటుంబాన్ని గ్రామం నుండి బహిష్కరించి, ఆస్తులను ప్రజలు స్వాధీనం చేసుకొని పంపిణీ చేసుకున్నారు

ఒరపొదొర్ గాసి గ్రామంలో ఆధిపత్యం కలిగిన కుటుంబం. ప్రారంభం నుంచి పార్టీ వ్యతిరేకతను ప్రశ్నిస్తూ వస్తున్నాడు. కొడుకు సాయిబో గుమ్మలో బియ్యం గోడౌన్‌లో సెక్యూరిటీ గార్డుగా ఉంటూ పోలీసు ఏజేంటుగా పార్టీ సమాచారాన్ని అందిస్తున్నాడు. ఈ విషయాలపై గ్రామంలో ఒకటి, రెండుసార్లు ప్రజల్లో పెట్టి మందలించిన వారి ప్రవర్తనలో ఎలాంటి మార్పు రాకపోగా మరింత చురుకుగా పని చేస్తున్నారు. ఈ విషయాలను ప్రజల్లో పెట్టి విచారించగా పోలీసులతో సంబంధాలు ఉన్నాయని అంగీకరించారు. తండ్రి కొడుకుల కుటుంబాలను గ్రామం నుండి బహిష్కరించి వీరికి చెందిన ఆస్తులను స్వాధీనం చేసుకొని ప్రజలు పంపిణీ చేసుకున్నారు.

గుసుంపొదొర్ గోపాల్, సహదేవ్‌లు అన్నదమ్ములు. గోపాల్ మాజీ సర్పంచ్, ధనిక రైతు. గ్రామంలో ప్రజలను బెదిరించి, కొట్టి కొందరిని గ్రామం నుండి వెళ్ళగొట్టి వారి భూములను స్వాధీనం చేసుకొని సొంతం చేసుకున్నారు. గ్రామంలో వారి దౌర్జన్యాలను ఎదురించడానికి ఎవరు సాహసం చేయరు. గ్రామ పరిసరాలలో పార్టీ ఆయుధాల డంపును దొంగిలించాడు. ప్రజల్లో పెట్టి మందలించడంతో వాపసు ఇచ్చారు. నేరుగా ఎస్.పితో సంబంధాలు కొనసాగిస్తున్నాడు. విషయాలు బహిర్గతమై పార్టీ శిక్షిస్తే ఎదుర్కోవడానికి కొద్దిమంది అనుచర గణాన్ని కత్తులు, గొడ్డళ్ళతో సాయుధం చేసాడు. అన్నదమ్ములిద్దరినీ పార్టీ దేహశుద్ధి చేయగానే గ్రామం నుండి పారిపోయి పోలీసులను ఆశ్రయించి క్యాంపులు పెట్టాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయాలపై గ్రామంలో చర్చించి ప్రజలు, పార్టీ కలిసి ఈ కుటుంబాలను గ్రామం నుండి బహిష్కరించి లక్షల రూపాయల విలువ చేసే ధాన్యం, వస్తువులు, గొడ్లు, మేకలు, గృహోపకరణాలను మూడు గ్రామాల ప్రజలు స్వాధీనం చేసుకొని పంపిణీ చేసుకున్నారు. ప్రజా, విప్లవ వ్యతిరేకులుగా పని చేసే శత్రువు ఏజెంట్లు ఎవరికైనా ఇలాంటి శిక్షలు తప్పవని ఏరియా వ్యాప్తంగా ప్రచారం చేసారు.

## అవినీతి పరులైన కాంట్రాక్టర్లను ప్రజాకోర్టులో విచారించి కూలీలకు డబ్బులిప్పించిన పార్టీ, ప్రజలు

కటాఫ్ ఏరియాలోని పనసపుట్ పంచాయితీ సిందిపుట్ గ్రామంలో చాలా సంవత్సరాలుగా కాంట్రాక్టర్, గంజాయి స్మగ్లర్‌గా పని చేస్తున్న భీమ అవినీతిలో రారాజుగా వెలుగొందుతూ పెద్దఎత్తున ఆస్తులు కూడగట్టి విలాసవంతమైన జీవితం గడుపుతూ ప్రజలపై ఎదురులేని ఆధిపత్యాన్ని చెలాయిస్తున్నాడు. పార్టీ, ప్రజలతో నక్క వినయం ప్రదర్శిస్తూ మోసగించడంలో దిట్ట. నయాతరహా భూస్వామ్య లక్షణాలు, గుండాగిరీ, ఆరాచకాలు దినదినం మితిమీరడంతో ప్రజలు ప్రశ్నించడం ప్రారంభమైంది.

6 గ్రామాల ప్రజల సమక్షంలో భీమ అవినీతిపై పార్టీ ప్రజా కోర్టులో విచారించింది. కాంట్రాక్టర్‌గా గత 10-15 సంవత్సరాలుగా పనసపుట్ పంచాయితీలోని పనులన్నీ చేసాడు. చేసిన పనులలో నాణ్యత లేదు. పని చేసిన కూలీలకు డబ్బులివ్వలేదని తేల్చారు.

వాటికి డొంకతిరుగుడు జవాబులు, కుంటి సాకులు చెప్పి సమర్థించుకోవడానికి ప్రయత్నించాడు. గట్టిగా నిలదీయడంతో 2 లక్షలు బాకీ ఉన్నట్లుగా (అంతకన్న ఎక్కువగానే ఉంటుంది) అంగీకరిచాడు. నెల రోజులలో కూలీలకు చెల్లించాల్సిన డబ్బులు చెల్లించాలని నిర్ణయించగా ప్రజల తీర్పును ఆమోదించాడు. ఈ అవినీతిపరుడు, ప్రజావ్యతిరేకిని పార్టీ నిర్వహించే ప్రజా మీటింగ్‌లకు రాకుండా, బహిష్కరించాలని నిర్ణయించారు. ఈ ప్రజాకోర్టు అవినీతి పైన కాకుండా భీమ ప్రజావ్యతిరేక రాజకీయ ఆధిపత్యాన్ని కూడా నిలదీసింది. ఈ ప్రజాకోర్టు ప్రజలలో గొప్ప రాజకీయ విశ్వాసాన్ని కలిగించింది.

ఒంద్రపల్లి పంచాయితీ ఒరపొదొర్ గ్రామంలో ప్రభుత్వ గెస్ట్‌హౌజ్ గోడనిర్మాణానికి రెండు లక్షలు నిధులు కెటాయించగా బి.ఎల్.డబ్ల్యూ మరియు, గ్రామ పెద్దాలు కొడుకు లొంక కలిసి కూలీలకు 60 వేలు ఇస్తామని ఒప్పందం చేసుకొని పనులు చేయించారు. పనులు పూర్తయి బిల్లులు కూడా తీసుకొని 2 సంవత్సరాలు గడుస్తున్న కూలీలకు ఇవ్వాల్సిన డబ్బులివ్వకుండా కాంట్రాక్టరు, బి.ఎల్.డబ్ల్యూ కలిసి కాజేసారు. ఈ విషయం గ్రామ ప్రజాకోర్టులో లొంకను పార్టీ సమక్షంలో ప్రజలు నిలదీయగా ఆ బిల్లు రాలేదనీ, బి.ఎల్.డబ్ల్యూకు మాత్రమే తెలుసునని తప్పించుకునే ప్రయత్నం చేయగా ప్రజలు ఆధారాలతో ప్రశ్నించడంతో అంగీకరించాడు. నెల రోజుల వ్యవధిలో కూలీలకు డబ్బులివ్వాలనీ, లేని ఎడల స్వంత ఆస్తులను స్వాధీనం చేసుకోవాలని ప్రజలు తీర్పునిచ్చారు.

## మతం ముసుగులో ఉన్న అరాచకుడు, ప్రజావ్యతిరేకి అయిన గుదలంవీధి సింహాచలం ఆశ్రమంపై దాడి చేసిన విప్లవ ప్రజానీకం

పెదబయలు ఏరియా కమిటీ పరిధిలో గల జి.మాడుగుల మండలం భీరం పంచాయితీ గుదలంవీధి గ్రామంలో గల సిద్ధి సింహాచలం ఇల్లు మరియు తన 'అరాచకాల నిలయం' (ఆశ్రమం) లపై జనవరి 17, 2015 రాత్రి 11గం॥ల ప్రాంతంలో పి.ఎల్.జి.ఎ మన్యం పితూరీసేన, విప్లవ ప్రజానీకం దాడి చేసి మతం ముసుగులో ఆరాచక, ప్రజా ఉద్యమ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడే వారికి తగిన గుణపాఠం చెప్పారు. స్థానిక పార్టీ ఇచ్చిన పిలుపునందుకొని ప్రజలు, ఎమ్.పి.ఎస్ సభ్యులు సుమారు 500మంది తమ సాంప్రదాయక ఆయుధాలతో, వర్గ చైతన్యంతో దాడిని విజయవంతం చేసారు.

గరువు సంహాచలం గత రెండు దశాబ్దాల నుండి మతం ముసుగులో స్థానిక ప్రజలను అనేక విధాలుగా దోపిడీ చేస్తూ దొంగ గురువుగా స్థిరపడ్డాడు. దేవుడి పేరుతో స్థానిక పేద ప్రజల భూములను లాక్కోవడం, ఆశ్రమానికి వచ్చే పేదభక్తుల చేత పెద్ద మొత్తంలో గంజాయి సాగు చేయించడం, అమాయక భక్తురాళ్ళను తన ఆరాచక శిష్యుల జల్సాలకై వాడుకోవడం, జబ్బులు, మొక్కుబడులు, స్వామి మాలల పేర్లతో వేలాది రూపాయలు ప్రజల వద్ద నుండి సేకరించడం లాంటి పనులన్నీ చేస్తూ జిల్లాలో గల ప్రధాన పట్టణాలలో భవనాలు నిర్మించుకొని ఏజెన్సీలో తనవంతు దోపిడీ 'హుందా'గా నిర్వహిస్తున్నాడు.

గత మూడున్నర దశాబ్ధల నుండి మావోయిస్టు పార్టీ అందిస్తున్న విప్లవ రాజకీయలను తమ ఆలోచనల్లో భాగం చేసుకున్న స్థానిక విప్లవ ప్రజానీకం దాడిని వర్గకసితో అమలు చేసారు.

ఈ దాడికి ఆశ్రమం చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కూడా పూర్తి మద్దతును వివిధ రూపాలలో తెలిపారు. దేవుడి పేరుతో అక్రమంగా సంపాధించినదంతా ప్రజలకే చెందాలని నినదిస్తూ సాధ్యమైనంతవరకు అతడి ఆస్తులను (పశువులు, మేకలు, కోళ్ళు, పనిముట్లు, దుస్తులు, గృహసామాగ్రి) స్వాధీనం చేసుకొని సాధ్యం కాని వాటిని ధ్వంసం చేయడం, మరికొన్నింటిని కాల్చివేయడం చేసారు. ముఖ్యంగా ప్రజలు ఏ మాత్రం శషబిశలు మందిరాన్ని నేలకూల్చి తమ విప్లవ చైతన్యాన్ని చాటారు. ఈ దాడి సందర్భంగా ఎముకలు కొరికే చలిని సైతం లెక్కచేయకుండా అత్యంత విప్లవ క్రమశిక్షణగా 4గం॥ల పాటు ప్రయాణించి దాడిలో పాల్గొన్న ప్రజలు తప్పించుకున్న సింహాచలాన్ని, కోరుకొండ దాడికి పాల్పడిన గూండాలను ఎప్పటికైనా వదిలిపెట్టేది లేదని హెచ్చరిస్తూ పి.ఎల్.జి.ఎ రక్షణలో క్షేమంగా రిట్రీట్ అయ్యారు.

అప్పటిదాకా వీరవరంలో దాడి ఆదివాసీలు మావోయిస్టులపై దాడి చేసారనీ, మన్యంలో మావోయిస్టుల మనుగడ ఇక కష్టమనీ, ఈ దాడి అల్లూరి స్ఫూర్తిగా జరిగిందనీ, దేశ చరిత్రలో ఇది మొదటిసారనీ, దాడిలో పాల్గొన్న వారికి పూర్తి రక్షణ కల్పిస్తామనీ అడ్డూ అదుపు లేకుండా ఢంకాలు కొడుతూ అసత్య ప్రకటనలు ఇస్తున్న జిల్లా పోలీసు అధికారులకు, వందలాది మంది ప్రజల నాయకత్వంలో ఈ దాడి జరగడంతో నోళ్ళు మూతబడ్డాయి. వారికి మౌనమే శరణ్యం అయ్యింది. అధికారుల కుట్రపూరిత, అసత్య ప్రకటనలకు అడ్డంకులేర్పడ్డాయి. ఈ దాడి ద్వారా విప్లవ ప్రజానీకం చాలా సంతోషించారు. జిల్లాలో మంచి ప్రభావం వేసింది.

## వ్యవసాయక విప్లవ కార్యక్రమంలో భాగంగా భూములకు సాగునీరు అందించడానికి చెక్‌డ్యాం నిర్మించుకున్న రైతాంగం

"దున్నేవారికి భూమి లభించనిదే రైతాంగానికి విముక్తి లేదు" అని రైతాంగం పోరాడుతుంటే ఈ దోపిడీ ప్రభుత్వాలు భూస్వాముల కబంధ హస్తాలలో ఉన్న లక్షలాది ఎకరాల భూములను పంచడానికి బదులు రైతాంగం పంట భూములను బలవంతంగా లాక్కొని కార్పొరేట్ కంపెనీలకు, భారీ డ్యాంల నిర్మాణానికి దారదత్తం చేసి కొట్లాది మంది ప్రజలను నిర్వాసితులను చేస్తున్నది. గుమ్మ బ్లాక్‌లోని బలిమెల వద్ద సీలేరు నదిపై నిర్మించిన భారీ జలవిద్యుత్ ప్రాజెక్ట్ ద్వారా వేలాది ఎకరాల పంట భూములు, వందలాది గ్రామాలు ముంపుకు గురై ప్రజలు పెద్ద సంఖ్యలో నిర్వాసితులయ్యారు. అప్పటినుండి నేటి వరకు భూముల కోసం సాగు, త్రాగునీరు కోసం పోరాడుతూనే ఉన్నారు. వ్యవసాయం అత్యంత వెనుకబడిన పద్ధతులను అనుసరించి వర్షాధార పంటలను పండిస్తున్నారు. వ్యవసాయం గిట్టుబాటు కాక ఇతర ప్రాంతాలకు కూలీలుగా వలసలు పోతున్నారు. మరికొందరూ గత 2, 3 సంవత్సరాలుగా గంజాయి సాగు వైపు మళ్ళారు. ఇది సమస్యను పరిష్కరించక పోగ ఆదివాసీ సమాజంలో పరాధీన, అరాచక విధానం ప్రవేశిస్తున్నది. ఈ సమస్యపై ప్రజలను చైతన్య పరుస్తూనే వ్యవసాయంలో అభివృద్ధి తీసుకురావడానికి విప్లవ భూసంస్కరణలను అమలు చేస్తున్నే ఆ భూములకు సాగునీరు, పంటలలో మార్పు తీసుకురావడానికి పార్టీ కృషి చేస్తున్నది.

ఒం(డుపల్లి పంచాయితీ సన్యాసిగూడ, తోటగూడ గ్రామాల మధ్య కొండపై నుండి పారుతున్న నీరు ప్రజలకు ఉపయోగపడకుండా వెళ్ళి రిజర్వాయర్‌లో కలుస్తున్నది. మరోవైపు నీటి సౌకర్యం లేక చాలా ఎకరాల భూములు సాగుకు నోచుకోకుండా వృధాగా వుంటున్నాయి. ప్రజలకు కొండ పోడు తప్ప మరోగత్యంతరం లేకుండా పోయింది. ఈ సమస్యపై పార్టీ ప్రజలతో చర్చించగా కొండనుండి వస్తున్న కాలువపై చెక్‌డ్యాం నిర్మిస్తే సన్యాసిగూడ, తోటగూడ గ్రామాల మధ్య బీడుగా ఉన్న సుమారు 50 ఎకరాల భూములకు సాగునీరు అందించి ఆ భూములను పంట భూములుగా మార్చి రెండు గ్రామాలోని 60 కుటుంబాలకు పంపిణీ చేయడం ద్వారా ప్రజల భూమి సమస్యను పరిష్కరించవచ్చనే అభిప్రాయంతో పాటు నిర్ణయానికి వచ్చారు. రెండు గ్రామాలలో చెక్‌డ్యాం నిర్మాణ కమిటీలు నిర్మాణం చేసుకొని ప్రజలను కదిలించి రాళ్ళు, చిప్స్ తయారు చేసుకొని ఒకరోజు దూరంలో ఉన్న ఇసుకను కొంత దూరం ట్రాక్టర్‌ల ద్వారా, అక్కడ నుండి పడవల ద్వారా తెచ్చి నది అంచు నుండి చెక్‌డ్యాం వరకు మోసుకెళ్ళారు. నాలుగున్నర ఫీట్‌ల ఎత్తు, ఎనిమిది మీటర్ల పొడవుతో కాలువ అడ్డంగా చెక్‌డ్యాం నిర్మించి ఒక పక్కన ఇనుప గేట్‌ను అమర్చారు. గేట్ నుండి బయటకు వచ్చే నీటిని భూముల వరకు తీసుకుపోవడానికి 3,4 వందల మీటర్ల పొడవు కొండ అంచును తొవ్వి కాలువ నిర్మాణం చేసారు. ఈ పనిలో గ్రామంలోని ప్రతి కుటుంబం (మహిళలు, పురుషులు, పిల్లలు, వృద్దులు) అత్యంత చురుకుగా, పట్టుదలగా పాల్గొన్నారు. ఉదయం నుండి సాయంత్రం వరకు పనులు చేస్తూ అక్కడే మధ్యహ్నా అన్నం వండుకొని తిన్నారు. ఈ నిర్మాణం పూర్తి కావడానికి 45 రోజుల సమయం పట్టింది. వీరికి మద్దతుగా దీసరిగూడ, జొంత్రి గ్రామాల ప్రజలు స్వచ్ఛంద శ్రామదానం చేసి వారి సంఘీభావం తెలిపారు. ఇసుక, సిమెంట్, చిప్స్ తరలింపులో వాహన యజమానులు స్వచ్ఛంద సహకారం అందించారు. మరికొందరు ఉచితంగా బియ్యం, కూరగాయలు, పడవలు, డీజిల్‌తో ఎవరికి తోచిన విధంగా వారు సహకరించారు. దీని నిర్మాణంలో మహిళలు చాలా బాధ్యతయుతంగా, చురుకుగా పిల్లలకు పని స్థాలాలలోనే ఊయల కట్టి వృద్ధమహిళలు పిల్లలను ఆటలాడిస్తూ, అన్నం తినిపిస్తూ పనులలో పాల్గొన్నారు.

ప్రజలు చేస్తున్న ఈ నిర్మాణ కృషిని శతృవు అడ్డుకోవడానికి తీవ్రంగా చివరి వరకు అన్ని ప్రయత్నాలు చేసాడు. సిమెంట్ వ్యాపారులను, సప్లైదారులను బెదిరించాడు. గ్రామప్రజలకు బెదిరింపు కబురులు పంపాడు. కూంబింగ్‌ల పేరుతో చెక్‌డ్యాం పరిసరాలలో అంబుష్‌నేర్పాటు చేసాడు. అయిన ప్రతిదినం ప్రజలు సెంట్రీలు పెట్టుకొనీ, పెట్రోలింగ్‌లు చేస్తూ శతృవు కుట్రను తిప్పి కొట్టారు. పార్టీ, పి.ఎల్.జి.ఎ ఎప్పటికప్పుడు గైడెన్స్ ఇస్తూ, రక్షణ కల్పిస్తూ వచ్చింది. ఈ కృషి ప్రజల సంఘటిత శక్తిని వెలికి తీసింది. వ్యవసాయ విప్లవ కొనసాగింపులో భాగంగా చేపట్టిన ఈ ప్రత్యామ్నాయ విప్లవ సంస్కరణ ప్రజలను దోపిడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజాయుద్ధం వైపు నిలబెట్టేందుకు దోహదపడింది.

### చిట్టెం చెలుక ఇన్‌ఫార్మర్ రామయ్య ఖతం

పెదబయలు ఏరియా కమిటీ పరిధిలోని మల్కనగిరి జిల్లా రోళ్ళగెడ్డ పంచాయితీ చిట్టెం చెలుక గ్రామంలోని రామయ్య గతంలో రైతుకూలీసంఘంలో సభ్యుడిగా పని చేసాడు. బొడిపడ, ఆటుగూడలో బి.ఎస్.ఎఫ్ క్యాంపులు ఏర్పాటు చేసిన తరువాత రహస్యంగా పోలీసులకు లొంగిపోయి వారికి ఇన్‌ఫార్మర్‌గా మారాడు. అప్పటినుండి గ్రామంలో ఉండకుండా బయట ఎక్కువగా తిరగడం, అప్పుడప్పుడు గ్రామానికి వచ్చి వెళ్ళడం ఉంది. ప్రజల వద్ద ఉన్న బర్మార్ తుపాకుల సమాచారం సేకరిస్తూ పోలీసులతో వచ్చి దాడులు చేసేవాడు. పోలీసులు ప్రజలపై తప్పుడు కేసులు బనాయించేవారు. ప్రజలు నిలదీస్తే బెదిరించడం, సంఘ సభ్యుల సమాచారం ఇవ్వడం, కూంబింగ్‌కు వచ్చే బలగాలకు రూట్‌గైడ్‌గా పని చేయడం చేస్తుండేవాడు. పార్టీ కుటుంబ సభ్యుల ద్వారా నచ్చచెప్పే ప్రయత్నం చేసిన తన పద్ధతులలో ఎలాంటి మార్పు రాకపోగా మరింత చురుకుగా ప్రజా, విప్లవ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడటంతో జూన్ 29న గ్రామంలోనే పట్టుకొని ప్రజల మధ్య విచారించి, వారి తీర్పును అనుసరించి పార్టీ ఖతం చేసింది. ★

---

# మల్కనగిరి డివిజన్

### పి.ఎల్.జి.ఎ చేతిలో శిక్షించబడిన ఇన్‌ఫార్మర్ బెంగాలీ తరుణ్

మల్కనగిరి జిల్లా కలిమెల బ్లాక్ పొడియా ఏరియా పరిధిలోని సీతరామ్‌పల్లి పంచాయితీ, బెంగాలీ క్యాంప్‌లో నివాసముంటున్న తరుణ్‌ను డిసెంబర్16-2014న మన పి.ఎల్.జి.ఎ చంపివేసింది.

బెంగాలీకి చెందిన తరుణ్ పంచాయితీ సెంటర్‌లో సైకిల్ షాప్ నడిపిస్తుండేవాడు. శతృవు కల్పించే ఆశలకు తలొగ్గి శతృవుకు ఇన్‌ఫార్మర్‌గా మారాడు. సెంటర్‌లో సైకిల్ షాపు నడిపిస్తూనే మన సంఘం వారిని, సంఘ నాయకత్వాన్ని గుర్తుపడుతూ శతృవుకు సమాచారం చెప్పేవాడు. అలాగే దళ అవసరాలకు తెప్పించుకునే సామాన్లను గుర్తుపట్టి అడగడం, ప్రజలు తెచ్చుకునే సమాన్లను సైతం ఎవరికి అని పదే పదే ఆరా తీయడం చేసేవాడు. వాడి ప్రవర్తనపై అనుమానం వచ్చిన ప్రజలు పార్టీకి చెప్పడంతో పార్టీ వాడిపై నిఘా పెట్టింది. వాడికి పోలీసులతో సంబంధాలు ఉన్నాయని తేలడంతో పార్టీ ప్రజల్లో చర్చించి ప్రజల ఆమోదం మేరకు చంపి వేసింది.

ఈ యాక్షన్ బెంగాలీ, ఆదివాసీ ప్రజల్లో మంచి ప్రభావం వేసింది.

### ప్రజాకోర్టు అభిప్రాయంతో ఇద్దరు ఇన్‌ఫార్మర్‌లు పి.ఎల్.జి.ఎ చేతిలో ఖతం

మల్కనగిరి జిల్లా కలిమెల బ్లాక్ పొడియా ఏరియా పరిధిలోని ఉండ్రుగొండ పంచాయితీ కేరగూడెం గ్రామానికి చెందిన మాడివి జోగాల్, కుంజం జోగాల్ అనే ఇద్దరు శతృవు ఏజెంట్స్‌ను జనవరి 4-2015న పి.ఎల్.జి.ఎ చంపివేసింది.

బావబామ్మర్దులైన ఇద్దరు జోగాల్‌లల్లో ఒకడు గ్రామ సంఘ నిర్మాణంలో పని చేస్తుండేవాడు. కుటుంబంలోని వీరి ఘర్షణను ఆసరా చేసుకున్న శతృవు వారిద్దరిని వాడి ఏజెంట్లుగా

మార్చుకున్నాడు. దాదాపు 3 సంవత్సరాలుగా శతృ ఏజెంట్స్‌గా పని చేస్తున్న వీరు గ్రామ సెల్ సెక్రటరీగా ఉన్న తమ అన్నని అరెస్టు చేయించారు. అలాగే దళ మకాంలను చూపెట్టడం, కూంబింగ్‌కు వచ్చిన పోలీసు బ్యాచీలకు వంటలు చేయడం చేసేవారు. గ్రామానికి దళం పోయినప్పుడు పోలీసులకు సమాచారం చెప్పేవాళ్ళు. అయితే మనం తీసుకున్న జాగ్రత్తల వల్ల మనకు ప్రమాదాలు తృటిలో తప్పాయి. గ్రామంలో జరుగుతున్న పరిణామాలు, శతృవు కదలికలపై స్థానిక దళానికి అనుమానం వచ్చింది. గ్రామ సంఘం, ప్రజలతోనూ ఈ విషయాలపై ఆరా తీయగా వీరిపై అనుమానం వ్యక్తం చేసారు. వీరిని పట్టుకుని ఇంటరాగేట్ చేయడంతో వీరికి 3సంవత్సరాల నుండి శతృవుతో సంబంధాలు ఉన్నాయని తేలింది. వీరిని వదిలితే పార్టీకి, ప్రజలకు తీవ్ర నష్టం ఉంటదని, చంపాలనే ప్రజల డిమాండ్ మేరకు పి.ఎల్.జి.ఎ చంపి వేసింది.

## పి.ఎల్.జి.ఎ వారోత్సవాల (డిసెంబర్ 2 నుండి 8 వరకు) ను విజయవంతం చేసిన పొడియా ప్రజానీకం

మల్కనగిరి జిల్లా పొడియా బ్లాక్ 3 గ్రామాల పంచాయితీ ప్రజలతో అక్కడి లోకల్ కమిటీ, మిలీషియా, ప్రజల భాగస్వామ్యంతో పి.ఎల్.జి.ఎ వారోత్సవాలను విజయవంతం చేయడం జరిగింది.

మధ్యాహ్నం 1గంట సమయానికి 3 గ్రామాల ప్రజలందరూ మీటింగ్ స్థలానికి చేరుకున్నారు. జి.ఎన్.ఎస్ ఆట పాటలతో, ఎర్ర బ్యానర్లతో కామ్రేడ్స్ ఇచ్చే నినాదాలతో ముందుగా ర్యాలీ ప్రారంభమైంది. ప్రజాసైన్యం లేకుండా ప్రజలకు ఉండేది ఏమి లేదు, పి.ఎల్.జి.ఎను పి.ఎల్.ఎగా అభివృద్ధి చేయాలి, కా॥ శ్యాం, మహేష్, మురళిల ఆశయాలను కొనసాగిస్తాం, 2వ దఫా ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ను ఓడిద్దాం అంటూ ముందుకు కదిలారు.

ర్యాలీ అనంతరం పార్టీ జెండా సెల్ సెక్రటరీ ఎగురవేయగా, పి.ఎల్.జి.ఎ జెండా ఎ.సి కామ్రేడ్ ఎగురవేయడం జరిగింది. ముందుగా అధ్యక్షుడు జె మాట్లాడుతూ పి.ఎల్.జి.ఎలో యువతీ, యువకులు చేరి సైన్యాన్ని బలోపేతం చేయాలి, మిలీషియా కామ్రేడ్స్ స్థానిక శతృవును దెబ్బతీసే దిశగా ఇంకా నైపుణ్యాన్ని సాధించాలంటూ ముగించాడు. సెల్ సెక్రటరీ పార్టీ గురించి మాట్లాడుతూ పార్టీ దోపిడీ నుండి పేద ప్రజలను విముక్తి చేయడం కోసం పుట్టింది అలాంటి పార్టీని కంటికి రెప్పలా కాపాడుకోవాలి, శతృవు తలపెడుతున్న గ్రీన్‌హంట్ దాడిని ప్రతిఒక్కరం వ్యతిరేకిస్తూ శతృవును ప్రతిఘటిస్తూ ఆ క్రూర క్యాంపెయిన్‌ను ఓడించాలి అని మాట్లాడాడు. కా॥ ఆర్ మాట్లాడుతూ కా॥ శ్యాం, మహేష్, మురళిల ఆశయాలతో పి.ఎల్.జి.ఎ ముందుకు వెలుతుందంటూ, పి.ఎల్.జి.ఎను పి.ఎల్.ఎగా అభివృద్ధి చేయాలంటే యువత సైన్యంలో చేరి ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ను ఓడించాలని అన్నారు. చివరగా నాయకత్వ కామ్రేడ్ మాట్లాడుతూ 1999లో కేంద్రకమిటీ సభ్యులు కా॥ శ్యాం, మహేష్, మురళిల అమరత్వంతో పార్టీ మొత్తం తుడిచి పెట్టుకుపోయిందని అనుకున్న భారత ప్రభుత్వానికి ఒక సంవత్సరంలోనే పి.ఎల్.జి.ఎను నిర్మించి భారతసర్కార్‌కి పార్టీ సవాల్‌గా నిలిచింది. పార్టీ 2000 సంవత్సరంలో డిసెంబర్ 2న పి.ఎల్.జి.ఎను నిర్మిస్తే అది అనేక ఆటుపోట్లతో రాటుదేలుతూ అభివృద్ధి చెందింది. శతృవు పార్టీని, ప్రజాసైన్యాన్ని దెబ్బకొట్టాలని ప్రయత్నిస్తున్నా ప్రజలు మాత్రం పార్టీని తమ కళ్ళళ్ళో పెట్టి చూసుకుంటున్నారు, పార్టీ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నారు ఇక ముందు కూడా ఈ సహకారం పెరగాలి. తన వుపన్యాసాన్ని ముంగించడం జరిగింది.

జి.ఎన్.ఎస్ ఆట, పాటలతో, వక్తల ఉపన్యాసాలతో, ప్రజల సహాయం, సహకారాలతో పి.ఎల్.జి.ఎ వారోత్సవాలను విజయవంతం చేయడం జరిగింది.

## పోలవరం డ్యాం నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ, ప్రజా సమస్యలపై డిమాండ్ చేస్తూ పొడియాలో ర్యాలీ

మల్కనగిరి జిల్లా, పొడియా బ్లాక్‌లో ఫిబ్రవరి 11న పోలవరం డ్యాం నిర్మాణానికి వ్యతిరేకంగా డిమాండ్ చేస్తూ స్థానిక ప్రజల సమస్యలను జోడించి ర్యాలీ చేయడం జరిగింది. దీనిలో 4 పంచాయితీలకు సంబంధించిన ప్రజానీకం పాల్గొన్నారు. వారు అక్కడి స్థానిక ప్రభుత్వ ప్రతినిధికి తమ సమస్యలను వివరించి, మెమోరాండం ఇవ్వడం జరిగింది.

పోలవరం డ్యాం నిర్మాణం వల్ల అక్కడి ప్రజలకి నష్టం తప్ప ఎలాంటి ఉపయోగం లేదు. పైగా దీని నిర్మాణం వల్ల ఆంధ్రప్రదేశ్‌లోని 274 గ్రామాలు, ఒడిశాలోని 50 గ్రామాలు ముంపుకు గురి అయ్యి దాదాపు 3లక్షల మంది ఆదివాసీ ప్రజలు నిర్వాసితులవుతున్నారు. పర్యావరణం దెబ్బతింటుంది. ఎంతో విలువైన వృక్ష సంపద, జంతుజాలం నాశనం అవుతుంది. అయినప్పటికీ బహుళజాతి కంపెనీల లాభాలకోసమే ఈ ప్రాజెక్టు నిర్మాణానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పూనుకుంది. దీనికి ఒడిశాలోని నవీన్‌పట్నాయక్ ప్రభుత్వం లోపాయికారి ఒప్పందం ఉంది. ఈ ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలను అన్ని వర్గాల ప్రజలు, ప్రజాస్వామికవాదులు వ్యతిరేకించాలని పొడియా ప్రజలు విజ్ఞప్తి చేస్తూ, ఆదివాసీ ప్రజల అస్థిత్వం కాపాడాలనీ, అందుకోసం నవీన్‌పట్నాయక్ ప్రభుత్వం పోలవరం డ్యాం నిర్మాణంలో కుమ్మక్కు కాకుడదని డిమాండ్ చేసారు.

స్థానికి సమస్యలైన కెనాల్ సమస్యపై డిమాండ్ చేసారు. కుర్సవాడ నుండి పొడియా వరకు కెనాల్ నిర్మాణం చేయాలంటూ, ఇతర అవసరాలైన విద్య, వైద్యం, పశు వైద్యశాల వంటి సౌకర్యాలు కల్పించాలని అడిగారు. తమ సమస్యలన్నింటిని వివరిస్తూ, పోలవరం డ్యాం నిర్మాణానికి వ్యతిరేకంగా బి.డి.ఒకు మెమోరాండం సమర్పించారు. ఈ ర్యాలీలో 600లకు పైగా ప్రజలు పాలొన్నారు.

## విప్లవ సంస్కరణలలో భాగంగా ఒరేల్ గ్రామంలో తాగునీటి పైప్‌లైన్ నిర్మాణం

మల్కనగిరి జిల్లా కలిమెల బ్లాక్ పొడియా ఏరియా సీతారాంపల్లి పంచాయితీ ఒరేల్ గ్రామ ప్రజలు కొన్ని సంవత్సరాలుగా మంచినీటి సమస్యతో బాధపడుతున్నారు. ఈ సమస్యను పార్టీ గుర్తించి ప్రజల సమిష్టి సహకారంతో మంచినీటి సౌకర్యాన్ని ఏర్పాటు చేయడం జరిగింది.

ఒరేల్ గ్రామంలో ముఖ్యంగా మహిళలు చాలా కాలంగా నీటి సమస్యతో ఇబ్బంది పడుతున్నారు. ఇంటిపని, భూమిపని, ఇతర పనులు చేసి నీళ్ళకోసం గంటదూరం కొండపైకి ఎక్కి నీళ్ళు తెచ్చుకోవడం వారికి చాలా సమస్యగా మారింది. ఈ విషయాన్ని గ్రామ సంఘంతో చర్చించారు. పార్టీ నుండి నిధులు, ప్రజల సమిష్టి శ్రమ ద్వారా పైప్‌లైన్ నిర్మాణం చేయాలని తీర్మానించి ప్రజల

ముందు పెట్టారు. ప్రజలందరూ, ముఖ్యంగా మహిళలు సంతోషం వ్యక్తం చేసారు. వెంటనే పైప్‌లైన్, నీళ్ళట్యాంక్ నిర్మాణం చేసి ఈ నీళ్ళట్యాంక్‌కి శీలకోట అమరుల పేరు పెట్టుకున్నారు. ఈ నీటితో వారి నిత్యావసరాలు తీర్చుకోవడంతో పాటు సమిష్టిగా ఆకుకూరలు, కూరగాయలు కూడా పండిస్తున్నారు.

ఈ గ్రామ ప్రజల సమిష్టి పనివిధానంతో నీళ్ళట్యాంక్ నిర్మాణం, కూరగాయల పెంపకం ఇతర గ్రామాల ప్రజలను ఆలోచింపచేసింది. విప్లవ సంస్కరణలో భాగంగా చేసిన ఈ నీళ్ళ సదుపాయం ప్రజల్లో మంచి ప్రభావాన్ని వేసింది.

### ప్రజా వ్యతిరేకులకు ప్రజలమధ్య దేహశుద్ధి

మల్కనగిరి జిల్లా, మతిలి బ్లాక్ ఉర్వ పంచాయితీ కొడ్రిపాల్ పరిధి ఆకూర్ గ్రామానికి చెందిన అదుమా పొడియామి, పూజారి వీరిరువురు ప్రజలపై దౌర్జన్యం చేస్తూ మేకలు, కోళ్లను బలవంతంగా తీసుకెళ్ళడం చేస్తున్నారు. దీనిని వ్యతిరేకించిన ప్రజలు ప్రజాకోర్టులో వీరిద్దరికి దేహశుద్ధి చేయడం జరిగింది.

అదుమ పొడియామి, పూజారి వీరిద్దరు పంచాయితీల పేరుతో ఊర్లోని మేకలు, కోళ్లు, బాతులు మొ॥న వాటిని లాక్కొవడం చేసేవారు. వారి మాట వినకుండా ఎదురు చెబితే సహించేవారు కాదు. పార్టీ ఊర్లోకి రావద్దనే ఉద్దేశంతో మేకలు, బాతులు, కోళ్ళ తీసుకొని మొక్కుబడి (పూట) చేస్తున్నామని అందుకే దళం మా ఊరికి రాదని చెప్పేవారు. రోజు రోజుకు వీరు ప్రజలపై పెత్తనం చెలాయించడం, ఊర్లో ప్రజలు ప్రాణంగా పెంచుకున్న జీవాలను బెదిరించి తీసుకుపోవడం పెరిగింది. ఈ మోసాలు పార్టీకి తెలిస్తే వాళ్ళ ఆటలు సాగవని పార్టీ గురించి అసత్య ప్రచారం మొదలు పెట్టారు. వీరి మోసాలు భరించలేని ప్రజలు విషయాన్ని పార్టీ దృష్టికి తీసుకెళ్ళారు.

దళం గ్రామానికి వెళ్ళి మీటింగ్ చేసినప్పుడు కూడా వీరు మీటింగ్ మాకు అవసరం లేదని తప్పించుకొని పోయేవారు. వీరిద్దరి పట్ల ప్రజలనుండి కూడా బాగా వ్యతిరేకత వచ్చింది. ఇలాంటివాళ్లు మాటల ద్వారా వినడం కష్టమని, తగిన శిక్ష వేయాలని ప్రజలు మాట్లాడారు. గ్రామస్తులే కాకుండా చుట్టుపక్కల గ్రామాలవారు సైతం వీరు మోసానికి బాగా అలవాటు పడ్డారనీ, కష్టపడకుండా దౌర్జన్యంతో ప్రజల సంపదపై ఎగబడి తింటున్నారంటూ వివరించారు.

గ్రామస్తులు, చుట్టుపక్కల గ్రామాలను సమావేశపరిచి ప్రజాకోర్టు నిర్వహించి వీరిద్దరికి ప్రజలందరిముందే దేహశుద్ధి చేయడం జరిగింది. తప్పు చేసేవారికి, ప్రజావ్యతిరేకులకు ఈ తీర్పు ఒక హెచ్చరిక అయింది.

### పార్టీకి వ్యతిరేకంగా ఎస్.పి.ఒలుగా తయారు చేస్తున్న ఇద్దరు యువకులకు దేహశుద్ధి

సుకుమా జిల్లా చీన్‌ఘడి కికిడిపల్లి పంచాయితీ కోడిపల్ ఏరియా పరిధి, తుమ్మలపల్లి గ్రామం వాసి యుసాకిపాండ్సే, అరవింద్‌నేతం ఎస్.పి.ఒలుగా తయారై, చుట్టుపక్కల యువతను ఎస్.పి.ఒలుగా తయారు చేసే పనిలో ఉండటం వలన ప్రజలు, యువత గమనించి పార్టీ దృష్టికి తీసుకెళ్లగా ప్రజల అభిప్రాయం మేరకు ప్రజాకోర్టు నిర్వహించి ఇద్దరికి దేహశుద్ధి చేయడం జరిగింది.

అరవింద్‌నేతం, 10వ తరగతి ఫెయిల్ అయి గ్రామంలో పంచాయితీ మెంబర్‌గా పనిచేస్తూ వుండేవాడు. ఇలా చేస్తున్న క్రమంలో యుసాకిపాండ్సేతో స్నేహం ఏర్పడింది. వీరిద్దరు కలిసి ఉంటూ ఎస్.పి.ఒలుగా తయారయ్యారు. గ్రామంలోని యువతీ, యువకులలో పార్టీకి వ్యతిరేకంగా ప్రచారం చేయడం ప్రారంభించారు. పార్టీ వల్ల గ్రామం అభివృద్ధి చెందదనీ, అన్ని రకాల ప్రభుత్వ సౌకర్యాలు కోల్పోతున్నామనీ, అభివృద్ధి చెందాలంటే పార్టీ గ్రామానికి రాకుండా ఉండాలనీ, అందుకోసం కికిడిపల్లిలో పోలీస్‌క్యాంప్ నిర్మించుకుంటే బాగుంటుందని యువతను ఆర్గనైజ్ చేసారు. ముగ్గురు యువకులను ఎస్.పి.ఒలుగా మార్చే ప్రయత్నం కూడా చేసారు. వీరి గురించి గ్రామ యువత పార్టీ దృష్టికి తెచ్చింది. ప్రజా మిలీషియా సహకారంతో ప్రజాకోర్టు నిర్వహించారు. ప్రజలు వీరిని విచారించి దేహశుద్ధి చేసారు.

### పోలీసులు తయారు చేసిన ఇన్‌ఫార్మర్ ఖతం

మల్కనగిరి జిల్లా వెంకటపాళ్యం పంచాయితీ, పనిమెట్ల గ్రామంలోని మాడి భీమ గ్రామం చుట్టుపక్కల దొంగతనాలు చేస్తుండేవాడు. పోలీసులు వీడిని అరెస్టు చేసి ఇన్‌ఫార్మర్‌గా మార్చుకున్నారు. తనకు బంధువులున్న బొడిగడ్డ పంచాయితీ గొందుగూడ గ్రామంలో ఉంటూ దళం సమాచారాన్ని పోలీసులకు ఫోన్ ద్వారా అందించేవాడు. దళ సమాచారం కోసం ఫోన్ కూడా కొనిచ్చారు. 4సార్లు దళ సమాచారం అందచేసాడు. అయినప్పటికీ భారీ వర్షాల కారణంగా శతృవు రాలేకపోయాడు. వీడు గ్రామంలో అనుమానం రాకుండా ఉంటూ సంత రోజు పోలీసులకు సమాచారం చెప్పేవాడు. చుట్టుపక్కల గ్రామాలలో కోళ్ళు, మేకలు దొంగతనం చేసేవాడు. ప్రజలకు అనుమానం కలిగి దళానికి సమాచారం ఇవ్వడంతో వాడిని ఇంటరాగేషన్ చేసి ఖతం చేయడం జరిగింది.

### స్వార్థ ప్రయోజనాలకోసం ఎస్.పి.ఒలుగా, ఇన్‌ఫార్మర్లుగా మారవద్దని పార్టీ పిలుపు

"శతృవు చేసే ప్రలోభాలకు ఆశపడి, డబ్బులకోసం ఇన్‌ఫార్మర్స్‌గా మారి పార్టీ, సంఘం సమాచారాన్ని పోలీసులకు ఇవ్వడం వల్ల ప్రజలకు మీరు ద్రోహం చేస్తున్నారనీ, దీనివల్ల మీకు ఎంతో కొంత డబ్బు దొరికినప్పటికీ, మీ పేరుతో ఎక్కువ మొత్తంలో పోలీసులు లబ్ది పొందుతున్నారనీ, ఇన్‌ఫార్మర్స్‌గా మారిన మీరు ప్రజల్లో కలిసి బతకలేక పోలీసులు చూపే చిన్న చిన్న ఇళ్ళలో, భయంతో జీవితం వెళ్ళబుచ్చుతున్నారనీ, ఇటువంటి ప్రజావ్యతిరేక, బానిస బతుకులను విడిచి ప్రజలతో కలవాలంటూ 6వేల కరపత్రాలు, 600 పోస్టర్లు వేసి కలిమెల, పొడియా ఏరియాల్లో ప్రచారం చేయడం జరిగింది.

### దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న ప్రజా సమస్యలపై కలిమెలలో ర్యాలీ నిర్వహించడం, ఫిబ్రవరి 20,21 తేదిలలో బంద్ పాటించడం వంటి కార్యక్రమాలను విజయవంతం చేసిన ప్రజలు :

ఎన్నో సంవత్సరాల నుండి కొర్కటపల్లి కెనాల్ నిర్మాణం చేయాలని డిమాండ్ చేసినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం, గత 2సం॥ల క్రితం గ్రామస్థాయిలోని నాయకులను రాజీనామా చేయాలని డిమాండ్ చేసినప్పుడు కెనాల్ నిర్మిస్తామని ప్రజల్ని నమ్మించడం, ప్రజలకు మాట ఇచ్చినందుకు వారిని నమ్మించేందుకు నామమాత్రంగా సర్వే పనులు చేపట్టి తర్వాత దీని గురించి

పట్టించుకోకపోవడం జరిగింది. ప్రజల విషయానికొస్తే 2,3 సం॥ల నుండి వెదురు పనులు లేక ప్రజలు ఇతర రాష్ట్రాలకు వలసలు పోతున్నారు. అతి స్వల్పంగా ఉన్న వెదురు పనులు కూడా ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా బంద్ పెట్టింది. తునికాకు సేకరణ పనులు సైతం బంద్ చేసింది. ఈ మూడు సమస్యలు పరిష్కరించాలని కలిమెల బ్లాక్‌లోని ప్రజలు అక్టోబర్ 29 తారీకున కలిమెలలో 3వేల మంది ప్రజలు ర్యాలీ నిర్వహించి బ్లాక్ అధికారులకు విజ్ఞాపన పత్రాలు అందచేసారు. ఈ ర్యాలీకి నాయకత్వం వహించిన ప్రజా నాయకులు కొద్ది రోజుల తర్వాత జిల్లా కలెక్టర్‌ను కలిసి మేము ఇచ్చిన విజ్ఞాపన పత్రంలోని సమస్యలు ఎంత వరకు పరిష్కరించారని అడగగా పై అధికారుల నుండి ఎలాంటి సమాధానం రాలేదు. మా సమస్యల పట్ల స్పందించకపోతే మా పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించి వచ్చారు.

ప్రజల డిమాండ్‌లపై ప్రభుత్వం నుండి ఏ మాత్రం స్పందన లేకపోవడంతో తిరిగి ర్యాలీ, ప్రచార కార్యక్రమాలు చేపట్టారు. పోలవరం డ్యాం నిర్మాణం వల్ల జిల్లాలోని పొడియా బ్లాక్‌లోనీ, మోటు తహసిల్‌లోని 50 గ్రామాలు ముంపుకు గురి అవుతున్నాయనీ, దీని వల్ల జిల్లా ప్రజలు విస్థాపితులవుతారనీ, ఈ విషయం ఏ రాజకీయ పార్టీలు నిరసించకపోవడాన్ని ఖండిస్తూ, దీర్ఘకాలికంగా పరిష్కారం కాని కొండరెడ్ల రిజర్వేషన్ సమస్య, వెదురు, తునికాకు, కలిమెలలో ఆరోగ్య సౌకర్యాలు మెరుగు పరచాలని, డాక్టర్ల సంఖ్యను పెంచాలని, బ్లడ్‌బ్యాంక్, అంబులెన్స్ ఇతర సౌకర్యాలు కల్పించాలనే డిమాండ్లతో ఫిబ్రవరి 13 తేదినా ఆదివాసీ వికాస్ సంఘ్ పేరుతో ర్యాలీ నిర్వహిచడం కోసం కరపత్రాలు 6వేలు, పోస్టర్లు 600 ప్రింట్ చేసి ప్రచారం చేసారు. ఈ ర్యాలీ 7,8వేల మంది ప్రజలతో నిర్వహించారు. ప్రజా సమస్యలపై ఇంత పోరాడుతున్నప్పటికీ ప్రభుత్వం నుండి ఎలాంటి హామీ ఇవ్వకపోవడంతో 20,21 తేదీలలో బంద్ పాటించాలని పోస్టర్లు, బ్యానర్లు, పత్రికా ప్రకటన ద్వారా పార్టీ తరపున ప్రచారం చేసి బంద్ విజయవంతం చేయాలని ప్రజల్ని కోరడం జరిగింది. దీనివల్ల జిల్లా వ్యాపితంగా కూడా బంద్ విజయవంతం అయ్యింది. ప్రజా సమస్యల కోసం ర్యాలీ, బంద్ నిర్వహించడం ప్రజలకు ఉత్సాహాన్ని కల్గించింది. పార్టీ బలహీనపడిందనే శత్రువు ప్రచారానికి ప్రజల పోరాటాలు జవాబుగా నిలిచాయి.

★

---

## ఐక్యత-పోరాటం-ఐక్యత

**ఏకశిలా సదృశ్యమైన ఐక్యత గురించి ఎల్లవేళలా మాట్లాడుతుండటం, పోరాటం గురించి మాట్లాడకపోవటం, మార్క్సిస్టు, లెనినిస్టు పద్ధతి కాదు. ఐక్యత, పోరాటం గుండా పయనిస్తుంది. ఐక్యతను ఆ విధంగానే సాధించగలం. పార్టీలోపలా, వర్గాలకు సంబంధించి, ప్రజల మధ్యనా కూడా ఇది ఇలానే ఉంటుంది. కేవలం ఏకశిలా సదృశ్యమైన ఐక్యతను గురించి మాట్లాడుతూ, పోరాటం గురించి, వైరుధ్యాల గురించి మాట్లాడకుండా ఉండటం అనేది మనం చేయజాలం. వైరుధ్యాలు లేకపోతే, పోరాటం లేకపోతే, ప్రపంచమనేదే ఉండదు. ఏ పురోగతీ వుండదు, జీవమనేదే ఉండదు, అసలు ఏది ఉండనే ఉండదు. అహర్నిశలు ఐక్యతను గురించే మాట్లాడుతు ఉండటం "పాచి పట్టిన నీటి గుంట" వంటిదే. అది నిరాసక్తతకు దారి తీయవచ్చు. ఐక్యతకు గల పాత ప్రాతిపదికను మనం తప్పకుండా నాశనం చేయాలి, పోరాడాలి, కొత్త ప్రాతిపదిక మీద ఐక్యమవ్వాలి.**

**-కా॥ మావో**

(56వ పేజీ తరువాయి)

దోహదపడుతుంది.

మన దేశంలో మనం పొందిన నిర్దిష్ట విప్లవ అనుభవం నుండి చూసినట్లయితే మన పార్టీ వ్యూహాత్మక ప్రాంతాలకు (శత్రువు పరిపాలన అమిత బలహీనంగా ఉండే గ్రామీణ ప్రాంతం) చేరుకునే దాక అక్కడ ఈ పాలకవర్గాలకు వారి రాజకీయ పార్టీలకు వ్యతిరేకమైన రాజకీయ వాతావరణమే నెలకొని ఉంది. ఆ ప్రాంతాలలో ప్రభుత్వ పాలన బలహీనంగా ఉన్నప్పటికీ ఉన్న మేరకు అది ప్రజలను కౄరంగా అణచివేసే యంత్రాంగంగా మాత్రమే ఉంది. ఫారెస్టుశాఖ, రెవిన్యూశాఖ, పోలీసుశాఖ ఇలా ప్రభుత్వానికి సంబంధించిన శాఖలన్నీ ప్రజలపై తీవ్రమైన దోపిడీ, అణచివేత, వివక్షతలను కొనసాగిస్తూ వచ్చాయి. ఇటువంటి పరిస్థితుల్లోనే వ్యూహాత్మక ప్రాంతాలలోని ప్రజలు, ముఖ్యంగా ఆదివాసీ రైతాంగం తమ సమస్యల పరిష్కారానికీ, విముక్తికి సాయుధ వ్యవసాయ విప్లవంలో సమీకృతులైనారు. ఈ పరిణామాన్ని ఏ మాత్రం భరించలేని ప్రభుత్వాలు విప్లవోద్యమాన్ని దెబ్బతీసేందుకు ఆదివాసీ ప్రాంతాలలో పూర్తి స్థాయిలో పరిపాలనను, అధికారాన్ని నెలకొల్పేందుకు (కంప్లీట్ రివాంప్ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్ అండ్ గవర్నెన్స్) మొదటి ప్రాధాన్యత నిస్తున్నాయి. తద్వారా సంస్కరణలను అమలు జరిపి ప్రజలకు దగ్గర అయ్యేందుకు ప్రయత్నిస్తున్నాయి. అంతేకాకుండా తాము చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు మావోయిస్టులు అడ్డు తగులుతున్నారని దుష్ప్రచారం చేస్తున్నాయి. ప్రభుత్వాలు చేపడుతున్న ఈ ప్రయత్నాలన్నింటిని 'ఆమోదయోగ్యమైన రాజకీయ వాతావరణం' సృష్టించడంలో భాగంగానే చూడాలి. అయితే ఉద్యమ ప్రాంతాలలో పాలకవర్గాల ఈ కుటిల ప్రయత్నాలను వర్గపోరాటం తిప్పికొడ్తున్నది. ప్రజలు క్రమంగా విప్లవ వర్గపోరాటంలో సుశిక్షితులవుతూ దోపిడీవర్గాల అసలు స్వభావాన్ని అర్థం చేసుకుంటున్నారు. వారి కుహనా సంస్కరణలు తమకేమాత్రం అమోదం కాదంటూ భూమి, రాజ్యాధికారం కోసం పురోగమిస్తున్నారు.

ఇక రెండవ విషయం ఆర్థికానికొస్తే దేశం ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నదని చెప్పేందుకు బూకటపు సూచికలు రూపొందిస్తారు. ఈ మధ్య కాలంలో ముఖ్యంగా మోడి ప్రధానమంత్రి అయిన తర్వాత సామ్రాజ్యవాదులు, వారి ద్రవ్య సంస్థ (ప్రపంచ బ్యాంకు, ఐ.ఎమ్.ఎఫ్) లు పని గట్టుకొని భారత ఆర్థిక వ్యవస్థ పురోగమన దిశగా వికాసం చెందుతున్నదని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ముఖ్యంగా స్థూల జాతీయ ఉత్పత్తి (జి.డి.పి) ని అధికం చేసి చూపుతున్నారు. ఇలా చూపడమనేది నడుస్తున్న ఆర్థిక సంవత్సరానికే కాకుండా గడిచిన ఆర్థిక సంవత్సరాలకు కూడా వర్తింప చేసారు. గతంలో జి.డి.పికి 2004-05 ఆర్థిక సంవత్సరాన్ని ప్రాతిపదికగా తీసుకుంటే ప్రస్తుతం దాని స్థానంలో 2011-12 ఆర్థిక సంవత్సరాన్ని ప్రాతిపదికగా తీసుకున్నారు. ఇలా ఎందుకు మార్చారో ఎవరికీ తెలియదు. ఈ మార్పువల్ల 2013-14 ఆర్థిక సంవత్సరానికి గతంలో నిర్ధారించిన 41/2 శాతంగా ఉన్న జి.డి.పి ఉన్నఫలంగా 7%నికి పెరిగింది. ఇదేవిధంగా 2014-15 ఆర్థిక సంవత్సరం జి.డి.పిని కూడా పెంచారు. ప్రస్తుతం నడుస్తున్న 2015-16 ఆర్థిక సంవత్సరానికి జి.డి.పి 8% ఉంటుందని చెపుతున్నారు.సామ్రాజ్యవాద ద్రవ్య సంస్థలు ఈ ఉదరగొట్టడాన్ని ఇక్కడితో ఆపకుండా 'మూడీస్' అనే 'రేటింగ్' సంస్థ భారత రేటింగ్ ఔట్‌లుక్ పెంపును 'స్థిరం' నుండి 'సానుకూలం' అని ప్రకటించింది. ఇలా ప్రకటించడమంటే భరతదేశం పెట్టుబడులకు అనుకూలమని చెప్పడమే. ఇలా పాలకవర్గాలు తప్పుడు సూచికలు, గణాంకాలు రూపొందించి దేశం అభివృద్ధి చెందుతుందని ప్రజలను భ్రాంతికి లోనయ్యేలా చేయడం కూడా కౌంటర్ ఇన్‌సర్జన్సీ వ్యూహంలో భాగంగానే చూడాలి.

ప్రస్తుతం దేశ ఆర్థికవ్యవస్థను మందగమనం నుండి బయట పడేసి 'ఉరకలెత్తించాలంటే' రెండవ తరం సంస్కరణలను అమలు చేయడం మినహా మరో మార్గం లేదని బూర్జువా ఆర్థికవేత్తలు, పత్రికాధిపతులు అదే పనిగా ప్రచారం చేస్తున్నారు. ఈ ప్రచారం సిద్ధాంత రూపంలో కొనసాగుతున్నది. ప్రజల మనసులను గెలుచుకునేందుకు ఆర్థికరంగంలో సంస్కరణలు ప్రవేశపెట్టడం ద్వారా దేశాభివృద్ధి జరిగిందని తెలిపే తప్పుడు గణాంకాలను ప్రజలముందుంచుతున్నారు. సంస్కరణల కొనసాగింపును వేగవంతం చేస్తే దేశం అగ్రపథాన నిలుస్తుందని ప్రజలను భ్రమల్లో ముంచెత్తుతున్నారు.

వాస్తవంగా ఆర్థిక విధానాలలో సంస్కరణలనేవి దేశాన్ని సామ్రాజ్యవాదులకు టోకున అమ్మేందుకు ఉద్దేశించినవే. తద్వారా సామ్రాజ్యవాదులు ఎదుర్కొంటున్న తీవ్రమైన ద్రవ్య, ఆర్థిక సంక్షోభం నుండి బయటపడేసేందుకు తోడ్పడేవే. ఈ సంస్కరణలనే నయా ఉదారవాద విధానాలు అంటున్నారు. మన దేశంలో 1990ల నాటి నుండి డీరెగ్యులేషన్ (నియమాల సడలిపు), ప్రైవేటైజేషన్, సామాజిక అవసరాలలో రాజ్యం వుపసంహరణ అనే రూపాలలో ఈ విధానాలు కొనసాగుతున్నాయి. ఈ విధానాల అమలువల్ల దేశం గతంలో ఎన్నడు లేనంతా సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నది. ధనికులు మరింత ధనికులుగా మారితే, పేదలు మరింత పేదలుగా మారారు. ఆకలి చావులు, అప్పుల చావులు, నిరుద్యోగం, అధిక ధరలు, అవినీతి సర్వసాధారణమై పోయాయి. ఒకవైపునా భారతదేశ వాస్తవ ముఖచిత్రం ఇలా ఉంటే భారత పాలకకర్గాలు మాత్రం తప్పుడు సూచికలు, గణాంకాల ద్వారా దేశం అభివృద్ధి చెందుతుందని ప్రచారం చేస్తున్నారు. అయితే ఈ నయాఉ దారవాద విధానాల (సంస్కరణలు) లో భాగంగా ప్రభుత్వం సామాజిక అవసరాల నుండి ఉపసంహరించు కుంటున్నప్పటికీ రోజు రోజుకు పురోగమిస్తున్న ప్రజా పోరాటాలు, విప్లవోద్యమం నుండి ప్రజలను దూరం చేసేందుకు రాజ్యం పరిమితంగానైనా సంక్షేమ కార్యక్రమాలను చేపట్టక తప్పడం లేదు. ముఖ్యంగా విప్లవోద్యమం బలంగా ఉన్న ప్రాంతాలలో సంక్షేమ పథకాలను కుమ్మరిస్తున్నారనే చెప్పాలి. ఉద్యమ ప్రాంతాలలో వీటి నిర్వహణ బాధ్యత ప్రత్యక్షంగా పోలీసులే చేపడుతున్నారు. సివిక్ యాక్షన్ ప్రోగ్రాంల పేరుతో స్థానిక ఎస్.ఐలు మొదలుకొని ఎస్.పిల వరకు అనేక పేర్లతో సంక్షేమ కార్యక్రమాలను చేపడుతూ ప్రజలను మభ్యపెడుతూ విప్లవోద్యమం నుండి పక్కదారి పట్టించేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రధానంగా ఈ దోపిడీ ప్రభుత్వాలు చేపడుతున్న ఈ ఆర్థిక సంస్కరణలతో పాటు సంక్షేమ పథకాలను కౌంటర్ ఇంటర్‌జెన్సీ వ్యూహంలో భాగంగా చూడాలి.

కౌంటర్ ఇన్‌సర్జన్సీ వ్యూహంలో 3వ అంశం భద్రత. దోపిడీ పాలకవర్గాలు 'తిరుగుబాట్లు' అంతర్గత భద్రతకు ప్రమాదం అంటూ అభివృద్ధి నిరోధక రాజ్యాంగ యంత్రాన్ని బలోపేతం చేస్తారు.

మన దేశంలో సెప్టెంబర్ 21, 2004న మావోయిస్టు పార్టీ ఏర్పడినప్పటి నుండి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దేశ అంతర్గత భద్రతకు ప్రమాదం ఏర్పడిందని ప్రకటిస్తూ వచ్చాయి. ఈ కారణాన్ని చూపుతూ 'భద్రతా వ్యవస్థ' కు చెందిన పోలీసు, పారా మిలటరీ, న్యాయవ్యవస్థలలో అనేక కుహన సంస్కరణలు తీసుకువచ్చారు. ముఖ్యంగా వాటిని మరింతగా పటిష్టీకరిస్తూ అభివృద్ధి నిరోధకంగా, ప్రజావ్యతిరేకంగా మలుస్తున్నారు. న్యాయవ్యవస్థ ద్వారా 'ఉపా' వంటి కౄరమైన ఫాసిస్టు

చట్టాలను అమలు చేస్తున్నారు.

ఈ వ్యూహంలో మరో ముఖ్యమైన అంశమేమిటంటే 'ప్రచారం' దీనినే వారు 'మానసిక యుద్ధం' గా చెబుతున్నారు. ఈ ప్రోగ్రాం ప్రజల మనసులను గెలుచుకొనే వైఖరితో ఉంటుదని సి.ఒ.ఐ.ఎన్ (కౌంటర్ ఇన్‌టర్జన్సీ) గైడ్‌లో రాసుకున్నారు. వాస్తవంగా వీరు ఈ ప్రోగ్రాంలో అసత్య ప్రచారంపై ప్రధానంగా ఆధారపడతారు. ఇటువంటి అసత్య ప్రచారాన్ని పదే పదే చేయడం ద్వారా ప్రజల అభిప్రాయాన్ని సాయుధ తిరుగుబాటుకు ప్రతికూలంగానూ, అభివృద్ధి నిరోధక పాలనకు అనుకూలంగాను మలిచేందుకు ప్రయత్నిస్తారు. ఇందుకు ప్రభుత్వ మీడియాను దోపిడీవర్గాల ప్రాయోజిత మీడియానూ విస్తృతంగా వాడుకుంటారు. ఈ విషయంలో ఇక్కడి పాలకవర్గాలు, వారి పోలీసు యంత్రాంగం ఎంతో అనుభవాన్ని సంపాదించుకున్నాయి. ఆంధ్ర, తెలంగాణ పోలీసులైతే మానసిక యుద్ధాన్ని (సైకాలజికల్ వార్) ఒక కళగానే అభ్యసించారు. 'తిరుగుబాటు దారు' (మావోయిస్టు) ల సిద్ధాంతం కాలం చెల్లినదనీ, వారు అభివృద్ధి నిరోధకులనీ, హింసావాదులనీ, తమకు ఆహారమందించిన ఆదివాసీలనే చంపుతున్నారని వగైరా పద్ధతులలో నిరంతరం దుష్ప్రచారం చేస్తూ ప్రజలను విప్లవోద్యమానికి దూరం చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. మరోవైపు పార్టీ, పి.ఎల్.జి.ఎ శ్రేణుల మనోధృతిని దెబ్బతీసే విధంగా రాజ్యం యొక్క బలాన్ని, దాని దాడి తీవ్రతను పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నారు. లొంగుబాటు పథకాలను రూపొందించి ఆహ్వానిస్తున్నారు. ఉద్యమ ప్రాంతంలో ఏ చిన్న సంఘటన జరిగినా దానిని తమకు అనుకూలంగా మలుచుకునేందుకు విస్తృతంగా తప్పుడు ప్రచారాన్ని చేపడుతున్నారు. ఇందుకు ఎ.ఒ.బి ప్రాంతంలో జరిగిన సాగులు, వీరవరం గ్రామాలకు చెందిన సంఘటనలను మంచి ఉదాహరణలుగా చెప్పుకోవచ్చు. సాగులు గ్రామంలో జరిగిన ఒక పంచాయితీ సందర్భంగా గ్రామ పెత్తందారుల ముఠా పథకం ప్రకారం మన మిలీషియా కామ్రేడ్స్‌పై దాడి చేయగా మన మిలీషియా చేసిన ప్రతిఘటనలో ఆ ముఠాకు చెందిన ముగ్గురు సాధారణ సభ్యులు చనిపోయారు. ముఖ్యమైన పెత్తందారులు తప్పించుకున్నారు. ఈ సంఘటనలో సాధారణ సభ్యులను చంపడం మన వైపునుండి జరిగిన పొరపాటని డివిజన్ పార్టీ కమిటీ సమీక్షించింది. అయితే ఈ సంఘటన జరగగానే పోలీసు యంత్రాంగం 'ఆదివాసీల కోసం పనిచేస్తున్నామని చెప్పుకుంటూ ఆదివాసీలనే చంపుతున్న మావోయిస్టులు' అని విస్తృతంగా దుష్ప్రచారం చేసింది. అంతే కాకుండా ఆ సంఘటనను ఆసరా చేసుకొని రెండు తెగల మధ్య ఘర్షణను సృష్టించేందుకు తీవ్రంగా ప్రయత్నించింది. దీనికి భిన్నంగా మరో సంఘటనలో వీరవరం గ్రామానికి చెందిన విప్లవ ప్రతిఘాతకుడు సంజీవరావు ముఠా ఒక పంచాయితీ సందర్భంగా పార్టీ డివిజన్ కమిటీ సభ్యుడు శరత్‌పైనా, కాఫీ పోరాటకమిటీ అధ్యక్షుడు గణపతి పైనా దాడి చేసి వారిరువురిని హత్య చేసారు. ఈ సారి కూడా పోలీసులు మరో రకంగా ప్రచారం చేస్తూ ఈ సంఘటనను సైతం తమకు అనుకూలంగా మలుచుకునేందుకు ప్రయత్నించారు. ఈ సారి 'మావోయిస్టులపై తిరగబడిన ఆదివాసీ ప్రజానీకం' అంటూ ఆ సంఘటనను ఎత్తి పడుతూ అన్నిచోట్ల ఇటువంటి తిరుగుబాట్లే చేయాలని పిలుపునిచ్చారు. ఈ రెండు సంఘటనలు పరిశీలిస్తే వారి దుష్ప్రచారానికి (మానసిక యుద్ధానికి) ఎంత ప్రాధాన్యతనిస్తున్నారో అర్థమవుతుంది. ఈ సంఘటనలే కాకుండా ఉద్యమంలో జరిగే ప్రతి ఘటనను వక్రీకరించి దుష్ప్రచారం చేస్తున్నారు. ఈ దుష్ప్రచార కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు, యువకులు, ఉద్యోగులను సమీకరించి శాంతి యాత్రలు, సద్భావన యాత్రలు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం చేపడుతున్న ఈ దుష్ప్రచారా క్యాంపెయిన్‌ను ఉద్యమ ప్రాంతంలోని ప్రజలు తిప్పికొడుతున్నారు. కానీ ఉద్యమ ప్రాంతానికి బయట ఉన్న విశాల ప్రజానీకంపై ఈ దుష్ప్రచారం కొంత ప్రభావం వేస్తున్నది. కనుక బయట ఉన్న విశాల ప్రజానీకాన్ని శత్రువు దుష్ప్రచారానికి ప్రభావితులు కాకుండా చేసేందుకూ, వారిని విప్లవ కార్యాచరణకు మద్దతుదారులుగా మలుచుకొనేందుకు తగిన ప్రచార రూపాలు ఎంచుకోవాలి ఇంకా ఈ అమెరికన్ కౌంటర్ ఇన్‌సర్జన్సీ గైడ్ 5వ అంశమైన నియంత్రణ గురించి ప్రధానంగా చెప్పింది. ఈ గైడ్‌లో పొందిపరిచిన 5 అంశాల మధ్య సరైన సంబంధం, సమన్వయం వుండాలనీ, అవి ఏక కాలంలో సమాంతరంగా అమలు కావాలనీ, చెపుతునే సాయుధ అణచివేత దాడి (నియంత్రణ) ని ప్రధానంగా నొక్కి చెప్పింది. ఈ గైడ్ ప్రకారం ప్రజల సాయుధ ప్రతిఘటనపై శత్రు వైఖరి చేపట్టి సాయుధ అణచివేతను హింసాపూరితంగా అమలుచేస్తారు. దాడిని మిలటరీ కోలమానంతో చూస్తారు. ఎన్‌కౌంటర్‌లు, ఆయుధాల స్వాధీనం, ప్రాంతాల స్వాధీనం, సరెండర్లు వగైరా అంశాలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ నూతన వ్యూహాలను రూపొందిస్తుంటారు. మొత్తంగా ప్రజా సాయుధ బలగాలను అణచివేసేందుకు కఠిన మరియు సరళ, ప్రత్యక్ష మరియు అప్రత్యక్ష, హింసా మరియు అహింసా, పద్ధతుల్లో వివిధ వ్యూహాలు అమలు చేస్తారు.

ప్రస్తుతం మన దేశంలో కౌంటర్ ఇన్‌సర్జన్సీ వ్యూహంలో భాగంగా సాయుధ అణచివేతను అత్యంత తీవ్ర స్థాయికి తీసుకెళ్తున్నారు. ఉద్యమ ప్రభావిత రాష్ట్రాలన్నింటిలో ప్రత్యేక బలగాల (కమాండో ఫోర్స్) ను ఏర్పరిచారు. వీటికి తోడు దాదాపు లక్షమంది బి.ఎస్.ఎఫ్, సి.ఆర్.పి.ఎఫ్, ఎస్.ఎస్.ఎఫ్, ఐ.టి.బి.ఫ్ వంటి పారా మిలటరీ బలగాలను ఉద్యమ ప్రాంతంలో మోహరించారు. వీరే కాకుండా వేలాది మంది స్థానిక పోలీసులను, హోం గార్డులను ఉద్యమ అణచివేతకు వినియోగిస్తున్నారు. ఈ మొత్తం సంఖ్య ప్రస్తుతం 5లక్షలకు చేరింది. వుద్యమ ప్రాంతాలన్నింటిని చుట్టివేసే విధంగా పోలీసు క్యాంపులను పెంచుతూ కార్పేట్ సెక్యూరిటీని బలోపేతం చేస్తున్నారు. కోట్ల రూపాయల ప్రజా ధనాన్ని వినియోగిస్తూ ఇన్‌ఫార్మర్ నెట్‌వర్క్‌ను విస్తృత పరుస్తున్నారు. కోవర్టులను తయారు చేస్తున్నారు. ఉద్యమ ప్రాంతాలంతటా మోడల్ (హైటెక్) పోలీస్టేషన్లు నిర్మిస్తూ, ఒక్కొక్క స్టేషన్‌కు 2కోట్ల రూ॥ల చొప్పున ఖర్చు పెడుతున్నారు. కమ్యూనికేషన్ వ్యవస్థను బలోపేతం చేసుకోవడంలో భాగంగా రోడ్లు, సెల్‌టవర్లు విస్తృతంగా నిర్మిస్తున్నారు. నిఘా వ్యవస్థను పెంచుకోవడంలో భాగంగా మానవ రహిత విమానాలను వాడుతున్నారు. ఈ విమానం ద్వారా సమాచారం అందుకోగానే హెలికాప్టర్ల ద్వారా బలగాలను మోహరించేందుకు విస్తృతంగా హెలిపాడ్‌లను నిర్మిస్తున్నారు. వీటితో పాటు కేంద్రం సహాయంతో వివిధ రాష్ట్రాలలో కౌంటర్ ఇన్‌సర్జన్సీ మరియు యాంటీ టెర్రరిస్ట్ ట్రైనింగ్ సెంటర్లను ఏర్పరుస్తున్నారు. ఇవే కాకుండా జగదల్‌పూర్‌లో మిలిటరీ హెడ్‌క్వార్టర్‌ను ఏర్పరిచి విప్లవోద్యమాన్ని అణచివేసేందుకు మిలటరీఅధికారుల, నిపుణుల సహాయ సహకారాలను ప్రత్యక్షంగానూ, పరోక్షంగాను తీసుకుంటున్నారు.

2009 మధ్య నుండి ఆపరేషన్ గ్రీన్‌హంట్ పేరుతో ప్రారంభమైన ఈ సాయుధ అణచివేత దాడి నేడు మరింత తీవ్రరూపం దాల్చింది. ఈ కాలంలో ప్రభుత్వ సాయుధ బలగాల సంఖ్య విపరీతంగా పెరిగింది. వివిధ బలగాల మధ్య సమన్వయం పెరిగి ఏరియా డామినేషన్ల ఫ్రీక్వెన్సీ పెరిగింది. ప్రస్తుతం ఉద్యమ నాయకత్వాన్ని లక్ష్యంగా చేసుకోవడంతో పాటు మొత్తం ఉద్యమాన్ని దెబ్బతీసేందుకు ఆపరేషన్ ఆల్ ఔట్ పేరుతో

సాయుధ అణచివేత దాడిని రెట్టింపు చేసారు.

వారి వ్యూహంలో రాజ్య అణచివేతతో పాటు అభివృద్ధి నిరోధక సంఘవ్యతిరేక శక్తులను కూడగట్టి, ప్రజా ఉద్యమాలపైన, విప్లవోద్యమంపైన సాయుధ దాడిని చేపట్టే కార్యక్రమం కూడా ఉంది. ఇప్పటికే పాలకవర్గాలు సల్వాజుడుం, జనసురక్ష సమితి, సేంద్ర వంటి పేర్లతో వివిధ రాష్ట్రాలలో ప్రయోగాలు చేసారు. నేడు మోడి అధికారంలోకి వచ్చిన తర్వాత హిందుత్వ శక్తుల బలమైన సామాజిక పునాదిపై ఈ ప్రమాదం మరింత పెరగబోతున్నది. సామ్రాజ్యవాదానికి సేవచేసే బ్రాహ్మణవాద హిందుత్వ శక్తులు ఆర్.ఎస్.ఎస్, విశ్వహిందు పరిషత్, బజరంగ్‌దళ్, రామసేన వంటి పలు ఫాసిస్టు సంస్థల రూపంలో మరింత సంఘటిత పడుతున్నాయి. ఇవి సంస్కరణలను వ్యతిరేకించే ప్రజాస్వామిక వాదులు, పర్యావరణ వాదులు మొదలుకొని వ్యవస్థలో మౌళిక మార్పును కోరుకునే విప్లవ కారులు, విప్లవ ప్రజానీకం వరకు లక్ష్యంగా చేసుకొని నిర్మూలన దాడులు నిర్వహించే విధంగా సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ పరిణామాలన్నీ చూసినప్పుడు దేశంలో అన్ని ప్రభుత్వ వ్యవస్థల కోరలను కౌంటర్ ఇన్‌సర్జన్సీ సిద్ధాంతంతో పదును పెడుతున్నట్లుగా మనకు అర్థమవుతున్నది.

అయితే సామ్రాజ్యవాదానికీ, స్థానిక దోపిడీ వర్గాలకు వ్యతిరేకంగా ప్రజలు చేస్తున్న న్యాయమైన పోరాటాలను అణచివేయడంలో కౌంటర్ ఇన్‌సర్జన్సీ వ్యూహం తప్పకుండా విఫలమవుతుంది. ఎందుకంటే ఆ వ్యూహాన్ని 'మెడకు పెద్ద బండ కట్టుకుని నీటిలోకి సొర (డైవ్) వేసే ఈతగాడితో' పోల్చవచ్చు. ప్రజల న్యాయమైన పోరాటాలను అణచి తమ పాలనను, దోపిడీని, అణచివేతను శాశ్వతం చేసేందుకు వారు ఆ బండను ఒక సాధనంగా ఎంచుకున్నారు. ఫలితంగా వారు ఆ వ్యూహం అమలు చేసే క్రమంలో మరింత వైరుధ్యాలలోకి చిక్కుకుంటారు. గత ప్రధాని మన్‌మోహన్‌సింగ్‌తో పాటు ఆయన నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ కౌంటర్ ఇన్‌సర్జన్సీ వ్యూహాన్ని అందులో భాగంగా 'ఆర్థిక సంస్కరణల' ను అమలు చేయడం ద్వారా పైన చెప్పుకున్నట్లు బండను మెడలో వేసుకొని నీటిలో సొర (డైవ్) వేసిన చందంగా మారింది. చివరికి మన్‌మోహన్‌సింగ్ ప్రజల దృష్టిలో నేరస్థుడుగా ముద్రించబడి, అత్యంత హీనమైన పరిస్థితులలో చరిత్ర తన ఎడల దయ చూపిస్తుందని తన దీనత్వాన్ని వ్యక్తం చేసాడు. నేడు అదే బండను మెడలో వేసుకొని అత్యంత ఉత్సాహంగా మోడి నీటిలోకి డైవ్ చేసేందుకు సిద్ధపడుతున్నాడు. మోడిని కూడా చరిత్ర క్షమించదు. చెత్త బుట్టలోకి విసిరివేస్తుంది.

నేడు సామ్రాజ్యవాద వ్యవస్థ ఎదుర్కొంటున్న మహాసంక్షోభం శాశ్విత స్వభావాన్ని సంతరించుకుంటున్నది. దీనికి పరిష్కారంగా పాలకవర్గాలు కౌంటర్ ఇన్‌సర్జన్సీ వ్యూహం, నయా ఉదారవాద విధానాలను ఎంచుకున్నారు. ఈ వ్యూహాలు ప్రజలను మరింత అణచివేతకు, దోపిడీకి గురి చేసి మౌళిక వైరుధ్యాలను తీవ్రతరం చేస్తున్నాయి. ప్రజల ప్రతిఘటన పెరుగుతున్నది. ఈ పరిస్థితిని విప్లవోద్యమం సరిగా అర్థం చేసుకొని ప్రజలను నిజమైన ప్రజాస్వామ్యం కోసం, స్వాతంత్ర్యం కోసం ఉద్యమింప చేయడం ద్వారా సామ్రాజ్యవాదులను, వారి దళారీలను చరిత్ర చెత్తబుట్టలోకి విసిరివేయగలదు.

**మన కర్తవ్యాలు :**

సి.ఒ.ఐ.ఎన్ వ్యూహం ఓడిపోక తప్పదు. అయితే తక్షణ, దీర్ఘకాలికదృష్టితో విడి విడి భాగాలపైన, మొత్తం పైన ఆ వ్యూహాన్ని ఓడించేందుకు దానిని బహిర్గతపర్చడం, దానిపై పోరాడటం, విసిగిపోయేలా చేయడం వంటి ఎత్తుగడలు చేపట్టి ఓడించేందుకు తగిన కృషి చేయాలి. అందుకు ఈ క్రింది కర్తవ్యాలను సాధించాలి.

1. పార్టీ, పి.ఎల్.జి.ఎ, ప్రజా నిర్మాణాలు, బోల్షివీకరణ క్యాంపెయిన్‌ను విజయవంతం చేయడం ద్వారా కార్మికవర్గేతర ధోరణులను దూరం చేయాలి. గతితార్కిక దృక్పథాన్ని అభివృద్ధి చేసుకొని పార్టీలో కార్మికవర్గ తత్వాన్ని అభివృద్ధి చేసుకోవాలి. అన్ని నిర్మాణాలలో పై నుండి కిందికి, కింది నుండి పైకి సమైక్యతను సాధించాలి. సమైక్యత ఎంతగా పెరిగితే అంతగా మన సమస్యలు పరిష్కరించుకునే శక్తి పెరుగుతుంది. సాపేక్షికంగా మంచి ఫలితాలు వస్తాయి.

2. విప్లవానికి, సంస్కరణవాదానికి స్పష్టమైన విభజనరేఖ గీయాలి. సామ్రాజ్యవాద వ్యతిరేక, భూస్వామ్య వ్యతిరేక, ఫాసిస్టు వ్యతిరేక విప్లవ కార్యక్రమాన్ని గ్రహించడం, ఎత్తి పట్టడం, ఆచరణలో పెట్టడం చేయాలి. మౌళిక సమస్యలపై వర్గశత్రువులకు వ్యతిరేకంగా వర్గపోరాటాన్ని చేపట్టడం ద్వారా సంస్కరణవాదాన్ని ఆయా మితవాద సంస్థలను బహిర్గతపర్చాలి.

3. ప్రజాపోరాటాలను, ఉద్యమాలను పురోగమింపచేయడం ద్వారా ప్రజలతో సన్నిహిత సంబంధాలను అభివృద్ధి చేసుకోవాలి. ఈ విధంగానే లక్షలాది మంది ప్రజలను చేరి వారిని సాయుధ విప్లవ మార్గంలోకి తేగలం. ఈ సందర్భంగా ప్రజలనుండి నేర్చుకోవడం, నేర్పడం అనే ప్రక్రియను పట్టుదలగా కొనసాగించాలి. ఈ క్రమంలోనే విప్లవకరమైన తీర్మాణాలు, విధానాలు రూపొందించి, వాటిని ప్రజలు తమ కార్యాచరణగా మార్చుకొనే విధంగా కృషి చేయాలి.

4. సరైన సన్నాహాలను చేసుకుంటూ గెరిల్లా యుద్ధాన్ని ఉన్నత స్థాయికి తీసుకెళ్ళాలి. మిలీషియాలోకి ప్రజలను విస్తృతంగా సమీకరించి గెరిల్లా యుద్ధాన్ని విస్తరింప చేయాలి.

5. విద్య గరపటం, ప్రచారం, సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా ప్రజల రాజకీయ చైతన్యాన్ని పెంచేందుకు విరామం లేని కృషి చేయాలి.

6. నయా ఉదారవాద విధానాలకు, బ్రాహ్మణవాద హిందుఫాసిజానికి వ్యతిరేకంగా ప్రజాస్వామిక వాదులను, లౌకికవాదులను, పర్యావరణవాదులను విశాల ప్రాతిపదికన కలుపుకొని ఐక్యవేదికలు నిర్మించాలి. సమస్యల ప్రాతిపదికన క్రింది స్థాయి నుండి వామపక్షాలను, ప్రతిపక్ష బూర్జువా పార్టీలలో కొన్నింటిని సైతం కలుపుకొని విశాల ప్రాతిపదికన ఐక్యవేదికలను నిర్మించాలి. ఈ సందర్భంగా కామ్రేడ్ మావో రూపొందించిన ఐక్యసంఘటనకు సంబంధించి కార్మికవర్గం అనుసరించాల్సిన మౌళిక ఎత్తుగడల సూత్రాలను తప్పనిసరి మార్గదర్శక సూత్రాలగా ఎంచుకోవాలి. ఈ ఐక్యసంఘటనల ద్వారా కదులుతున్న ప్రజలను రాజకీయంగా ప్రభావితులను చేసి వ్యూహాత్మక ఐక్యసంఘటన నిర్మాణాలలోకి తెచ్చే విధంగా కృషి చేయాలి.

7. అన్ని రకాల ప్రభుత్వ మోసాన్ని దెబ్బతీసే విధంగా ప్రచార పనిని తీవ్రస్థాయిలో, విస్తృత స్థాయిలో చేపట్టాలి. అట్లాగే ప్రభుత్వ ఫాసిస్టు నేరాలను, విప్లవ ప్రతిఘాతుక పథకాలను బహిర్గతం చేయాలి. ముఖ్యంగా ఈ పథకాల సృష్టికర్తలుగా ఉన్న సామ్రాజ్యవాదులను, స్థానిక పాలకవర్గాన్ని బహిర్గతం చేయాలి.

★

# బోల్షెవీకరణ క్యాంపెయిన్-కొన్ని అనుభవాలు

శతృవు ఆపరేషన్ గ్రీన్‌హంట్ మూడవ దశలో సమగ్రమైన పథకంతో దాడిని తీవ్రతరం చేశాడు. ఎ.ఒ.బిలో ఈ దాడి 'ఆపరేషన్ ఆల్‌ఔట్' పేరుతో జనవరి 2015 నుండి మున్నెన్నడు లేని స్థాయిలో అమలవుతున్నది. ఈ సారి చంద్రబాబు ప్రభుత్వానికి ఎ.పి.ని మావోయిస్టు రహిత రాష్ట్రంగా చేయాలనే ఉబలాటం మరింతగా పెరిగింది. ఈ నేపథ్యంలో జనవరి 2015 నుండి కేంద్ర పారా మిలటరీ బలగాల (బి.ఎస్.ఎఫ్, సి.ఆర్.పి.ఎఫ్) తో పాటు ఎ.పి, ఒడిశా రాష్ట్రాలకు చెందిన కమాండో బలగాలు (గ్రేహౌండ్స్, ఎస్.ఒ.జి), ఇతర స్థానిక బలగాలు కలిసి సంయుక్తంగా ఉద్యమ ప్రాంతమంతటా ఏరియా 'డామినేషన్లు' నిర్వహిస్తున్నారు. ఈ దాడుల్లో వేలాది మంది ప్రభుత్వ సాయుధ బలగాలు పాల్గొంటున్నాయి. వీటికి ఎస్.పి స్థాయి అధికారులు నేతృత్వం వహిస్తున్నారు. ఈ సందర్భంగా కొన్ని బలగాలు బయటకు పోతుంటే, కొన్ని బలగాలు లోపలికి వచ్చే 'రిలే' పద్ధతిని అనుసరిస్తూ ఏరియాలో ఏ మాత్రం వెసులుబాటు లేకుండా చేస్తున్నారు.

ఒకవైపునా శతృవు పార్టీనీ, విప్లవోద్యమాన్ని సంపూర్ణంగా నిర్మూలించాలని దాడిని తీవ్రతరం చేస్తూంటే, మరోవైపు కేంద్రకమిటీ ఇచ్చిన పిలుపునందుకొని ఆపరేషన్ గ్రీన్‌హంట్ దాడిని ఓడించి, ఉద్యమాన్ని గడ్డు పరిస్థితి నుండి బయట పడేసేందుకు ఎ.ఒ.బిలో బోల్షెవీకరణ క్యాంపెయిన్ చేపట్టాము.

ఈ క్యాంపెయిన్‌లో పార్టీ, పి.ఎల్.జి.ఎల సిద్ధాంతస్థాయిని పెంపొందించడం, అన్యవర్గ ధోరణులను తొలగించుకోవడం, కార్మికవర్గ క్రమశిక్షణను పెంచడం, సామాజిక పరిశోధన చేపట్టడం, మావో రూపొందించిన పని పద్ధతులను, పనిశైలిలను ఆచరణలో పెట్టడం, రహస్య పని పద్ధతులను, గెరిల్లా యుద్ధ సూత్రాలను దృఢంగా నిర్దిష్ట పరిస్థితులపై ఆధారపడి అమలు పరచడం, మొత్తంగా కార్మికవర్గ ప్రాపంచిక దృక్పథాన్ని పెంపొందించడం-ప్రధాన కర్తవ్యాలుగా చేపట్టాము.

ఈ కృషి ప్రారంభమైన తరువాత కొద్దిమంది మొండిఘటాలుగా మారిన సీనియర్ కామ్రేడ్లు మినహా మిగిలిన పార్టీ, పి.ఎల్.జి.ఎ శ్రేణులలో నూతన ఉత్సాహం పెరిగింది. వారు బోల్షెవీకరణ కర్తవ్యాలను స్వచ్ఛందంగా, ఉత్సాహంతో, పట్టుదలతో అమలు చేస్తున్నారు. ఈ క్యాంపెయిన్‌లో భాగంగానే పై నాయకత్వం (ఎస్.జడ్.సి, డి.వి.సి) క్రింది కార్యకర్తలతో కలిసి ఉండి కార్యక్షేత్రం (ఫీల్డ్) లో వారు ఎదుర్కొంటున్న సమస్యలను అర్థం చేసుకోవడంలోనూ, వాటిని పరిష్కరించుకోవడంలోనూ మార్గదర్శకత్వం అందిస్తున్నది. శతృవుపై జరిపే ప్రతి దాడుల్లో వారికి ప్రత్యక్ష నాయకత్వం వహిస్తున్నది. నాయకత్వం చేపట్టిన ఈ తరహా కృషి పార్టీ కార్యకర్తలలో, పి.ఎల్.జి.ఎ యోధులలో ఆత్మవిశ్వాసాన్ని మరింతగా పెంచింది.

ఈ క్యాంపెయిన్‌లో నిర్దిష్ట అనుభవాలుగా చూసినప్పుడు పార్టీ దశాబ్ది వార్షికోత్సవాల సందర్భంగా కా॥ జి.ఎస్ పీపుల్స్‌వార్ పత్రికలో రాసిన వ్యాసాలనుండి రెండు ముఖ్యమైన సూత్రీకరణలను ఆచరణలో పెట్టేందుకు కృషి చేసాము. అందులో ఒకటి 'శతృవు పాలసీ ఏమిటంటే ప్రజల నుండి మనల్ని వేరు చేసి దెబ్బతీయాలనేదే. మన పాలసీ ప్రజల్లోకి విస్తృతంగా వెళ్ళి వారితో కలిసిపోయి శతృవును దెబ్బతీయడం'.

ఈ సూత్రం ఆధారంగా ఈ సారి ప్రజలలోకి విస్తృతంగా వెళ్ళి ప్రజలను పోరాటాలలోకి కదిలించాము. విశాఖలో బాక్సైట్ తవ్వకాలకు వ్యతిరేకంగా పోరాటం ఒక వెల్లువలా వచ్చింది. కోరాపుట్‌లో విస్తాపిత, భూమి, రిజర్వేషన్ వంటి వివిధ సమస్యలలో ప్రజలు పెద్ద ఎత్తున కదిలారు. నారాయణపట్నం ప్రజలలో పాత భయాలు పోయి మనకు దగ్గరవుతున్నారు. శతృవును దెబ్బతీయడంలో సహకరిస్తున్నారు. ఎమ్.కె.బి ఏరియాలో వర్గపోరాటాన్ని తీవ్రతరం చేసి పునాది వర్గాలకు సన్నిహితమయ్యాము. మల్కనగిరిలో పోలవరం డ్యాంను వ్యతిరేకించడంతో పాటు రైతాంగానికి చెందిన వివిధ సమస్యలు చేపట్టడం వల్ల ప్రజలలో నిలదొక్కుకోగలిగాము.

పై కార్యాచరణ వల్ల ప్రజలలోకి విస్తృతంగా వెళ్ళాలనే మన విధానం కొంత మేరకు విజయవంతమయ్యిందనే చెప్పాలి. ఈ కృషి వల్ల పార్టీ, పి.ఎల్.జి.ఎలు ప్రజలకు మరింత సన్నిహితమయ్యాయి. కార్యకర్తలలో సృజనాత్మకత పెరిగింది. పార్టీకీ, పి.ఎల్.జి.ఎకు ప్రజల అండదండలు పెరగడంతో వారిలో ఆత్మవిశ్వాసం పెరిగింది. ఈ మార్పు పోలీసులకు తలనొప్పిగా మారింది. విశాఖ పోలీసులైతే 'బాక్సైట్ తవ్వకాల వ్యతిరేక పోరాటం ద్వారా మావోయిస్టులు ప్రజలలో బలపడుతున్నారనీ, ఈ సమస్యను ప్రభుత్వం పరిష్కరించకపోతే ప్రమాదం ఏర్పడుతుందని' వాపోతున్నారు. ప్రజలలో మనకు పెరుగుతున్న ఈ బలమే 'శతృ చుట్టుముట్టి అణచివేత దాడుల' నుండి పార్టీ, పి.ఎల్.జి.ఎ శ్రేణులను రక్షించుకోవడంలో దోహదపడుతున్నది. మరోవైపు వారి మద్ధతుతో శతృవుపై గెరిల్లా దాడులు జరిపి నష్టపరచగలుగుతున్నారు. ఇందుకు ఉదాహరణగా జాన్‌బై సంఘటన (ఆగస్టు 26) లో ముగ్గురు బి.ఎస్.ఎఫ్ జవానులను మట్టిగరిపించి 6గురిని గాయపరిచిన విషయాన్ని చెప్పుకోవచ్చు

మరో సూత్రీకరణ ఏమిటంటే 'ఎంతో మంది అమరులు తమ రక్తాన్ని చిందించడం వల్లా, విప్లవ ప్రజానీకం రోజువారిగా చేస్తున్న అసంఖ్యాక త్యాగాల ఫలితంగా మాత్రమే మనం పొందిన అనుభవాల సంశ్లేషణ నుండి మనం తీసుకున్న గుణపాఠాలను ఎన్నడూ మరిచిపోకుండా ఉండడం'.

ఈ సూత్రీకరణలో నొక్కి వక్కాణించిన 'గుణపాఠాలను ఎన్నడూ మరిచిపోకుండా ఉండడం' అనేది ప్రధానంగా రహస్య పని పద్ధతుల విషయంలో అన్వయించేందుకు కృషి చేశాము. అయితే లీగల్ పని పద్ధతులు అలవాటుగా మారిన స్థితి నుండి రహస్య పని పద్ధతులు అలవాటుగా మార్చడం కొంత కష్టంతో కూడుకున్న విషయమే. అయితే బోల్షెవీకరణ క్యాంపెయిన్‌లో భాగంగా పై సూత్రీకరణను అర్థం చేయించి పనిలో సౌఖ్యాన్ని కోరుకోవడం, సులభమార్గాలను చేపట్టడం వంటి పెటీ బూర్జువా ఆలోచనలనూ, అలవాట్లను పోగొట్టేందుకు ప్రయత్నించాము. పని పద్ధతులలో టెక్నికల్ జాగ్రత్తలలో కొంత మార్పు వచ్చింది. కష్టభుయిష్టమైన పద్ధతులు అలవాటుగా మారుతున్నాయి. దీంతో నష్టాలను కొంత మేరకు నివారించుకోగలుగుతున్నాము. అయితే పైన చెప్పినట్టు రహస్య పని పద్ధతులను ఒక అలవాటుగా మార్చుకొనేందుకు కఠోరమైన కృషిని ఇంకా చేయాల్సేవుంది. ★

# కౌంటర్ ఇన్‌సర్జన్సీ-ప్రతిఘాతక విప్లవ వ్యూహాన్ని ప్రజా యుద్ధం ద్వారా ఓడిద్దాం !

వలస, అర్ధవలస దేశాలలో జరుగుతున్న విప్లవ పోరాటాలను అణచివేసేందుకు రూపొందించిన సిద్ధాంతమే కౌంటర్ ఇన్‌సర్జన్సీ సిద్ధాంతం. ఇది అమెరికన్ సామ్రాజ్యవాదుల చేత రూపొందించబడింది. దీనిని ఎప్పటికప్పుడు మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా గత అనుభవాలను క్రోడీకరించుకొని అభివృద్ధి చేస్తూ వస్తున్నారు. 2009లో ఒకసారి సమకాలీన పరిస్థితులకు అనుగుణంగా కౌంటర్ ఇన్‌సర్జన్సీ గైడ్‌ను అభివృద్ధి చేసారు. ఈ పనిని అమెరికాకు చెందిన పొలిటికల్-మిలటరీ వ్యవహారాల బ్యూరో నాయకత్వంలో 9 ప్రభుత్వ ఏజెన్సీలు/డిపార్ట్‌మెంటులు కలిసి చేసాయి.

ఇన్‌సర్జన్సీ, కౌంటర్ ఇన్‌సర్జన్సీ పదాలను సామ్రాజ్యవాదులే సృష్టించారు. విప్లవం, ప్రతిఘాతక విప్లవం పదాల స్థానంలో ఇన్‌సర్జన్సీ (తిరుగుబాటు), కౌంటర్ ఇన్‌సర్జన్సీ (ప్రతి తిరుగుబాటు) అనే పదాలను వాడుకలోకి తెచ్చారు. ఇలా తేవడంలో సామ్రాజ్యవాదుల కుట్ర దాగివుంది. గత చరిత్రంతా విప్లవానికీ, ప్రతిఘాతుక విప్లవానికి మధ్య పోరాటం జరుగుతూ వస్తున్నది. ఆయా కాలాల్లో జరిగిన ఈ పోరాటంలో విప్లవానికి పీడితవర్గం ప్రాతినిధ్యం వహిస్తే, ప్రతిఘాతుక విప్లవానికి దోపిడీ వర్గాలు ప్రతినిధ్యం వహించాయి. ఈ పోరాటం భిన్న రాజకీయాల మధ్య కొనసాగుతూ వచ్చింది. దోపిడీ పాలకవర్గాలు తమ అధికారాన్ని, దోపిడీని అశేష పీడిత ప్రజలపై బలప్రయోగం ద్వారా కొనసాగించేందుకు అభివృద్ధి నిరోధక రాజకీయాలకు ప్రాధన్యతనిస్తే, విశాలమైన పీడితవర్గం కొద్దిమంది పీడకవర్గం నుండి రాజ్యాధికారాన్నిబలప్రయోగం ద్వారా హస్తగతం చేసుకొనే విప్లవ రాజకీయాలకు ప్రాతినిధ్యం వహించారు. ఈ వాస్తవాలను మరుగుపరచడంతో పాటు సాయుధ విప్లవాన్ని నేరపూరితంగా అభివర్ణించి వంటరి చేసేందుకు సామ్రాజ్యవాదులు ఇన్‌సర్జన్సీ, కౌంటర్ ఇన్‌సర్జన్సీ అనే పదాలను వాడుకలోకి తెచ్చారు.

ఈ సారి కౌంటర్ ఇన్‌సర్జన్సీ సిద్ధాంతాన్ని మరింత విస్తృతపరిచారు. దాని పరిధిని పెంచారు. ఈ సిద్ధాంతాన్ని 'కౌంటర్ టెర్రరిజం', 'ప్రజాస్వామ్య రక్షణ', 'బలహీన ప్రభుత్వాలను స్థిరపరచడం, సంస్కరించడం', 'ప్రజల పేదరికాన్ని తొలగించడం', 'ప్రజల మద్దతుతో దీర్ఘకాలిక ఆర్థికాభివృద్ధి'- వంటి పేర్లతో నవీనీకరించి దాని పరిధిని మరింతగా పెంచారు. ఈ పేర్లతోటే సామ్రాజ్యవాదులు వివిధ దేశాల సార్వభౌమత్వానికి భంగం కలిగించే విధంగా ఆంతరంగిక విషయాలలో జోక్యం చేసుకుంటున్నారు. ముఖ్యంగా సెప్టెంబర్ 9, 2001 తర్వాత కౌంటర్ టెర్రరిజం పేరుతో అమెరికా దాని సంకీర్ణ బలగాలు ఆఫ్ఘనిస్తాన్, ఇరాక్, లిబియా దేశాలపై సైనిక దాడులు చేపట్టి అక్కడి ప్రభుత్వాలను కూల్చివేసి తమ కీలుబొమ్మ ప్రభుత్వాలను ఏర్పరిచాయి. ఇంకా సిరియా, ఈజిప్ట్ వంటి అనేక దేశాలలో వివిధ కారణాలు చూపి తమ జోక్యాన్ని కొనసాగిస్తున్నాయి. ఇప్పుడిప్పుడే తిరిగి ప్రపంచాధిపత్యం కోసం రంగంలోకి దిగుతున్న రష్యన్ సామ్రాజ్యవాదులు కూడా కౌంటర్ ఇన్‌సర్జన్సీ సిద్ధాంతాన్ని ఒక ఆయుధంగా చేపడుతున్నారు. వీరు 'ప్రజాస్వామ్య రక్షణ' పేరుతో యుక్రెయిన్‌పై సైనిక దాడి చేసారు. రిఫరెండం పేరుతో యుక్రెయిన్‌లో భాగంగా ఉన్న క్రిమియాను తన భూభాగంలో కలిపేసుకున్నారు.

కౌంటర్ ఇన్‌సర్జన్సీ వ్యూహం 5 అంశాల (రాజకీయం, ఆర్థికం, భద్రత, సమాచారం, నియంత్రణ) తో కూడుకొని ఉంటుంది. ఇందులో 'నియంత్రణ'కు మిగిలిన 4 అంశాలు లోబడి ఉంటాయి.

కౌంటర్ ఇన్‌సర్జన్సీ సిద్ధాంతంలోని 5 అంశాలలో రాజకీయం కీలకమైనది. రాజకీయం అన్నప్పుడు 'ఆమోదయోగ్యమైన రాజకీయ వాతావరణమనే' సామ్రాజ్యవాదుల పరిభాషలో చెప్పుకోవాలి. దీన్నే మరోమాటలో నామమాత్ర ప్రజాస్వామ్యం ( ఫార్మల్ డెమోక్రసీ) అనవచ్చు. ఇందులో ఎన్నికలు, రిఫరెండం, న్యాయవ్యవస్థలాంటి అంశాలు ఉంటాయి. ఈ వాతావరణం ప్రజల అసంతృప్తిని, ఆగ్రహాన్ని ఏదో ఒక రూపంలో నీరుకార్చేందుకు ప్రయత్నిస్తూ ఉంటుంది. ఇంకా నిర్దిష్టంగా చెప్పుకోవాలంటే సేఫ్టీ వాల్వ్‌లాగా పనిచేస్తుంటుంది. వీటినే అమెరికన్ సామ్రాజ్యవాదులు, వారి తైనాతీలు 'ప్రయత్నించు, పరిక్షించుకో' (ట్రై అండ్ టెస్టెడ్) పద్ధతిలో భాగంగా చెపుతారు. అంటే 'నీవు కష్టపడి పనిచేస్తే ఈ సమాజం నీకు అవకాశాలు కల్పిస్తుంది, కనుక పరీక్షలో పోటి పడమని' సందేశం ఇస్తుంది.

ఇక మన దేశంలో చూసినట్టయితే భ్రష్టు పట్టిపోయిన పార్లమెంటరీ ప్రజాస్వామిక వ్యవస్థకు సంస్కరణల ద్వారా మెరుగులు దిద్ది ప్రజల ఆమోదం పొందేందుకు పాలకవర్గాలు పడరాని పాట్లు పడుతున్నాయి. రోజు రోజుకు ఎన్నికల ప్రక్రియనుండి దూరం అవుతున్న దేశ ప్రజలను 16వ లోక్‌సభ ఎన్నికల సందర్భంగా పోలింగ్ శాతం పెంచేందుకు ఎప్పుడు చేయనంత ప్రయత్నం చేసారు. ఎన్నికల సందర్భంగా ఉపయోగిస్తున్న సారా, డబ్బు వంటి వాటిని నివారించి ఎన్నికల 'పవిత్రతను' కాపాడేందుకు ప్రయత్నాలు చేసారు. ఇంకా 'నైతిక విలువల'కు సంబంధించి నియమ నిబంధనలు రూపొందించారు. ఈ చర్యల ద్వారా 'ఆమోదయోగ్యమైన రాజకీయ వాతావరణం' సృష్టించేందుకు పాలకవర్గాలు తీవ్ర ప్రయత్నం చేసాయి. కానీ వాళ్ళు ఈ సారి లోక్‌సభ ఎన్నికలకు 90% పోలింగ్ లక్ష్యంగా పెట్టుకుంటే 66% మాత్రమే పోలింగ్ జరిగింది. ఇక ఎన్నికల్లో రాజకీయ పార్టీలు గుమ్మరించిన డబ్బు వాళ్ళు రూపొందించుకున్న పరిమితులను అతిక్రమించడమే కాకుండా, మునుపటి ఎన్నికల ఖర్చును కొన్ని రెట్లు అధిగమించింది. ఇక ఏ పార్టీ కూడా ఎన్నికల కమీషన్ రూపొందించిన 'నైతిక నియమావళిని' పాటించలేదు. అంటే వాళ్ళు ఆమోదయోగ్యమైన రాజకీయ వాతావరణం సృష్టించేందుకు వ్యర్థ ప్రయత్నాలు చేస్తుంటారని మనకు ఈ విషయాలు తెలియచేస్తున్నాయి.

ఇంకా వాస్తవంగా చెప్పాలంటే 'ఆమోదయోగ్యమైన రాజకీయ వాతావరణం' ప్రాధాన్యత ఏమిటంటే అప్పటికే అమలులో ఉన్న రాజకీయ వ్యవస్థను నిలబెట్టడంగా ఉంటుంది. అందుకు నామమాత్ర ప్రజాస్వామ్య ప్రక్రియను 'ఆమోదయోగ్యం' అయ్యేలా ప్రయత్నిస్తూ ప్రజలను విప్లవం నుండి దూరం చేసి ప్రభుత్వ పరిధిలోనే వుంచేందుకు ప్రయత్నిస్తారు. ప్రస్తుతం ఉన్న రాజకీయ వ్యవస్థను నిలబెట్టడంలో ఈ కృషి నిర్ణయాత్మక పాత్ర వహిస్తుంది. ఇంకా వాళ్ళు విప్లవ శక్తులను సాయుధంగా అణచివేయడంలో ప్రజల ఆమోదాన్ని పొందడం లక్ష్యంగా ఈ కృషిని కొనసాగిస్తారు. అందుకే 'ఆమోదయోగ్యమైన రాజకీయ వాతావరణం' అనేది కౌంటర్ ఇన్‌సర్జన్సీ వ్యూహంలోని మిగిలిన 4 అంశాల అమలుకు

**(తరువాయి భాగం 52వ పేజీలో)**